
భారతి



మార్చి 1986 వెల: రు. 4/-






అనోలియమ్
కోల్డ్ రబ్
జలుబులు మరియు దగ్గుల
మీద ఇది ఎలా చల్లగా,
అయినా అమోఘంగా
పనిచేస్తోందో చూడండి.
Anoleum
Anoleum
6 ఔషధ దినుసుల ప్రక్రియ
అనోలియమ్ చల్లనైనది,
అయినా అమోఘమైనది-
ఆబాలగోపాలానికి అతి శీఘ్రంగా
ఉపశమనం కలిగిస్తుంది.

ఆదా చేయండి రు. 11 లు!

పోస్టుద్వారా
భారతి
తెప్పించుకోండి!



ఆఫ్‌సెట్
ముద్రణలో
భారతి !

భారతి సంవత్సర చందా (పోస్టు ద్వారా రు. 51/–లు) ఒకేసారి చెల్లించే వారికి రు. 11/–ల 'ముదరా' వుంటుంది.

అంటే మీరు కేవలం రు. 40/–లు చెల్లిస్తే ప్రతినెలా భారతి పోస్టు ద్వారా మీ ఇంటికే అందుతుంది.

చందా పైకమును ఆంధ్రపత్రిక, గాంధినగరం, విజయవాడ–3కి మనియార్డరు లేదా డిమాండు డ్రాఫ్టు ద్వారా పంపుతూ ఈ దిగువ కూపను జతపర్చ కోరుతాము.

నేను 'భారతి' మాసపత్రికకు చందాదారునిగా చేరదలుచుకున్నాను చందా పైకము రు. 40/– డి.డి. / ఎం. ఒ. ద్వారా పంపుతున్నాను.

పేరు : ______________________

ఊరు : ______________________

చందాదారుని సంతకం

సంపుటము . 63 మార్చి 1986 సంచిక . 3

భారతి

సాహిత్య మాసపత్రిక

★

సంస్థాపకుడు

కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

★

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

(1938 - 1972)

★

విషయానుక్రమణిక

ముఖచిత్రం : బాబా ఆంటే

నర్తకీమణి శ్రీమతి స్వప్న సుందరి

విడి పత్రిక వెల : నాలుగు రూపాయలు

నాగేశ్వరరావు ఎస్టేట్స్ ప్రయివేట్ లిమిటెడ్ తరఫున ముద్రాపకుడు ప్రచురణకర్త : శివలెంక రాధాకృష్ణ
ముద్రణ : ఆంధ్రపత్రిక ప్రెస్, గాంధీనగరం, విజయవాడ-3; సంపాదకుడు : శివలెంక రాధాకృష్ణ

మహనీయుడు

శ్రీ మురళీధర్ దేవీదాస్ ఆంటే గారు డెబ్బయి ఏళ్ళు దాటిన తరువాత దేశంలో సమైక్య భావాన్ని పెంపొందించటానికి ఒక భారతదేశ యాత్ర మొదలు పెట్టారు. ఆయనకి ఇటీవలే కేంద్ర ప్రభుత్వం వారు పద్మవిభూషణ బిరుదు ఇచ్చారు. ఆయనని ఎవరు ఏ విధంగా సత్కరించినా సత్కారం చేసిన వారికే గొప్ప అనటంలో సందేహం లేదు. బాబా ఆంటే తమ జీవితాన్ని కుష్ఠురోగుల సేవకి ఏ విధంగా అంకితం ఇచ్చారో మూడవ పేజిలో పడిన వ్యాసం కొంత తెలుపుతుంది. భారతీయులకి, అందులోనూ హైందవులకి ఇటువంటి సేవ చేసే సంప్రదాయాలు లేవనే విమర్శ తరుచు వినపడుతూ ఉంటుంది. అటువంటి విమర్శలకి ఈ మహనీయుని జీవితమే ఒక సమాధానం. బాబా ఆంటెని గురించి క్లుప్తంగానే అయినా కొంత సమాచారం భారతిలో ప్రచురించే అవకాశం కలిగినందుకు మాకు సంతోషంగా ఉన్నది!

★★ ★★ ★★


తమ పాత కథలలో ఒకదానిని ఏదయినా మళ్ళీ వేద్దామని ఉన్నదని శ్రీ పురాణం సుబ్రహ్మణ్య శర్మగారితో అనగా వారు "కోతి"ని, ప్రచురించమన్నారు. ఈ సారి ఆ కథకి బొమ్మ వేసిన శ్రీ నాని ఆయన కుమారుడే....

★★ ★★ ★★

శ్రీ రాజీవ్‌గాంధీ – కీ. శే. హర్చంద్‌సింగ్ లోంగోవాల్‌లు చేసుకున్న ఒప్పందంతో పంజాబు రాజకీయాలు బాగా మారిపోతాయని కొందరు అనుకున్నారు. ఎన్నికలలో గెలవలేని వారు దౌర్జన్యాలు జరిపి అయినా తమకి ఇష్టంలేని వారిని గద్దె దింపగలిగారు. అకాలీలలో ఒక వర్గం లేదా కొన్ని వర్గాల వారికే పెత్తనం ఇస్తే పరిస్థితులు క్రమంగా చక్కబడగలవని అనుకున్న వారికి పంజాబు ముఖ్యమంత్రి శ్రీ సుర్జీత్‌సింగ్ బర్నాలా అసహాయత కనువిప్పుగా ఉండవచ్చు. హైందవ – మహమ్మదీయ సమస్యల కన్నా హైందవ – సిక్కు సమస్యలే తీవ్రంగా ఉన్నాయని కొందరు అంటున్నారు. మొహమాటాలు లేకుండా అకాలీల అసత్య ప్రచారాన్ని ఖండించటం, అన్ని రకాల రాజ కీయవాదులూ చెయ్యవలసిన మొదటి పని.

★★ ★★ ★★

అమెరికా సంయుక్త రాష్ట్రాల వారు చేసిన "ఛాలెంజర్" అంతరిక్ష ప్రయోగం విషాదాంతం అయిపోయింది. వివిధ జాతులకీ మతాలకీ చెందిన వారు ఈ ప్రయోగంలో పాల్గొని తమ ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఇది ఎంత వ్యధ కలిగించినప్పటికీ అంతరిక్ష ప్రయోగాలు ఆగవనే ఆశించాలి....



ముఖచిత్ర వ్యాసం

మానవతకి మరో పేరు ఆంటి

బాబా ఆంటిగా ప్రపంచ వ్యాప్తంగా పేరుపొందిన శ్రీ మురళీధర్ దేవీదాస్ ఆంటి కుష్టు రోగుల సేవకి తమ జీవితాన్ని నిస్వార్థంగా అంకితం చేసిన మహావ్యక్తి. తమ సేవా కార్యక్రమాలద్వారా ఇప్పటికి ఆయన దాదాపు 2 లక్షల మంది కుష్టువ్యాధి పీడితులని ఆరోగ్యవంతులని చేసారు.

శ్రీ ఆంటి మహారాష్ట్రలో నాగపూర్‌కి 120 కి. మీ. దూరంలో ఉన్న వరోరాలో 1914లో జాగీర్‌దార్ల వంశంలో జన్మించారు. పధ్నాలుగేళ్ల ప్రాయంలో ఇల్లు వదలి వెళ్లి గోండులతో నివసించి వేటలో ప్రావీణ్యాన్ని సంపాదించారు. ఎన్నో సాహసకృత్యాలు చేశారు. అనంతరం న్యాయ శాస్త్ర పరీక్షలో ఉత్తీర్ణులై న్యాయవాదిగా, వరోరా పురపాలక సంఘం అధ్యక్షుడిగా పని చేసారు. ఒకనాడు ఆయన అత్యంత దయనీయస్థితిలో ఉన్న ఒక కుష్టురోగిని చూసి తమ జీవితాన్ని కుష్టువ్యాధి పీడితుల సేవకి అంకితం చేయాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం శ్రీ ఆంటి కుష్టునివారణ సంస్థలో శిక్షణ పొందారు. 1950లో శ్రీ ఆంటి మహారోగ్ సేవాసమితిని స్థాపించి తమ ఆడంబర జీవితానికి స్వస్తి చెప్పి వరోరా సరిహద్దులలో ఉన్న ఆనందవన్‌కి కుటుంబంతో సహా ఒక గుడిసెలోకి తమ మకాం మార్చారు. తమతో పాటు ఆయన ఆరుగురు కుష్టురోగులని కూడా అక్కడికి తీసుకు వెళ్లారు. అలా ప్రారంభమైన ఆనందవన్ శ్రీ ఆంటి నిరంతర కృషి ఫలితంగా నేడు 450 ఎకరాల విస్తీర్ణం కల ఒక సముదాయంగా రూపుదిద్దుకున్నది. అందులో పంట పొలాలు, 2,500 మంది కుష్టురోగులు, అంగ వికలురైన వారికి నివాస గృహాలు, 500 మంది విద్యార్థులు గల ఒక వ్యవసాయ కళాశాల, పదమూడు వందల మంది విద్యార్థులు ఉన్న ఒక డిగ్రీ కళాశాల ఉన్నాయి.

ఈ ఆనందవన్‌కి సమీపంలోనే అశోకవన్, సోమనాథ్ అనే మరో రెండు కేంద్రాలని శ్రీ ఆంటి స్థాపించారు. కుష్టు వ్యాధినించి విముక్తి పొందిన వారు వాటిని నిర్వహిస్తున్నారు. అవి ఆనందవన్ కర్చుని కొంత భరించడానికి, అందులోని ఆదాయం లేని పథకాలు, ఆసుపత్రులు మొదలైన వాటి నిర్వహణ కోసం నడుపబడుతున్న కేంద్రాలు. చంద్రాపూర్‌కి 200 కి. మీ. దూరంలో ఉన్న హేమల్ కాసాలో ఆదివాసుల కోసం ఒక కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. పదేళ్ళ కిందట 4 వేల మంది రోగులతో ప్రారంభమైన ఈ కేంద్రం ఇప్పుడు అంతకి పదింతల మంది రోగులకి సేవ చేస్తున్నది.

బాబా ఆంటి 1942లో మహాత్మాగాంధీ, ఆచార్య వినోబాభావేలతో కలసి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న దేశభక్తుడు. ఇప్పుడు ఆయన జాతీయ సమైక్యత కోసం 1985 డిసెంబరు 24న కన్యాకుమారి నించి భారత దేశ యాత్ర ప్రారంభించారు. ఈ సమైక్య నవ భారత నిర్మాణ యాత్రలో ఆయన జనవరి 14 నించి 25 వరకు ఆంధ్ర ప్రదేశ్‌లో పర్యటించారు. జనవరి 23న హైదరాబాదులో ఆయనని ఆం. ప్ర. గవర్నర్ కుమారి కుముద్ బెన్ జోషి ఘనంగా సత్కరించారు.

బాబా ఆంటి నిరుపమాన సేవలకి గుర్తింపుగా ఆయనకి 1971లో పద్మశ్రీ, 1978లో రాష్ట్రభూషణ్, 1979లో బజాజ్ అవార్డు, 1980లో నాగపూర్ విశ్వవిద్యాలయం నించి డి. లిట్; 1981లో కృషిరత్న, 1984లో డామియన్- డట్టన్ అవార్డు, 1985లో మెగ్‌సేసే అవార్డు లభించాయి.

దేశంలోని అత్యున్నత గౌరవాలలో రెండవది అయిన పద్మ విభూషణ్ అవార్డు ఈ సారి బాబా ఆంటికి లభించింది.


బాబా ఆంటి సేవా కార్య క్రమాలలో ఆయన భార్య శ్రీమతి సాధనాతాయి, కుమారులు డా. వికాస్, ప్రకాశ్‌లు కూడా అంకిత భావంతో కృషి చేస్తున్నారు.

–బి. వి.



హైదరాబాదులో జనవరి 23న బాబా ఆంటిని సత్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ గవర్నర్ కుమారి కుముద్‌బెన్ జోషి

శ్రీమతి స్వప్నసుందరి



నేటి యువ నాట్య కళాకారులలో, భరత నాట్యం, కూచిపూడి, మోహిని ఆట్టం (కధకళి) మేటిగా ప్రదర్శనలివ్వ కలిగిన తెలుగు కళాకారిణి, ఢిల్లీ స్థిర వాస్తవ్యురాలు శ్రీమతి స్వప్న సుందరి.

గురువులు వేంపటి చిన్నసత్యం, కె. ఎన్. దక్షిణామూర్తి, పసుమర్తి సీతారామయ్య వద్ద భక్తి శ్రద్ధలతో నాట్య విద్యను నేర్చుకొని, సాధనచే తన సొంత సొమ్ముగా చేసుకొని, అన్ని విదేశాలలో ప్రదర్శనలిచ్చి, మాతృదేశమునకు కీర్తి ప్రతిష్ఠలను తెచ్చిపెట్టారు. భారత ప్రభుత్వము ఏదేశమునకైన పంపిన సాంస్కృతిక బృందములో ఈ కళాకారిణికి తప్పక ఒక చోటు కలదు.. అంతటి ఔన్నత్యము గల నర్తకి. సుస్వర మాధుర్య కంఠముతో, నృత్యము చేయుచూ పాడగల యువతి.

"నృత్య శారద", "శృంగార మణి", మొదలైన బిరుదులుగల శ్రీమతి స్వప్నసుందరికి, మంచి రూపలావణ్యములను, శరీర సంపదను, విశాల నేత్రాలను, బ్రహ్మ ప్రసాదించాడు.

హైదరాబాదులో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలో మొదటి రోజున స్వప్నసుందరి నృత్య ప్రదర్శన లక్షలాది ప్రేక్షకులను మైమరిపించింది. ఉజ్జయినిలో 25,000 లలిత కళోపాసకుల సమక్షములో నృత్యం చేసిన ఆమెను కాళిదాసుడు వర్ణించిన ఊర్వశి మాళవిక, ఈ స్వప్నసుందరి కాబోలు అని ఆనాటి వైస్ ఛాన్స్‌లర్ ఉజ్జయినిలో అఖిల భారత కాళిదాస నాట్య సదస్సులో వర్ణించారు.

నృత్తము, నృత్యము, అభినయము, మూగాభినయము అన్నిటిలోను తనకు తానే సాటి అని నిరూపించగల మేటి నర్తకి స్వప్నసుందరి

వాసు.

****

కోతి



పురాణం సుబ్రహ్మణ్యశర్మ

రైలు యింకా రాలేదు. ఆకాశం ముసురేసేటట్లుగా వున్నది. రివ్వుమని గాలి వుండి వుండి వీస్తూంటే స్టేషనులోని చెట్లన్నీ దేన్నో మాసి ఒడుసుకుంటున్నట్లుగా కంపించి 'జుయ్' మంటే 'జుయ్' మని గోల చేశాయి.

దుమ్ము రెండు మూడు నిలువుల యెత్తున లేచి సుళ్ళుగా తిరుగుతోంది.

చినుకు యింకా భూమ్మీద పడలేదు. పడకుండానే రైలువచ్చి ప్లాటుఫారం మీద నిల్చుంది.

స్టేషనులోకి త్రోసుకుంటూ వచ్చిన శాస్త్రి, కొంచెం చిరాగ్గా ముఖాన విసురుతూన్నట్లున్న దుమ్ముకు చేయి అడ్డుగా పెట్టి, అప్పటికప్పుడు ఏర్పడ్డ ఆ తొడత్రొక్కిడిలో పరుగెత్తుతూ, ఇటూ-అటూ తిరిగి మొత్తానికి ఆడవాళ్ళ పెట్లన్నీ గాలించేశాడు.

తనను కావలసిన మనిషి రాలేదు.

బెల్లం చుట్టూ చీమలు ముసిరినట్లుగా ప్రయాణీకులు రైలును చుట్టుముట్టి సామానులు తోచినట్టుగా లోపలకు విసరటంవల్లనేమి, దిగే జనాభా యొక్క-కుయ్యో మొర్రోలవల్లనేమి, యావత్తు ప్లాటుఫారమూ మహా గందరగోళంగా వుంది. ఆ గొడవలోనుంచి యీవలకు వచ్చాక చినుకులు పడుతున్నట్లుగా తోచి మూసిన గొడుగు విప్పాడు శాస్త్రి.

అతను చిన్నప్పట్నుంచీ దేనికోసమో ఎదురుచూస్తున్నట్లుండేవాడు. ఆ ఎదురుచూడ్డం సెలయేటి కెరటాల తరగల పొంగుల్లో పడి పొర్లిపోదామనీ కాదు, నీలిరంగు మబ్బుల్లోకి నిండుగా హృదయాన్ని విసిరి రోజాపువ్వుల గుత్తులలోకి ముఖాన్ని దాచుకుందామనీ కాదు, మల్లెలు సన్నజాజుల వాసనలకు మత్తిల్లి ఆదర్శ శిఖరాల అంచుల్లో వూహలకు మాత్రమే అప్సరసతో సుఖిద్దామనీ కాదు- ముంగిసలా కాలం మెలితిరిగిన తన జీవిత సర్పాన్ని రాచిరాచి నేలను వొత్తి కొరుకుతూన్న కొద్దీ - ఒక చల్లని చూపు ఒక తియ్యని మాట వినాలని కోరేది మనస్సు. అంతే! అంతకన్నా పెద్ద ఆశ పెట్టుకోలేదు. అతని వివాహం కూడా అంతంత మాత్రంగానే జరిగింది. శిథిలావస్థలో వున్న జీర్ణ గేహాన్ని నాలుగు తాళపత్రాలతో కప్పుకుని అందులో సుఖిద్దామనుకున్నాడుగాని అంతస్థులు మిద్దెలు విలాసాలకోసం అతను అర్రులు చాచలేదని మొదవే చెప్పాలి. డబ్బుకోసం పెళ్ళి చేసుకోవటం సుతరామూ శాస్త్రికి అప్పట్లో ఇష్టం లేదు. పిల్ల నచ్చటం, మనస్సు కలిసిందా లేదా - యివి అన్నీ వున్నవాళ్ళకు గాని తనకేమిటి అనిపించింది. తను విరహవ్యథలు అభినయిస్తూ ఇంట్లో గూర్చుంటే తనమీద పంచప్రాణాలు పెట్టుకున్న తల్లిదండ్రులు లేమికాను? అందుచేతే ఎవరో ఒకర్తి ఆడది - అని చేసుకున్నాడు సరస్వతిని. అనుకున్న కండిషను ప్రకారం డబ్బుయిచ్చి చదువు చెప్పించాడు మామగారు. సరస్వతి కాపురానికి వచ్చాక క్రొత్తలో కొంత పెట్టుబడి కూడా తనేమీ కోరకుండానే సర్దుబాటు చేయటం జరిగింది.

ఇప్పుడు శాస్త్రి సంపాదనాపరుడు కాగానే సరస్వతి కంఠాన్ని పొడిగించి- ఆ యావత్తు ఆర్జనా నిజంగా అనుభవించవలసిన హక్కు- తనదిగాని అంతర బొంతరవాళ్ళను తెచ్చి మేపటం సమంజసం కాదని వాదిస్తూ వచ్చేది.

మొదట్లో శాస్త్రి సరస్వతిని చూచినప్పుడల్లా కొద్దిగా గర్వపడేవాడు లోపల్లోపల. ఆమె గుండ్రటి లేతచేతులు, రోజారంగు చెక్కిళ్ళు, నవ్వినప్పుడల్లా సొట్టలుపడే బుగ్గలు, మధ్యపాపిటి, వొత్తైన నొక్కు నొక్కుల జుట్టు జడతో ఎంతో ఆకర్షణీయంగా వుండేది. తరువాత పిల్లలు వాళ్ళతో ఆఫీసునుంచి రాగానే ఆడుకోవటంలో ఎంతో హాయి, సుఖమూ లభించేవి.

ఆ పొంగుల్లో తనకు - తెలియకుండానే సరస్వతి సంసారక్రమాన్ని క్రొత్తమార్పులతో సవరణలతో ఎన్నిమాట్లు బిగించాలని ప్రయత్నించినా అదొక తమాషాగానే చూసీ చూడనట్లు వూరుకున్నాడుగాని, ఆమెలో అవ్యక్తభావనా రూపమై నెలకొన్న అధికారవాంఛా మేఘమొకనాడు ఝుళిపించి విస్సురుగా యెడాపెడా వర్షిస్తుందనీ, ఆ తుఫానులో ఇక తన ఒక్కగాని ఒక్క చెల్లాయిని రక్షించుకోనన్నా రక్షించుకోలేనని, యిల్లాలు అడ్డుగోడల్ని బాగా పెరుగనిచ్చి 'ఇది నా ఇల్లు - యిందులోకి మరెవ్వరికీ ప్రవేశార్హత లేదని, నిక్కచ్చిగా కట్టుదిట్టాల్ని చేస్తుందనీ శాస్త్రి బహుశా కలలో కూడా వూహించియుండడు.

వాన కురవసాగింది. కాళ్ళీడ్చుకుంటూ పొడుగ్గా కొల్లేటి చేంతాడులా వున్న బేడారా రోడ్డును దాటివస్తూంటే, ఎక్కడ చెట్టూ చేమా అన్నది లేక చుట్టూ ఉబ్బి లేసుకుపోయిన యిసుక మైదానాలలో —— వానకు వరదకు, ఎండకు గాలికి

అన్నింటికీ తన శరీరాన్ని వప్పగించి కదలక మెదలక అట్లానే పడివున్న ఆ రోడ్డు వొంటరితనానికి కూడా శాస్త్రి జాలిపడసాగాడు.

అతనికి మరొక్క విషయం స్ఫురణకొచ్చింది - తను చిన్నతనాన్ని దాటుతున్నానని క్రమేపీ యింకొక పదేళ్ళకు అంటే నలభై మేరల్లోకి వచ్చేసరికి యవ్వనంలో దేనికోసమై తపించి లభించక హతాశయులై హత్యలకు ఆత్మహత్యలకు యత్నిస్తుంటారో, సరిగా అటువంటి స్థితే తనకూ వచ్చినా - ఆ వయస్సులో అప్పుడిక స్త్రీకోసం జీవితాన్ని పాడుచేసుకుని పంచప్రాణాల్నీ వొడ్డేటంత తెలివి తక్కువ మనిషిగా తను మారనని, తనకిప్పుడు ముప్పై బహుశా వుండొచ్చు. తల అక్కడక్కడ నెరుస్తోంది. ముప్పైయేళ్ళకే పెద్దమనిషా—

శరీరం యొక్క భౌతికమైన పెరుగుదలను గుణించటానికి వయస్సు సాయమవుతుంది. లోపలి మనస్సు యొక్క వయఃపరిమితిని జీవితంలోని దుఃఖాల నుంచి యేర్పడ్డ వొత్తిడి నిర్ణయిస్తుంది. అందువల్లనే కొంతమంది వయస్సు మళ్ళిన వాళ్ళు కూడా చిన్నపిల్లల మాదిరే వుంటారు. ఆ కారణాన్నే రైళ్ళలో డిటెక్టివ్ నవలలు, పిల్లల పత్రికలు చదివే పెద్దవాళ్ళు తారసపడుతూంటారు. అట్టే ఆశ్చర్య పడనవసరం లేదు వాళ్ళను గూర్చి.

శాస్త్రికి అనుభవమైతే వుందికాని, పది పదిహేడేండ్ల వయస్సుకు ముందు బచ్చాలు, చెడుగుడు గూటిబిళ్ళ, బంతి ఆటలు ఆడుకొంటూ తిరిగి పెరగవలసిన వయస్సులో సుఖదుఃఖాల్ని తూచుకుందుకు వలసినంతగా శక్తి లేదు. తను లేని కుటుంబానికి చెందనని, పేదతనం వలన జీతం కట్టుకోలేకుండా వున్నానని తలకో పావలా అర్ధా సాయం చెయ్యవలసినదిగా పెద్ద మనుష్యుల యెదుట నిలబడి అర్థించాల్సి వచ్చేది. అట్లా వినయ విధేయతలు గలిగిన ఒక బీద పుత్రవాడుగా వుంటూ పరిమితావకాశాల సుడిగుండంలో పడుతూ లేస్తూ మసిలి పెరిగిన వ్యక్తికి స్వేచ్ఛ నియమబద్ధమైన జీవితం, నన్ను ముట్టుకోకు నామాలకాకి అనేట్లుగా తన వర్గీలో కూడా జీవించవల్సివస్తే ఎట్లాగుంటుంది? అంచేతే ఆ సంసారం సుఖజీవన సారం కాలేదు.

"ఆ చెల్లెలు - అదే నాకు మిగిలివుంది" అనేవాడు అర్థం చేసుకో మన్నట్లు.

ఇంకా ఒకప్పుడు ప్రాణం విసిగి కసిరేవాడు సరస్వతిని.

"నువ్వు ఏడ్చి పెడబొబ్బలు పెట్టనక్కర్లేదు. ఇక్కడ వుండటం ఈ చాకిరీ చెయ్యటం నీవల్ల కాకపోయినా, నీ కిష్టం లేకపోయినా, నిక్షేపంలా మీ యింటికి నువ్వు వెళ్తానన్నా నిన్నేమీ అనేవాణ్ణి కాను."

ఈ ముక్కలు విన్నప్పుడల్లా సరస్వతి ముఖం అగ్నిగోళమయేది.

అట్లా చివరకు రెండు సమానశక్తుల తీవ్రమైన విజృంభణ వాగ్వాద పోరాటాలకు ఆ యిల్లు నిలయమై కూర్చుంది.

సరస్వతి యిలాగనేది.

"నేను మీ ఒక్కగాని ఒక్క చెల్లెలుకు రాకూడని జబ్బేదో ఆమెకే వచ్చింది. వస్తే చేయనన్నానా? అంటువ్యాధి కదా వుయ. మన యింట్లోనూ చంటి పిల్లలు. ఎందుకిక్కడకని ఆ ఉద్దేశ్యంతో అన్నాను కాని, మీరు లేని అభిమానం నాకుంచేమటుకు యీ కొంపమీద - అది ఎందుకు చెల్లుతుంది? నీరసస్థురాలినని చేసుకోలేనని మీకేమున్నా వున్నది గనుకనా? లోకం దీనికి పొడా పొబ్బా గిట్టదన్ని అనుకుంటుంది. దానికి తగ్గట్టే మీకూ నన్ను అవమానించాలనే వుంది. ఉండబట్టే పుట్టింటికి పొమ్మని అంత తేలిగ్గా అనగలిగారు. నాకు మటుకు ఏమిపేడిసింది యిక్కడ - కానీండి. చెట్టుకు కాయలు బరువా, నా వాళ్ళకు నేను బరువు కావ టానికి? వాళ్ళకేమీ తక్కువ లేదు."

శాస్త్రి అప్పటికీ గొంతు చించుకుంటూ నాలుగూళ్ళకు వినిపించేలా-"వెళ్ళు వెళ్ళు ఎవర్నుద్ధరిస్తా విక్కడ" అన్నాడు చిరాగ్గా.

అన్నట్లుగానే ప్రయాణమై వెళ్తూ "అంతా నన్ను వొంపెత్తు మనిషని చిన్నప్పట్నుంచీ వెక్కిరిస్తూ వచ్చారు ఆ మాటే మీకూ రూఢి చెయ్యాలని ఉంది. నేను ఏమైనా సహిస్తాను కాని అవమానాన్ని మాత్రం సహించను" అన్నది సరస్వతి.

శాస్త్రి ఊరుకోలేదు.

"నీ మాట చెల్లకపోతే నీకేదో అవమానం జరిగినట్లే ఉంటుంది. నీ సహజ ధర్మాలన్నింటినీ నీ కోసం వదలేసుకుని జోగినై గంగిగోవులా డూడూ డూడూ బసవన్నా అంటే ఎగిరి గంతెయ్యకపోతే ఇంత రభసా చేసేదానివేనా?'

సరస్వతి తన సుందర ముఖారవిందాన్ని మాటిమాటికీ పొత్తుకుంటూ "మీ ధర్మాలన్నీ మీరు సక్రమంగానే నిర్వర్తించుకోండి. అయితే ఆ ధర్మ పరిపాలనలో కాస్త నాకు కూడా మిగిల్చి న్యాయం చెయ్యండి. ఎంతచెడ్డా మీ కంటికి కెంత దుష్టస్వభావురాలిలా ఉన్నా నా మెళ్ళోనూ ఒక పెద్ద పెయ్యకట్టుత్రాడు మంగళ సూత్రమనే పేరిట బిగించారు. అదైనా ఊరికే మాత్రం కాదు..." అన్నది.

శాస్త్రి కాలుకాలిన పిల్లిలాగున నిప్పు త్రొక్కిన కోతిలా అయి, "మరి అందుకా నన్ను కొనుక్కున్నట్లు మాట్లాడుతున్నది. విను, మీ ఇంట్లో అస్తమానూ పూజలు, నోములు, వ్రతాలని ఎంతో హడావిడి చేస్తూంటారే, ఇంత కోపాగ్ని చల్లార్చుకోలేనిదానివి - ఎందుకు? ఎట్లా సాగించాలనొచ్చావు జీవితం? నీ మాట చెల్లకపోతే ప్రపంచమంతా తల్లక్రిందులు కావలసిందేనా? ఫో, ఫో, నాకక్కర్లేదు" అనేసి చరచరా ఇంట్లోంచి చెప్పులు వేసుకుని నడిచాడు బయటికి.

శాస్త్రిది క్షణికమైన కోపమని తెలిసి కూడా అభిమానం కొద్దీ ఆగకుండా పిల్లల్ని తీసుకుని పుట్టింటికి ప్రయాణమై ఆ రోజే వెళ్ళిపోయింది ఆ మహాఇల్లాలు.

చెల్లాయి వచ్చాక - రాజుకున్న అగ్గి ఆరిందనుకుని ఫలానా బండికి వస్తాను పంపమని బావమరిదికి కబురు చేశాడు. మంత్రాలకు చింతకాయలు రాల్తాయా? ఆశకొద్దీ స్టేషనుకు వచ్చాడు. సరస్వతి రాలేదు కాని రైలు వచ్చింది.

2

జీవించటం, జీవితము - అందులో సుఖపడ్డం వేరుగా ఉంటుంది. కష్ట సుఖాలను పునరాలోచన చేసుకుంటూ నడుస్తున్న శాస్త్రికి అప్పుడే నెత్తిమీద ఏదో బరువుగా కదిలినట్లయింది. ఆలోచనల బరువేమీ కాదు.

పిల్లలు విరగబాటుగా నవ్వుతున్నారు. కొంతమంది చప్పట్లు చరుస్తూ వెంబడించబోతున్నారు.

వాన కురవటం మానింది గదా అని తీగ నొక్కబోతే, గొడుగు వున్న మాటుగా ఒక్క కుదుపు కుదిపినట్లయి తేలికపడింది. ఏమిటాని చూడబోతే గొడుగ కామమీదుగా లంఘించిన అడకోతి, నేలమీదుగా పరిగెత్తుకుంటూ వెళ్ళి ప్రక్క గోడను ఎక్కి, తీరిగ్గా కూర్చొనబోతోంది.

పిల్లలంతా కోతి కోతి అంటూ రాళ్ళను గోడమీదకు విసరనారంభించారు. బయటి వర్షం ముగిశాక రాళ్ళ వర్షం ఆరంభమయిందా అన్నట్లుంది. అదికూడా పండ్లు కిలిస్తూ, రోమాలన్నీ నిలబడగా, భయంతో కిచకిచలాడుతూ స్వప్రాణ రక్షణ కోసం ఆ కొమ్మమీదనుంచి యీ కొమ్మమీదకు, ఇక్కడ్నుంచి పెంకుల మీదకు ఎగురుతూ నానా అల్లరి ఆరంభించింది.

అక్కడో పెద్ద గుంపు ప్రోగయింది. అందులో అన్ని వయసులవాళ్ళూ ఉన్నారు. అందులో పిల్లలకు వేట సరదా హెచ్చింది. అది చేసే అల్లరికి పీళ్ళు కూడా వెర్రులెత్తిపోయారు.

శాస్త్రికి తానుగా అడ్డు వెళ్ళి ఆ కోతిని కాపాడాలనిపించింది. "ఎందుకా కోతిమీదకు రాళ్ళు విసురుతారు ఆగండ"ని మాటలతో వారించబోతే, "పెద్ద చెప్పొచ్చావు వెళ్ళవయ్యా నీకెందు"కన్నట్లు చూశారు అక్కడి పిల్లమూక. శాస్త్రి





ఊరుకునే మనిషి కాదు. ఒకరిద్దరి చేతుల్లోని బెడ్డముక్కలను లాక్కుని నేలమీద పారేశాడు.

కోతి చూస్తూనే వుంది - శాస్త్రి బెడ్డలు గుప్పిళ్ళల్లోంచి లాక్కుని నేల మీదకు విసరటం. అంతలోనే పిల్లమూక ఎదురు తిరిగి శాస్త్రిమీదకు బెడ్డలు విసరసాగారు. ఒకటి నుదుటిమీదా, ఒకటి గుండెలమీదా, ఒకటి ముక్కుమీదా బలంగా తగిలాయి.

శాస్త్రికి ఉప్పూ పులుసూ తినే మనిషికి వచ్చేటంత కోపం వచ్చింది. గొడుగు మడిచి కుర్రమూకను తరిమి తరిమి చావగొట్టాడు. ఆ ఘట్టం అభిమన్యుడు పద్మవ్యూహాన్ని భేదించినదానికేమీ తీసిపోదు. కాని చిన్న తేడా వుంది. అక్కడ ఒక కుర్రవాడు అతిరథుల్ని మహారథుల్ని గాభరా లెత్తించాడు. ఇక్కడ ఒక పెద్దవాడు కుర్రవెధవల్ని చెమడాలెక్కతీసి పరుగులెత్తేట్లు చేశాడు.

"చచ్చాంరా బాబో..." అంటూ కాలికొద్దీ దూసుకున్నారు.

అట్లా శాస్త్రి వాళ్ళని తరుముతూంటే పరుగు పరుగున వెనుకనుంచి వెంబడిస్తూ వచ్చిన కోతి అమాంతం కంట వెలికివచ్చేలా అతడి పిక్క పట్టేసుకుంది.

శాస్త్రి పెద్ద కేకపెట్టి అమాంతం ఆ కోతి పీకను రెండు చేతుల్లోకి తీసుకుని, నలిపి చంపేద్దామన్నంత వైరికోపంతో పైకెత్తాడు. అంతే - అది తన పొడుగాటి సన్నటి చేతుల్తో కళ్ళు తుడుచుకోసాగింది. అది చూసే చూపులు "నన్నెందుకు చంపుతావు" అని జాలిగా అడుగుతున్నట్లున్నై.

శాస్త్రి జ్ఞానమున్న మనిషితో మాట్లాడినట్టుగా పళ్ళు పటపటలాడిస్తూ— "యింతసేపూ నా నెత్తిమీదకెక్కి సవారీ చేస్తివే? ఛడవా - ఇప్పుడు నిన్ను కాద్దామని వీళ్ళని తరుముతూంటే నన్నే పీకుతావూ? చూడు నిన్నేం చేస్తానో-" అన్నాడు.

అది అంతకన్నా తమాషాగా రెండు చేతుల్నీ ఎత్తి దండం పెట్టింది.

శాస్త్రి పెద్దగా ఆపులించి "హాసి - నీ యమ్మకడుపు బంగారం కానూ- ఎన్ని లయలే-" అంటూ చెవిమీద గిల్లాడు.

దాన్ని ఎత్తుకుని వస్తూంటే యింటికొచ్చేదారిలో, రెండుమార్లు అతని అర చేతులవరకూ జారి, గిల్లి తప్పించుకోవాలని చూసింది. శాస్త్రి దాన్ని యింకా హృదయానికి దగ్గరగా తీసుకుంటూ యిలాగన్నాడు - "చేసుకున్న ప్రేయసి చెప్పినా వినకుండా లేచిపోయింది. నువ్వు కూడా అట్లాగే చేస్తావా?" ఈ ముక్కలు అన్నాక కోతి మెడలోని వొంటిమువ్వ శుభసూచనగా ఘల్లుమంది. శాస్త్రి బిగ్గరగా నవ్వాడు.

అతనికి ఆకలి వేసినట్లుగా అనిపించి కోతికేసి చూశాడు. అది బద్ధకంగా ఆపులించింది.

"సరే పద - నీ కిక్కడ విందు. రేపు యింటిదగ్గర నీకు పెళ్ళికూతురి వస్తాయి - సరేనా" అంటూనే శాస్త్రి మర్కట సమేతుడై హోటలులో ప్రవేశించాడు. ముప్పావలా బిల్లయేలా యిద్దరూ తినుబండారాలమీద కలయబడ్డారు. కొంతవరకూ మచ్చికైన తర్వాత మర్కటసుందరి బల్లమీద ఇటో చెయ్యి అటో చెయ్యి పడేసి, మధ్యగా సాసరులో శాస్త్రి వూది చల్లార్చిన కాఫీ ఉంచగా— అమృతం త్రాగినట్లుగా ఎత్తి గొంతులో పోసుకున్నదై పెదవుల్తో తడి ఆర్చుకుంటూ నాలికంతా బయటపెట్టి తెగశుభ్రంగా నాక్కుంది మూతి.

ఇట్లా అరగంట కాలక్షేపమయేవరకూ, ఇంటిదగ్గర చెల్లాయి సరస్వతి రాక నపేక్షిస్తూ, ఒక్కర్తే కూర్చుని ఉంటుందన్న విషయం అతనికి గుర్తు రాలేదు.

"ఇక పోదాం యింటికి-" అంటూ లేచాడు. దాని దృష్టి తనవైపు లేదు. ఒడుపొడుపుగా పట్టుకుని పెద్ద పెద్ద అంగల్ని వేస్తూ యీవలకొచ్చి చూశాడు. భూమి అక్కడా అక్కడా గుంటలు పడ్డచోట్ల నీళ్ళను నిలవేసుకుని నడవటానికి కష్టమనిపించేలాగుంది, రిక్షాకోసం పరధ్యాసగా అటూ యిటూ కాస్త చూశాడు. కోతి అదే సందనుకుని తన్ను దూసుకుని ఉడాయించేసింది. శాస్త్రి విస్తుపడి నిల్చుండిపోయాడు. చీకట్లో మరొకవైపునుంచి అరిటిపళ్ళ అత్తాన్ని లంకించుకుని పరుగు పరుగున ఎగురుకుంటూ తన కాళ్ళమేరకు వచ్చి నిలబడ్డది.

శాస్త్రి ముక్కుమీద వ్రేలుమోపి కఠినంగా "తప్పు తప్పు. ఇల్లాంటి వెధవ పెంకిపనులు చేస్తే నిన్ను ప్రేమించేది సున్న. పెండ్లికూతుర్ని చేసేది లేదు."

దుకాణం వదిలిన ఒక ఆడమనిషి లబోదిబోమంటూ వచ్చింది,

"పొరపాటున వదిలేశాను. ఎత్తుకొచ్చేసింది' అని క్షమార్పణలు చెప్పకుని వెల ఇచ్చేసి తనూ సర్ది పంపాడు.

ఎకాయెకీ ఇంటికి చేరుకున్నాక చెల్లాయి గుమ్మంలోనే ఆతురతగా "వదిన రాలేదూ?" అన్నది, వెనక మరో బండిగాని రిక్షావంటిదిగాని వస్తూ ఉండకపోవటాన్ని చూసి.

"వచ్చింది. పారిపోయిన మీ వదిన్ను పట్టి తెచ్చాను" అన్నాడు మందహాసంగా.

"ఏదీ?"

శాస్త్రి కోతిని ఎత్తి చూపించాడు.

"ఇదేమిటి? ఇదెక్కడ్నుంచి?"

చెల్లాయి అడుగు వెనక్కువేసి దారి ఇస్తూండగా క్రొత్త మనిషిని చూడ్డం చేత కోతి కంగారుగా అరిటిపండ్ల అత్తాన్ని దాచుకోబోయింది.

శాస్త్రి "ఏమిటి? ఇప్పుడు దీనికేమి లోటని-అచ్చంగా మీ వదినే శాపవశాన- ఎందుకే అమ్మాయి నవ్వుతావు? అహల్య రాయై పోలేదా? ఉద్దాలకుడు చండికకు శాపమివ్వలేదా? నే నేమి తక్కువా - శాపమిచ్చేశాను."

చెల్లాయికి నవ్వాగింది కాదు. పొట్ట చేత్తో పట్టుకుని, "భలే - అన్నయ్యా! భలే!" అన్నది.

శాస్త్రి చంకనుండి జాగర్తగా నేలకు దింపాడు. చెల్లాయి చోద్యంగా చూస్తూ "పీకుతుందేమో అన్నయ్యా" అని అడుగు వెనక్కువేసి "మా ఆసుపత్రిలో నువ్వు ఒక్కరోజు ఉన్నావంటే మమ్మల్నందర్నీ పొట్టలు చెక్కలయ్యేలా నవ్వించి తీరుతావు. ఇదివరకు డాక్టరు 'నవ్వాలమ్మా, నవ్వితేనేగాని ఊపిరితిత్తులు శుభ్రపడవు' అంటూండేవాడు." అన్నది.

శాస్త్రి చొక్కా విప్పుకుంటూ "భయంలేదు, ఎందుకైనా మంచిది మీ వదిన్ను రెండురోజులు కట్టి పడెయ్యాలి. ఎక్కడికైనా ఉడాయించగలదు" అని తాడుకోసం వెతికి పాత నులకమంచంనుంచి బాగా రెండు మూరల త్రాడును జమిలి వేసి కోతి మెడలోని పట్టాకు కట్టి తన గదిలోని కిటికీవూచ కా త్రాడును ముడేసి వచ్చాడు.

అతను యిటు తిరగ్గానే అది కిటికీలోకి ఎగిరి కూర్చుంది. శాస్త్రి తీరిగ్గా స్నానానికని లేచాడు.

చెల్లాయి జిహ్వాచాపల్యంకొద్దీ అర్టిపండుకోసం అత్తంమీదకు వంగి ఒక కాయ త్రుంచబోయింది. అది ఎట్లా పసిగట్టిందో కిటికీలోంచి మీదకు దుమికి చెంప ఛెళ్ళుమనేలా వాయించేసింది.

భయంతో మంచంవరకూ గెంతి, "రారో అన్నయ్యా, ఈ వదిన పీకుతుందేమో - బాబో..." అంటూ దుప్పటీ లాక్కుని వళ్ళు కప్పుకు మంచం నడిమికెక్కి కూర్చుంది.

శాస్త్రి వచ్చి దాని రెండుచెవులూ పుచ్చుకుని మెలేసి 'జాగ్రత్త' అని హెచ్చరించాడు.

సరస్వతి అని దానికి నామకరణం చేయటం జరిగాక ఒక వారం రోజులు అహర్నిశలూ తిప్పలు పడి దాని కా పేరు అలవాటు చేయటం జరిగింది.

పెండ్లికూతురుకు జరిగే గౌరవ మర్యాదలన్నీ దానికి జరుగనారంభించాయి. ఒక యినుప గొలుసు, ఒక పింగాణీ కంచం, యిత్తడిగ్లాసూ ప్రత్యేకంగా కొనటం జరిగింది. ఇక్కడకు వచ్చాక మంచి పోషణా అదీ వుందేమో బంతిలా తయారైంది.


శాస్త్రి ఆఫీసుకు వెళ్ళగానే చెల్లాయికూడా కూడా తిరిగేది. రేగిపళ్ళు వస్తే రేగుపండ్లు, జామికాయలు ఒకచేమిటి ఏది వస్తే అది పుష్కలంగా దానికి పడేసేవారు.

చెల్లాయి వొదినా అన్నా వెనువిరిగి ఎగురుకుంటూ వచ్చి ప్రక్కను కూర్చునేది. దానికి శాస్త్రి రాకకూడా తెలుసును.

"అన్నయ్య వస్తున్నాడేమో చూడు..." అనటం తడవుగా మెట్లన్నీ ఎక్కి అతని గది కిటికీలోకి ఎగిరి కూర్చొని, వచ్చేపోయే గొడుగుల్ని, ముఖాల్ని పరిశీలిస్తూ ఆతృతగా చూసేది.

శాస్త్రి గొడుగు దానికి బాగా గుర్తు. చెల్లాయికి దాని ముఖంలోని సంతోషాన్ని చూస్తూంటే, అతని రాకకు సూచనగా ఆ గొడుగును వీధి మలుపులో చూడ్డంతో దాని కిచకిచల హడావిడికి ఎంతో ఆశ్చర్యం వేసేది.

అతను గడపదాకా రావటం తడవు ఆ గొడుగును లాక్కుని యీడ్చుకుంటూ యిల్లంతా అలంగం తిరిగేది. శాస్త్రి దాన్ని విడిచి ఒక్క నిముషం కూడా వుండేవాడు కాదు.


AMRUTANJAN'S
SWAS
MINTS
అమృతాంజన్
వారి మరొక గొప్ప తయారి
స్వాస్
మింట్
బిళ్ళలు
అమృతాంజన్ లిమిటెడ్

స్నానాల గదిలోకి వెళ్ళితే అక్కడకూ, దుస్తులు మార్చుకుంటూంటే ఆ చోటికీ, వ్రాసుకుంటున్నప్పుడు బల్లమీదా కూర్చునేది.

ప్రత్యేకంగా పువ్వుల జుబ్బాలు ఎన్నో కుట్టించాడు అతను దానికోసం. చెల్లాయి చిన్న చిన్న గళ్ళపరికిణీలు తయారుచేసి వాటిని తొడిగి అతను వచ్చే సమయానికి ముస్తాబు పూర్తిచేసి తీర్గా వుండేది.

తీరిక సమయాల్లో దానికి కొన్ని మనుషుల అలవాట్లను నేర్పారు. ఏదన్నా తిన్నాక చేతుల్తో మూతి తుడుచుకుంటుంది. తన వస్తువుల్ని ఇతరులను వాడ నివ్వదు. తనవి కానివి ముట్టుకోదు. పరికిణీ చొక్కా అసహ్యంగా మాపుకోదు.

శాస్త్రి స్నేహితులెవరైనా వస్తే వాళ్లు వెళ్ళేవరకూ కూడా వుండేది. రాను రాను సాయంత్రాలు బీచికి షికారుకు వెళ్ళటం కూడా అలవాటయింది.

సబ్బుబిళ్ళ తువ్వాలు చేతికిస్తే అది శాస్త్రికి పట్టుకెళ్ళి యిచ్చేది.

ఒకరోజున శనగలు, ఒకరోజున అరిటిపళ్లు, కారప్పూసలాటి వస్తువుల్ని రోజూ ఎవరో వకరు తెచ్చి బీచిలో తినిపిస్తూండేవారు. శాస్త్రికి కోపం రావటం కూడా దానికి తెలుసు.

పెద్ద పెద్ద కెరటాలు ఎగురుకుంటూ కట్టను ఢీకొంటున్నప్పుడల్లా కుప్పించి కుప్పించి యిసుకలో ఎన్నిరకాల ఆటలో ఆడేది.

శాస్త్రి మిసెస్సు బీచికి రాకపోతే, ఆ రోజు మాత్రం ఎవరిళ్ళకు వాళ్ళు పెందరాళే చేరుకునేవారు.

తరువాత చెల్లాయిని బెడ్ దొరికినందున ఆస్పత్రిలో చేర్పించటం జరిగింది. ముగ్గురికీ కారియరు వచ్చేది. శాస్త్రి పుష్కలంగా డబ్బు ఖర్చుపెట్ట నారంభించాడు. స్వయానా రెండుచేతులా చాకిరీకి దిగాడు. కారియరు తీసుకెళ్ళటం నుంచి నీళ్ల తోడ్డం యిల్లు సర్దుకోవటంవరకూ పైనే పడింది. ఒక్కొక్కరాయి చొప్పున తీస్తుంటే కొండైనా తరుగుతుంది. యిదొక లెక్కా అనుకున్నాడు లోపల.

3

ఒకమారు, నిత్యజీవితము, అందులోని యాతనలు తాపత్రయాలనుంచి బైటకు వచ్చిపడ్డాక - వూపిరి పీల్చుకుందుకు స్వేచ్ఛగా, యేమేమి చేశామని లోపల వుంటుందో, వాట్లన్నిటిని ఆచరణలో పెట్టుకుందుకు సరస్వతికి యిప్పుడు వీలు చిక్కిందనే చెప్పాలి.

ఆలోచనలు పరుగెత్తినంత వేగంగా మనుష్యులు కూడా పరుగెత్తటానికి వీల్లేని గట్టి చిక్కొచ్చి పడింది.

సరస్వతి చేతిలో డబ్బులేదు. పదిరూపాయలు వుంటే మాత్రం—అది - మూలకూ చాలదు.

మాటమీద మాట అనుకున్న తరువాత శాస్త్రి మాత్రం ఏ సౌకర్యమూ, మంచీ-చెడ్డా అన్నది చూడకుండానే వీధిలో కెళ్ళిపోయాడు.

అట్లాటి మనిషిని ఏమని అడుగుతుంది? ఎంత పరాధీనపు బ్రతుకైనా — తానుగా యిప్పుడు స?లించి సింహగర్జనలు చేసింది!

వాల్తేరు స్టేషనులో పెట్టె, హోల్డాలు, మరచెంబు, సజ్జబుట్ట రైలులోకి స్టేషనుకూలీ ఎక్కిస్తూన్నప్పుడు సరస్వతి యిలాగనుకున్నది - "ఆయనకు ఆ వచ్చేకోపం ఎల్లానూ వచ్చింది. పోతే పొమ్మని విస్సురుగా అనేవాడు జేబులోంచి పదో పదిహేనో తీసి నా మొహాన ఎందుకు కొట్టలేదూ'' అని.

ఆ వెళ్ళటం తిన్నగా ప్రసాదరావు దగ్గరకు - ఒక్కగాని ఒక్క చెల్లెలు తను, చూసి కూడా ఎన్నో రోజులయింది. అక్కడ వుంటే దేనికీ అంతగా యిబ్బంది వుండదు. ఈ తిక్క కుదిరాక అప్పుడు చూసుకోవచ్చును. అంతగా కుదరక అన్నగారి యింట్లో వుండటం యిష్టం లేకపోతుందీ, ఒక కార్డుముక్క గిలికి పారేస్తే తండ్రి వచ్చి పువ్వుల్లో పెట్టినట్లు తీసికెళ్ళడూ-

సరస్వతి ఆలోచించినట్లు వర్తించినట్లు ప్రాజ్ఞురాలైన స్త్రీ ఎవ్వతీ ఆలోచించదు.

స్వర్గం కానీ, నరకం కానీ, సుఖం కానీ, దుఃఖం కానీ - తనూ, తన యిల్లు తన సంసారమే తనది కాని - యిది కాదని మరొక చోటికూ, అదికాదని యింకొకచోటికూ, కుప్పిగంతులు వేస్తూ - పరుగెత్తటం వానర పక్షతలకే చెల్లుతుంది కాని మనుష్యులకూ సామాన్య సంసారులకూ కాదు.

అట్లా అని సరస్వతిని పూర్తిగా కోతిని చేసి వదలటానికి వీల్లేదు. ప్రపంచంలో ఒకరకం స్త్రీ లున్నారు. వారికి తమ ఇల్లు తమ సంసారము తమ చుట్టూ మనుష్యులు నచ్చరు. అదుగో వాళ్ళ మనిషిచేత కట్టెలు తెప్పించుకున్నారు. అవి ఎండు కట్టెలు. మరి మీరు వెళ్తే పచ్చి మొద్దులు - ముఖాన్నిబట్టి అమ్ముతారు కాబోలు అడవిలో. ఇట్లాటి మాటలాడే వ్యక్తులు అస్తమానూ పొరుగింటి పుల్లకూరే రుచి అనుకుంటారు;

చంటిపిల్లడ్ని తీసుకుని బెజవాడ వచ్చాక అనుకున్నట్లుగానే తన జీవితము అరుకాయలూ మూడు పువ్వులుగా సాగుతున్నట్లు సరస్వతికి తోచింది.

ప్రసాదరావుకు రెండు చేతులా గట్టి సంపాదన వుంది. తినడానికి వెనుక పదిమంది ఎవ్వరూ లేరు. లింగూ లిటుకూ మంటూ యిద్దరు.

తీగల తంపరలాగ పిల్లలా — లేరు.

అదృష్టవంతురాలైన బొడ్డున మాణిక్యం పెట్టుకు పుట్టిన స్త్రీ ఎంత సుఖపడుతుందో, ఆ ఇంట్లో ఆ వదినగార్ని చూసి తెల్సుకోవచ్చును అనుకుంది సరస్వతి.


ఆవిడకు రవ్వల ముక్కుపుడక, రెండు జతల రవ్వల దుద్దులు వున్నాయి. సాయంత్రం కట్టిన చీర మళ్ళీ ఉదయం కట్టదు.. ముద్దులేసి ముక్కారు నగలు. కోరిన బట్టా కోరిన నగా తెస్తాడు అన్నయ్య.

సరస్వతి తన వదినగార్ని తల్చుకున్నప్పుడు ఆవిడ వైభోగాన్ని గుణించుకుంటున్నప్పుడు తన విశాఖపట్నంలోని రెండు గదుల డాబా ఇల్లు-ఒకటి క్రింద, ఒకటి పైన, నల్లగా మాసిన కిటికీలు, గలీబులు లేని తలగడలు ఒకటి వుంటే ఒకటిలేని సంసారం ఇందుకు పైగా ఏ నాలుగు రూపాయలన్నా జాగ్రత్త చేసుకుందామనే ఆలోచనే లేని తన భర్త - అన్నీ జ్ఞాపకానికొచ్చేవి.

చక్కగా వీధినుంచి ఏ వస్తువు కావల్సినా తెచ్చి పడేసేందుకు నౌకరు కుర్రవాడున్నాడు. వాడే చంటిపిల్లవాడ్ని కూడా ఎత్తుకుని ఆడించసాగాడు. రోజూ సాయంకాల ఏ సినిమాకో పాటకచ్చేరికో లేడీస్ క్లబ్బుకో పోతూండవచ్చు.

ఈ సౌఖ్యాన్ని కొద్దికొద్దిగా అనుభవిస్తూ మధ్య మధ్యన చెమటలు కారే ముఖంతో ఎడా పెడా మూటలు సంచులు మోసుకుంటూ యింటికి వచ్చే శాస్త్రి ముఖం, గుర్తుకు వచ్చినప్పుడల్లా ఎవరో ఎక్కడో బలంగా విసిరిన రాయి వచ్చి గుండెలకు తగిల్తే ఎలా ఉంటుందో, అంతకన్నా ఎక్కువే బాధపడాల్సి వచ్చేది.

వచ్చిన వారం రోజులకు పిల్లడికి సుస్తీ చేసింది. డాక్టరు వచ్చి మందిచ్చాక పదిరోజులకు తగ్గింది, ఎంత పోషణ బాగున్నా వాడు ఎండలకు తట్టుకోలేక, నీరసిల్లాడు. వాడికి తగ్గిందో లేదో రెండు రోజులు తలనొప్పి, ఎలాగో అనిపించి తను కూడా పడకెయ్యాల్సొచ్చింది. సరస్వతి కూడా పది పదిహేను లంఖణాలు చేసి పూచికపుల్లయి కూర్చుంది. ప్రసాదరావు ఆవీ ఇవీ తెస్తున్నాడు. జాగ్రత్తగానే చూస్తున్నాడు. ఇట్లా రెండవనెల కూడా పూర్తి కావచ్చింది. కాని ఇట్నుంచి అట్నుంచి కాకి కూడా కదల్టం లేదు. జ్వరం తగ్గింది. అస్తమానం డీలయిపోయినట్లుగా అనిపించేది లోలోపల.



లంఖణాలు చేశాక జుట్టు కూడా రాలిపోతూంటే బక్కపలచగా అంటుకు పోయినట్లున్న ముఖాన్ని మాటిమాటికి అద్దంలో చూసుకుంటూ 'ఎంత వికృతంగా వున్నాను' అనుకోసాగింది సరస్వతి.

ప్రసాదరావు స్నేహితుల్తో ముందు వరండాలో పెద్దగా నవ్వుతూ పిచ్చాపాటీ ఆడుతున్నాడు.

చంటిపిల్లవాడు మధ్యగదిలో చాపమీద పడుకున్నవాడల్లా వున్నట్లుండి లేచి పెద్దపెట్టున రాగాలాపనకు లంకించుకున్నాడు.

వదిన కాఫీ కుంపటి దగ్గర కూర్చుని తెల్లవారి లేచాక మూడోమారు అతిథుల కోసం కాఫీ సరంజామాలో మునిగి తేలుతున్నట్లుంది.

సరస్వతి అంతక్రితమే తలంటిపోసుకుని దొడ్లో అరుగుమీద కూర్చుని తలకు చిక్కు తీసుకుంటున్నది. పిల్లడి గొంతుక బాగా వినిపించి కూడా నీరసంతో లేవలేక ఏడవనీ అనుకుని మళ్ళీ దువ్వెన జుట్టులోకి పోనిచ్చి ఒక్కొక్కమారు ఎంత జుట్టు నష్టమవుతున్నదో చూసుకుంటూ దిగులుగా చతికిలబడిపోయింది.

అంతక్రితమే ప్రసాదరావు సిగరెట్లు కిళ్ళీలు తెమ్మని పురమాయించటం వలన వెళ్ళిన నౌకరు కుర్రాడు లేడు ఏడిచే పిల్లవాడ్ని ఎత్తుకునేటందుకు.

ఎవరో నౌకరు ఎత్తుకుంటారులే అని వూరుకుంది సరస్వతి. మధ్యలో కాఫీ కాస్తున్న వదినె 'రావమ్మా - ఆకలికి కాబోలు పిల్లవాడేడుస్తున్నట్లున్నాడు' అని ఒక చిన్న కేకకూడా వేసింది.

సరస్వతికి లేవక తప్పింది కాదు. లేచి అలమార్లో పాలడబ్బా యివతలకు లాగి మూత తెరిచింది. దానినిండా చీమలు. కాస్తో కూస్తో మిగిలివున్న పాలగుండను కాస్తా అవి కాజేసినై. నాలిక కర్చుకుంటూ చాపవద్దకు వెళ్ళింది.

పిల్లవాడు పెద్ద గుక్క పట్టాడు. ఎత్తుకుని దొడ్లోకి వద్దామనుకుంటోంది.

"ఇంటో ఎవరూ లేరా - అవతల పెద్దమనుష్యులు మాట్లాడుతూంటే - యీ గోల - యిదేమిటి? కాస్త ఎత్తుకోలేరూ ఏడ్చే పిల్లవాడ్ని?" అంటూ వచ్చాడు ప్రసాదరావు.

పాలడబ్బా అయిపోయిందని చెప్పటానికి సరస్వతికి నోరు రాలేదు. చెప్ప రాని భయం వేసింది. కాఫీ కప్పుల్ని 'ట్రే'లో వుంచుతూ వదినె 'ఏమిటి చెయ్యమంటారు మధ్యాహ్నానికి. రెండు కూరలూ ఒక పచ్చడి చాలునా-' అడిగింది.

"సగ్గుబియ్యపు పరమాన్నం చేసి వడలు చెయ్యి, అమ్మాయీ, నీకూ ~గలు వెయ్యటం బాగా వచ్చు కదుటే-"

సరస్వతి గడప దాటుతూ "అప్లో-" అన్నది.

"ఆవిడా - ఆవిడవల్ల యేమవుతుంది?" అన్నట్లు ప్రసాదరావు ముఖంలోకి చూసింది వదినె.

సరస్వతి తన దగ్గర పాలు యిచ్చి ఊరుకోబెట్టడానికి ప్రయత్నించి విఫలురాలైంది. తన దగ్గర కూడా లేవు, ఎండిన తన రొమ్ములను కాస్సేపు చప్పరించిన కుర్రకుంక కోపంగా అంగుటి బిగించి నములుతూ మళ్ళీ బాకా ఎత్తాడు.

సరస్వతికి బక్కకోపం వచ్చి నాలుగు మొత్తింది.

"ఎందుకమ్మా వదినా - దేనికట్లా వాడ్ని బాదుతావు? నీకేమన్నా మతి పోతోందా?" అంటూ వచ్చింది నవ్వుతూ వదినె.

అల్లాగే వుండి అన్నట్టుగా దీనంగా చూసింది.

సరస్వతికి ఏమీ పాలుపోలేదు. ఆత్మాభిమానం అడ్డు వస్తున్నా తెగేసి చెప్పింది - "పాలడబ్బా ఆఖరయింది."

"ఐతే వుండు. మీ అన్నయ్యను పంపిస్తాను." అని చక్కా వెళ్ళిపోయింది ఆవిడ వాకిట్లోకి.

సరస్వతికి మొదటిసారి కన్నీరు చెంపల వెంబడి కారింది. చెప్పనవసరం లేకుండా ఎక్కడో అప్పన్నా పుట్టించి పాలడబ్బాలు తెచ్చే శాస్త్రి చేతులు - అవి ఎంత దూరాన వున్నాయో జ్ఞప్తికొచ్చి బెంబేలు పడ్డది మనస్సు.

అభిమానం —— దేనికోసమైతే యింతవరకూ గ్రంథాన్ని పెంచుకుని వచ్చిందో అది కాస్తా బుగ్గయేలా 'అది కావాలి - యిది కావాలని' యితరులను అడగాల్సి వస్తోంది.

వొదిన చెప్పాలనే వెళ్ళిపోయింది. కాని తీరా చెప్పటానికి వీల్లేకుండా చుట్టూ ఎవరెవరో మనుష్యులూ - ఏవేవో వ్యవహారాలు మాటలాడుకుంటున్నారు. మళ్ళీ వుత్త చేతులతో వెనక్కు వచ్చింది.

ఏడిచి ఏడిచి పిల్లవాడు వుత్త చూపులు చూస్తున్నాడు. కాస్త కాఫీ పట్టారు ఎల్లాగో వాడికి. నౌకరు కుర్రాడు సరిగ్గా పన్నెండు కొట్టాక వచ్చాడు 'అన్నాని కెళ్తానండమ్మగారూ-' అంటూ.

"పాల డబ్బా తెచ్చి వెళ్ళమని" డబ్బులిచ్చింది వదినె.

ఆ డబ్బు లుచ్చుకుని అదేపాళాన పోయాడు. వాడు మళ్ళా రాలేదు. పాల డబ్బా లేదు. పిల్లవాడి కడుపు వెన్నునంటుకు పోయింది. వాడు ఆకలితో అఘో రిస్తూంటే సరస్వతికి అన్నమెట్లా వెడుతుంది లోపలికి! ఆమె భోంచెయ్యలేదు. అందుకని వదినె కూడా మానింది.

ప్రసాదరావూ అతిథులూ టంచనుగా పన్నెండున్నర కొట్టాక పీటలమీదకు దిగారు. వదినే వడ్డనంతా చేసింది. సరస్వతి బయట మంచాలు పరిచి పక్కలు వేసింది.

భోజనాలయాక రికార్డులు పెట్టడం కోసం పడక గదిలోని రేడియో వద్దకు వచ్చాడు ప్రసాదరావు. అప్పుడు యావత్తు కథా వదినె అతడి చెవిని వేసింది. అతను మండిపడ్డాడు. ఇంటికి వెళ్ళి నౌకరు వెధవను జుట్టుపట్టుకు తంతానన్నాడు. తన్నడం కాదు మనకు కావలసినది ముందు పాలు అని చెప్పాక ఏకాఏకీ మధ్యాహ్నపు ఎండలో బజారుకు పోయాడు. కొట్లన్నీ కట్టేసి వున్నాయి. అటూ యిటూ తిరిగి పిల్లలు గల ఒక స్నేహితుడి యిల్లు పట్టుకుని ఒక చిన్న సంచీలో కాస్త రెండు పూటలకు సరిపడ్డ పాలపిండి ముష్టెత్తి తెచ్చి యిచ్చాడు. అప్పుడతని వాలకం చూడ్డానికి సరస్వతికే భయం వేసింది. ఇద్దర్నీ కలిపి చెడామడా నాలుగు దులిపాడు.

అప్పుడే కొద్దిగా కోలుకుంటున్నది వైశాఖమాసం. ఎడగాడ్పూ పెడ గాడ్పూను. ఉండి వుండి అకాలంలో వాన కూడా కురవసాగింది. సరస్వతికి ఏమీ తోచలేదు. నీరసంగా వుండి యే పనీ ముట్టుకుందామనే అనిపించేది కాదు.

పాలు త్రాగాక కాస్సేపు యేడ్చి అట్టే నిద్రపోయాడు పిల్లవాడు. నెమ్మదిగా ఓపిక చేసుకొని మెట్లన్నీ యెక్కి డాబా మీదకు వెళ్ళింది. అక్కడా ఎండకు గచ్చంతా మాడివుందేమో - భగభగమంటోంది.

పిట్టగోడవారనే నెమ్మదిగా నడుస్తూ, ఆకాశాన ఇళ్ళకు మళ్ళిపోతూ గోల చేసే పక్షుల గుంపులు, చెట్టాపట్టాలు వేసుకొని వూసులాడుకుంటూ షికార్లు కొట్టే స్నేహితుల్లా అక్కడక్కడ జంటలు జంటలుగా మేఘాలు - అంతకు తప్పించి యేమీ లేదు. పశ్చిమాద్రిని ఎర్రటి సూర్యబింబం మునిగిపోతున్నది. దూరాన రోడ్డుమీద మనుషులు, వాహనాలు చిన్న చిన్న మూర్తుల్లా అగపడసాగారు. సరస్వతి మెల్లగా పిట్టగోడ అంచుమీద శరీరాన్ని మోపి రవికలో దాచిన చిన్న ఉత్తరాన్ని మడతలు విప్పి చదువసాగింది, మధ్యమధ్యలో నిదానంగా యిటూ అటూ చూస్తూ, మళ్ళీ ఉత్తరం చదవటాన్నిబట్టి అది యే మూడవసారో నాలుగవ సారో అయివుంటుంది - ఆమె ముఖం కొద్దిగా కుంచించుకుంది. అటు తరువాత కాస్త ఎర్రబడ్డది. మళ్ళీ కొంచెం యీవలకు వచ్చి రెండు చేతులూ వెనక్కు మడిచి ఆలోచిస్తూ నిలబడ్డది. ఒకటికి రెండుమార్లు క్రింది పెదిమను కొరుకుతూ వెనక్కు విరిచిన చేతుల్తోనే పచార్లు చేయనారంభించింది.

ఆ అవస్థలో ఆమె వదిన రాకను గుర్తించి వుండలేదు. ఆవిడ కాఫీ కలరు కోయంబత్తూరు చీర నాజూగ్గా కట్టి తలలో చిన్న సన్నజాజి చెండును వుంచి మిగతా పూలను యివ్వటం కోసమంటూ, సరస్వతి కోసం ఇక్కడా అక్కడా వెతుకులాడి, చివరకు డాబామీద ఎవరో మనుషుల చప్పుడు కాగా ఆ అలికిడికి పైకి చప్పున వచ్చింది.

సరస్వతిని దూరాన్నుంచి చూడగానే తమాషా చేయాలని ఆవిడ పిల్లిలా అడుగులో అడుగు వేసుకొంటూ వచ్చి వెనుకనుంచి చేతిలోని కాగితాన్ని చప్పున లాక్కుంది,

సరస్వతి తెలతెలబోతూ "నువ్వా వదినా...ఎవరో అనుకొని ఎంత హడలి పోయానూ-" అన్నది. ఆ అనటంలో ఏదో దాపరికం వున్నట్టు తేలిగ్గా యివతల వాళ్ళకు తెలిసిపోతోంది.

"ఈ కాగితం విప్పనా-"

సరస్వతి నేరస్థురాలిలా చూస్తూ వూరుకుంది. ఉలకలేదు, పలకలేదు.

వొదిన లేని చొరవను తెచ్చుకొంటూ "ఎందుకు నువ్వు అస్తమానూ ఒంటరిగా దిగులుగా ఆలోచిస్తుంటావు. నీకేదన్నా కావలిస్తే నాతో చెప్పవు...నాకు తెలుసులే - నీకు యిక్కడే మొహమాటం..."

సరస్వతి యీ మాటలాడే మనిషి అంతస్సులోకి చూడాలనుకొని పరిశీలనగా "అదికాదు వదినా! నాకిక్కడేం లోటు? అడక్కుండానే అన్నీ అమర్చే వదినె...నా కోసం ముష్టెత్తడానికి కూడా వెనుదీయని అన్నగారూ - యింకా ఏమన్నా వుంటే నావల్లే వుండాలి లొసుగు..."

"అడిగినదానికి సూటిగా జవాబు చెప్పు, నీ మనస్సులో ఏదో కదుల్తూ వుంటుంది అస్తమానూ - అవునా..."

సరస్వతి పిట్టగోడ మీద చేతులాన్చుతూ "ఏం చెప్పగలను, ఏం చెప్పమంటావు వదినా!" అంటూ శూన్యంలోకి చూచింది.

"పిచ్చిదానా - నాకు తెలుసు. ఇవ్వాళ మీ అన్నయ్య నాకంతా చెప్పారు.

సరస్వతి చప్పున వెనుదిరిగి "అన్నయ్యా..." అని నోరు ఆవులించి పిచ్చిగా అధఃపాతాళానికి క్రుంగిపోతున్నట్లు అయోమయపు చూపులు చూసింది.

వొదిన సన్నజాజి చెండును మడిచి తల్లో వుంచుతూ బుజం మీద చిన్న చిటికెవేసి "అయితే నువ్వు పచ్చి దొంగవు సుమా, నీకు జ్వరం కూడా ఎందుకు వచ్చిందో నా కిప్పుడిప్పుడు కొంచమర్థమవుతూ వుంది. అలాంటి దేదైనా వుంటే నీకన్నా కాస్త పెద్దగదా ఇంత ముక్క నా చెవిని ఎందుకు వేశావు కాదు?"

"ఏ ముక్క?" సరస్వతి అసంబద్ధమైన ఆలోచనల కూడికలోంచి తెప్పరిల్లలేక తలను దించుకునే అనేసింది.

"అదే - నాకు తెలియదనుకున్నావా ఏం? అతను నిన్ను వెళ్ళిపొమ్మని గసిరిన సంగతీ అదీను "

"వెళ్ళిపొమ్మనా? అవును అన్నారు. అంటే వచ్చేశాను."

హృదయం

తిరునగరి

ఎన్ని భయదహేమంతాల్ని ఓర్చుకోలేదీ హృదయం
ఎన్ని నిబిడాంధ్యనిశల్ని తట్టుకోలేదీ హృదయం
ఎన్ని విషాద వన్నివేశాల్ని ఎదుర్కోలేదీ హృదయం
ఎన్ని కష్టాల పారావారాల్ని ఈదలేదీ హృదయం!
ఈ హృదయం సుమకోమలం
ఎక్కడినుంచి మలయ మారుతం వీచినా
ఏతోటలో మల్లెపందిరి పూచినా
ఏవాగులోగల గల పారినా
ఏ కానలో కోయిలలు పాడినా
రసోద్రేకంతో పొంగిపోతుంది
రమణీయ గీతాల నాలపిస్తుంది
ఈ హృదయం వాజ్రేయం
ఎంతటి దుర్మార్గం తమస్సంఘన్నంగా చెలరేగినా
ఎంతటి విద్వేషం క్రాములా బుసకొట్టినా
ఎంతటి క్రూరత్వం మారణాయుధాలతో భయపెట్టినా
ఎంతటి అన్యాయం ఏకధాటిగా దండెత్తినా
అకుంఠిత దీక్షతో ఎదిరిస్తుంది
తమస్సుల్ని చీలుస్తుంది.
క్రాముల్ని కూలుస్తుంది
క్రౌర్యాన్ని తుదముట్టిస్తుంది
అన్యాయాన్ని అంతం చేస్తుంది
ఈ హృదయం పరిమళించే చందనం
ఈ హృదయం సురభిళించే నందనం
ఈ హృదయం సుమకోమలం
ఈ హృదయం వాజ్రేయం
ఈ హృదయం అందాల జలజం
ఈ హృదయం అమృతకలశం
ఈ హృదయం
ఈ హృదయం

"పోనీ స్టేషనుకు వచ్చినా్న టిక్కెట్టూ అదీ కొని ఇచ్చాడా?"

"నా దగ్గరే పది రూపాయలుంటే, పోర్టర్ని బ్రతిమాలి కొనుక్కు కున్నాను."

చీకటి మసగ్గా అలుముకొంటున్నది. ఆకాశంలో కూడా, ఆలస్యంగా వెళ్ళే ఏ ఒకటి రెండు పక్షులో మినహా అంతా సంచార శూన్యంగా వుంది.

వొదిన ప్రశ్నాపత్రంలో కొన్ని చిక్కు ప్రశ్నల్ని వదిలేసి అడగటంవల్ల సరస్వతి తేలిగ్గా సమాధానాల్ని యివ్వగలిగింది.

చాలా నెమ్మదిగా——

"అయితే ఈ ఉత్తరం కూడా చదవనా?" అన్నది.

సరస్వతి 'ఈ ఉత్తరం కూడా' అన్న లౌక్యపుపొడి - మెలిక విప్పుకోలేక బిత్తరపోతూ - "ఇంకా యేమన్నా వున్నాయా జాబులు" అని ఆగింది. తన సంశయానికి అవతలి మనిషి తప్పు తీసుకుని నొచ్చుకుంటుందేమో అనుకుని.

"మీ అన్నకు వ్రాసిన ఉత్తరం — అదే దాని మాటే." సరస్వతి సగం ఆశ్చర్యాన్ని లోపల్నే అణచివేస్తూ, "ఈ ఉత్తరం ఆయన వ్రాసింది కాదు" అనేసి ఆ అనటంలోనే తనకేమీ అభ్యంతరం లేనట్లు సూచించింది.

అటు తర్వాత ఇద్దరూ డాబామీద కూర్చున్నారు. వొదిన అనునయ కంఠంతో, తూచినట్లుగా, "నీవల్ల తప్పుందని నేననను: కాని చటుక్కున అంత తేలిగ్గా వెళ్ళిపొమ్మని అనటం వుందే; అది అభిమానమున్న ఆడదానికి ప్రాణం తీసినట్లే." అన్నది.

"ఊఁ..."

"అదీగాక మీలో మీకు ఇంత వైముఖ్యం రావటానికి తగినంత పెద్ద కారణం నాకేమీ కనిపించటం లేదు కూడాను."

సరస్వతి వూకొడ్తోంది కాని ఆ పెద్ద కారణమేదో బయటపెట్టలేక పోతోంది. వొదిన చాకచక్యంగా మళ్ళీ అందుకుంది——

"అంతెందుకు? మీ అన్నయ్య వున్నారా? అంతలా చనువు యిస్తూన్నట్లగ పడ్తారు కాని, అబ్బో సమయం వస్తే ఆయనమట్టుకు ఎంత మగతనం చలాయిస్తారని?"

"అలాగా!" అని ఇంకా చెప్పమన్నట్లు చూసింది సరస్వతి, "మీ వంశంలో ఉన్నదే ఒక గుణం, నీకు కోపం రాదంటే చెబుతాను." సరస్వతి మందహాసంగా "చెప్పు. నాకు కోపమెందుకు?" అన్నది.

మొండి పట్టుదల, కోపం. అవతలివాళ్ళ పరిస్థితీ - మంచిచెడ్డ కూడా ఆలోచించకుండా తాము కోరినట్లే ఎందుకు జరక్కపోవాలీ అని పంతగించుకోవడం మామూలే."

సరస్వతి లోపల ఇలా అనుకోసాగింది - యీ వరసను తన్ను దెప్పటం లేదుకదా, ఏమో! అవును. ఉన్నమాటంటే తనెందుకు ఉలికులికి పడాలి!

"అదికాదమ్మా, ఆ రోజు ఆయనగారిక్కి తలనొప్పి జ్వరమట. ఆ సంగతి నాకెలా తెలుస్తుంది చెప్పు. మధ్యాహ్నం వెళ్ళేముందు క్లబ్బుకు వెళ్తున్నానని చెప్పి మరీ స్త్రీ సమాజాని కెళ్ళాను. ఆ రోజు చాలామంది కలియటంవల్ల ఆ మాటా మాటా చెప్పుకొంటూ కూర్చుండిపోయాం. బైట చల్లగా వుంటే కొబ్బరిచెట్ల నీడను పేము కుర్చీలు లాక్కుని చిన్ననాటి స్నేహితులు ఒకరిద్దరు కలిశారు. చెప్పొద్దూ - ఆ రోజు బాగా యెనిమిది దాటాకే యింటికొచ్చాను. తప్పల్లా కొంచెం ఆలస్యంగా ఇంటికి రావటం - తను అంతక్రితం ఎన్నిషూట్లో రెండో సినిమాకు వెళ్ళి కూడా అర్ధరాత్రి అపరాత్రి రావటం లేదూ - అవన్నీ పట్టించుకుంటామా? దాన్తో మొదలెట్టారు ఎకసక్కాలు - మగవాడు తిరక్క, ఆడది తిరిగి చెడిందట. నాకు వొళ్ళు మండి నాలుగురోజులు ఏడుస్తూ పడుకున్నాను. ఎందుకులే అన్న ముక్క అనలేదు. పలకరించిన పాపాన పోలేదు. అంతటితో వూరుకోవచ్చునా - పుండుమీద కారం జల్లినట్లు అమ్మకు పనివేళ్ళా ఒక కొంచె

ఉత్తరం రాశారు. అసలే ఆవిడ అంతంతమాత్రం. అల్లుడు కూడా వ్రాశాక నాకు హితోపదేశాలు చెబుతూ చాటభారతమంత జాబు వ్రాసింది. ఇదేమిటని అయన్ను అడిగితే వెకవెకా పకపకా నవ్వు—మంచీ చెడ్డా వుండేనా...వూరుకోలేదు. కోపం కొద్దీ అనేశాను. నేనేమి కాపురాలు త్రవ్వుకుని లేచిపోయే మనిషి ననుకొన్నారా-యింత కుళ్ళు మీ కడుపులో పెట్టుకొని ఎందుకొచ్చిన వెటకారమని."

సరస్వతి సావధానంగా విన్నాక తన కథతో పోల్చుకోకుండా ఉండలేక పోయింది. ఎంత పద్దనుకున్నా తన విషయానికొచ్చేసరికి తప్పంతా అవతలి వ్యక్తిదైనట్లుగా వాదించటానికి అంతరాత్మ ససేమిరా ఒప్పటం లేదు.

"లేద్దామా సరూ..." అంటూండగానే, "అయ్యో - పిల్లాణ్ణి ఒక్కణ్ణీ వదిలేసి వచ్చామ్రా" అంటూ సరస్వతి గబగబా మెట్లు దిగింది.

లోపల అన్నగారు ఎత్తుకొని ఆడిస్తున్నవాడల్లా సరస్వతిని చూడ్డంతో "యిందే - అమ్మాయీ" అని అందివ్వబోయాడు.

సరస్వతికి నవనాళ్ళూ క్రుంగినట్లయి తలకాయ వాల్చి తప్పు చేసిన మనిషిలా పిల్లణ్ని అందుకొని అక్కడ నిల్చోకుండా నాలుగంగల్లో దొడ్లోకి పరుగెత్తుకొచ్చేసింది. వొదిన సరస్వతి చేతిలోంచి లాక్కున్న కాగితం ముక్కను చదవాలనే కుతూహలంతో నేరుగా పడకగదిలోకి వెళ్ళి బెడ్‌లైట్ స్విచ్ నొక్కి-తలగడ నానుకొని మెల్లగా కాగితపు మడతలను విప్పసాగింది. ఆ రావటంలో మధ్యగదిలో కుర్చీలో కూర్చున్న ప్రసాదరావును కూడా ఆమె గమనించలేదు.

ఎటువైపునుంచి వచ్చాడో ప్రసాదరావు గ్రద్దలా ఆ ఉత్తరాన్ని కాస్తా ముక్కున కర్చుకొని నిశ్చలంగా వుడాయించే యత్నంలో వున్నాడు.

ఆమెకు చాలా కోపం వచ్చిందనే చెప్పాలి. పరుషంగా "నా మీద వొట్టే అది మీరు గనుక చదివితే..."

"ఇందులో యేమిటి వుంది?"

"నాకు తెలీదు."

"ఇది పచ్చి అబద్ధం. పోనీ ఎక్కణ్నుంచి...?"

ఆమె యింకా కోపంగా "ఎక్కణ్నుంచా? నా శ్రాద్ధంనుంచి."

"అదికూడా నేనే పెట్టాలి. నాకు శ్రార్ధం పెట్టేవాడు కలిగేవరకూ నీకు శ్రాద్ధం కావాలనుకోకు."

"ఏమిటి శుభమంటూ తిని కూర్చుని బావుల మీదకు పోతున్నారు" అంటూ వచ్చింది సరస్వతి. ఈ ముక్కలు అనే ధైర్యం ఎట్లా వచ్చిందో వదినకు అర్థం కాలేదు. ఆశ్చర్యంతో - "ఏదీ ఆవిడ ఉత్తరం ఆవిడ కిచ్చెయ్యండి" ప్రసాదరావు రూక్షంగా - "అయితే ఆవిడ ఉత్తరం నువ్వెందుకు తీసుకొని చక్కగా మడతల్ని విప్పి కులుకుతూ చదువుతున్నావు?"

"నే నేమీ చదవలేదు,"

సరస్వతి ఇద్దరి తగూ తీర్చే ధోరణిలో "నే నే ఇచ్చాన్రా బాబూ! అందులో ఏమీలేదు. మా ఆడపడుచు చెల్లాయి వ్రాసింది."

కథ అడ్డం తిరిగిందేమనుకొని—

"చెల్లాయా...ఇంకా మీ ఆయన ఛార్జిషీటు ఇచ్చాడేమో ననుకున్నాను నేను!"

ప్రసాదరావు మెల్లగా జారుకోబోతున్నాడు. వదిన గడుసుతనంగా "పాపం! ఎందుకు జారుకుంటున్నారు. ఏమి వ్రాసిందో మీరు కూడా వినండి. ఆనక మళ్ళీ నేను ఫలానా అని చెబితే నమ్మేస్థితిలో వుండరు" అనేసి, నవ్వుతూ "చిన్న ఉత్తరమ్రా - పెనసలుతో వ్రాసింది పాపం, చదువుతాను-మ. ల. స. వొదినకు చెల్లాయి నమస్కారములు. అంతా క్షేమం. మీ క్షేమం, చంటివాడి క్షేమం బొత్తిగా తెలియటంలేదు. అన్నయ్య రోజు రోజుకీ మారిపోతున్నాడు. నాకు భయం వేస్తున్నది. ఈ మధ్యన నువ్వు వస్తావనుకొని స్టేషనుకు వెళ్ళాడు. సరే-ఆవేళ వస్తూ దారిలో ఒక కోతిని పట్టుకొచ్చాడు. దానికోసం ఎంత డబ్బు ఖర్చుపెడుతున్నాడో చెప్పటానికి వీల్లేదు. నేనూ మొదట్లో కాలక్షేపంగా ఎంతో సరదా పడ్డాను. కాని ఆ ప్రవర్తన చూస్తున్నకొద్దీ ఎందుకో నాకే దిగులు వేస్తున్నది. ఆ కోతిని తెచ్చాడన్నానా - దానికి నీ పేరు పెట్టాడు. అందరితో అది నా భార్య - చాలా విశ్వాసంగా వుంటుందని చెబుతూంటాడు. ఇదంతా చూస్తూంటే నాకు నువ్వు ఎంత చప్పున వస్తే అంత మంచిదని తోస్తోంది. నా ఆరోగ్యం కొంచెం బాగు. నా వలన తప్పులుంటే క్షమించి వస్తావని తలుస్తాను. చిన్న నాన్నకు ముద్దులు.

చెల్లాయి వ్రాలు."

ఉత్తరం చదివాక వొదిన ఏమీ మాట్లాడలేదు. సరస్వతి తలను వాల్చి నేలచూపులు చూడసాగింది. ప్రసాదరావు స్తబ్ధతను భంగపరుస్తూ—

"బావ రోజురోజుకీ అచ్చం కోతిలా మారిపోతున్నాడే—"

ఈ హాస్యానికి ఎవ్వరూ నవ్వలేదు. వదినే కఠినంగా చూసింది. ప్రసాదరావు సర్దుకొని "వెళ్తావా?" అని సరస్వతికేసి చూశాడు.

ఆ వెళ్తావా అనటంలో దిగబెట్టివస్తాననే అర్థం ఎక్కడా సరస్వతికి పట్టలేదు. గ్రహించిన వదిన భర్త వాక్యాన్ని సర్దుతూ "నీకు వెళ్ళటం యిష్టంగా వుండకపోతే ఎందుకు - ఆయన్నే యిక్కడకు రప్పించే యేర్పాటు చేస్తేసరి!"

సరస్వతి వెంటనే "రారు" అనేసి మళ్ళీ చప్పున సిగ్గుపడిపోయింది.

ప్రసాదరావు నసిగాడు. "నే నతను పంపమని వ్రాసినదానికి సమాధానం కూడా వ్రాయలేదు కూడా."

సరస్వతి గాబరాగా తలెత్తింది. అంతవరకూ తన్ను పంపమంటూ జాబు వచ్చినట్లే ఆమెకు తెలియదు. చెల్లాయి ఉత్తరం పూర్తిగా యిప్పుడు బోధపడినట్లే.

ఆ రాత్రి పసిపిల్లడ్ని పక్కలో పెట్టుకొని యేడ్చింది యేడ్చినట్లే వుంది సరస్వతి. అప్పుడు యిట్లా అనుకోసాగింది—'నేనే పాపిష్టిదాన్ని. చేతులారా నా కష్టాలు కొని తెచ్చుకున్నాను. మా అన్నయ్యా వదినా నన్నెంత గౌరవంగా చూస్తున్నారో చెల్లాయిని ఆయనట్లా చూసుకోవటం సహించలేకపోయాను. నా అసహనం నన్ను కోతిని చేసి పారేసింది. ఆయన కోతిని తెచ్చి దానికి నా పేరెట్టారని అభిమానపడి యేం ప్రయోజనం? ఎవరు విన్నా చివరకు నేను చేసిందే కోతిపని అంటారు, ఏ మొహం పెట్టుకొని నేను ఆ మహారాజు పంచలకు చేరుకొనేది?' సరస్వతి ఆలోచనల బరువులో దొర్లిన గంటలను గుర్తించలేక, కోడి కూత విని అప్పుడే తెల్లవారిందా అనుకోసాగింది.

4

బండీ వచ్చి గుమ్మంముందు ఆగింది. చదువుతున్న పత్రిక పుటల్నొత్తిగించి ప్రసాదరావు ముందుకు చూశాడు. అప్పుడే ముగించి విడిచిన కాఫీ కప్పు వొత్తిగించటం కోసమని ప్రత్యేకంగా వచ్చిన వొదిన నోరు తెరచి విస్తుబోయి చూస్తున్నది.

మెట్లదాకా వచ్చాక - 'మేమేన్రా - ఏమిటట్లా గుడ్లప్పగించి చూస్తున్నారు?" అంటూ పైకి రావటం కోసం వూతకర్రను బలంగా నేలకు అదిమి వెనుకకు వినిపించేలా—

"అమ్మీ—నువ్వు కూడా నాతో లుడుంగున యింట్లోకి జొరబడకు. వడుచుదానివి యింకా కాస్త - సామాన్ను లోపలకు చేరవేయించు."

Statement about Ownership and other Particulars about Newspaper

BHARATI

Form IV (See Rule - 8)

1. Place of Publication : VIJAYAWADA.
2. Periodicity of Publication : MONTHLY.
3. Printer's Name : S. Radhakrishna
   Whether citizen of India : Yes.
   Address : 14-14-21, Mallikarjuna Rao Street, Vijayawada-3.
4. Publisher's Name : Sri S. Radhakrishna
   Whether Citizen of India : Yes
   Address : 14-14-21, Mallikarjuna Rao Street, Vijayawada-3.
5. Editor's Name : S. Radhakrishna
   Whether citizen of India : Yes
   Address : 14-14-21, Mallikarjuna Rao Street Gandhinagar, Vijayawada-3
6. Name and addresses of Individuals who own the News paper and partners of share holders holding more than one percent of the total capital.
   (1) Name : S. Kamakshmma, 1 Luz Avenue Mylapur. Madras-600004 (2) S. Radhakrishna Address : 14-14-21, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada-3. (3) Name : S. Nageswara Rao Address : 1, Luz Avenue, Mylapur, Madras-600004. (4) Name:S. Rajeswari Address : 14-14-21, Mallikarjuna Rao Street, Gandhinagar, Vijayawada-3. (5) Name : S. Seshamma Address : 1, Luz Avenue, Mylapur, Madras-600004. (6) Name : S Sreeram Murthy, Trustee, Kasinadhuni Nageswara Rao, Sivalenka Sambu Prasad Dharma Nidhi. Address : 42-46 Luz Church Road, Madras-600004. (7) Name : S. Ramayamma, Address: 1, Luz Avenue, Mylapur Madras-600004. (8) Name : P. Satyanarayana Address : Plot No. 28, Bhagyalakshmi Nagar, (Behind Kalpana Talkies), Hyderabad-500380. (9) M/s Sambu Prasad & Sons P. Ltd. 63, Rayapettah High Road, Madras-4 (10) Mr. M. S. Kini, 1-9-1122/3/1' Dayananda Nagar, Hyderabad-4. (11) Sri Venkata Rao Kordale, 1-1-593/2, Gandhinagar, Hyderabad-38. (12) Smt. P. Lakshmi Sailaja, P O. Yellamanchili, Visakhapatnam Dist. (13) Sri V Sundaram, No. 20 First Main Road, Thiruvanmiyar, Madras-41. (14) Sri R. Gopalakrishna, 79, Venkateswaranagar, Kottivakkam Madras-41 (15) Sri S. Sreeramamurthy, 63 Rayapettah High Road, Madras-4. (16) Sri P. Ramaswami, 63 Rayapettah High Road, Madras-4. (17) Smt. P.V.L. Ratnam, Sreenagar Colony, Kakinada, E. G. Dist. (18) Master S.V.S. Arvind, 1, Luz Avenue, Madras-4. (19) Sri M.S. Ramesh, 16-11-19/5/2/A, Saleemnagar Colony, Malakpet, Hyderabad - 36. (20) Smt. P. Nageswaramma, 1, Luz Avenue, Madras-4.

I, S. Nageswara Rao hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

1-3-1986

S. RADHAKRISHNA,
Signature of Publisher.

వాక్యం ముగియకుండానే అవతల చేతులోని సిగరెట్టును బహు చాక చక్యంతో నులిమేసి ప్రసాదరావు వాకిట్లోకి గబగబా నాలుగడుగులు వేశాడు.

గుమ్మంలో నిల్చున్న పార్వతమ్మ "ఏంరా నాన్నా. కులాసా? కాశీ వెళ్దామని బయల్దేరదీస్తే వున్న పాళానా వచ్చేశాం! మీ నాన్నగారితో ఏదొచ్చినా నోట్లో మాట నోట్లో ఉండగానే కావాలి పనులు. లేడికి లేచిందే పరుగు."

"నువ్వు లోపలికి నడు...నేను చూస్తాన్లే..."

తరువాత జట్కావాలాతో చిన్న యుద్ధకాండ పావుగంటసేపు జరిపి డబ్బులు మొహాన్న విసిరికొట్టాక, మెల్లగా లోనికి వచ్చాడు ప్రసాదరావు.

అప్పటికే తల్లీకూతుళ్ళు ఆశ్చర్యసంభ్రమాభిమానాల్ని ప్రకటించుకోవటం, కుశల ప్రశ్నలవరకూ సంభాషణ రావటం జరిగింది.

ప్రసాదరావు వచ్చి చూసిన దృశ్యం యొక్క సందర్భం యిది.

సరస్వతి తల్లిని రెండు చేతుల్తో పట్టుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్నది. ముసలాయన చంకలోని పిల్లవాడు పండిన ఆయన మీసకట్టును చూసినంతసేపు చోద్యంగా చూసి, చేతుల్తో అందుకోవటం కోసం విశేషించి యత్నిస్తున్నాడు.

ప్రసాదరావు భార్య ఊరంత గొంతుకతో వార్తల్ని చదువుతున్న రేడియో గొంతు నొక్కివచ్చి, మెల్లగా సరస్వతిని దొడ్లోకి నడిపించుకు వెళ్ళింది. ఆడవాళ్ళు ముగ్గురూ విడిపోగానే ముసలాయన కళ్ళజోడును మనుమడి బారినుంచి భద్రంగా రక్షించుకొంటూ కొడుకు నుద్దేశించి "ఏమిటీ కథ?" అన్నారు.

ప్రసాదరావు తనకేమీ తెలియనట్లు 'ప్చ్' అనేసి ఊరుకున్నాడు.

"ఎప్పుడు రావటం?"

"నెల్లాళ్ళయి___"

"నాకు తెలియలేదే!"

కొడుకేమీ జవాబివ్వకపోవటం చూసి - "ఇదా...నాకేమీ క్షేమ సమాచారాలు తెలియకపోవటంచేత ఒకమారు అట్లా వెళ్ళిరానా అని కూడా అంటూ వచ్చాను. మీ అమ్మే___పట్టి చండోడి మనిషి. ఎద్దు ఎండకు లాగితే దున్న నీడకు లాగుతానంటుంది.

"వెళ్ళి రావలసింది, కథంతా అర్థమయ్యేది___" చేత్తో చిన్న పూచిక పుల్లను విరిచి పళ్ళు కుట్టుకుంటూ నసిగాడు కుర్చీతోసహా వెనక్కి నడుం విరుచుకుంటూ.

"హా హా___ఏదోవుంది" అన్నారు ముసలాయన.

పూచికపుల్లతో గాలిలో సూచిస్తూ "ఇప్పుడేం లాభం అనుకుని...అటువంటి సంబంధం చేశాక___"

ముసలాయన ఒక్కమాటు బుజాల్ని దులుపుకొని చేతిలోని కర్రను కుర్చీ వెనుక వ్రేలాడేస్తూ "ముసలాడి కబుర్లు నీకు పచ్చి పచ్చిగా ఉంటాయిగాని, యీ తల పూర్తిగా పండేదాకా నౌకరీ చేశానా, దేశం కాని దేశం...అక్కడా ఇక్కడా వుంటూ వచ్చానా, ఎన్నిరకాల మనుష్యుల్ని చూడలేదు? అంతా ఒక్కలా వుండరు. అదలా వుంచు. ఎప్పుడూ మనమే నెగ్గాలనుకొనే మనస్తత్వం కల మనుష్యుల్ని చూశాను. కొన్ని సందర్భాల్లో గెలుస్తూ మళ్ళీ వోడుతూ జీవితం సాగించే వ్యక్తుల్ని చూశాను. పట్టూ విడుపూ అన్నదుండాలి, అది లేని వ్యక్తుల్తో అందులో హమేశా మనమే ముందుండాలి - మనమాటే నెగ్గాలి అనుకునే వాళ్ళతో జీవించటం ప్రమాదకరం. మీ అమ్మ ఉందా? అది కాపురానికొచ్చిన క్రొత్తల్లో పట్టి గొడ్డు మొరాయించటం కరపటం వుండేదికాదు. ఆఖరికి నాకు తెలియకుండా అణా అర్థా తీసి యే పోపుల డబ్బాలోనన్నా చేరేసి ఒక పది రూపాయలు చేస్తుందేమో అని చూశాను, ఆ తెలివితేటలు కూడా లేవు. కాని అట్లాటి మనిషితో కాపురం నా కేమీ కష్టమనిపించలేదు. కాని మళ్ళీ మీ చిన్నత్త చచ్చిపోయిందిలే, నువు పుట్టాక. అంచేత తెలీదు. ఆవిడ మొగుడ్ని రాచిరంపాన పెట్టేదని నలుగురూ అనుకునేవారు. నాకేం మొహమాటం లేదు. అడిగేద్దామా అన్నంతవరకూ వచ్చింది. కాని చూస్తూ చూస్తూ ఆడబిడ్డను నే నేమన్ను? ఒకమాటు దాన్ని పుట్టింటికి తీసుకురమ్మంటే నే నే బయల్దేరి వెళ్ళాను. గుమ్మం ప్రక్కనే స్కూలు. ఆ బడిపిల్లలు కిటికీ దగ్గరకు వస్తే వల్లంలో వీళ్ళ దొడ్లో అంతా కనబడుతుంది. అప్పుడు వాళ్ళేదో అంటున్నారు. ఇది వాళ్ళను చెరిగేస్తోంది తిట్లతో. ఏమిటే ఆ పిల్లలు అంటున్నది అనడిగాను రావటంతో. దానికి నా మీద కూడా కోప మొచ్చింది. తరువాత తెలిసింది. 'అయినకాడికి అణా పరక___' అని పిల్లలు పిలుస్తారని. బజారుకి ఆ వూళ్ళో పనిమీద బయలుదేరితే ఏ గోడమీద చూసినా అయినకాడికి అణాపరకా. ఒక గుంటవెధవని పిలిచి 'ఏంరా-ఆ మాట' అన్నాను. వాడు నవ్వుతూ పరుగెత్తుకుపోయాడు. నేను స్వతహా కొంటెమనిషిని___ఆ రోజు దీపాలు పెట్టాక దారిలో ఎదురైతే 'ఏవిటి బావా-అయినకాడికి అణాపరక అని రాసుంది మీ యింటిమీద-' అని ఖర్మంజాలక నోరుజారాను. అగ్గిరుద్రుడయాడు. ఎల్లాగో తెలుసుకున్నాను. ఒకరోజున ఉదయం 8 గంటలకు బజారుకని బయల్దేరి, ఏదో ఒక తోటకూర కట్ట, కాసిని పచ్చిమిరపకాయలతో అడుగు పెట్టాట్ట ఇంట్లో. స్కూల్లో ఒకటికి బెల్లు కొట్టారు. అప్పుడు మీ చిన్నత్త చింత రువ్వలాటి తలేసుకొని తడిసిన చీరతో వురుముకుంటూ వచ్చి 'ఏవిటీ తగలేశావు?' అందిట, 'ఫలానా-' అన్నాక 'ఎంతయింది?' అని గర్జించిందట. 'అణా పరక-' అన్నాక ఆలస్యమయిందని శాపనార్థాలు పెడుతూ, 'ఇంతేనా అయినకాడికి అణాపరక' అంటూండగా స్కూలుపిల్లలు విని ఆ ముక్క పుచ్చుకున్నారు.

'ఇంతకథా నీ కెందుకు చెప్పానంటే, ఆవిడ పోలికే అచ్చంగా మన సరస్వతి.

ప్రసాదరావు రూక్షంగా "మీ కసలు ఏం తెలీదు. మీరు దానికి చాలా అన్యాయం చేశారని నే ననబోతున్నందుకు ముందుగా యింత చరిత్ర చెప్పకొచ్చారు. నాకు తెలుసు నాన్నా - ఇంకా ఏం కావాలి? నిల్చున్న పాళాన చంటిబిడ్డతో ఇంట్లోంచి పొమ్మన్న మనిషికి ఏపాటి సంస్కారం వుంటుందనుకునేది?"

"అతనలాటి మనిషి కాడు." ముసలాయన సమర్థిస్తూ గట్టిగా అన్నారు.

ప్రసాదరావు క్షణంసేపు లేచి నిలబడి పరుషంగా - "మీరు చేసింది తప్పు కాదని సమర్థించుకోవటం కోసమే చూస్తున్నారుగాని మన గౌరవం ఏ మాత్రం అతగాడు నిలబెట్టాడో ఆ విషయం ఆలోచించటం లేదు."

ముసలాయన యీలోగా "అమ్మీ కొంచెం 'టీ' పట్రా. సుపుత్రుడు దేవతలకు పంచాంగాలు చెబుతున్నాడు." అనేసి "కూర్చోరా నాన్నా.కూర్చో-" అని ప్రసాదరావు నుద్దేశించి అన్నారు.

ప్రసాదరావుకు వోటమి యిష్టం లేదు. ఆయన వాదించి తనచేత అవునని పిస్తారనే భయం లేకపోలేదు లోపల. అదీగాక స్వయానా కూతురి విషయంలో ఆయన అల్లుడి పక్షం తీసుకోబోవటం చూస్తే తనకే ఎట్లానో కచ్చగా వుంది. అందుకనే లేచి తప్పుకుపోవాలని చూశాడు.

ముసలాయన అన్నారు_

"ఈ ఒక్కమాట విను. నీకు తెలిసింది, చాలామంది అనుకునేది, మనుషులంతా డబ్బు గలవాళ్ళు, లేనివాళ్ళు అనే. ఈ రెంటిమధ్యా సంబంధ బాంధవ్యాలు పొసగవనే. పైగా ఈ విభజనలో తప్పుందంటాను నేను. మనుషుల్ని తత్వాల వారీగా విభజించి పరీక్షించాలంటాను. శాస్త్రిని నేను అట్లానే కొల్చి చూశాను. అతను యితరులకు కష్టం కలిగించడు. ఇతరులు తనకు కలిగిస్తే ఓపికతో సహించి వూరుకుంటాడు. బస్, యిక నీవు వెళ్ళచ్చు."

"మరి యీ జరిగిన రాద్ధాంత సిద్ధాంతాలన్నీ?"

"ఏ రాద్ధాంత సిద్ధాంతాలు...?"

"ఇదిగో, ప్రత్యక్షంగా కనబడుతున్నదే పుట్టింటికి తోలెయ్యటం-"

"హాఁ! అదా - ఏదో మాటా మాటా వస్తే అమ్మాయే వచ్చేసుండొచ్చు. మన బంగారమే మంచిదని అస్తమానూ అనుకోవడం తప్పురా. ఎదటివాడి కంట్లో దూలం వెతికేముందు మన కంట్లో నలుసు అఘోరించిందేమో చూసుకోవద్దూ!"

"చూసుకోవాలి—" అని కోపంగా అనేసి ప్రసాదరావు చరచరా వీధిలోకి నడిచాడు. సరిగ్గా అదే సమయానికి ప్రక్కగదిలోనే వుండి యాపత్తూ కాకపోయినా కొంత కొంత విన్న ప్రసాదరావు తల్లి యీవలకు వస్తూ "ఇంకా కొంపలో అడుగుపెట్టి పదినిమిషాలు కాలేదు. ఏమిటి వాదినలా వెర్రెక్కిస్తున్నారు? ఏదో మర్యాదగా వచ్చాం - నాల్రోజులుండి మర్యాదగా వెళ్ళాలని లేదా మీకు?"

"హుష్, వూరుకోవే—తగుదునంటూ వచ్చావు నడాన. నేను ధర్మం కోసం పాటుబడుతాను. ఎప్పుడు ఎక్కడెక్కడ ధర్మం నశిస్తుందో అక్కడల్లా పుట్టుకొస్తానని కృష్ణపరమాత్మ చెప్పలే గీతల్లో..."

"ఓహో - యిదే కామోసు ఆ అవతారం. చాల్లెండి అనవసరంగా ఆ పిల్లల మనస్సులు నొచ్చుతాయి. వాళ్ళేం అజ్ఞానులు కారు. ఎవళ్ళ వాళ్ళంత వాళ్ళు వాళ్ళయ్యారు. మీరూరికే నోటికొచ్చినట్టల్లా..."

"నువ్వు ఫో-ముందు అవతలకి..." ముసలాయన గర్జించారు. మధ్యలో కోడలు వచ్చి - "మావయ్యగారూ మీకు వోల్టిను తెచ్చేదా..." అని సమాధానం కోసం నిలబడ్డది.

"ఏవి మర్యాద? ఏవి మర్యాద? చూడు పిల్లలంటే అలా వుండాలి. ఆవిడకు వినిపించలేదు ఆ మాటలు. మళ్ళీ అందుకుంది.

"ఐతే మీరు ఏవిటి అమ్మాయిని - దాన్ని కాస్త పలకరించారూ?" ఆయన ముఖం కుంచించుకుని "పోదూ-నీ తెలివికి సంతోషిస్తున్నాను. నేను ఆ విషయం ఎత్తితే అది చిన్నబుచ్చుకుని ఏడవదూ—"

ఇంతలో వోల్టిను పుచ్చుకొని వచ్చిన కోడలును పరామర్శగా "మీ అమ్మా అంతా బాగున్నారా? జాబు లొస్తున్నాయా?"

తల వూస్తూ కప్పును బల్లమీద వుంచి - "అత్తయ్యా...మీరు..." అంది. ఆవిడ అధికార పురస్సరమైన ధోరణిలో - "నాకేం అక్కర్లేదమ్మా. అబ్బ! అందులో ఏదో కోడిగుడ్డు సొన కూడా వేస్తారట. రామ! రామ ఆ వోల్టిన్లూ అవీ అట్లాటి సూకరాలు బస్తీవాళ్ళూ నాగరికులు మీకుగాని..."

ముసలాయన లేచారు. మీది సిల్కుకండువాని ఎక్కడ తగిలించటమా అని యిటూ అటూ చూస్తున్న ఆయనకు ముసలావిడ మాటలు వినిపించాయి. చేతిలోని కండువాని అందుకోవటం కోసం వస్తూన్న కోడల్నుద్దేశించి - పద్యం చదివే ధోరణిలో "రుచిపాకము నాలుకగా కెరుంగునే, తెడ్డది కూరలో కలియ' అని వూరికే అన్నాడూ భాస్కరశతక కర్త.

ఆ అమ్మాయి కండువా వంకీని తగల్చటం కోసం అక్కడనుంచి నిష్క్రమించాక ఆవిడ యీ అన్న ముక్కలకు వూరుకోలేదు.

"పిల్లదగ్గర అట్లా తీసిపారేస్తూ వస్తే నే నంటే యేమన్నా చీమకాలంత గౌరవం వాళ్ళకిక ఎందుకుంటుంది?"

"అందుకే అన్నార వెర్రిదానా - మొగుడు తిడితే మొగసాలవాడూ తిట్టాడని."

"నాకు గౌరవం లేదని ఎల్లానూ తెలుసు. మీతో దేనికిగాని వాదన, అమ్మాయి సంగతి కాస్త గనుక్కోండి. మీరు వెళ్ళటమో, అతగాడికి కబురు చెయ్యటమో—"



"ఏమని - నువ్వు కాస్త నోరు మూసుకుంటే అన్నీ అవుతాయి. కాశీ నుంచి వచ్చేటప్పుడు మాద్దాంలే."

"దారిలో పనిగదా?"

ముసలాయన క్రుద్ధులై నిస్సాకారంగా - "ఇప్పుడు నావల్ల కాదు. వచ్చేప్పుడు చూద్దామన్నానుగా."

ఆవిడ ప్రక్కకు తిరిగి చెంగుతో కళ్ళు నొత్తుకుంటూ బొంగురు చేసుకున్న గొంతుకతో "అంతే దాని ఖర్మ. రేపు ప్రొద్దున్న నలుగురూ ఏవమ్మా, మీ అమ్మాయి యింకా యిక్కడే వుందేమంటే నేనేమని చెప్పేది? నలుగురూ నన్ను దుయ్యబట్టుకుంటారు గాని..."

ఆయన ఒక్కమారు లేచి నిల్చొని - "చాల్చాలు యింక అధికప్రసంగం చెయ్యకు. ముందు నువ్వే మా అమ్మాయిని వొదిలేశాడని నలుగురిలోనూ చాటొచ్చేటట్లున్నావు."

"హవ్వ! రామ! రామ!" అనేసి ఆవిడ నెమ్మదిగా అక్కడ్నుంచి నిష్క్రమించే లోపున ఆయన నున్నటి తలను పదే పదే రాసుకుంటూ పచార్లను ప్రారంభించారు. దూరంగా నేలమీదకు గంటన్నర క్రితమే వదలి వేయబడ్డ మనువడు అక్కడే నిద్రతీసి అప్పుడే లేచి మెడను రిక్కించి తాతగారి పచార్లను బుర్ర రాసుకోవటాన్ని పరిశీలనగా చూడసాగాడు. కాని అట్లా వాడు ఎంతసేపో పెద్ద మనిషి తరహా అభినయించలేదు. చరచరా మోకాళ్ళతో ప్రాకి ఆయన అప్పటి వరకూ కూర్చున్న కుర్చీ ముందు ఉండే విరుగుడు చేవ గుండ్రబల్ల క్రిందకు చేరి, అంతక్రితం ప్రసాదరావు నలిపి విసిరేసిన సిగరెట్టు పీకలను సునాయాసంగా ప్రోగుచేసి వాటితో ఆడుకోవటంలో నిమగ్నుడయాడు.

తాతగారు ఆలోచనామగ్నులై ఇట్నుంచి అటూ అట్నుంచి ఇటూ ఓపల్లిను అరిగేదాకా పచార్లు చేశారు కాని బల్లక్రింద ఆడుకొంటున్న మనుమణ్ని పోల్చుకో లేకపోయారు.

ముసలావిడ వంటలోకి దిగింది. కోడలు బహు జాగ్రత్తతో మడిగట్టుకుని ఆవిడకు అదీ యిదీ సరఫరా చేస్తున్నది. కాని యీ వ్యవహారంలో ఏ మాత్రం హెచ్చు తగ్గులు వచ్చినా అత్తగారు సహించి వూరుకోదు - "నేను కాపురాని కొచ్చిన క్రొత్తలో..." అంటూ ప్రారంభిస్తుంది.

ఇదివరకే అంతమాత్రపు పని - సరస్వతి కిప్పుడు చేతినిండా తీరిక. గంటసేపు కూర్చుని తీరిగ్గా జడ అల్లుకున్నది. తరువాత తువ్వాలు సబ్బుబిళ్ళ పుచ్చుకుని స్నానాల గదిలోకి వెళ్ళింది. "అయ్యో, యింత నిదానంగా పనులు చేసుకుంటూ కూర్చుంటే అవతల వంటా అదీ చూసుకోవాలి, ఇల్లు చక్కబెట్టుకోవాలి" అనటానికి యిది తన యిల్లు కాదు. ఈ పనులు పూర్తి చేసి సకాలంలో అందించవలసిన ఆ బాధ్యత, అదీ తనకు లేదు.

అది చాలా చిన్నగది. ఒకప్రక్కంతా పొగతో నల్లగా మసిబారిపోయింది. క్రిందగా ఒక పెద్ద పొయ్యిలో భగభగా మండుతున్నవి నాలుగు పెద్ద కట్టెలు. అపైన వెడల్పైన నల్లటి రాగి గాబు. అందులో రెండుబిందెల నీళ్ళు ఏకధాటిన సలసలా మరుగుతాయి. కట్టెలు బాగా మండుతున్నవేమో, ఒకవైపునుంచి సెగలు వస్తూండగా, సరస్వతి తలుపులు బిగించి, కుర్చీపీటను లాక్కుని, అందుమీద ఒక కాలునుంచి పోసుకుంటూ నీళ్లు - మధ్యమధ్యను వొళ్లు రుద్దుకొన్నచోటే మళ్ళీ మళ్ళీ రుద్దుతూ గంటన్నరసేపు జలకమాడింది. అంతసేపూ తన వొళ్లు తాను చూసుకుంటూనే వుంది. చేతులు నీళ్ళను పాశంగా తొలుపుతూనే వున్నాయి. స్నానం పూర్తవుతూనే వుంది. కాని మనస్సు మనస్సులో లేదు. ఇప్పుడు తన బ్రతుకు పరీక్ష తప్పిన కుర్రవాడి మోస్తరయింది.

అంత వేడినీరు శరీరంమీదుగా పరుగెడుతున్నప్పుడు సరస్వతికి తన కాపురం మొదటి దినాలు గుర్తుకొచ్చాయి. ఆ ఆలోచనలు గూడా 'సంబంధపు చర్యలు-' అట్నుంచి 'పెండ్లిచూపులు' – 'బీదా గొప్పా తారతమ్య వివరణ'– పలువురూ పలువిధాలుగా చేసిన సూచనలు, ఎల్లాగో అయిన పెండ్లి, మధు పర్కాలు, దండాడింపు అన్నీ చకచకా తిరిగిపోయాయి.

అటు తరువాత శాస్త్రిని గురించి తీవ్రంగా వూహించటానికి మొదలుపెట్టిన రోజునుంచి, అతణ్ని చూడగానే ఎవరో వెనకనుంచి వచ్చి గిలిగింతలు పెట్టినంత ఉత్సాహంతో పులకరెత్తిన తను - ఏ రోజుకోసం యువతీ యువకులు రాత్రిళ్లూ పగళ్లూ పువ్వీళ్లూరుతూ ఆలోచిస్తుంటారో, ఆ దినం - తను ఎట్లా ప్రవర్తించింది, ఏమేమి చేసింది ఒక్కమాటు గుర్తుకు తెచ్చుకోకుండా వుండలేకపోయింది సరస్వతి.

సరస్వతి కప్పటికి యింకా పదహారేళ్లు నిండలేదు. వోణీలు మానేసి కూడా ఏడాది పూర్తయిందో లేదో - యింటికి వచ్చిన అమ్మలక్కలంతా 'పిల్ల ఎత్తరి- మనిషవుతుంది,' అంటూంటే ఆ ముక్కలు బోధపడక పోయినా వాటివెనుక ఏదో తీయటికల వున్నట్లు అనిపించేది తన మటుక్కి. ఆ రోజుల్లో ఎంతసేపూ దృష్టి ముస్తాబుమీదే వుండేది.

పండగలకు పిల్చినప్పుడల్లా శాస్త్రి వస్తూండేవాడు. మొదటిసారి చెల్లెల్ని కూడా వెంటబెట్టుకొస్తే, ఆ పిల్లను తాను ఎంత వేళాకోళం చేసింది - ఏదో వంకను ఆమె బట్టలనో అలవాట్లనో హేళనగా తీసికట్టుగా విమర్శించినదీ, అవన్నీ గుర్తుకొస్తున్నకొద్దీ సరస్వతి యిప్పుడు విచారించకుండా వుండలేకపోతున్నది. ఒక్క లేనితనాన్ని మాత్రమే శాస్త్రి తమ యెదుట విధిలేక ప్రదర్శించవలసి వచ్చినప్పుడు అతను బికారిలా వుంటాడని, మామగారివద్దనుంచి వచ్చినప్పుడల్లా డబ్బు గుంజుకుపోవటమే ప్రధానాశయంగా పెట్టుకున్నాడని తనవారు ఆఖరికి తల్లి కూడా ఆ నోటా ఆ నోటా తనముందరే అంటూ వచ్చినప్పుడు అభిమానవతి యైన మరొక స్త్రీ యేం చేసేది? తను మాత్రం యివతలిగట్టునే నిలబడి చేతుల్ని కట్టుకుని నలుగురూ తిరస్కారంగా అనుకునే మాటలకు వూతాన్ని యిస్తూ ఎంత ముభావం నటించలేదు? ఆ రోజున అమ్మలక్కలు తాంబూలాలు తీసుకున్నాక కొంగున కాసు ముడివెయ్యలేదని, అంతమాత్రం లేకపోయిందా అన్న భావంలోనే తెల్లవార్లూ తలుపునానుకునే నిలబడి వెదముఖంగా వుండే అతనేమన్నాడు? పల్లెత్తు మాట అనకుండా గుప్‌చుప్‌గా మూడురోజులూ ఖైదులో కూర్చున్నట్లు గడిపి మళ్ళీ వచ్చాక తీసుకువెళ్తానని అనేసి దాటుకున్నాడు తన బాటనుంచి, అవతలవాళ్లు తీసుకెళ్ళటం కోసం మనిషిని పంపినప్పుడు కూడా యేడ్చి యమలోకానికి పోతున్న దానిలా పెద్ద పెద్ద రాగాలతో వెళ్ళినప్పుడు స్టేషనులో అతను ఎదురువచ్చి ఎంతో మర్యాదగా యింటికి తీసుకువెళ్ళాక కూడా మూడు నెలలు తను ఎన్ని చెరువుల నీళ్ళు త్రాగించినా పైకి ఏమన్నా తేలాడా! అటువంటి శాస్త్రిని తిరిగి నలుగురూ కోతి అంటూండటాన్ని తను యీ మాత్రం పరిజ్ఞానం వచ్చాక కూడా వింటూ సహించి ఎంతకాలం ఎట్లా ఊరుకోగలదు? ఇప్పుడు పిచ్చివాడు కూడా అవుతా డేమోనని చెల్లాయి వ్రాసింది. ఎవరు కారణం? తనే. తనే. తనే. తన మూలకంగా అతడు సర్వనాశనమౌతాడు. డేగిసాలోని నీళ్ళన్నీ వర్చయాక ఇవతలకు వచ్చిన కూతుర్ని ఉద్దేశించి-"ఎక్కడున్నావే ఇంతసేపూ స్నానమేనా..." అన్నది తల్లి.

"ఆఁ" అనేసి గడప దాటుతుండగా చంటివాడు ఆడుకుని వదిలేసిన గిలక్కాయి ఎర్రగా దృష్టిని పడ్డంతో సరస్వతికి ఒక్కమాటు వొళ్ళు ఝల్లుమంది. "పిల్లవాడు ఏమైనట్లు?"

చిన్న గుడ్డతోనే నాలుగు గదులూ అలంగం తిరిగి వంట యింటోని వదిన గారి వద్దకు వచ్చి తడబడుతూన్న గొంతుకతో "నాసిగాడేడి?" అంది.

ఆవిడ చెంబును క్రింద ఉంచుతూ "వాకిట్లో లేడా - ఇందాక చూశానే!"

"ఏమోనమ్మా...!" అంటూ మళ్ళీ దొడ్డంతా కలయతిరిగింది.

పొయ్యిదగ్గర కూర్చుని సంతనాగా వండుతున్న ముసలావిడ పోపుకోసం మాడబెట్టిన బాణల్ని యిటుక ముక్కలతో గమ్మున దింపి "అయ్యో నా కూతురా-

ఎక్కడ వదిలేశార్రా బిడ్డను - చప్పున వెతకండి. చప్పున వెతకండి" అంటూ ముందరగా నూతి దగ్గరకు పరుగెత్తింది. తల్లి నూతి దగ్గరకు దారి తియ్యటంతో బెంబేలుపడి సరస్వతి గుడ్ల నీరు గ్రుక్కుకుంటూ అనుసరించ సాగింది.

"ఆశ్చర్యంగా ఉందే;" అంటూ వదినగారు ఇల్లంతా చుట్టివచ్చి అంత క్రితమే పచార్లను ముగించి మధ్యగదిలో నరసరావుపేట కుర్చీలో పరుండి అర్ధ నిమీలిత నేత్రాలతో ఆలోచిస్తూన్న ముసలాయన్ను అడిగింది. "పిల్లవాణ్ణి ఎక్కడన్నా చూశారా?" అంటూ.

ఆయన హఠాత్తుగా విన్నారేమో ఆ లేపటంతో టప్పుమని ముక్కుమీద నుంచి కళ్ళజోడు జారి గచ్చుమీద పడి బ్రద్దలయింది. కోడలు ఆ ముక్కల్ని ఏరటం కోసం నేలను వంగినప్పుడు టీపాయి క్రింద చేరి ఆడుకుని అలసి నిద్ర పోతున్న పిల్లనుంక ఒక మూలన సాక్షాత్కరించాడు.

"ఇదుగోనర్రా యిక్కడున్నాడు-"

గుమ్మందాకా నడిచి ఎండలోకి గాబరాగా చూస్తున్న ముసలాయన "యేడి యేడి" అంటూ వచ్చి "అమ్మ దొంగా, ఇందాక నేనే అబ్బాయితో మాట్లాడుతూ మాట్లాడాతూ నేలను వదిలేస్తే దీని క్రిందకు జేరాడు గావును" అని పూర్తి చేశారు.

ఎరుపెక్కి ధారలు గట్టిన కన్నీళ్ళతో తడిసిన సరస్వతి ముఖాన్ని చూడగానే తండ్రి హృదయం చప్పున కరిగి "ఇదుగోనమ్మా" అంటూ అందిచ్చిన చేతుల్తో తలమీద నెమ్మదిగా నిమిరి "ఎంత గాభరా పెట్టేశాడో ఇంటిల్లపాదినీ వీడు. అమ్మ ముండా! కళ్ళజోడు కూడా విరిగిందిరా నీ మూలాన."

మాటలో అడ్డువస్తూ అమ్మమ్మ—"ముండా గిండా అనకండి వాడిని-వాడికి మీ పేరే పెట్టారు కూడా."

సరస్వతి చెంగుతో నీళ్ళు వొత్తుకుంటూ పిల్లవాణ్ణి తీసుకుని వెళ్ళబోతోంది. గొంతు సవరించుకుని అన్నారు తండ్రి-"ఏమే అమ్మాయి మాతో కాశీకి వస్తావా?- యాత్రలు చేసొద్దుగాని."

మడిలో వున్న పెద్దావిడ నోరు నొక్కుకుంటూ - "దాన్నెందుకండి కాశీ ప్రయాణం చేస్తారు?" అంటూ అడ్డుపుల్ల విసిరింది.

"అది కాదే భడవా - ఏమున్నా పాపాలు చేసుంటే అవన్నీ గంగలో కడిగేసుకుంటానికి."

"అది పసిపిల్ల — దానివల్ల ఏయే పాపాలు జరిగుంటాయని—"

"ఏయే పాపాలా —— మొగుళ్ళను యేడిపిస్తే వచ్చే పాపాలు."

"చాల్లెండి ఎవరైనా వింటే నవ్విపోతారు?"

"అయ్యో ఖర్మమా - అస్తమానూ ఎవరో వింటారు, ఎవరో ఏదో అంటారని ఎవరికోసమో బ్రతుకుతున్నట్లు అఘోరిస్తావేమిటి? మీ ఆడజాతి చేసే ఘోరాల్లో భర్తలను క్షోభ పెట్టే ఆలోలక్షణా అనేట్లు చెయ్యటం వుందే - దాని కోసం కాశీ వెళ్తే జీవితంలో ఒకమాటు మంచిదంటాను నేను."

"మరి మీరెందుకు అయితే-"

"అల్లా అడుగు లెక్క చెబుతాను. మీరు చేసే దరిద్రగొట్టు పనులన్నిటికీ చిత్రగుప్తుడి దగ్గర జవాబుదారీ వహించేది మేము. అంటే మేం చేసుకున్న పుణ్యమేదన్నా వుంటే అది కాస్తా మీ మూలంగా బ్యాంకులో డబ్బులాగా హరించి పోకుండా వుండేందుకు."

"అయ్య బాబో——మీరు దేముడితో కూడా గిచి గిచి బేరమాడేటట్లున్నారు పాపపుణ్యాల విషయంలో."

"బేరమా - నా ఎదురుగుండా వచ్చి నిలబడితే భగవంతుడ్ని కూడా లెక్కల్లోకి గుణింతాల్లోకి దింపి చివరకు కొసరు వేయించుకుంటాను. రాధేశ్యామ్. రాధేశ్యామ్. వెళ్ళండి వెళ్ళండి. నా కళ్ళజోడు ఆయువుమట్టం కాపటానికొచ్చింది యీ హడావిడి. లేకపోతే నిక్షేపంలా యింట్లో వున్న బిడ్డకోసం - ఒకరు వీధిలోకి ఒకరు నూతిలోకి పరుగులెత్తుకున్నారు. ఛీ! ఛీ!"

సరస్వతి యీ సందట్లో నెమ్మదిగా జారుకుని మరోచీర మార్చి పిల్లడికి పాలు గ్రటాపట్టి చాపపరచుకుని నెమ్మదిగా చిన్న కునుకు తీయటాని కారంభించింది. ఆ పసివెధవ కాళ్ళను తపాతపా కొడుతూ కేకలు పెడుతూ కేరింతలు గొడుతున్నాడు.

ఆ రోజు రాత్రి ఉన్నట్లుండి సరస్వతి హఠాత్తుగా ఒక నిర్ణయానికొచ్చేసింది. తెల్లవారి లేచాక ఎందరు చెప్పినా వినలేదు. ఎదురు మాటలాడినవారందరితో చెడామడా తగూలాడేసింది. ప్రసాదరావు అధికారం కూడా పనిచెయ్యలేదు. బలవంతాన తండ్రి జేబులోని పర్సు లాక్కుని పది రూపాయలు చేత్తో పుచ్చుకుని నే నివ్వాళే వెళ్తానని మంకుపట్టు పట్టి ప్రయాణమయింది. ముసలాయన తప్పని సరిగా స్టేషనుకు వెళ్ళి టికట్టు కొని యిచ్చి వచ్చాడు. ఆ రాత్రి వదిన "నేను చెప్పానా మీ చెల్లెలు కోతి-" అని భర్తను గేలిచేసింది నవ్వుతూ.

5

సాయంత్రం ఎర్రబడ్డది. సరస్వతి ముఖాన కూడా, కారే చెమటలకు అలుముకుపోయిన కుంకుమరక్తిమను, చూసి కూడా చూడనట్లు తప్పుకు నిల్చున్నాడు శాస్త్రి.

మళ్ళీ సజ్జబుట్ట - మరచెంబు, ఫ్లాస్కు, ట్రంకుపెట్టి ఒకటొక్కటే రిక్షావాలా తెచ్చి యింట్లో పడేస్తున్నాడు.


వెలిగిస్తున్న బుడ్డిదీపాన్ని గోడనున్న మేకుకు చేర్చి మసక చీకటిలో "ఎవరన్నయ్యా——" అంటూ వచ్చింది చెల్లాయి.

క్షణంసేపు మాటలాడకుండా చూస్తూ నిలబడ్డ మానవాకారం నిశ్శబ్దంగా అక్కడనుంచి నిష్క్రమించింది.

సరస్వతి పోల్చుకోలేకపోలేదు. బికారిలా పెంచిన గడ్డంతో నల్లటి మురికి తుండు నొకదాన్ని చుట్టుకుని స్తంభంవారనుంచి మిడిగుడ్లు పెట్టుకుని చూస్తున్నది ఆ మనిషే——అతగాడేనని.

సరస్వతి చంకనుండి పసికూన నేలకు జారబోతున్నాడు. చెల్లాయి చప్పున అందుకుంటూ "—నువ్వా వదినా - యిల్లు ఎట్లా పోల్చుకున్నావు?"

సరస్వతి కొంగునున్న ముడివిప్పి మూడుపావలా కాసులు యివ్వబోయింది. రిక్షావాడు తలను వంకిస్తూ "ఏం దమ్మగోరూ - ఆ యాది కాదని యీ యాది. యీ యాది కాదని అది వూరు సగానికి తిప్పిస్తి వే - ముప్పావులా డబ్బులేనా,



రూపాయన్న ... గం. నా నుచ్చుగోనంటే వుచ్చుగోను."

సరస్వతి నీరసంగా - "అంతే - నా దగ్గర అంతకన్నా లేదు. వెళ్ళు వెళ్ళు. ఇచ్చిన డబ్బుల్తో తృప్తి లేకపోయాక, అందుకనే మీకు కూడూ గుడ్డా వుండదు."

ఇచ్చిన ముప్పావులాను గడపమీద వుంచి - "అమ్మగోరూ - నాకాడ తిరకాసు పనికిరాదండీ, మీ డబ్బులు మీరు ఇచ్చేస్తేనే సంగోరు దక్కుతుంది."

అంతసేపూ కావడి బుజాన్నేసుకుని సందుమార్గాన నీళ్ళను తెచ్చి జేర వేస్తున్న శాస్త్రి ఎదురు రొమ్ము ముచ్చెమటలు కారుతూండగా కావడి బద్దను పుచ్చుకుని నేలను పొడుచుకుంటూ "ఎవరి సంగోరురా దక్కేది!" అని పళ్ళు పటపటా పిండి ఉరిమినట్లు చూశాడు. అంతవరకు యింట్లో మగవాళ్ళు కూడా ఉన్నారనే జ్ఞానంలేని రిక్షావాలా "ఇసుమంటి బేరాలు నొండు తగిల్తే నోటుకి నా సామిరంగా! గంజి మెతుకులు కూడా పోవు నోటిలికి" అని నెమ్మదిగా తోక ముడిచాడు.

"ఇదిగో మంచినీళ్లు వదినా!"

సరస్వతి గుటగుటా రెండు చెంబుల్నెత్తి నోట్లో పోసుకుని-

"అమ్మయ్య" అనుకున్నాక "ఇప్పుడు నీ వంటో ఎట్లాగుంది."

"ఫరవాలేదు. ఇంటికి వెళ్ళమన్నారు. శుక్రవారం శుక్రవారం రిక్షా మీద వెళ్ళి యింజక్షన్లు తీసుకుంటున్నాను."

చెల్లాయి చంకలోని కుర్రకుంక నెమ్మదిగా బొకాపట్టి యేడుపు లంకించుకున్నాడు.

"పాలు కలపాలి కామోసు వీడికి-"

"ఆఁ యిందాక రైల్లో యివ్వటమే మళ్ళీ పట్టలేదు."

"ఆ బుట్టలో వున్నాయా పాలడబ్బా - సీసా అవీను..."

"ఆ... నేనిస్తాన్లే. నువ్వెందుకు లేవటం?"

"పాపం యేడుస్తున్నా డొదినా-"

"ఏడవని వెధవేడుపు..."

"వేడినీళ్లు కావాలి కాబోలు. కుంపటి అంటించనా?"

"నాకు చెప్పు. నేనే అన్నీ చూసుకుంటా. నీకు తెలీదమ్మా నీకు కూడా వరసాగ్గా పిల్లలు కలిగితే...యిట్లాటివన్నీ - అప్పుడు అలవాటవుతాయి."

"ఫో—వదినా, సరదాకు పిల్లడికి పాలు పడతానంటే-"

"అదే- మొదట్లో సరదా, ఆ తరువాత బురద...ఇందులోంచి పీక్కుందామన్నా తెరిపి వుండదు చూడ్డంలే..."

చెల్లాయి లేచి బొగ్గులు కుంపటి చేర్చి నిప్పు వెలిగిస్తూ-

"చాలా చిక్కావే వదినా..."

సరస్వతి తన దగ్గర పాలు కలుపుతున్నది నెమ్మదిగా తలెత్తి "ఏదో నువ్వైనా అడిగావు ఆ మాత్రం. అందుకే సంతోషిస్తున్నా."

చెల్లాయి "అన్నయ్య వస్తున్నాడు..." అని గొంతు కుంచించి—

"ఈ యిల్లు నీకెట్లా తెలిసింది చెప్పు - ఇంత మూల. డాబా గార్డెను లోంచి చెంగ్రలావు పేటకు వచ్చేశామే-!

"నోట్లో నాలికుంటే అన్నీ తెలుస్తాయి. నాకేం సిగ్గు, మొహమాటం, బిడియం లేవు. ఇదివరకేమన్నా వుంటే ఆ కాస్తా ఇప్పుడు హరించుకుపోయాయి. ఎవర్నన్నా అడగ్గలను, ఏ విధంగానన్నా యీ ఇల్లు పట్టుకోగల్ను అనుకున్నాను. అంతే."

"పోనీలే - ఎల్లా వుంది?"

సరస్వతి నాలుగు మూలలా పరిశీలనగా చూసింది. అది మునుపటి వాటా కన్నా చిన్న - (అద్దె భరించలేక కాబోలు) గూళ్ళంలా మూసుకుపోయి నేల బారున వుంది. గాలీ వెలుతురూ తక్కువ. ఇహ లోపల, ఎక్కడ సామాను అక్కడే - నానా చిందరగానూ వుంది. గుమ్మం ఎదురుగుండా పెద్ద వేపచెట్టు. నిత్యమూ బోలెడు కొట్ట రాల్తుంది. దారివెంట బస్సులు బళ్ళూ మనుష్యుల కాలి దుమ్మూ అంతా యీ యింట్లోనే వుంటుంది.

సరస్వతి లేచి దొడ్లోకి వెళ్ళింది అక్కడ ఎల్లా వుందో చూదామని. అటు వైపు నొక పెద్ద బాదంచెట్టు.

అప్పుడే మెరుపు మెరిసినట్లు తన అన్నగారి యింట్లోని సౌకర్యాలు, అన్ని హంగులూ, విరుగుడు చావ టీపాయి దగ్గర్నుంచి ఫిలిప్సు రేడియో పెట్టె వరకు జ్ఞాపకం వచ్చాయి.

మరైతే అక్కడే ఎందుకు ఉండలేదు? ఇక్కడికి ఈ ఎత్తుపల్లాల గతుకుల్లోకి దేనికిగాను తిరిగి వచ్చింది?

సుఖాన్ని కాని దుఃఖాన్ని కాని కలిగించేది - పొందేది మనస్సు. ప్రాపంచికమైన యీ వస్తువుల్నుండి వచ్చేవి అనుభూతులే - ఫిలిప్సు రేడియో సెట్టు, వాక్సుహాలు చిన్నకారు, నాలుగంతస్తుల మేడ - మనుషులు కోరదగ్గవే- కాని పూరికొంప యింటినిండా దుమ్ము గతుకులు పల్లాలు, ఒకటి వుంటే ఇంకొకటి లేని సంసారం - యిందులోనే గడుపుకుంటూ కూడా మనస్సు దివ్యమైన అనుభూతుల్ని రుచి చూడగలదు. మనుష్యుల్ని వాళ్ళ సంస్కారము మనస్సు యొక్క అంతస్తుల్ని బట్టిగాని కొలిచేది, బ్యాంకు ప్యాసుబుక్కు బాలెన్సునుంచి కాదు. లోకం అనుకునేట్లు ఉత్తమ తరగతి జీవితం ఉన్నత భోగాల్ననుభవించటమే అయితే- సరస్వతి నిష్కారణంగా నిలుచున్నపాళాన ఎందుకు విశాఖపట్టణం ప్రయాణం కట్టుంది? ఏది వున్నా యేది లేకపోయినా 'నాది' అని చెప్పుకునే హక్కు కోసం ఆడా-మగా పోరాడ్డాన్నిబట్టి చూస్తే స్వేచ్ఛకోసం స్వాతంత్ర్యం కోసం అన్ని రంగాల్లోనూ పెనుగులాట సాగించటం ఎంత సహజమో చప్పున తెలుస్తుంది.

సరస్వతి ఏమీ వులుక్కుండా పలుక్కుండా ఆ దొడ్డిగుమ్మాన్నానుకుని అట్లా ఎంతసేపో నిల్చుండిపోయింది.

పిల్లడికి పాలుపడుతూన్న చెల్లాయి అన్నయ్యతో మాటాడుతున్నది కాబోలు అనుకుని తృప్తిపడసాగింది. గుంటవెధవ 'తా...త...త...త్తా త్తా' అని చేతుల్ని చరుస్తూ గచ్చు మీద దీపం వైపుకు ఉరుకుతున్నాడు హడావిడిగా.

అంతసేపూ సరస్వతి చూడలేదు గాని బాదం చెట్టుక్రింద రాతిమీద కూర్చుని చిన్న మాసిన కొళ్ళాయి గుడ్డతో శాస్త్రి ఏదో ఆలోచిస్తున్నాడు.

ఆకాశంలో అంతకుముందు గుంపులు గుంపులుగా చేరిన నీలిరంగు మబ్బుల మధ్యనుంచి త్రోవను చీల్చుకుంటూ చందమామ పైకి పైకి వస్తున్నాడు. ఆ వెన్నెల ఒక్కమాటు విచ్చినట్లయింది. బాదంచెట్టు కొమ్మల మధ్యనుంచి శాస్త్రి వీపుమీద కూడా వెన్నెల పడుతోంది. పగలల్లా ఎండలకు మాడివున్న నేల నెమ్మదిగా చల్లబడుతోంది. బాదం చెట్టుక్రిందనుంచి పల్చని శరీరం - తెల్లటి నీలిరంగు అంచుల చీరలో గుమ్మం వద్ద నిలబడ్డ సరస్వతి చాలా మనోహరంగా అగపడొచ్చు.

హఠాత్తుగా ఆమె దృష్టి శాస్త్రిమీద పడ్డది. తక్షణం చెట్టు నీడకు నెమ్మదిగా అడుగులేసుకుంటూ వినీ వినిపించకుండా అంది - "ఇక్కడ కూర్చుని వొక్కరూ ఏం చేస్తున్నారు?"

"అదంతా నా మీద కోపమేనా...?"

ఒకటి రెండు బాదంకాకులు పుటుక్కున విరిగి నేలకు పడ్డ శబ్దం విన్నా అతడి వద్దనుండి సమాధానం లేదు.

వెనుకనే నిల్చున్న సరస్వతి - కఠినంగా, "నేనసలు అన్నింటికీ తెగించి వచ్చాను. నా దగ్గర మంచితనం లేదు. అనవలసినవేమైనా వుంటే నా ముఖాన్నే అనెయ్యండి. అంతేకాని..."

శాస్త్రి మోకాలు క్రిందకు దింపి "హుఁ" అని మూలిగాడు.

"అన్నట్లు చెల్లాయి ఉత్తరం వ్రాసింది. మీరు కోతిని వుంచుకుని దానికి నా పేరు పెట్టారని..."

శాస్త్రి చప్పున అక్కడ్నుంచి లేచి వెళ్ళిపోబోయాడు. అతని ఎడమ చేతిని చప్పున అందుకుని వెనక్కు లాగుతూ—

"ఆ వ్యవహారమంతా నలుగురి నోట్లోనూ పడింది. మీకేమో మతి చలించిందని... నా కొక్కదానికే తెలుసు, ఈ తంతంతా ఎందుకు జరిపిస్తున్నారో."

చేతిని గట్టిగా విదల్చి శాస్త్రి లోపలికి దూసుకున్నాడు. చప్పున సరస్వతి బిక్కమొహంపెట్టి రెండుచేతుల్తో ముఖం కప్పుకొని వెక్కి వెక్కి యేడువ నారంభించింది. బాదం చెట్టుమీద కాకి ఒంటికాలుమీద కునుకుతూ హఠాత్తుగా లేచి 'కా...కా' అని అరవటంతో, సరస్వతి యేడుపుమాని గూడుమీదకు ప్రాకబోతున్న గండుపిల్లిని చూసి రాయి తీసుకుని వేసింది. అంతే...మళ్ళీ ఇదివరకు శాస్త్రి కూర్చున్నచోటే కూలబడి మోకాలుమీద ఆన్చిన తలతో ఆలోచిస్తూ యేడుస్తూ కాలక్షేపం చేయసాగింది.

చెల్లాయి కొంతసేపటికి వెతుక్కుంటూ వచ్చి "ఏమిటిక్కడ...ఎందుకు ఏడుస్తున్నావు వదినా..." భుజంమీద చేయివేసి కుదిపింది.

అంతక్రితమే మబ్బుల్లోకి వెళ్ళిన చందమామ మళ్ళీ యివతలకొచ్చి తొంగి తొంగి చూస్తున్నాడు.

"నాకు చెప్పవు వదినా...నే నన్నయ్యను పిలుచుకొస్తానుండు" అని వెళ్ళి నులకమంచం కుక్కిలో వూగుతూ అర్ధనిమీలిత నేత్రాలతో గతించిన మర్కట సుందరిని తల్చుగుంటూ పడున్న శాస్త్రి నుద్దేశించి.

"అన్నయ్యా వదిన యేడుస్తోంది?" అన్నది చేతులు నలుపుకుంటూ.

"ఏ వదిన..." అంటూ అయోమయంగా ప్రశ్నించాడు.

ఈ మారు చెల్లాయి కూడా సరస్వతి పక్షం తీసుకోక తప్పింది కాదు.

"వదినంటే - ఆ డాబా యింట్లో ఆవాళ మేడమీద ఎలక్ట్రిక్ తీగను ముట్టుకుని చనిపోయిన కోతేననా నీ అభిప్రాయం."

"అంతే...అసలైన వదిన ఎప్పుడో యిక్కడ్నుంచి వెళ్ళిపోయింది."

"లే అన్నయ్యా. నువ్వు ఒక్కమాటు వచ్చి చెబితే వదిన తప్పకుండా వచ్చి అన్నం తింటుంది."

శాస్త్రి మూర్ఖంగా "నా వల్ల కాదు..." అనేశాడు.

చెల్లాయి వెంటనే దొడ్లోకి పరుగెత్తి తెగించి ఆడదల్చుకున్న అసత్యం వొదిన ఎదుటను పెట్టింది.

"అన్నయ్య పిలుస్తున్నాడు నిన్ను—"


సరస్వతి ముడుకులమీద ఆన్చిన తలనెత్తి "నన్నా..."

గుండెలు కొట్టుకుంటుంటే చెల్లాయి "అవును. నిన్నే..." అని చీకట్లోకి ముఖం త్రిప్పుకుంది.

ఆ అసహాయకుర్రాలు యీ మాటలను నమ్మేసి చెంగుతో ముఖం తుడుచుకొని నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకొంటూ పడకగది చేరింది.

దాన్ని పడకగది అని అనటం కంటే కలకత్తా చీకటికొట్టు అనటం యుక్తమనిపించుగొంటుంది.

గదినిండా డబ్బాలు - నానా చెత్తాను. మధ్యగా నులక నుక్కిలో శాస్త్రి మాగన్ను మీదున్నాడు. సరస్వతి ఒరడుగు ముందుకువేసి గడపను దాటిందో లేదో అవతలివైపు కిటికీ దగ్గర వూపిరి బిగపట్టుకుని నిలుచున్న చెల్లాయికి యీ క్రింది మాటలు వినిపించాయి.



సరస్వతి—"పిలిచారట"-

నిశ్శబ్దం.

"మిమ్మల్నే - ఎందుకని అడుగుతున్నాను."

"నువ్వు నిలువు నిలువంతా అబద్ధాలకోరువి. నీ అంతట నువ్వు వచ్చి నేను పిలిపించానని దబాయిస్తున్నావు."

"పిలవలేదూ - చెల్లాయి వచ్చి చెప్పింది మీరు పిలిచారని."

"ఇది ఇంకో అబద్ధం-"

"సరే - నేనన్నీ అబద్ధాలే ఆడుతాను. మీ రింకా ఎందుకు నన్నిట్లా యేడి పిస్తారు?"

శాస్త్రి మాటలు వినిపించలేదు.

సరస్వతి గొంతుకే తెచ్చుకున్న ఉద్రేకంతో - "కానివ్వండి. మగ మహా రాజులు. మీ యిష్టమొచ్చి నన్ని ఆటలు మీరు ఆడవచ్చు. ఎల్లా ఏడిపించ దల్చు కొంటే అల్లా యేడిపించండి." మళ్ళీ గొంతుకలో వొణుకు - దుఃఖంతో మిళిత మైన మాటలు వెరట వెంటనే దొర్లాయి - "నేను మొండి పీనుగను. మీరు వెళ్ళ మన్నా వెళ్ళను. ఇదే నా యిల్లు...యిక్కడ్నుంచి నన్ను ఎక్కడికీ ఎవళ్ళూ వెళ్ళగొట్టలేరు. మీరు నాతో మాట్లాడకపోయినా నేను యిందులోనే వుంటాను. ఆఖరికి మీ చేతుల్తో ఏ రోజో మీరే యీ నా కాస్త గొంతూ-"

శాస్త్రి వున్నమాటున చెళ్ళుమని చెంపపెట్టులా తగిలిన మాటకు పులిక్కి పడి లేస్తూ - గోడను వ్రేలాడుతున్న దీపంబుడ్డి వత్తి పెద్దది చేసి చేత్తో పట్టు కొని సరస్వతి ముఖాన ధారలుగట్టి స్రవిస్తూన్న కన్నీటి దొంతరులను వింతగా చూస్తూ - "నీ హృదయం రాయిలా పాషాణమనుకొన్నాను. కాని యింత బేల వనుకోలేదు" అని పకపకా నవ్వాడు.

ఒక్కమాటు దించిన తలను కాస్త యెత్తి కోపంగానే అన్నది — "నేను అలో లక్షణా అని యేడుస్తూంటే మీరు హాయిగా కడుపునిండుగా వున్న ట్లుందే—"

"అవును."

"అల్లాగే వుంటుంది లెండి-గుమ్మంలోకి అడుగుపెట్టే, చేసుకున్నదాన్ని కదా, ఏమని నోటినుంచి మాట పెగిలిందా మీకు? ముత్యాలు రాలిపోతాయను కున్నారు.

"అంతే—ముత్యాలు రాలిపోతా యనుకొన్నాను."

"పోనీ—కన్న పిల్లవాడినన్నా దగ్గరకు తీశారూ?"

"వాడూ నీ పిల్లాడేగా..."

"అదీ...కోతుల్తో ప్రేమలు వెలిగించే ముఖాలకు అంతకన్నా ఏమిటి తెలుస్తుంది."

"కోతులే నయమంటాను నేను మనుషులకన్నా. ఒక పొరపాటు చేశాడు భగవంతుడు. అందరికీ తోకలు లేకుండా మనుష్యుల్ని చేసేశాడు కాని, కొంత కొంతమందికి—ఆ స్వభావం కలవాళ్ళను, తేలిగ్గా పోల్చుకొనేందుకు వీలయ్యే ట్టు తోకలు వుంచితేనే బాగుండిపోయేది!"

"ఏ యే స్వభావం కలవాళ్ళకు?"

"అదే - నీకుమల్లే, చీటికీ మాటికీ తగూలాడి తెగించి పుట్టిళ్ళకు మాకేమని పోతూంటారే..."

"మాటలు తిన్నగా రానీయండి."

"ఏం! యీమాటు చీపురుకట్ట తిరగేస్తావా?"

"ఆ ముక్క ముందుగా మీ నోటినుంచే వచ్చింది. నే నన్లేదు. మీరు వెళ్ళ మంటేనే వెళ్ళాను."

"మళ్ళీ ఎందుకొచ్చావు? ఏ ముఖం పెట్టుకొని?"

"మీకు ఆ వెళ్ళమనే అధికారం లేదని తెలుసుకొన్నాక వచ్చేశాను."

తరువాత శాస్త్రి నవ్వు వినపడ్డది. మళ్ళీ మాటలు - "నువ్వు ఈమారు రెండాకు లెక్కువ చదువుకొచ్చి నట్లున్నావు. యిస్కోమంటే యిస్కోమంటు న్నావు."

"మీరు మాత్రం - కోతుల్తో కాపురం వెలిగించి రాలేదూ-"


శాస్త్రికి మిసెస్సు జ్ఞాపకానికొచ్చింది. నెమ్మదిగా అనదల్చుకొన్నమాట పైకనేశాడు. "చెల్లాయిని రేపువారం యిక్కణ్నుంచి తోలేస్తాను."


సరస్వతి "మీ కాళ్ళు పట్టుకొంటాను - ఆ ముక్క మళ్ళీ అనకండి."

శాస్త్రి నవ్వి "నీ ధోరణి చూస్తూంటే అంతా కోతిచేష్టలకు మల్లే అని పిస్తోంది. వెళ్ళేముందు తెచ్చినందుకు తగూలాడావు ఇప్పుడు పంపిస్తానంటూంటే యిట్నుంచి మళ్ళీ వద్దంటున్నావు. ఏమిటి?"

సరస్వతి గోడను జారగిలబడి "మీరు ఒక్కమాటుగాదు, వెయ్యిమాట్లు గాదు, లక్షసార్లు అనండి. నేను కోతినే — కోతినే — కోతినే-" అని పక్కు మని నవ్వేసింది. ●

ఇంతకు ముందే అచ్చు అయిన ప్రముఖ రచయితల కథలని భారతిలో వేయడం మొదలు పెట్టాము. అటువంటి వాటిలో ఇది ఒకటి. సం.





శ్రీరస్తు – శ్రీ త్రిపురసుందరీ వరశివాఖ్యాంనమః

ఆంధ్రపత్రిక

అక్షయ నామ సంవత్సర పూర్ణశాస్త్రీయ పంచాంగము



'దైవజ్ఞచిన్తామణి' శ్రీ పిడపర్తి చినకృష్ణమూర్తిశాస్త్రి,

'భాషాప్రవీణ' శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రి సిద్ధాన్తి సోదరులచే గుణింపబడినది.

ఆంధ్రపత్రికా కార్యాలయము

ప్రతి 1–కి రూ. 5-00

గాంధీనగరం, విజయవాడ - 3.

బషీర్‌బాగ్, హైదరాబాద్–29

డా॥ కొల్లూరు సూర్యనారాయణ

వేములవాడ చాళుక్యుల సాహిత్యపోషణ

తెలుగునాటి వాయవ్య ప్రాంతాల్ని అతి కీలకమైన దశలలో పాలించి ఆ ప్రాంతపు రాజకీయ, మత సంస్కృతుల కెనలేని సేవ చేసిన పాలక వంశము వేములవాడ చాళుక్యులు. వీరి పాలన తెలంగాణా ప్రాంతములోని ప్రస్తుత నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలలో క్రీ॥శ॥ ఏడవ శతాబ్ది నుండి పదవ శతాబ్ది వరకు కొనసాగింది. సమకాలీన రాజకీయ రంగమున వీరు నిర్వహించిన పాత్ర విస్మరింప వీలుకానిది. మాన్యఖేట రాష్ట్రకూటులకు వేంగిచాళుక్యులతో నేర్పడిన పోరాట పరంపరలోను; వారి యితరేతర దిగ్విజయ యాత్ర లన్నింటను యీ చాళుక్య కుటుంబీకుల తోడ్పాటుకై వారెల్లప్పుడు ఎదురుచూచు చుండుటను బట్టి, దక్కను రాజకీయములపై వీరి ప్రభావమెంతటిదో ఊహింపవచ్చును. తెలుగు నాట జైన మతమునకు పెద్ద పీటవేసి తన్మత వ్యాప్తికై అవిరళ కృషి సల్పిన ఒకే ఒక్క పాలక వంశము వీరే. భారత దేశమున ప్రముఖ జైన కేంద్రమై విలసిల్లిన శ్రావణ బెళ్గోలము కన్న మిక్కిలి ముందు, అంతకు ఎన్నోరెట్లు ప్రసిద్ధికెక్కిన బోధన నగరము వీరి తొలి రాజధాని. వీరి మలి రాజధానియైన వేములవాడలో కూడ నేటికీ అధిక సంఖ్యలో జైన మూర్తులు ద్యోతక మగుట గమనింప దగినది. ఇన్ని ప్రత్యేకతలు సంతరించు కొన్న వేములవాడ చాళుక్యులు సాహితీ రంగమున చూపిన ఆసక్తి కూడ సాటిలేనిదే. ప్రస్తుత వ్యాసంలో వారి యేలుబడిలో జరిగిన సాహిత్య పోషణను గూర్చి సూక్ష్మంగా పరిశీలించటం జరుగుతుంది.

తెలుగు భారతికి గోదావరీ తీరంలో వేంగి ప్రభువులు పల్లకీ ఎత్తటానికి సుమారు శతాబ్ది ముందట, వేములవాడ సంస్థానంలో కన్నడ సరస్వతి నీరాజనాలందుకోవటం జరిగింది. వీరి ఆదరణలో సంస్కృత, కన్నడాలు పరిపుష్టం చెందాయి. నాటికింకా భాషాపరంగా తెలుగుతనం ఓ కొలిక్కి రాక పోవటం వలననో, కావ్య రూపానికి సిద్ధం కాకపోవటం వలననో, వీరి పోషణలో తెలుగు సాహిత్యం చోటు చేసుకోలేదు. కాని వారి కాలంలో కూడ అక్కడక్కడ తెలుగు పద్యాలు వ్రాయటం మొదలిడినట్లు చెప్పుకొందికి జినవల్లభుని గంగాధర శిలా శాసనం చాలు (1). కేవలము కవి, పండిత పోషకులు మాత్రమే కాక విద్యావేత్తలు కూడ నగుటచే యీ ప్రభువులు సాహిత్యముపై విశేషాదరము చూపిరనవచ్చును. మొదటి అరికేసరి, మూడవ అరికేసరివంటి వారు అనేక క్షత్రియోచిత విద్యలందు మాత్రమే కాక వ్యాకరణాది సాహిత్య సంబంధిత విద్యలందు కూడ నిష్ణాతులని శాసనములు పేర్కొంటున్నాయి. వివాదములకు, పండిత గోష్ఠులకు వేదికలగు 'సూరిస్థానము' లేర్పరుపబడినట్లును, అటువంటిది ఒకటి వేములవాడ యందే నున్నట్లును తెలియుచున్నది (2).

వీరి ఏలుబడిలో పోషణనందిన సంస్కృత భాష విషయం పరిశీలిస్తే, ఏ కాలంలో ఏ ప్రాంతంలో సాధించిన అభివృద్ధి కంటే వీరి పోషణలో ఆ భాష పొందిన స్థానం ఎంత మాత్రం తక్కువకాదని నిరాఘాటంగా చెప్పవచ్చును. వేములవాడ రాజాస్థానంలో సోమదేవ సూరి, ఘటవియ, విద్యారాశి, వ్యాఖ్యాని భట్టారక (3), పెద్దన భట్టు (4) మున్నగు అనేక మంది పండితులుండినట్లు తెలుస్తోంది. అయితే దురదృష్టవశాత్తు వారెవరు వ్రాసిన గ్రంథాలు నేడు మనకు లభ్యం కావటం లేదు. ఒక్క సోమదేవ సూరి వ్రాసిన గ్రంథాలు మాత్రం చాల వరకు లభ్యమయ్యాయి.

క్రీ॥ శ॥ 955 నాటి వాడైన సోమదేవ సూరి యావద్భారత ఖ్యాతి నార్జించిన జైన పండితుడు. నిమిత్తమాత్రునివలె కావ్యములల్లు కొనుచు కూర్చుండక, అస్తవ్యస్తము, అరాచకము అగుచున్న నాటి రాజకీయ వాతావరణమున నీతిని, రాజనీతిని సమ్మిశితముచేసి పాలకుల కొక నియమావళి సృష్టించి సార్థక జన్ముడైన మహామనిషి. సుమారుగా నీతడు వాగరాజ, రెండవ బద్దెగ, మూడవ అరికేసరి పాలనా కాలములలో వేములవాడలో నుండి యుండవచ్చును. బద్దెగుడు నిర్మించిన 'శుభధామ జినాలయము'నకు యీతడు స్థానాధిపతిగా నుండి నట్లు "గౌడ సంఘాధిపశ్రీమత్సోమ దేవాయసూరయే । తేనాయం భూభుజకారి శుభ ధామ జినాలయః [॥] - అని ఒక వేములవాడ శాసనం పేర్కొంటుంది (5). మూడవ అరికేసరి సోమదేవునకు దాన మొసగిన పరభణి తామ్ర శాసనమున (6) యీతనిని గూర్చి -

"... ధీమాన్ ! శ్రీసోమదేవ స్తపసః శ్రుతస్యస్థానమ్ యశోధామ గుణోర్జితశ్రీః॥ అపిచ యో భగవానా దర్శస్సమస్త విద్యానామ్ విరచయితా యశోధర చరితస్య కర్తాశ్యాద్వాదోపనిషదః కవితా చాన్యేషామ్ అపి సుభాషితానామ్ అఖిల మహా సామంత సీమంత ప్రాంత పర్యస్తోత్తంశ స్రక్సురభి చరణస్సకల విద్వజ్జన కర్ణావతంశీభవద్ యశః పుండరీకః సూర్యయైవ సకలావని భృతమ్ శిరశ్శ్రేణిషు శిఖండమండనాయ మాన పాదపద్మో భూతో ।...

-అని వర్ణింపబడింది. ప్రముఖ జైనాచార్యుడైన నేమి దేవుని శిష్యుడై కఠోర శైవ దీక్ష వహించిన సోమదేవుడు సమకాలీన పాలకులందరి గౌరవమన్ననలను బడసి గణుతికెక్కినాడు. శ్రీ నేలటూరి వేంకట రమణయ్యగారి అభిప్రాయము ననుసరించి, యీతడు ఉత్తర భారత దేశమునుండి దక్షిణమునకు వచ్చి వేములవాడలో స్థిరపడి యుండును(7). వేములవాడ పాలకుల జైనమతాసక్తియే నీతని నట నిలిపి యుండును. తన యావత్పాండిత్యమును జైన మత ప్రబోధమునకే నియోగించిన సోమదేవుడు 'యశస్తిలక', 'నీతి వాక్యామృత', 'సన్నవతీ ప్రకరణ', 'మహేంద్ర మాతలీ సంజల్ప', 'యుక్తి చింతామణీ సూత్ర'(8)- మున్నగు తన గ్రంథములన్నింటా, జైన సిద్ధాంత చర్చలకే స్థాన మొసగెను. వీనిలో 'యశస్తిలక', 'నీతి వాక్యామృత'లు పేరెన్నికగన్నవి.

'యశస్తిలక' ఉజ్జయినీ పాలకుడైన యశోధరుని వృత్తాంతమును వివరించు ఎనిమిదా శ్వాసముల గ్రంథము. సంస్కృతమున తొలిదశలో వ్రాయబడిన చంపూలలో నిది ముఖ్యమైనది. దీని యందు కూడ సోమదేవుడు తన సహజ ధోరణి ననుసరించి జైన సిద్ధాంతములకే అగ్రస్థాన మొసగెను. జైనేతరములైన వాదములకు, రాజనీతికి, ప్రాచీన గాధలకు కూడ సముచిత స్థాన మొసగెను. నాటి రాజాస్థానపు తీరు తెన్నులను కన్నులకు కట్టినట్లు వర్ణించుటతో బాటు, నాటి రాజరిక వ్యవస్థ యొక్క మంచి చెడ్డలను, లోతు పాతులను కూడ చర్చించినాడు. తన యీ కావ్యమును గూర్చి చెప్పుకొనుచు, యిది తన జీవితమున తానాకళింపు చేసుకొన్న సర్వ సిద్ధాంతముల సారమనినాడు. ప్రథమాశ్వాసపు శ్లోకములలో నొక సందర్భమున, గోవు ఏ విధముగా తృణము మేసి, జీర్ణించుకొని, క్షీరము నిడుచున్నదో, అటులనే తానును నిస్సారము, తర్క వితర్కములతో నిండినవియునైన సిద్ధాంతముల నెన్నింటినో కూలంకషముగా బాల్యమాదిగా నభ్యసించి, యిట్టి గ్రంథము నొడ గూర్ప గలిగినట్లు పేర్కొనినాడు. దీనిని బట్టి తొలి దశలో నీతడు తర్క వేదాంతములను క్షుణ్ణముగా మధించి క్రమముగా పండితుడై, వేములవాడ ఆస్థానమును చేరి యుండినట్లు గ్రహింపవచ్చును. క్రీ॥ శ॥ 959లో తన ప్రభువైన అరికేసరి రాష్ట్రకూటులకు సహాయముగా జైత్ర యాత్రలో దక్షిణమున 'మేల్పాడి' యందు విడిసి యుండగా, తానీ గ్రంథమును 'గంగాధర' మందు (కరీంనగర్ జిల్లా) వ్రాసినట్లు యీతడందు పేర్కొనినాడు. యుక్త వయస్కులగు ప్రేమికులు ఎవ్వని లేఖినిచే తమ తమ ప్రేమ లేఖలను వ్రాయించుకొనుట కువ్విళ్ళూరెదరో అట్టి 'లేఖక శిఖామణి' యైన రచ్చకుడు దీనిని లిఖించెనట!

సూక్ష్మముగా 'యశస్తిలక' యందలి యితివృత్తమిది -

యౌధేయ రాజ్యము నందలి రాజపురమును చండమహాసేనుని పుత్రుడైన మారదత్తుడు పాలించుచుండెను. ఒకనాడు వీర భైరవుడను తాంత్రికు డాతని కడకేతెంచి, అతని నగరి దేవతయైన చండమారికి విశేషమగు బలులు సమర్పించినచో ఖడ్గము లభింపగలదని పలికి శుభలక్షణ పూరితులగు యిర్వురు వ్యక్తులను ముందుగా స్వీయహస్తములతో బలిచేయవలసినదిగా పలికినాడు. వెంటనే మారదత్తుడు 'మహానవమి' వేడుకల మిషతో రాజ్యమునందలి యావన్మందిని అచ్చటకు రావలసినదిగా నియోగించి, వారిలో యోగ్యుల నిద్దరనుబంధించి బలికి సిద్ధము చేయ భటుల నాజ్ఞాపించెను. అదే సమయమునకు రాజపుర ప్రాంతమున విడిసియున్న సుదత్తుడను జైన ముని శిష్యులైన అభయరుచి, అభయమతి, అను పిన్న వయస్కులగు అన్నా చెల్లెండ్రిరువురు భిక్షకై అచ్చటకు రాగా, రాజభటులు వారిని బలినిమిత్తము బంధించిరి. వీరు బాల్యముననే జైన దీక్ష స్వీకరించి సుదత్తుని వెంట తిరుగుచున్న మారదత్తుని సోదరియగు కుసుమావళి కవల బిడ్డలు. ఈ కుసుమావళి ఉజ్జయినీ రాజ్యాధిపతియైన యశోధరుని పుత్రుడగు యశోమతి పట్టమహిషి. ప్రాణభీతికి, ప్రమాదమునకు వెరగందని యీ యిర్వురను ఆలయమునకు చేర్చునప్పటికి, యితర బలుల కవసరమగు అనేక జంతువులు కూడ అచ్చటకు గొనితేబడినవి. ఖడ్గపాణియై బలి నివేదమునకై మారదత్తుడు కూడ ఆ ప్రదేశమునకు వచ్చినాడు. నిర్భీతులగు ఆ పసివారిని చూచుసరికి అతని హృదయము ద్రవించినది. "ఇచ్చట నీ వారమే తప్ప ఎవ్వరునూ శత్రువులు కాన రారే, ఎవ్వరునూ, నీ యాజ్ఞ నతిక్రమించుటలేదే, మరి చేత నా ఖడ్గ మెందులకు దాల్చితి"వనిన వారి ప్రశ్న కాతడు నిర్విణ్ణు డయ్యెను. హస్తము కంపించి కృపాణము నేలపై బడినది. చేష్టలుడిగి నిల్చిన మారదత్తునకు నెమ్మదిగా అభయరుచి ధర్మబోధ సలిపి, తన పూర్వ జన్మగాథల నెరుక పరచినాడు. అవంతి రాజ్యము నందలి ఉజ్జయినీ నగరాధిపతియైన యశోర్ఘుని పుత్రుడైన 'యశోధరునిగా తానుండి నప్పటి కథయే, యీ కావ్యకథ.'

సోమదేవసూరి కవిత్వమున నొక్కొక్క సందర్భమున అతని శక్తులపై అతనికున్న అపరిమితమగు విశ్వాసము, కావ్యకథనమున అతని శక్తి యుక్తుల నేర్పు, అతిగా పేర్కొనబడి స్వోత్కర్షగా రూపొందినవి. కావ్యములను మలచుటకు మూలకములగు పూర్వ గ్రంథములు కాని, ఆధారములుగాని లేవనియు, దేనిని ఆధారముగా గొనకయే, తాను కావ్యములను మలచుచున్నానని గొప్పగా పేర్కొనినాడు. తన దృష్టిలో పూర్వకవుల గ్రంథములను ఆధారముగా వ్రాయుటకాని, వానిచే పదే పదే తరచి అందలి భావములను స్వీయ రచనలో ప్రతిబింబించుటకాని హేయమైన కార్యమని నిరసించుచు, అట్టి పనిచేయు వానిని పాపిగను, చోరునిగను అభివర్ణించినాడు. కాని యీతని కావ్యములపై తీవ్ర పరిశీలన జరిపిన కృష్ణ కాంత హాండిక్వి మున్నగు పండితులు యీతని కావ్యములకు కూడ మూలకములున్నవన్న అభిప్రాయమునకు వచ్చుట గమనించ దగ్గది 9). క్రీ॥ శ॥ 777లో ఉద్దయోత్తనసూరి వ్రాసిన 'కువలయమాల' అను ప్రాకృత గ్రంథమున, ప్రభంజనుడను నాతడు వ్రాసిన 'యశోధర చరిత్ర' యను గ్రంథము ప్రస్తావింపబడినది. దానిని బట్టి యీ కథాంశము పదవ శతాబ్దిలో సోమదేవుడు వ్రాయుటకు చాల ముందు నుండియే ప్రాచుర్యము నందినట్లు గ్రహింప వచ్చును. కనుక యీతడు చాటుకొన్న స్వతంత్ర కథనము వస్తువునకు సంబంధించినదిగాక కథా సంవిధానమునకు, శైలికి మాత్రము సంబంధించినదై యుండును.' వాస్తవమునకు 'యశస్తిలక'లో మనకు కంఠశోషమైన యశోధరుని చరిత్ర విషయము కన్న, శబ్దార్థాలంకారములతో నిండిన యీతని గంభీర రచనమే కనబడి యీతని కవితా శక్తిని సాక్షాత్కరింప జేయును.

ఈతని రెండవ ప్రముఖ గ్రంథమైన 'నీతి వాక్యామృతమ్.' యశస్తిలక చంపూ వ్రాసిన తరువాత వ్రాయబడి యుండవచ్చును. రాజనీతిని గూర్చి వివరముగా చర్చింపబడిన యీ గ్రంథము ముప్పది రెండు అధ్యాయములకు పెరిగినది. మధ్య యుగపు భారత దేశమున గణుతి కెక్కిన రాజనీతి గ్రంథము లన్నింట నుత్తమోత్తమముగా పరిగణింప వచ్చును. పరిపాలనా పద్ధతులకు, రాజ్యశ్రేయోభివృద్ధికి, సమర్థమగు ప్రణాళిక నిడిన సోమదేవుని మేధాశక్తి యీ గ్రంథమున బహుముఖముల ప్రభవించినది. స్యాద్వాదాచలసింహ, తార్కిక చక్రవర్తి, వాక్కల్లోల పయోనిధి, కవికుల రాజ మున్నగు యీతని బిరుదము లెన్నియో యీ గ్రంథమున పేర్కొన బడినవి. వాద సభలలో సోమదేవుని పాండితీ విభవమునకు ప్రత్యర్థుల గుండెలు భీతిచే గుభిల్లు మనునట; సురగురువైన బృహస్పతి సైతము వాదమున నీతనికి దాసోహము కావలసినదేనట !

ప్రముఖ పరిశోధకు లనేకమంది సోమదేవసూరి గ్రంథములను కూలంకషముగా మథించి, అతని ఉత్కర్ష సమర్థ నీయమే యని అంగీకరించి నారు. ఈతని 'యశస్తిలక' అనేక విషయముల ఆసక్తి కరమైన అంశములను వెలువరించు విజ్ఞాన సర్వస్వము వంటిదనియు, మధ్యయుగపు భారతదేశ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, మత పరిస్థితులను పరిశీలించుటకు మిక్కిలి ఉపయుక్తకరమైన దనియు శ్రీ నేలటూరి వేంకట రమణయ్యగారు ప్రశంసించినారు (10). 'నీతి వాక్యామృత' మును గూర్చి పేర్కొంటూ శ్రీ. ఎ. యస్. ఆల్టేకరుగారు. యీ గ్రంథము కౌటిల్యుని అర్థశాస్త్రపు ప్రాతిపదికపై వ్రాయబడినట్లున్నను , దాని కన్న ధర్మదృష్టితో, ఉన్నత ప్రమాణములతో కూర్చబడినట్లు గుర్తించి నారు. శ్రీకృష్ణ కాంత హాండిక్విగారి అభిప్రాయమున, భారతదేశ సాహిత్య చరిత్రలో సాటిలేని మేధా సంపన్నునిగా సోమదేవుని స్థానమత్యున్నతము. వేర్వేరు విషయములలో నాతడు సముపార్జించిన జ్ఞానము అనితరసాధ్యము (12).

ఇక వేములవాడ చాళుక్య ప్రభువుల పోషణలో పరిఢవిల్లిన కన్నడ కవిత్వ విషయము పరిశీలింపవలసి వుంది. కన్నడ కావ్యం ప్రథమంగా రూపు దిద్దు కొన్నది వీరి యేలుబడిలోనే. నాటికే 'గుణగాంకీయం,' 'కవిరాజమార్గ,' వంటి గ్రంథాలు కన్నడంలో వున్నా, అవి లక్షణ గ్రంథాలు కావటంతో, కావ్య గౌరవము 'ఆదికవి' గా గణుతికెక్కిన పంప మహా కవి విరచిత 'ఆది పురాణ,' 'సాహస విక్రమార్జున విజయము'లకే దక్కుతుంది (13). ఈ పంపకవి క్రీ॥శ॥ 930 ప్రాంతపు వాడైన ఇమ్మడి అరికేసరి యొక్క ఆస్థానకవి; కమ్మనాటి వంగిపఱ్ఱు ప్రాంతపు వాడైన ఆంధ్ర బ్రాహ్మణుడు. ఈతని పూర్వీకు లందరును యజ్ఞయాగాదులొనరించిన సోమయాజులు. జైనముపై మక్కువ వలననో, మరే యితర అభ్యంతరములు కారణముగనో, తండ్రియైన భీమన కాలము నుండియే వీరు సనాతన మగు వైదికమును విడచి జైన మవలంబించిరి. తండ్రి కాలము నుండియే వీరు స్వస్థానమును వదిలి వేములవాడ చేరి యుందురు. కొంతకాల మీతడు వనవాసదేశమున గడిపి యుందురని పండితుల ఊహ. "ఆది పురాణ దొళరివుతు కావ్యధర్మమం, ధర్మముమం", అని తన కావ్యారంభమున చెప్పుకొనుటను బట్టి, కావ్య ధర్మమును సాధించుటకే పంపకవి 'ఆది పురాణము'ను వ్రాయుట జరిగినదను కొనవచ్చును.

పంప కవి మొదటి కృతియైన 'ఆది పురాణము' పదహారాశ్వాసముల గ్రంథము. ప్రముఖ జైన తీర్థంకరుడైన వృషభనాథుని కథను వర్ణించు దీని నీతడు మూడు మాసముల స్వల్ప వ్యవధిలో పూర్తి చేసెనట. ఆత్మానందమునకై దీనిని వెలయించినట్లీతడే పేర్కొనెను. జినసేనుని సంస్కృత గ్రంథమైన 'పూర్వ పురాణము' నుండి కథాంశము గ్రహింపబడినది. పురాణ కథ యగుట వలన కల్పనకు, కథన కౌశలమునకు హెచ్చు అవకాశము లేకపోయినది. పురుదేవుని పూర్వ జన్మ గాథలు ఆతని పరినిష్క్రమణము, ధర్మ విహారము, జిన ధర్మము బోధసేయుట, కడకు నిర్వాహణ మందుట యిందలి విషయములు. సాహిత్య పరముగా మహోత్కృష్టమైనను పొందవలసినంతగా జనాదరణము నందినట్లు తోచదు.

ఈతని రెండవ గ్రంథము 'పంప భారతమని' ప్రసిద్ధిగాంచిన 'సాహస విక్రమార్జున విజయము'. విక్రమార్జునబిరు దాంకితుడైన ఇమ్మడి అరికేసరి కంకితముగా నీయబడిన యీ కృతి నీతడు ఆరు మాసములలో వ్రాసినాడట. "కతెపిరి దొదొడం కతెయమెయ్ గిడలీయదెముం సమస్త భారత మన పూర్వ మాగెసలెపేళ్ద కవీశ్వర రిల్ల వర్ణకం కతెయొళొడం బడం పడెమె పేర్వాడె పంపనె పేళ్గు మెందు పండితరెత గుళ్దు బిచ్చటి సెపేఱ లొడర్చిదె నీ ప్రబంధమం" - అని పండితులు వ్యాస భారతాన్ని వెలువరించటానికి తను తప్ప అన్యులు సమర్థులు కారని ప్రేరేపిస్తే, వ్రాయటానికి సమకట్టినట్లు చెప్పుకొన్నాడు. అయినప్పటికీ భారత కథకీతడు కొంత వరకు న్యాయమును కూర్చ లేదనియే విమర్శకుల అభిప్రాయము. తానుద్దేశించిన విధముగా తన పోషకుడైన అరికేసరిని పాండవ మధ్యముడైన అర్జునునితో పోల్చుటకై మూలకథను మార్చుటకు సహిత మీతడు వెనుతీయలేదు. ఇదియే తీవ్ర విమర్శలకు గురియైనది (15). కొందరి దృష్టిలో నీతడు పంచమవేదమైన భారత కథలో మానవ మాత్రుడైన అరికేసరి కథను అభేదముగా చెప్ప నుంకించి, దాని గౌరవమును కుంచింప చేసినాడు. భారత కథలో ముఖ్యముగా నీతడు గావించిన మార్పులివి :-

i) ద్రౌపదిని పాండవుల కందరకును కాక, అర్జునుని కొక్కనికే భార్యగా చెప్పుట,

ii) భారత కథా సూత్రధారియైన శ్రీకృష్ణ పరమాత్ముని భగవత్తత్త్వము మఱుగుపుచ్చుట,

(iii) కురుక్షేత్ర మహా సంగ్రామానంతరము ద్రౌపదీ ధర్మజులకు కాక, సుభద్రార్జునులకు పట్టాభిషేకము చేయుట,


ఇట్టి మార్పులను చేయుటకు బహుశః ఆతడు సంప్రదించిన యితర గ్రంథములైన కిరాతార్జునీయ, వేణీ సంహారము వంటివి కొంత వరకు కారణము కాదగును (16). జైన మతమవలంబించిన పండితుడు హైందవేతిహాసమును వ్రాయుటలో నిట్టి అనౌచిత్యమో !

ఎట్టి మార్పులు చేసియైనను వానిని కథనమున కడవరకు పాటింప లేదు. జైన భారతము ననుసరించి ద్రౌపదిని అర్జునుని కొక్కనికే భార్యగా చేసినను, కురుసభలో ద్రౌపదీ వస్త్రాపహరణపు విషయము వచ్చుసరికి వ్యాసుని గ్రంథము ననుసరించెను. ద్రౌపదికి జరుగుచున్న అవమానమునకు క్రుద్ధుడై లేచి కౌరవులను కడతేర్తునని భీషణ ప్రతిజ్ఞలు చేయునది భీమసేనుడే. అట్లే అజ్ఞాత వాస సమయమున విరాట నగరిలో కీచకునిచే పీడింపబడినప్పుడు ద్రౌపది పోయి మొరపెట్టుకొనినది భీముని తోడనే. కురుక్షేత్ర సంగ్రామమున దుశ్శాసన వధానంతరము రుధిర హస్తములతో ద్రౌపది కేశములు ముడిచినది భీముడే, కాని అర్జునుడు కాదు. ఈ సందర్భము లన్నింట భీముడు ద్రౌపదిని భార్యగనే పిలుచును. వేర్వేరు స్థలములలోని కథాంశము లిట్లు ముడి పెట్టుటవలననే ఔచిత్యము చెడినది. ప్రభువుపైకల భక్తి విశేషములచే అరికేసరిని అర్జునునితో పోల్చుటతో తృప్తిపడక యీ పాలకుని బిరుదము లన్నింటిని నిరర్థకముగా అర్జునునకు ప్రయోగించినాడు.

పంపకవి భారతములోని కథాంశములపై నెట్టి విమర్శలు వచ్చినను ప్రౌఢశైలికి, పాత్ర చిత్రణకు, కథాకథనమునకు యీతని రచన మచ్చుతునక. తనను గూర్చి తానే 'హితమితమృదు వచన', అనియు, 'ప్రసన్న గంభీర వచన రచనా చతుర', అనియు చెప్పుకొన్నాడు. తన కవిత్వము నందలి ప్రధానమైన గుణములను గూర్చి పేర్కొంటూ -

"ఆ సకళార్థ సంయుత మళం కృత యుక్త ముదాత్త వృత్తి వి
న్యాస మనేక లక్షణ గుణప్రభావం మృదుపాద మాదవా
క్క్రీసుభగం కళాకళిత మెంబ సెగత్తి యనార్ధ కబ్బమం
కూసుమ నీవు దీవు దరికేసరి గల్లద వస్తుగీవుదే" - అనియు

"లలిత పదం ప్రసన్న కవితా గుణ విల్లదె పూణ్డు పేర్టి బె
ళ్ళళ కృతి బంధమంబరిహ కొఱరకైగళ కేడు నుణ్ణన
ప్పళ కడవేడు పేళిసి దొడర్థద కేడినెపేళు బీగి పూ
ట్టళిస నెగర్తిగాటి సువ దుష్షవియుం కవియెంబ లెక్కయే"



- అనియు చెప్పినాడు (17). రచనలో దేశీవృత్తములకన్న హెచ్చుగా సంస్కృత వృత్తములే వాడినాడు. అనంతర కన్నడ, తెలుగు కవులు చాల మంది పంపకవి కవిత్వ పోకడల ననుసరించిన వారే. ఈతని కవితా ప్రాభవాన్ని కొనియాడుతూ అరికేసరి యీతనికి 'కవితా గుణార్ణవ' బిరుదముతో బాటుగ 'ధర్మపుర' అగ్రహారాన్ని దానమొనరించినాడు. ఈ వేములవాడ ప్రభువుల పోషణే లేకుంటే, కన్నడ సాహిత్యానికి తెలుగు సాహిత్యంకన్న ఓ శతాబ్ది ముందు, పరిమళ భరితమైన భారత సుమం అంది వుండేది కాదేమో !

పంపకవి తెలుగు కావ్యాలు వ్రాయటం జరిగిందా ?!

ఇది పూర్తిగా సంసయగ్రస్తమైన విషయము. 'జినేంద్ర పురాణ' కర్త యైన పద్మకవి యీ పంపకవే తప్ప అన్యుడు కాదని శ్రీ నిడదవోలు వెంకటరావుగారు భావించటము,(18) వారి అభిప్రాయాన్ని శ్రీయుతులు కె.సుబ్బరామప్ప (19), తిరుమల రామచంద్ర (20), చల్లా రాధాకృష్ణ శర్మ (21), దివాకర్ల వేంకటావధానిగారలు (22), అంగీకరించటము జరిగాయి. కాని శ్రీ కోర్లపాటి శ్రీరామమూర్తిగారు(23) అభిప్రాయ పడినట్లు దీని నంగీకరించుట కన్న, అంగీకరింప కుండుటకే హెచ్చు అవకాశము లున్నవి.

పెద్దపాటి జగ్గనకవి 'ప్రబంధ రత్నాకరము'న పేర్కొన్న పద్యాలు తప్ప పద్మకవి 'జినేంద్ర పురాణం' ప్రస్తుతం లభ్యం కాలేదు (24). 'ప్రబంధ రత్నావళి' పీఠికలో శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఆ పద్యాలు అంత ప్రాచీనమైనవి కాకపోవచ్చునని కూడ అభిప్రాయపడ్డారు (25). కాని శ్రీ నిడదవోలు వెంకటరావుగారు 'జినేంద్ర పురాణాన్ని' పంప కవి గ్రంథంగానే పరిగణించారు. ఆయన వాదానికి ఆలంబనగా గైకొనిన విషయాలివి :

(i) ముళియ తిమ్మప్పయ్యగారు తన 'నాడోజపంప'లో సూచించినట్లు పంప, పద్మ, పదములు రెండును ఆరవ జైన తీర్థంకరుడైన 'పద్మప్రభ' నామమునుండియే ఉత్పత్తి యైనట్లు గ్రహించుట.

(ii) తెలుగు ప్రాంతమైన 'వంగిపఱ్ఱు' స్వస్థలమైన వాడగుటచే పంపకవికి 'జినేంద్ర పురాణము'ను తెలుగున వెలయించు నంతటి పాండిత్యముండి వుండునట్లు భావించుట.

(iii) కన్నడమున 'ఆది పురాణము'ను వ్రాసిన (భాషయందే కాక కథా విషయమున మార్పు లేదు కనుక) 'జినేంద్ర పురాణము'ను వ్రాయు అవకాశ ముండుట.

(iv) ఇది 'చిత్రకవిత'కు వచ్చుటచే నన్నయకు పూర్వమైనది కావచ్చునని అభిప్రాయపడుట.

—కాని పై అంశములలో నే ఒక్కటియు పంపకవిని పద్మకవిగా నిర్ధారించుటకు సరిపడదు. 'జినేంద్ర పురాణము' నందలి చిత్ర కవిత దానిని ప్రాచీన గ్రంథమని సూచించును గాని, రూఢిగా నన్నయకు పూర్వపు గ్రంథమని కాదు. కన్నడమున 'ఆది పురాణము' వ్రాసిన కవి తెలుగున వ్రాసి యుండుననుట కూడ నిరాధారమగు నూహయే. పంపకవికి తెలుగు సాహిత్యమున వ్రేలిడు సామర్థ్యమున్నదా, లేదా, అనునది వివాదము కాదు. అట్టి సామర్థ్య మాతనికి వుండియే వుండునను కొన్నను, ఆతనిని పద్మకవిగా నిరూపించుట కది చాలదు. అట్లే 'పద్మ' శబ్దము నుండి 'పంప' శబ్దము ను రాబట్టుటకూడ సహేతుకమైన పద్ధతి కాదు. సరియే, వాదమునకు పైవన్నియు అంగీకరించి పంపకవియే జినేంద్ర పురాణము, వ్రాసెననుకొన్నను, అందరెరిగిన స్వీయ నామమును విడచి, 'పద్మకవి'గా ఎందుకు చెప్పుకొని యుండునో ? తెలుగునకూడ 'పంపకవి'గనే వాసి గాంచి యుండును కదా ! వీని యన్నింటిని బట్టి శ్రీ శ్రీరామమూర్తిగారు గుర్తించినట్లు పద్మకవిని పంపకవిగా గుర్తించుటకు, ప్రస్తుతాధారములు చాలవు పంపకవి తెలుగున యెట్టి గ్రంథములు వ్రాసినట్లు తోపదు.

అధోజ్ఞాపికలు :-

(1) "ఎపిగ్రాఫియ ఆంధ్రిక," సంపుటి. 2; పే. 21.
(2) "ఇన్స్క్రిప్షన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్", కరీంనగర్ డిస్ట్రిక్టు, నెం. 2.
(3) " " "

ఉత్తర మీమాంస

ప్రాఙ్ముఖ ధ్యాన ముద్రితుని
భ్రూమధ్య రేఖకూ,
భూమధ్య రేఖకూ,
సమాంతరంగా,
జనన మరణ ధ్రువాల
ప్రాక్పశ్చిమ బిందువుల్ని,
నిర్వక్రంగా స్పృశిస్తూ
దురతిక్రమమైన కాలరేఖ !

కాలరేఖను
రెండు పక్షాలుగా విభజిస్తూ,
ఉత్తర దక్షిణ ధ్రువాల్ని
ఉడ్డీనంగా సంధిస్తూ,
లంబమాన హంసమయ జీవరేఖ !
నాసాగ్రానికి
ఈషదున్నతంగా,
జీవరేఖ కాలరేఖతో సంగమించే
సుమేరు శిఖరాగ్రమొక తేజః కేంద్రం !

ప్రాచీన జనన బిందువుతో
ఉపక్రమించి,
ప్రతీచీన మృత్యు బిందువు నతిక్రమిస్తూ,
వర్తులంగా విస్తరించిన బిందుపథమే
జీవన వృత్తం !
కాలరేఖ కిరుగడలా
రెండు భాగాలు !
జీవన వృత్తంలో
నాలుగు పాదాలు !!

తొలి రెండు చరణాలు,
ఉదయాస్తమయాది
సర్వద్వంద్వాల మధ్య విస్తరించిన,
దృశ్యమాన జీవితం !
నిజానికదే
ఒక పూరణ లేని ప్రవహ్లిక !!
మిగిలిన రెండు చరణాలు,
ఈ ప్రహేళికకు పూరణాలు !
సృష్టిస్థితి లయాల గతులకు
కారణాలు !!

జీవన వృత్తం
పూర్వార్థమొక పెద్ద ప్రశ్నార్థకం !
జనన మొక ప్రశ్న !
మరణ మొక ప్రశ్న !
జనన మరణాల మధ్య
జీవితమే ఒక ప్రశ్న !!
ఈ ప్రశ్న లన్నిటికీ,
ప్రత్యుత్తరమే
ఉత్తరార్థం !
సమీచీన సంశయ సమాహారాలకు,
సమాధానాలు శోధించటమే,
ఉత్తర మీమాంస !!

సౌందర్య లహరి

అనాఘ్రాత వికసిత సహస్రారాలు
అచుంబితాలైన భావాలు
ఎప్పుడూ నిరుక్తాలే
ఆ భావాలను
ఛందశ్శక్తిలో నిక్షేపిస్తే
ఉక్తి ఉజ్వల ముక్తమౌతుంది !
సౌందర్య లహరీ సూక్త మౌతుంది !!

నిర్వచనాలు

శోకం
శ్లోకంగా పరిణమించటం,
వేదం
కావ్యవాద పారిజాతమై పరిమళించటం,
స్మృతులు
పౌరాణిక స్మృతులను ప్రస్తరించటం
శాఖోపశాఖలుగా విస్తరించటం
ఒక అక్షర తత్వానికి
నిర్వచనాలుగా నిలిచేందుకే !
అందుకే అవి నిర్వచనాలు !!

శ్రీ గడియారం శేషఫణి శర్మ

(4) "ది చాళుక్యాస్ ఆఫ్ వేములవాడ", పే. 92.
(5) "ఇన్స్క్రిప్షన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్", కరీంనగర్ డిస్ట్రిక్టు, నెం. 4.
(6) "ది చాళుక్యాస్ ఆఫ్ వేములవాడ", పే. 92.
(7) " " పే. 46.
(8) "యశస్తిలక అండ్ ఇండియన్ కల్చర్," పే. 1.
(9) " " ,పే. 42.
(10) "ది చాళుక్యాస్ ఆఫ్ వేములవాడ", పే. 46.
(11) "రాష్ట్రకూటాస్ అండ్ దైర్ టైమ్స్", పే. 411.
(12) "యశస్తిలక అండ్ ఇండియన్ కల్చర్", పే. 52.
(13) "భారతి", 1958, జూలై, పే. 33.
(14) "విక్రమార్జున విజయము"; 1 - 11.
(15) "ఆంధ్ర వాఙ్మయారంభదశ", ద్వితీయసంపుటము", పే. 1045.
(16) "దక్షిణభారతసాహిత్యములు", పే. 64.
(17) "విక్రమార్జున విజయము"; 1 - 6, 12—
(18) "ఆంధ్ర కర్ణాటక సారస్వతములు - పరస్పరప్రభావము", పే. 61.
(19) "భారతి", 1958, జూలై, పే. 33.
(20) "విజ్ఞానదీపిక", సంపుటి 1, పే. 400.
(21) "తెలుగు - దక్షిణాత్యసాహిత్యములు", పే. 36.
(22) "ఆంధ్రవాఙ్మయారంభదశ", పే. 93.
(23) "నవభారతి", 1978, ఏప్రియల్, పే. 7.
(24) "ఆంధ్రకవితరంగిణి", సంపుటి 8, పే. 226.
(25) "ప్రబంధరత్నావళి". పీఠిక, పే. 27.

సీరియల్

సమిధలు

దిలావర్

(గతసంచిక తరువాయి)

19

ఎన్నో సన్నివేశాలను, ఎన్నో సంఘటనలను, ఎన్నో జీవితాలను నిమ్నోన్నతాలను తనలో కలుపుకొని కాలప్రవాహం అనంతంగా కొనసాగుతూనే వున్నది.

కాలేజికి సెకండ్ టరమ్ హాలీడేస్ పూర్తయ్యాయి.

అంతవరకూ స్తబ్ధుగా నిర్లిప్తంగా వున్న కాలేజి ఒక్కసారిగా హుషారు పుంజుకుంది. విద్యార్థులంతా ఎంతో మురిపంగా ఎదురుచూసే 'కాలేజి డే' రానే వచ్చింది.

ఉదయం నుండే కాలేజి కళకళలాడుతున్నది. రంగు రంగు దుస్తుల్లో-స్వేచ్ఛగా-హాయిగా-ఖుషీగా తిరుగుతున్నారు విద్యార్థులు. తమ చదువులను, సమస్యలను పక్కకు పెట్టి జోకులు పేలుస్తూ, నవ్వుతూ, నవ్విస్తూ, ఉల్లాసంగా కేరింతలు కొడుతున్నారు విద్యార్థులు.

పోటీలుపడి క్లాస్‌రూంలు డెకరేషన్ చేయడంవలన, రంగురంగుల తోరణాలు కట్టడంవలన కాలేజి పెళ్ళిల్లులా పెటపెటలాడిపోతున్నది.

కళ్ళు మిరుమిట్లు గొలిపేట్టు అలంకరింపబడింది స్టేజి. స్టేజి పైభాగాన పెట్టిన మైకులోంచి వస్తున్న పాటలు వాతావరణాన్ని హుషారెక్కిస్తున్నాయి. అవసరమున్నా లేకున్నా సర్దుకుంటున్న పైటలతో-క్రీగంటి చూపులతో-అయస్కాంతం నవ్వులతో కదిలే రంగుల బొమ్మల్లా విద్యార్థినులు. వారి కంట పడితే చాలు జన్మ ధన్యమైనట్టేనని భావించి నానా అవస్థలూ పడుతున్న విద్యార్థులు. పక పకలతో-కిక కికలతో-సందడి సందడిగా-గోల గోలగా-సంబరంగా వుంది కాలేజి.

కాలేజి డే సందర్భంగా మిగిలిన కొన్ని గేమ్సు స్పోర్ట్సు పూర్తయ్యాయి. వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహింపబడ్డాయి.

విద్యార్థినీ విద్యార్థులు స్టాఫ్‌తో కలసి టీపార్టీ చేసుకున్నారు.

ఇక సాయంత్రం కార్యక్రమం ప్రారంభమైంది.

సమావేశంలో ప్రసంగించవలసిన వక్తలంతా విచ్చేశారు. ఆహూతులతోబాటు తర్వాత జరిగే సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు హాజరయ్యారు.

వాలంటీర్లు క్రమశిక్షణతో అందర్నీ గైడ్ చేస్తున్నారు.

కాలేజిలో విద్యార్థి సంఘాలెన్ని వున్నాయో అన్ని సంఘాల రాష్ట్రస్థాయి నాయకులు వేదిక నలంకరించి వున్నారు. పురప్రముఖులు కూడా వారితోబాటున్నారు. అధ్యక్ష స్థానంలో ప్రిన్సిపాల్‌గారు ఆసీనులయ్యారు.

బహిరంగ సమావేశం ప్రారంభమైంది.

ఉపన్యాసకులు ఒక్కొక్కరే మైకందుకొని వీరావేశంతో వూగిపోతూ పిడికిలి బిగించి గొంతు చించుకొంటున్నారు.

విద్యాలయాలనే ఫ్యాక్టరీలనుంచి నిరుద్యోగులు ఉత్పత్తి అవుతున్నారు అని ఒకరు ప్రసంగించగానే హర్షాతిరేకంతో చప్పట్లు వినిపించాయి.

అశాస్త్రీయ విద్యావిధానం రూపుమాపాలని ఒకరు విమర్శించగానే మళ్లీ కరతాళధ్వనులు.

హిట్లర్ వారసులైన పాలకుల రాక్షస పాదాలక్రింద నలిపివేయబడుతున్న పీడితుల గురించి ఒకరు చెప్పగానే వడగండ్ల వర్షం పడ్డట్టు చప్పట్లు, ఈలలు, ఆగకుండా అర్ధగంటసేపు వినిపించాయి.

ఇంకా దోపిడీ, దౌర్జన్యం గురించి వాటికి వ్యతిరేకంగా రాము జరుపుతున్న పోరాటాల గురించి. అంతా ఐకమత్యంతో మెలగవలసిన అవసరంగురించీ గొప్ప ఉద్రేకంతో ప్రసంగించి సభికులను ఉత్తేజపరిచారు. అయితే ఆచరణలో అవలంబించవలసిన వ్యూహాలను గురించి విభిన్న సంఘ ప్రతినిధుల స్వరాలు భిన్నంగా పలికాయి.

దాదాపు అంతా అయిపోయినట్టే. చివరగా ప్రకాశం మాస్టారు వేదిక మీదికి వచ్చాడు.

వారెందుకొచ్చారో అర్థంగాక ఒకరి ముఖాలొకరు చూసుకుంటున్నారు.

ఓ ఐదు నిమిషాలు మాట్లాడేందుకు తనను అనుమతించ వలసిందిగా కోరాడు ప్రకాశం మాస్టారు. అనుమతి లభించగానే మైకందుకున్నాడు.

అంతా నిశ్శబ్దంగా మాస్టారువేపు చూస్తున్నారు.

తనలో గుడుసుళ్ళు తిరుగుతున్న ఆవేదనను, ఆక్రోశాన్ని మాటల్లోకి అనువదించే ప్రయత్నం చేస్తున్నాడు మాస్టారు.

"ఎన్నో విషయాలను గొప్ప ఆవేశంతో వివరించారు ఇప్పటివరకూ మాట్లాడిన వక్తలు. వారి మాటల్లో నిజం లేదనే సాహసం నాకు లేదు. కానీ ఆవేశకావేశాలకు, కలుషిత రాజకీయాలకు అతీతంగా ప్రశాంతంగా ఆలోచించ వలసిందిగా అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. ఎలుకలున్నాయని యింటిని తగుల బెట్టుకొనే మనస్తత్వం విజ్ఞత అనిపించుకోదు. ప్రతి చిన్న విషయానికి ఆందోళన, ప్రతి చిన్న సంఘటనకూ రాజకీయం పులుముడు ప్రతి చిన్న సమస్యకూ రాజకీయ పరిష్కారం వాంఛనీయం కాదు? ప్రపంచానికి యుద్ధమొక్కటే ఆరోగ్యకరమైనదన్న వాదం ఎంతటి ప్రమాదకారో వ్యక్తి హింసావాదం కూడా అంతే ప్రమాదకారి అని నా ప్రగాఢ విశ్వాసం. అశాంతినుండి, నిరాశనుండి కసి ఉద్రేకం పెంచుకొని విధ్వంసనానికి పూనుకోడంకన్నా ఉన్మాదం మరొకటి లేదు. ప్రజాస్వామ్య విలువల్లో నమ్మకం లేని కొద్దిమంది సృష్టించే ఈ తీవ్రవాదం హింసను తప్ప దేన్ని ప్రోత్సహిస్తున్నది? విప్లవమంటే మారణాయుధాల వికటాట్టహాసమా? విప్లవమంటే మృత్యువు విలయతాండవమా? విప్లవమంటే రక్తతర్పణం కాదు. లోకాన్ని స్మశానంగా మార్చి ఏ విప్లవానికి పునాదులు వేస్తారు...? విద్యాలయాల్లో ఈనాడు ప్రచండంగా వీస్తున్న హత్యా రాజకీయాల్ని 'ఉద్యమం' అనీ 'పోరాటం' అనీ, భ్రమపడటంకన్నా వినాశకర ధోరణి మరొకటిలేదు. మనమంతా కలిసి చావడం కాదు. కలసి బతకడం నేర్చుకోవాలి. ఆచరణ సాధ్యంకాని

ఆదర్శాలకు అమాయకుల్ని బలిచెయ్యడం ఇకనుంచైనా ఆపడం మన కర్తవ్యంగా బాధ్యతగా మనమంతా గుర్తించాలి. జీవితాన్ని ద్వేషించే మరణాన్ని ప్రేమించే త్యాగం ఆహ్వానించదగింది కాదని మనమంతా తెలుసుకోవాలి. ఏ జెండాలకూ, వర్గాలకూ, మతాలకూ లొంగని స్వేచ్ఛా విద్యావిధానం కొనసాగిననాడు యీ విద్యాలయాలు నిస్సందేహంగా జ్ఞానపీఠాలుగా విలసిల్లుతాయి. రేపటి పౌరులారా! ఆలోచించండి...ప్రశాంతంగా ఆలోచించండి...మీ భవిష్యత్తు మీ చేతిలోనే వున్నది..." మాస్టారు వాగ్ధోరణి ప్రవాహంలా కొనసాగుతూనే వున్నది.

విద్యార్థుల్లో కలకలం.

రోగికి పథ్యంలా కొందరికి మాస్టారి మాటలు రుచించలేదు.

కొందరైతే ఆముదం రాగిన మొహాలు పెట్టారు.

'ఛీగు ఛీగు'

'సిగ్గు సిగ్గు'

కేకలు-పిల్లికూతలు-యీసడింపు మాటలు.

చిన్న చిన్న రాళ్ళు వేదికమీద పడటం ప్రారంభమైంది. అరవులు పెడ బొబ్బలు మొదలయ్యాయి. ఆగ్రహావేశాలు నినాదాల రూపంలో మార్మోగుతున్నాయి.

అంతటా తొక్కిసలాట - గందరగోళం - అయోమయం!

ఎవరో కావాలని ఫ్యూజు తీసివేశారు.

అంతవరకూ దేదీప్యమానంగా వున్న వెలుతురు స్థానంలో చీకటి కమ్ముకుంది.

ఈలలు, కేకలు, నినాదాలు దిక్కులు పిక్కటిల్ల జేస్తున్నాయి.

చూస్తుండగా కాలేజి దౌర్జన్యానికి, కసికి, ఉద్రేకానికి రంగస్థలమైంది.

ఎన్నాళ్ళనుండో మనసుల్లో గూడు కట్టుకున్న విద్వేషం ఆ చీకటిలో బుసలు కొట్టింది.

పట్టుకో...

పోనీయకు...

మళ్ళీ రాదు ఛాన్సు...వేసెయ్...

మారో సాలేకో...

మూల్గుల్ని, ఆక్రందనల్ని, ఆర్తనాదాల్ని మౌనంగా తన పొట్టన పెట్టుకుంటున్నది.

తల చిట్లి రక్తసిక్తమైన మాస్టారికి చీకటే ఆశ్రయమయింది.

20

మనిషి గాయాలు మాన్పేందుకు కాలంకంటే దివ్యౌషధం మరొకటి లేదు. కాని మనసులోని గాయాలు మనిషితోబాటు పోవలసిందే తప్ప మరొక మార్గం లేదు.

ప్రకాశం మాస్టారు కోలుకొని మామూలు మనిషయ్యాడు. కాని గుండెలో జ్ఞాపకాల రూపంలో గాయాలు సెలవేస్తూనే వున్నాయి...

కాలేజి చివరి ఘట్టానికి చేరుకున్నది.

సంవత్సరంపాటు పడ్డ శ్రమకు విలువకట్టే సమయం వచ్చింది.

పరీక్షలొచ్చాయి...

తెల్లవార్లూ లైట్లు వేసుకొని, కళ్ళు మంటలు మండుతున్నా, నిద్ర ముంచుకొస్తున్నా లెక్క చెయ్యకుండా - అరగంటకో టీ చొప్పున తాగుతూ పుస్తకాల్లో కూరుకుపోయి చదువుకునే రోజులు పోయాయి.

పరీక్షలంటే యిప్పుడు ఆందోళనగానీ, భయంగానీ పిసరంత శ్రద్ధగానీ ఏ కోశానా లేదు. అవేవో రొటీన్‌గా వచ్చే పండగల్లాగా - జాతరలాగా ఒక సందడిమాత్రం విద్యార్థి లోకమంతటా వ్యాపించింది.

టీషాపుల్లో, బడ్డీ కొట్లల్లో విద్యార్థులంతా గుంపులు గుంపులుగా చేరి వ్యూహరచన చేస్తున్నారు. ప్రశ్నపత్రాల వేట ప్రారంభమయింది. ఇదే అదనుగా నాలుగురాళ్ళు కూడబెట్టేవారి రహస్య వ్యాపారం జోరుగా సాగుతున్నది.

అవసరాన్నిబట్టి, డిమాండును బట్టి, సబ్జక్టును బట్టి ప్రశ్నపత్రాల ధర పెరిగిపోతున్నది. బంగారంలాంటి అవకాశాన్ని ఎవరు జారవిడుచుకుంటారు? రేయింబవళ్ళ పుస్తకాలతో కుస్తీపట్టి - బట్టీపట్టినా-ఏం ప్రశ్నలు వస్తాయోనన్న ఆందోళన తప్పదు. చచ్చీ చెడీ బట్టీపట్టినా అవే వస్తాయన్న గ్యారంటీ లేదాయె. ఈ బాదరబందీకంటే రెడీమేడ్‌గా ప్రశ్నపత్రాలు మార్కెట్టులో దొరుకుతుంటే వద్దనే మూర్ఖులెవరుంటారు?

సిన్సియర్‌గా కష్టపడి చదువుదాం అనుకునేవాళ్ళు కూడా తోటి విద్యార్థులను చూచి 'ఎందుకొచ్చిన శ్రమరా హాయిగా ప్రశ్నపత్రాలు కొనుక్కోక' అనుకుంటున్నారు,

ఇక యథాశక్తి కాపీలు కొట్టేందుకు ప్రిపరేషన్లు మొదలయ్యాయి. చిన్న చిన్న చిట్టిలతోబాటు-ఒంటిమీద, ప్యాంట్లమీద కూడా రాసుకొని పరీక్ష హాల్లో!



వెళుతున్నారు. చిట్టీలు దాచే స్థలాలు ఇన్విజిలేటర్‌కు కాదు కదా బ్రహ్మదేవుడికి కూడా తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు. చిన్న చిన్న చిట్టీలతో సంతృప్తి పడనివారు పుస్తకాలకు పుస్తకాలే - గైళ్ళకు గైళ్ళే తెచ్చుకుంటున్నారు.

ఇన్విజిలేటర్లు పేపర్లు పంచడమే తరువాయి-చెప్పుల్లోంచి, బెల్టు చాటునుంచి బనియన్ల లోపల్నుంచి, దొంగ జేబుల్లోంచి-ఇంకా చెప్పుకోలేని రహస్య స్థలాల నుంచి చిట్టీలు బయటికొచ్చాయి. చకచకా కలాలు కాగితాలమీద నాట్యం చేస్తున్నాయి. కొత్త కొత్త పద్ధతుల్లో, చిత్ర విచిత్రమైన రీతుల్లో ముమ్మరంగా కాపీలు జరుగుతున్నాయి.

ఇంత జరుగుతున్నా ఇదేమిటని ప్రశ్నించిన నాధుడు లేడు. ఎవరిమట్టుకు వారు తమకెందుకు లెమ్మని నిమ్మకు నీరెత్తినట్టు చూస్తూ కూడా చూడనట్టు నటిస్తున్నారు ఇన్విజిలేటర్లు. ఎందుకొచ్చిన తంటా అని తప్పుకుంటున్నారు. అనవసరంగా సమస్యల వలయంలో చిక్కుకోవడమెందుకని ఉదాసీనంగా వుంటున్నారు.

నాలుగైదు పరీక్షలు నిర్విఘ్నంగా కొనసాగాయి.

విద్యార్థులు మరీ విజృంభించారు.

ఇదంతా గమనిస్తున్న ప్రకాశం మాస్టారు ఇక సహించలేకపోయాడు. ఇట్లా ఉదాసీనత్వం వహించడంకన్నా ఆత్మవంచన చేసుకోవడంకన్నా తమ కర్తవ్యం తాము నిర్వహించి రాబోయే ఎంతటి ప్రమాదాన్నైనా ఎదుర్కోవడమే న్యాయం అని భావించాడు.

తోటి అధ్యాపకులంతా స్టాఫ్ రూంలో వున్నారు.

"మనమంతా ఇట్లా చూస్తూ వూర్కుండే పరిస్థితి ఎంత అధ్వాన్నంగా వుంటుందో ఆలోచించండి..." అన్నాడు వారితో.

"చూస్తూ వూర్కోక ఏం చెయ్యమంటారండీ? స్టూడెంట్సుతో తలపడి తిట్లూ తన్నులూ తినమంటారా?" అన్నాడొక అధ్యాపకుడు.

"అట్లా అని వాళ్ళకు భయపడి మన విద్యుక్తధర్మం మరచిపోతామా!" అన్నాడు ప్రకాశం మాస్టారు.

"మరచిపోక ఎవర్ని ఉద్ధరించాలని? రేపేదన్నా జరిగితే మనల్ని ఎవడు ఆదుకుంటాడు?" అన్నాడు ఇంకొక మాస్టారు.

"ఆదుకోకపోగా వాళ్ళ వెనక వున్న రాజకీయ నాయకులు మనల్ని శంకరగిరి మాన్యాలు పట్టిస్తారు..." మరొకరి హెచ్చరిక.

ప్రకాశం మాస్టారు ఇక వాళ్ళతో వాదించి ప్రయోజనం లేదని గ్రహించాడు.

మౌనంగా పేపర్లందుకొని పరీక్ష హాల్లోకి వెళ్ళాడు.

అంతవరకూ గందరగోళంగా-సినిమాహాల్లా వున్న హాలు మాస్టారిని చూడగానే నిశ్శబ్దమైపోయింది. నెమ్మదిగా గుసగుసలు ప్రారంభమయ్యాయి. కొందరు విద్యార్థులకు దడ ప్రారంభమైంది. 'ఈ తలతిక్క మాస్టారొచ్చారేంరా మన హాలుకు' అనుకుంటున్నారు విద్యార్థులు.

ఆన్సరు స్క్రిప్టులు అందరికీ పంచాడు మాస్టారు. ఓసారి హాలంతా కలయ జూచి "మీ దగ్గరున్న పుస్తకాలు, నోట్సు తీసి బయట పడేయండి. చిట్టీలుగానీ ఎట్లాంటి కాగితాలుగానీ వున్నా బయట పారేయండి." అన్నాడు గంభీరంగా.

జవాబుగా ఓ మూలనుంచి కిసుక్కున నవ్వు వినిపించింది.

ప్రశ్నపత్రాలు యిచ్చాడు మాస్టారు.

ఓ ఐదు నిమిషాలసేపు సద్దుమణిగింది. ఏ క్షణాన కాపీలు మొదలెడదామా అని ఎదురు చూస్తున్నారంతా. మాస్టారు వేయి కళ్ళతో అందర్నీ గమనిస్తున్నాడు. విద్యార్థులు మాస్టారి కదలికల్ని గమనిస్తున్నారు.

చీమ చిటుక్కుమన్నా వినిపించేంత నిశ్శబ్దం అలుముకుంది హాల్లో.

నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ ధన్ మన్న శబ్దం వినిపించింది.

అంతా అటుకేసి చూచి కొయ్యబారిపోయారు.

రెడ్డి చొక్కాజేబులోంచి బటన్‌చాకు తీసి ముందున్న బల్ల*చెక్క సందులో బలంగా గుచ్చాడు. తననే గమనిస్తున్న మాస్టారివేపు ఓసారి నిర్లక్ష్యంగా చూసి కాలర్ సర్దుకొని బాహాటంగానే పుస్తకాలు తీసి బల్లమీద పెట్టాడు.

రెడ్డి ప్రవర్తనకు తనలో తాను నవ్వుకున్నాడు మాస్టారు.

మిగతా విద్యార్థులు కూడా ధైర్యం కూడగట్టుకొని సరంజామా మొత్తం బయటికి తీస్తున్నారు.

ఓ రెండు నిమిషాలు గడిచాయి.

"లుక్ హియర్...భయపెట్టి - దౌర్జన్యంగా పరీక్షలు రాసి అట్లా పాసై ఏం చేద్దామని..." అన్నాడు మాస్టారు.

మాస్టారి మాటలు వినే స్థితిలో ఒక్కడూ లేడు. అంతా పులివిస్తరి మీదికి ఎగబడ్డ కుక్కల్లా గబగబా రాసేస్తున్నారు.

"ఏది మంచో ఏది చెడో ఆలోచించే అవసరం కానీ వ్యవధికానీ మీకు లేదు. ఆల్‌రైట్...మరొకసారి హెచ్చరిస్తున్నా...కాపీలుకొట్టి పాస్ కావడం కంటె మిమ్మల్ని మీరు వంచించుకోవడం మరొకటి లేదు. దయచేసి ఆ పుస్తకాలు, నోట్స్...చీటీలు బయట పారేయండి..."

ఒక్కడూ వంచిన తల యెత్తలేదు.

ఇక లాభం లేదని గ్రహించాడు మాస్టారు.

రెడ్డి దగ్గరకు వెళ్ళి "స్టాండప్. ఆ ఆన్సర్ పేపర్ యిలా యివ్వు." అని గద్దించాడు.

"బతకాలని లేదా మాస్టారూ?" నిర్లక్ష్యంగా మాస్టారిని చూస్తూ అన్నాడు రెడ్డి.

"అవును. మీరు కాపీలు కొడుతుంటే నిస్సహాయంగా చూస్తూ బతకాలని లేదు. తే యిలా..." కోపం నిగ్రహించుకుంటూ అన్నాడు మాస్టారు.

విద్యార్థులంతా వూపిరి బిగపట్టి ఆ దృశ్యాన్ని చూస్తున్నారు. రెడ్డి సంగతి బాగా తెలిసినవాళ్ళు కాబట్టి ఏం జరగకూడనిది జరుగుతుందోనని భయపడుతున్నారు.

మంత్రులనే కొనగల డబ్బు ప్రభుత్వాలనే మార్చగల పలుకుబడి మనుషుల్ని పిట్టల్లా కాల్చి చంపగల రాక్షసత్వం వున్న కుటుంబంనుంచి వచ్చిన వాడు రెడ్డి. మాస్టారు రెడ్డితో తలపడ్డమంటే మృత్యువుతో తలపడ్డమన్న మాటేనని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

"యివ్వకపోతే...?" తలబిరుసు సమాధానం.

"నేనే తీసుకుంటాను" మాస్టారు.

"కాగితంమీద చెయ్యిపడ్డ మరుక్షణం మీ గుండెల్లో కత్తి కసుక్కున దిగుతుంది"

"షటప్! డోంటాక్ నాన్సెన్స్...ఐ సే గెటౌట్ ఫస్ట్" ఆన్సర్ షీటు లాక్కుంటూ గర్జించాడు మాస్టారు.

రెడ్డి రెండో చివర పట్టుకొని లాగడంతో పేపర్ మధ్యకు చినిగిపోయింది.

"కమాన్—నాలో రా—నిన్ను బుక్ చెయ్యాలి—" ఆవేశాన్ని అదుపు చేసుకుంటూ అన్నాడు మాస్టారు.

"బుక్ చేస్తావా...? నన్ను బయటకు పంపడం కాదు...నిన్నే పంపుతున్నాను చూసుకో యమలోకానికి..." ఉద్రేకంతో పళ్ళు పటపట కొరు

వెంటాడే నీడలు

శ్రీ కలువకొలను సదానంద

వెంటాడే నీడల్లారా !
మిన్నంటే కోరికలారా !
మీ పిచ్చి ఊహల కోసం !
మనిషిని వేధిస్తారా ?
మనిషిని బాధిస్తారా ?
మాయ మర్మ మెరుగని హృదయం
మధురమైన అమృతకలశం
పదిమందీ పంచుకుంటే
పదికాలాలుంటుంది,
ఒకడు స్వార్థపరుడైతే
పగిలి ముక్కలవుతుంది
బ్రతుకే ఒక క్రీడారంగం ;
భయమెందుకు విజయం కోసం ?
జయమైనా అపజయమైనా
స్వీకరించు చిరునవ్వుతో !
ఎదుటివారి గుండెలు తుంచి
బంతులాట లాడెదవేల ?
నాటకమే జీవితమంటూ
మాటలు వల్లించే బొమ్మా !
జీవితమే నాటకమైతే
చేసేదేమున్నది బ్రహ్మా ?
వేషంతో రాజువు కాలేవ్,
ఆశలన్నీ రాణులు కాలేవ్ !
కడలి విడిచి అలలుండవనీ,
కష్టాలకు బ్రతుకు నెలవనీ
తెలుసుకుంటె చీకటిలేదు,
శాంతి నీకు దూరంకాదు

నీకేదో కరువైనందుకు
లోకాన్నే మసి చేస్తావా ?
ఏదో ఒక ముల్లు దిగిందని
నీ దారిని నిందిస్తావా ?
జో కొట్టే చెట్ల నీడలే
బాటలోన లేవంటావా ?
ఒయాసిస్సు నీ ముందు నిలిస్తే
ఎండమావులని పొరబడకోయీ

పదవులపై నిషా పెంచుకొని
ప్రజల కాళ్ళు పడుతుంటారు,
పల్లకాటి కొస్తే కూడా
నాయకులం మేమంటారు
రచ్చకీడ్చి రగడలు పెంచి
ఉచ్చులు తగిలిస్తారు
బెదిరించే తిమిరావళిలో
చిరుదీపం లేనే లేదా ?
వెంటాడే నీడల వ్యూహం
విడిపోయే మార్గం లేదా ?
దేవుడైన దిగిరారాదా ?
మనిషి దేవుడై పోరాదా ?...

కుడుంటూ మాస్టారి గుండెల్లో కత్తితో బలంగా పొడిచాడు రెడ్డి.

మాస్టారి గుండెల్లోంచి చివ్వున రక్తం చిమ్మింది. ధారగా కారుతున్న రక్తం మడుగు కట్టింది. రక్తం మడుగులో మాస్టారు విలవిల తన్నుకుంటున్నాడు.

విద్యార్థులంతా భయకంపితులై పజపజ వణికిపోతూ మాస్టారి చుట్టూ గుమిగూడారు.

చూస్తుండగా మాస్టారి ముఖం విపన్నమైంది. మిడిగుడ్లు పడుతున్నాయి. అతి కష్టంమీద శ్వాస తీసుకుంటున్నాడు. మృత్యువుతో సాగిస్తున్న ఆ పోరాటం భయంకరంగా వుంది.

క్షణాల్లో ప్రిన్సిపాల్, మిగిలిన అధ్యాపకులూ పరుగెత్తుకొని వచ్చారు.

ఏం చెయ్యాలో ఎవరికీ తోచడం లేదు.

మూతలు పడుతున్న కళ్ళను బలవంతంగా తెరచి అందరివేపు చూశాడు ప్రకాశం మాస్టారు.

ఏదో చెప్పాలని పెదవులు కదిలిస్తున్నాడు.

అతనిలో ఏవో సముద్రాలు ఘూర్ణిల్లుతున్నాయి...ఏవో అగ్నిపర్వతాలు రగులుతున్నాయి...


ఎండిపోయిన మాస్టారి గొంతులోంచి పెల్లగించుకొని వస్తున్నాయి మాటలు...

"నా ప్రియమైన విద్యార్థులారా-! వ్యక్తిగతంగా మనకెవరిమీదా ద్వేషం-పగ వుండనక్కర్లేదు. మన అవిశ్రాంత పోరాటం వ్యక్తులతో కాదు, అజ్ఞానంతో-మూర్ఖత్వంతో-దారిద్ర్యంతో-మూఢ విశ్వాసాలతో. కులాల పేరిట, మతాల పేరిట రాజకీయాల పేరిట గావింపబడుతున్న మారణహోమంలో అమాయక విద్యార్థులు సమిధలు కాకూడదన్నదే నా ఆరాటం. జ్ఞానపీఠాలుగా విలసిల్లవలసిన యీ విద్యాలయాల్లో క్రూరంగా కొనసాగుతున్న యీ రక్తతర్పణం ఆగాలన్నదే నా ఆకాంక్ష. తరంనుండి తరానికి నిరంతరం ప్రవహిస్తున్న యీ జాతి రక్తం ఏ ఉద్రేకపు మంటలకూ ఇంధనం కాకూడదన్నదే నా ఆవేదన—ఈ ఆశయంకోసం నేను మొదటి బలిదానం అవుతున్నందుకు గర్విస్తున్నాను. నా రక్తాన్ని తిలకంగా దిద్దుకొని ప్రమాణం చెయ్యండి బాబూ ఈ ఆశయం కోసం అహర్నిశలూ పాటు పడతామని ప్రతిజ్ఞ చెయ్యండి బాబూ-" మాస్టారి గొంతులోంచి యిక మాటలు రాలేదు. మాస్టారి కళ్ళు అందరినీ ఏదో అర్థిస్తున్నట్టే, అందరినీ ఏదో ఆదేశిస్తున్నట్టే చూస్తున్నాయి.

(అయిపోయింది)


చిల్లరోయ్ చిల్లర......

ఛాయాశిల్ప



బెణుకుల బాధతో
తన గొప్ప రోజు
పాడవడం దేనికి?





నయం చేసే శక్తి మీ చేతుల్లోనే ఉంది.

మీ చేతుల వెచ్చని సౌమ్యమైన స్పర్శ, అయొడెక్స్‌లో గల నయం చేసే శక్తి — ఇవే తనకి కావలసినవి. అందుకే అయొడెక్స్‌ను అందుబాటులో ఉంచుకోండి. ఎందుకంటే అయొడెక్స్‌లో, గాయపడిన ధాతువులను నయం చేసే అయొడిన్, నొప్పిని తగ్గించే మిథైల్ శాలిసిలేట్ చేరి ఉన్నాయి.

అయొడెక్స్ రోజుకు రెండుసార్లు రెండింతలు గుణకారి.

నొప్పి తగ్గేవరకూ, ఆ తర్వాత రెండు రోజుల వరకూనూ రోజుకు రెండుసార్లు అయొడెక్స్ వాడమని సిఫారసు చేస్తున్నారు డాక్టర్లు. ఎందుకంటే, నొప్పి ఒక లక్షణం మాత్రమే కాగా అసలు సమస్య లోపలి ధాతువుకైన గాయం.

కనుక మీ ఆప్తులు ఎవరైనా బెణుకులు, కండరాల పట్లు, కీళ్ల పట్లు, ఒళ్లునొప్పులతో బాధ పడటం జరిగితే అయొడెక్స్ మర్దించండి. రోజుకు రెండుసార్లు. తమని రెండింతలు శీఘ్రంగా మళ్లీ చురుకుగా చేసినందుకు వారు మీకు ఋణపడి ఉంటారు.

అయొడెక్స్® — నయం చేసే శక్తిగల నమ్మకమైన బామ్.


SKOF — ఎస్‌కేఎఫ్ ఉత్పాదన.

ELL-1509

కన్నడ మూలం: డా. ఎం. చిదానందమూర్తి

ఆంధ్రానువాదం : డా. జి. ఎస్. మోహన్

కరీంనగర్ జిల్లాలోని పంపమహాకవి సోదరుని జినవల్లభుడి శాసనం: మరికొన్ని పరిశోధనాంశాలు



బొమ్మలగుట్ట మధ్య పెద్ద బండ మీద విగ్రహాలు, శాసనం ఉన్నాయి.

1968 లో డా. ఎన్. వేంకటరమణయ్యగారి 'జినవల్లభుని గంగాధర శాసనం (అనువాదం : శ్రీ సీతారామజాగిరదార్) అనే వ్యాసం ప్రకటింపబడి నప్పటినుంచీ[1], ఆ శాసనం ప్రత్యేకంగా కన్నడంలో (కొంతవరకు తెలుగులో, విశేషంగా భారతిలో) చాలావరకు చర్చకు లోనయింది. ఆ చర్చల మొత్తం సారాంశాన్ని ఇక్కడ వ్రాయడం కంటే, కొన్ని అంశాలనూ, వాటి పూర్వ రంగంలో నేను చేసిన పరిశోధనలను ఇక్కడ ఉట్టంకిస్తాను. (శాసనం కరీంనగర్ జిల్లా కేంద్రమైన కరీంనగర్‌కు దాదాపు 20 కి.మీ. దూరంలోని కుర్క్యాల గ్రామసమీపంలోని 'బొమ్మలమ్మ గుట్ట'లో ఉందన్న విషయాన్ని శాసనాధ్యయన విద్వాంసులందరూ ఎరుగుదురు)

"బొమ్మలమ్మ గుట్ట"

శాసనాన్ని మొట్టమొదట ప్రకటించిన డా. వెంకటరమణయ్యగారు శాసనాన్ని 'గంగాధరపు శాసనం' అని పిలిచారు. దానికి కారణం, వారి ప్రకారం శాసనంలో ఉన్న 'బొమ్మలగుట్ట' 'గంగాధర' అనే గ్రామపొలిమేరలో ఉండడమే అయితే మొదట 1968 లో కుర్క్యాల గ్రామాన్ని సందర్శించి అదే శాసనపు పరిష్కృత పాఠాన్ని ప్రకటించిన డా: జి. ఎస్: గాయిగారు[2] గుట్టపేరు 'బొమ్మలమ్మ గుట్ట' అని సరిగ్గా గుర్తించడమే కాకుండా, ఆ గుట్ట కురిక్యాల గ్రామ పొలిమేరలో ఉండడంవల్ల శాసనాన్ని 'కురిక్యాల శాసనం' అని పిలవాలని సకారణంగా సూచించారు. డా. గాయి తర్వాత 1970 లో కురిక్యాల గ్రామానికి వెళ్ళిన డా. కల్బుర్గిగారు శాసనాన్ని 'గంగాధరం శాసనం' అని పిలువడమే కాకుండా, పల్లీయుల నోటినుంచి ఉచ్చరింపబడుతున్న గుట్టపేరును సరిగ్గా గమనించక పోవడంవల్ల "బొమ్మల గుట్ట" అనియే దాన్ని తమ ఒక వ్యాసంలో పేర్కొన్నారు[3]. ఇటీవల (ఫిబ్రవరి 1985) నేను అదే ఊరిని సందర్శించి గ్రామస్థులంతా ఆ గుట్టను 'బొమ్మలమ్మ గుట్ట' అనియే పిలుస్తుండడాన్ని (= బొమ్మల అమ్మ యొక్క గుట్ట) గమనించాను. ఆ గుట్టను 'బొమ్మలమ్మ గుట్ట' అనే వ్యవహరించాలన్న విషయాన్ని మళ్ళీ ఒత్తి చెప్పాల్సిన పని లేదు. (చూడు చిత్రం - 1)

"గంగధారా"

బొమ్మలమ్మగుట్ట పశ్చిమదిశకు (సరిగ్గా చెప్పాలంటే వాయవ్యదిశకు సుమారు రెండుమైళ్ళ దూరంలోని జనుల గ్రామనామోచ్చారణను ఎవరూ గమనించినట్టు తోచదు. అది అందరూ అనుకొన్నట్లు "గంగాధర" కాదు, "గంగధార్", "గంగధార" లేదా "గంగధార్" అనే ఉచ్చారణ అతి ముఖ్యమైన విషయం. ఎందుకంటే, పదవ శతాబ్దపు సోమదేవుడు తన యశస్తిలక చంపూ

కావ్యాన్ని క్రీ.శ. 959 లో "గంగధారా" లో వ్రాశానని చెప్పుకొన్నాడు.[5] [శ్రీ కృష్ణరాజదేవే సతి తత్పాద పద్మోప జీవినః...చాలుక్య జన్మనః సామంత చూడామణేః శ్రీమదరికేసరిణః ప్రథమపుత్రస్య శ్రీ మద్వాగ రాజ ప్రవర్ధమాన వసుధారాయాం గంగధారాయాం వినిర్మితమితి కావ్యమితి"]. ఆ "గంగధారా" గ్రామమే నేటి "గంగధార్"— వేయి సంవత్సరాలైనా మూల ఉచ్చారణని ప్రజలు నిలుపుకొంటూ వచ్చారు. ఆ ఊరి పొలాల్లో సోమదేవుడు తన కావ్యాన్ని వ్రాసిన జైన దేవాలయపు అవశేషాలున్నట్లు కన్పిస్తుంది. [చూడు – ప్రబుద్ధ కర్నాటక; 50:8; పు. 82] నా ఇటీవలి సందర్శనలో చాల బడలికవల్ల ఆ గ్రామానికి వెళ్ళలేకపోయాను.

"ధర్మపుర"

పంపడు విక్రమార్జున విజయాన్ని వ్రాసినందుకుగాను తనకు అరికేసరి 'ధర్మపుర' అనే అగ్రహారాన్ని దానంగా ఇచ్చినట్టు తన కావ్యంలో చెప్పుకోవడమే కాకుండా, కురిక్యాల శాసనం కూడా ఈ విషయాన్నే చెప్తుంది [శాసనం ధర్మపురాన్ని "ద్విజావసథ గ్రామం" లేదా బ్రాహ్మణుల గ్రామం అనీ ప్రక్కనున్న గుట్టను "ద్విజావసథ పర్వతం" లేదా అగ్రహారపు గుట్ట అనీ పిలిచియుండడాన్ని గమనించండి]

ఈ "ధర్మపుర" ఏదిః అది ఎక్కడ వుండిందిః ఈ విషయం గురించి డా. వేంకటరమణయ్యగారు ఇలా చెప్పారు—

"......మొట్టమొదట ధర్మపురాన్ని గుర్తించకుండా ఈ వృషభాద్రిని గుర్తించడం సాధ్యం కాదు.[6] సబ్బినాడుకు సరిపోయే కరీంనగర్ జిల్లాలోని ధర్మపురం ఒకటికాదు. ఇది ఈ కరీంనగర్‌కు ఉత్తరదిశలో 40 మైళ్ళకు దూరంగా గోదావరీ దక్షిణ తీరంలో ఉండి. నేటికీ ఇక్కడ బ్రాహ్మణుల ఆధిక్యం ఉంది; యాత్రాస్థలంగా ఉంది. ధర్మపుర వాసుడైన శ్రీ లక్ష్మీనరసింహస్వామిని సేవించడానికి పరిసర ప్రదేశాలలోనివారు వస్తుంటారు. శాసనంలో చెప్పబడ్డ ధర్మపురం ఇదే అయి ఉండవచ్చు. "విక్రమార్జున విజయం" రచనకు మెచ్చి అరికేసరి పంపనికి ఇచ్చిన అగ్రహారం ఇదే అయి ఉండవచ్చు. అప్పుడు ఈ అనాది సంసిద్ధ తీర్థమైన వృషభాద్రి కూడ ఈ ధర్మపురానికి ఉత్తరదిశలో ఉన్న గోదావరీ ఉత్తర తీరంలో వున్న ఆదిలాబాదు జిల్లా కొండలలో ఉండి ఉండవొచ్చు. అప్పుడొక ఆక్షేపణ సహజంగానే ఏర్పడుతుంది. అదేమిటంటే, శాసనంలో చెప్పబడ్డ ధర్మపురం సబ్బినాడు మధ్య ఉండింది కదా అని. పైన చెప్పిన గోదావరీ తీరపు ధర్మపురమూ ఈ ధర్మపురమూ ఒకటే అయివుండి, అది ఆ కాలంలో సబ్బినాడు లోపల ఉండి ఉండవచ్చు. అయితే గోదావరి ఉత్తర పార్శ్వానికీ సబ్బినాడు వ్యాపించి ఉండిందని చెప్పేటటువంటి శాసనాధారాలు ఇప్పటిదాకా ఒకటీ బయటపడలేదు. అందువల్ల గోదావరీ తీరపు ధర్మపురం మరియు ఈ శాసనోక్త ధర్మపురాలను ఒకటే అని చెప్పడానికి జంకవలసి వస్తుంది. ఇంకా విశేషమేమిటంటే ఈ కరీంనగర్ జిల్లాలో ఒకటికాదు అనేకం ధర్మపురమనే గ్రామాలున్నాయి. "ధర్మార" అనేది ధర్మపురానికి నేడు రూపాంతరమైన నేడు రూఢిలో ఉన్న పేరు.

ధర్మపుర → ధర్మపుర → ధర్మవర → ధర్మార అయింది.

ఒక ధర్మారం వేములవాడకు పశ్చిమంలో పదిమైళ్ళ దూరంలో ఉన్న 'సిరసిల్లా'కు 15 మైళ్ళ వ్యత్యాసంలో పశ్చిమోత్తర దిశలో ఉంది. మరొకటి 'మంథని'కి 15 మైళ్ళ దక్షిణంలో ఉంది; ఇంకొకటి 'ఓరుగల్లు'కు పశ్చిమంలో 20 మైళ్ళ దూరంలో ఉంది. ఇవన్నీ సబ్బినాడులో వున్నాయి. అందువల్ల ప్రస్తుత శాసనోక్త ధర్మపురం వీటిలో ఏదో ఒకటి అయి ఉండాలి. భావి పరిశోధనలో సత్యం బయటపడాల్సి వుంది".[7]

వారి ప్రకారం ధర్మపురాన్ని వారు గుర్తించలేకపోయారు. 1968 లో బొమ్మలమ్మ గుట్టను సందర్శించిన డా. జి. ఎస్. గాయిగారు 'ధర్మపురం' గురించి ఈ క్రింది విధంగా పేర్కొన్నారు.


"...ఈ వృషభగిరి పంపడు దానంగా స్వీకరించిన ధర్మపురం లేదా ధర్మవరపు ఉత్తరదిశలో ఉందని శాసనంలో చెప్పబడి ఉండడంవల్ల ధర్మపురం వృషభాద్రికి దక్షిణ దిశలో ఉండిందనడం స్పష్టం. మరియు ఈ ధర్మపురానికి వెళ్తే అక్కడినుంచి క్షీరాభిషేకం వల్ల మునిగిన వృషభపర్వతాన్ని చూడవచ్చని శాసనపు సంస్కృత శ్లోకంలో చెప్పబడి ఉండడంవల్ల ధర్మపురం ఆ గుట్ట దక్షిణ భాగంలో అతి సమీపంలోనే ఉండిందని తెలుస్తుంది. అంటే ధర్మపురంలో నిలబడితే బండరాయి మీదున్న చక్రేశ్వరి మరియు జైన బింబాలను పూజించడాన్ని చూడవచ్చునయి ఉండేది. వృషభాద్రి లేదా నేటి బొమ్మలమ్మ గుట్ట అనే దక్షిణానికి ఇంత సమీపంలో నేటి ధర్మపుర లేదా ధర్మవుర అనే పేర్తో గ్రామం ఉండి ఉండదు. అయితే నేటి కురిక్యాల అనే గ్రామం శాసనంలోని ధర్మపుర గ్రామ వర్ణనకు సరిపోతుంది. పైన చెప్పిన ప్రకారంగా కురిక్యాల గ్రామం బొమ్మలమ్మగుట్ట దక్షిణ దిశకు 5-6 ఫర్లాంగుల దూరంలో ఉంది. అందువల్ల నేటి కురిక్యాల గ్రామం మరియు దానితోబాటు ఉన్న నేలకొండపల్లి మరియు కొండనపల్లి అనే ఉపగ్రామాలు చేరి శాసనంలో చెప్పబడ్డ ధర్మపుర లేదా ధర్మవుర అయి ఉంటాయని మాకనిపిస్తుంది. కరీంనగర్ జిల్లాలోని ధర్మపురం, ధర్మార మొదలైన గ్రామాలు శాసనంలో వర్ణింపబడ్డ ధర్మపురానికి సరిపోక పోవడంవల్ల అవి పంపడు స్వీకరించిన ధర్మపురం కాదని చెప్పవచ్చు. డా. వేంకటరమణయ్యగారు తమ వ్యాసంలో శాసనంలో చెప్పబడ్డ వృషభాద్రిని గుర్తించడం సాధ్యం కాదని చెప్పి, దాన్ని మరియు ధర్మపురాన్ని గుర్తించే విషయంలో చేసిన వివరమైన చర్చ సరిగా లేదని మా అభిప్రాయం."[8]

డా. గాయిగారి చివరి వాక్యం విశ్వసనీయంగా ఉంది. అయితే నిజానికి ధర్మపురం ఒక అగ్రహారం అయి ఉండినందువల్ల, అది నేటి కుర్క్యాల, నేలకొండపల్లి, కొండనపల్లి అనే గ్రామాల సంకీర్ణమని భావించడం సరికాదు. ఈ గ్రామాలు పరస్పరం ఒక్కొక్క మైలు దూరంలో ఉన్నాయి. మరియు ఆ మొత్తం గ్రామాలు నేటి ఒక నగరం అంత పెద్దదవుతాయి. "నేటి కుర్క్యాల అనే గ్రామం శాసనంలోని ధర్మపుర గ్రామ వర్ణనకి సరిపోతుంది" అని డా. గాయిగారు చెప్పివున్నారు. అయినా వారు ప్రాచీన స్మారక లేదా అవశేషాల దృష్టితో ఆ గ్రామాన్ని పరిశీలించినట్లు అగుపించదు.

1970లో కురిక్యాలను సందర్శించిన డా. ఎం. ఎం. కల్బుర్గిగారు తమ ప్రవాస కథన రూపంలోనున్న వ్యాసంలో[9] ఇలా చెప్పారు.

"గుట్టకు దక్షిణానికి ఒక మైలు దూరంలో కుర్క్యాల్ అనే గ్రామం ఉంది. ఇదే ప్రాచీన ధర్మపురి అయి ఉండవచ్చునాః అని గ్రామమంతా తిరిగాము. అక్కడ ప్రాచీన అవశేషాల ఒక ముక్క కూడా కనబడని కారణంగా అది ఇటీవల ఉద్భవించిన గ్రామమని నిశ్చయమైంది. ఊరి ప్రజలని విచారిస్తే గుట్ట ప్రక్కలో దక్షిణానికి త్రవ్వితే ఇప్పటికీ ఒక గ్రామం వున్న అవశేషాలు లభిస్తాయని తెలియవచ్చింది. గుట్టకు సమీపంలో చెరువు వుంది. చెరువు సమీపంలో గ్రామం ఉండడం సహజం. అందువల్ల గుట్ట దక్షిణానికి అనుకొన్న ధర్మపురము ఇప్పుడు భూగతమై ఉంటుందనిపించింది. అక్కడ భూపరిశోధనా కార్యం జరిగితే ధర్మపురం తెలియవస్తుందని అనుకొంటూ ఐదుగంటలకు కారు ఎక్కాము. కారు వేములవాడవైపు సాగింది."

డా. కల్బుర్గి గ్రామస్థుల నోటినుండి వచ్చిన సూచనను అనుసరించి, మళ్ళీ వెనక్కి కేవలం ఒక కిలోమీటరు దూరంలో ఉన్న నివేశ స్థలానికి వెళ్ళక బొమ్మలమ్మ గుట్ట దక్షిణపు సమతల ప్రదేశంలో ధర్మపురం ఉండొచ్చునని ఊహించుకొని, అలాగే వెనుదిరిగి రావడంవల్ల ఒక మంచి పరిశోధనావకాశాన్ని పోగొట్టుకున్నారు. వారు ఊహించిన నివేశమే ధర్మపురం అనడంలో సందేహం లేదు. (ముందు చూడండి). పరిశోధనలో ఓర్పు, ఉద్దేశం, ప్రత్యక్ష పరిశీలనా శక్తి లేనట్లయితే అనాహుతాలయ్యే సంభవం వుంటుంది. గ్రామ ప్రజలు చెప్పింది సత్యమాః అక్కడ భూమిమీద ఏవైనా అవశేషాలు లభిస్తాయిః[10] ఆ అవశేషాల




'ధర్మపుర' నివేశం - గుట్టపైనుండి కన్పించే దృశ్యం

కాలం ఏది ఇత్యాది సందేహాలను ఏర్పరచుకొని వారు ఆ నివేశాన్ని పరిశీలించి ఉంటే వారు దాన్ని ఖచ్చితంగా గుర్తించవచ్చునయి ఉండేది. గ్రామప్రజలు చెప్పిన విషయాలు మరికొంత ఎక్కువ పరిశోధనకు ఒక సూచన(క్లూ) కావచ్చునే కాని ఒక నిర్ణయానికి రావడానికి సాక్ష్యాధారం కాదు(ఎవిడెన్స్). త్రవ్వితే బంగారం దొరుకుతుందన్న పల్లీయుల మాటను ఊరకే వినివచ్చిన భూగర్భ పరిశోధకుల వ్రాతకు ఎంత విలువ ఉంటుందో, అంతే పైన చెప్పిన మాటలకు విలువ ఉంది. అక్కడ బంగారం దొరకవచ్చు. కాకి బంగారం దొరకవచ్చు. గ్రామస్థులు దొరుకుతాయని చెప్పిన అవశేషాలు, రెండు మూడు సంవత్సరాల వెనుకటివయి వుంటే, అప్పుడు: డా. కల్బుర్గిగారి ఊహాలు మహా అంటే ధర్మపురపు పరిశోధనలో ప్రమేయ (ఒక ఆధారరహితమైన అభ్యూహ) (హయిపోతెసిస్) మట్టంలో నిలుస్తాయి. ("భూగతమయి ఉంటుందనిపించింది"; "తెల్వియవచ్చు" అని సందేహాస్పదంతో కూడిన మాటలు వారి వ్రాతల్లో గమనించండి. కురిక్యాల ఇటీవలి గ్రామం అనే విషయం వారికి "నిశ్చయ" మయింది; ధర్మపుర నివేశం గురించి ఇంకా సందేహం ఉంది). హయిపోతెసిస్ ఒక సమస్యకు ఉన్న సాధ్యమైన సమాధానాలలో ఒకటే కాని, సమాధానం కాదు. అధిక ప్రామాణిక ఆధారాలనుంచి అది పోష్యమైనప్పుడు మాత్రమే అది నిర్ణయమనిపించుకొంటుందని పరిశోధకులకు తెలుసు.

ధర్మపుర నివేశాన్ని (చూడు చిత్రం-2) గుర్తించే ప్రధానోద్దేశంతో బొమ్మలమ్మ గుట్టకు నేను వెళ్ళడానికి (4-5.2.1985) ముందే ఆ గ్రామం ఆ గుట్ట దక్షిణానికి అనతి దూరంలో ఉండి ఉంటుందనీ, ఆ ప్రదేశంలో కనీసం రెండు చెరువులు ఉండి ఉంటాయనీ (ముందు చూడండి), మరియు ఆ చెరువుల క్రింది జమీను బ్రాహ్మణుల మాన్యపు భూములయి ఉంటాయనీ ఊహించుకొని ఉంటిని[11] బొమ్మలమ్మ గుట్ట దక్షిణ సమతల ప్రదేశంలో మొదట మాకు అధిక సంఖ్యలో ఇటుక మట్టిపాత్రల ముక్కలు లభించాయి. వీటికాలం ఎంత లేదన్నప్పటికీ వేయి సంవత్సరాలకు పూర్వంవయి వుంటాయని పురాతత్త్వ శాస్త్రజ్ఞులు డా. రామచంద్రమూర్తిగారు తెలిపారు. (వాటి కాలాన్ని కరీంనగర్ మ్యూజియం క్యూరేటర్ కూడ సమర్థించారు) చక్రేశ్వరి విగ్రహం ముందున్న బండిమీది పద్మ - పాదం (చూడు చిత్రం-3) చెంత మేము నిలబడి వున్నప్పుడు మాతో పాటు వచ్చిన బందరాజన్న (కుర్క్యాల గ్రామ తలారి, వయస్సు 75 సం॥) అదే గ్రామ నివాసి షేక్ వాలి (వయస్సు 50 సం॥) ఇద్దరూ ఆ గుట్ట దక్షిణ సమతల ప్రదేశపు పెద్ద ఖాళీ నివేశంలో వెనుకటికి ఒకప్పుడు "ధర్మపురి" అనే పట్టణం ఉండేదన్న కథను అక్కడ ప్రచారంలో ఉన్నదాన్ని స్వ-ఇచ్ఛతో తెలిపారు. అంతేకాక, కుర్క్యాలకు వచ్చిపోయే సంచార గాయకుల పాటలలో కూడ ఆ పట్టణం గురించిన విషయం ఉండడాన్ని తెలిపారు.[12] గుట్ట దక్షిణపు మొదల్లోనే ఉండిన ధర్మపురం నాశమైనప్పుడు అక్కడ ఉండిన జైనులు మరో ప్రాంతానికి వలసపోయి ఉండవచ్చును. కుర్క్యాల గ్రామానికి బొమ్మలమ్మ గుట్టకూ మధ్య ఉన్న 'పాత చెరువు' వెనుకవైపున్న పొలాలలో అనేకం నేటికీ బ్రాహ్మణుల మాన్యపు భూములు వున్నాయి. (ధర్మపురం నాశమైన తర్వాత అక్కడ వుండిన బ్రాహ్మణులు చుట్టుప్రక్కల గల కుర్క్యాల, కొండనపల్లి మొదలైన గ్రామాలలో నివసించినట్టు తోస్తుంది) ఇది వెనుకటికి అక్కడ – నేటి బయలు నివేశంలో అగ్రహారం ఉండి ఉంటుందనడానికి సాక్షిగా ఉంది. బొమ్మలమ్మ గుట్ట ఉత్తరపు లోయలో చెరువొకటి ఉంది (అది బహుశా 'కవితా గుణార్ణవ' తటాకమయి వుంటుంది. ముందు చూడండి). ఈ రెండు చెరువుల మధ్య ఉన్న విస్తారమైన బయలు ప్రదేశంలో ధర్మపురం ఉండి ఉంటుందనడంలో సందేహం లేదు. పాతచెరువు వెనుక భాగంలోని పొలాలలో కూడ పాత ఇటుక, మట్టిపాత్రల ముక్కలు, పూర్తిగా మట్టిపాత్రలు లభించడమే కాకుండా ఒక 'మాస్తికల్లు', గుర్తించడానికి సాధ్యంకాని మరొక శిల్పమూ కన్పించాయి, మరియు ఆ ప్రదేశాన్నంతటినీ ప్రజలు "పాటిగడ్డ" అని పిలుస్తారు. తెలంగాణాలో పాటిగడ్డ అని పిలువబడే ప్రదేశాలన్నీ ప్రాచీన నివేశాలు.

రెండు చెరువుల క్రింది పొలాలలో మధ్య ధర్మపురం - ఇప్పటి విస్తార ప్రదేశాన్ని గమనిస్తే - దాదాపు రెండు, మూడు వందల ఇళ్ళుండిన గ్రామమయి వుండాలి.



చక్రేశ్వరి విగ్రహం ముందు బండమీద జినమునుల పాదాలు: బహుశా జయణంది భట్టారకుల పాదాలు కావచ్చును.

"కవితాగుణార్ణవ" తటాకం, "మదనవిలాస" వనం

జినవల్లభుడు తన అన్న పేర్తో కవితాగుణార్ణవమనే చెరువు త్రవ్వించిన విషయం శాసనాల్లో ఉల్లేఖింపబడ్డ విషయం ఇప్పటికే అందరికీ తెలిసిన విషయం. డా. ఎన్. వేంకటరమణయ్యగారు గుట్ట వెనుకభాగపు ఉత్తర లోయలోని ఉడన్ చెరువు అనే చెరువే 'కవితాగుణార్ణవ' తటాకం అని ఊహించగా[13] దక్షిణంలో ఉన్న పాతచెరువు అనే చెరువే 'కవితాగుణార్ణవ' తటాకమని డా. గాయి[14] మరియు డా. కల్బుర్గి ('కర్మవీర' వ్యాసంలోని చిత్రం చూడండి) భావించారు వీళ్ళెవరు తమ అభిప్రాయాలను సమర్థించుకోలేదు. పంపడు తన పంప భారతంలో[15] ధర్మపురాన్ని వర్ణించే సమయంలో అక్కడ ఒక చెరువు వున్న విషయాన్ని చెప్పి ఉండగా ఎవరూ దాన్ని లక్ష్యపెట్టలేదు. పంపని వర్ణన ఇలాగుంది:

> బీరదళవియ నన్నియ చాగద శాసనం చంద్రార్క తారంబరం
> మేరు నిల్వినం నిలవేక్కుం కావ్యక్కె తానిత్తం శాసన దగ్రహారం
> సార మెంబినం పెసరిట్టు తానీయె హరిగన ధర్మ భండారదంతె
> సారమాదుదు బిట్టగ్రహారమా బచ్చెసాసిరదొళం ధర్మపురం॥
>
> దెసెమఖధూమదిం ద్విజర హోమది నొగ్గెతె హంసళోకసా
> రస కళనాదదిందొళగె వేదనినాదదినెత్త మెయ్దె శో
> భిసె సురమర్త్యమానవనధి క్షుభితార్ణవ ఘోషదంతె ఘూ
> ర్ణి సుతిరతీ గుణార్ణవన ధర్మద ధర్మపురం మనోహరం॥

పంపనికి దానంగా వచ్చినప్పుడే ధర్మపుర అగ్రహారంలో ఒక మంచి చెరువు (పెద్ద చెరువు) ఉండేదన్న విషయం పై పద్యంవల్ల తెలుస్తుంది. ముందు జినవల్లభుడు తన అన్న పేరుతో కట్టించినది 'కవితా గుణార్ణవ' తటాకం. ఈ విధంగా ధర్మపురంలో రెండు తటాకాలు ఉండడాన్ని ఎవరూ లక్ష్యపెట్టలేదు. ఇప్పుడు బొమ్మలమ్మ గుట్టకు దక్షిణంలో 'పాత చెరువు' అనే పెద్ద తటాకం ఉంది. పంపనికంటె ముందే ఆ చెరువును అగ్రహారం కోసం రాజెవరైనా కట్టించి వుంటే అది పెద్దదే అయి ఉండాలి. అందువల్ల 'పాతచెరువు' (పేరు గమనింపదగ్గది) పంపనికి ధర్మపురం దానంగా వచ్చినప్పుడే ఉండిన చెరువు, పైగా పైన పేర్కొనబడిన రెండో పద్యంలో వర్ణింపబడ్డ తటాకం ఇదే. నేటి ధర్మపుర నివేశాన్ని పరిశీలిస్తే, ధర్మపురం జమీనులకు నీటిని సరఫరా చేస్తుండిన తటాకం ఇదే. గుట్ట వెనుక భాగపు లోయలో ఉత్తర దిశకున్న ఉడన్ చెరువు చాల చిన్న తటాకం, మరియు జినవల్లభుడు తన అన్న పేర్తో కట్టించిన కవితా గుణార్ణవ తటాకం బహుశా ఇదే. ఈ తటాకం పక్కనే గుట్టమీద అనేక గుహలు వుండి, అక్కడ జైనమునులు నివసించి ఉంటారనడానికి గుర్తులున్నాయి. (పాత చెరువు చెంత ఎలాంటి గుహలూ లేవు). జినవల్లభుడు ఈ చెరువును జైనమునుల కోసం, మరియు జైన యాత్రికుల కోసం కట్టించి వుండే సాధ్యత వుంది దాని పక్కనో లేక వెనుకభాగంలోనో యాత్రార్థుల విశ్రాంతి కోసం మదన విలాసమనే వనాన్ని నిర్మించి వుండవచ్చు. (వనం వుండేదనడానికి ఇప్పుడు చిహ్నాలకోసం నిరీక్షించడం తప్పవుతుంది) దక్షిణపు పాత చెరువు, ఉత్తరపు ఉడన్ చెరువుల మధ్యగల సమతల ప్రదేశపు ఎత్తైన బయలే ధర్మపుర నివేశం ఉడన్ చెరువు నీటివల్ల కొన్ని జమీనులు నీటివసతిని పొందుతున్నాయి.

"జైన గుహలు"

బొమ్మలమ్మ గుట్టలో పలు జైనగుహలుండేవన్న విషయాన్ని ఎవరూ ఇంతవరకూ గమనించలేదు. బొమ్మలమ్మ గుట్టలో (నాటి వృషభాద్రి) జినవల్లభుడు తీర్థంకరుని విగ్రహాలనూ, చక్రేశ్వరి ప్రతిమను చేయించి (చూడు చిత్రం–4) జినాలయాన్ని నిర్మించిన పిదప, అక్కడ జరుగుతున్న పూజాదులను చూడడానికి అధిక సంఖ్యలో జైనమునులూ, శ్రావకులూ, ఇతర ప్రజలూ వచ్చారని శాసనం చెప్తుంది.

> భ్రాతర్ధర్మపురం ప్రియామ రిమతో జైనాభిషేకోత్సవ
> క్షీరప్లావిత తుంగ శృంగ వృషభ క్షోణీధ్ర మీ క్షామహే
> యాత్రాయాత సమస్త భవ్యజనతా సన్మాన దానోద్యతం
> పంపార్యానుజమత్ర భీమతనుజం సమక్త్వ రత్నాకరం॥
>
> అజస్ర జినవందనాగత మునీశ్వర శ్రావక
> ప్రజాస్తవరవ ప్రతిధ్వనిత కోళాహలైః
> అధిష్ఠిత దిగంబరో వృషభశైలవాష స్వయం
> పరాం వదతి వాచకాభరణ కీర్తిమాకళ్వతః॥

బొమ్మలమ్మ గుట్ట తూర్పు దిశలో గుట్ట సగం భాగంలో గుహ ఒకటి వుండి, దానిముందు చెట్టుచేమలు పెరిగి వున్నాయి. అక్కడే క్రింద గుహ ఒకటి వుంది; దాని ఒకటి రెండు పార్శ్వాలు పైనుండి నీరు ప్రవహించకుండా మట్టి గోడతో కప్పిపెట్టిన గుర్తులున్నాయి. గుట్ట వెనుకభాగపు ఉత్తర పార్శ్వంలో రెండు గుహలున్నాయి. ఒక గుహకు పైకెక్కి పోవడానికి మెట్లు చేసి వుండడం స్పష్టంగా తెలుస్తుంది. (అన్ని గుహల్లోను మట్టిపాత్రల ముక్కలు యథేచ్ఛగా వుండి, అవి ప్రాచీన మనుష్యుల నివాసంగా వుండిన లక్షణాలు వున్నాయి). ఉత్తర పార్శ్వంలో ఒకచోట పెద్ద బండరాయిమీద మెట్లు చెక్కబడ్డాయి. ఆ ప్రదేశంలో గుట్ట పైనికి వెళ్ళకూడదనీ, వెళ్తే మనుష్యులు మరణిస్తారన్న నమ్మకం వుంది. వెనుకటికి గుహల్లో వుండిన దిగంబర మునులు గుట్టపైనున్న జినాలయానికి వెళ్ళే మార్గం అదయి వుండి, వారికోసం ప్రత్యేకించబడ్డ ఆ మార్గాన్ని సాధారణ ప్రజలకు నిషేధింపబడినట్లు తోస్తుంది. గుహలున్న ఉత్తర పార్శ్వపు క్రింది సమతల ప్రదేశంలోనే కవితాగుణార్ణవ తటాకం (నేటి ఉడన్ చెరువు) వుండింది.

"త్రిభువనతిలక జినాలయం"

గుట్ట సమతల ప్రదేశంలోకానీ, గుట్ట పైనకానీ జినవల్లభుడు కట్టించిన త్రిభువనతిలక జినాలయం అవశేషాలు ఎక్కడా కన్పించలేదు. శాసనం వున్న

సిద్ధశిల వెనుకవైపున్న గుట్ట తుదికి జనసామాన్యులు వెళ్ళడానికి పశ్చిమదిశనుండి మార్గం చేసి వున్నారు. అక్కడక్కడ బండలమీద మెట్లున్నాయి. గుట్టమీద ఏడెనిమిది రోళ్లుండడంవల్ల ఆ ప్రదేశానికి ప్రజలు వచ్చిపోతూ వుండేవారనడానికి, చిహ్నాలు వున్నాయి. అక్కడే రెండు మానవ నిర్మితాలైన దొనలు వున్నాయి. మేము వెళ్ళినప్పుడు చెరువులూ, ఆ దొనలూ పూర్తిగా ఎండిపోయి వుండినా, మంచి వర్షం పడ్డప్పుడు వర్షపునీరు వాటిలో నిండివుండాలి. ఆ దొనల సమీపంలో గుట్టమీద ఒకే ఒక సమతల ప్రదేశం వుండి, నేడక్కడ మన్నుపడి గడ్డి బాగా పెరిగింది. అయినా అక్కడ త్రిభువనతిలక జినాలయం వుండి వుంటుందని ఊహించేందుకు వీలుంది. ఎందుచేతనంటే చివరి బయలు ప్రదేశంనుండి క్రిందికి దిగడానికి ప్రక్కలో బండమీద చిన్న చిన్న మెట్లు చెక్కి ఉన్నారు. ఆ బయలు గుట్ట తూర్పు చివర ఉంది. మరియు త్రిభువనతిలక జినాలయం అక్కడ ఉండి ఉంటుందన్న ఊహకు రోళ్ళు, దొనలు, మెట్లు సాక్షిగా వున్నాయి. అక్కడ ఏ కట్టడమూ ఉండకపోతే వాటి అస్తిత్వానికి మరో కారణమే వుండదు. త్రిభువనతిలక జినాలయం ఆదివృషభ తీర్థంకరునిది అయి వుండాలి. శాసనంలోని ఈ పద్యాన్ని గమనించండి.

ఇదు కవితా గుణార్ణవన కీర్తియ మూర్తివొలాగి దక్షిణా
ర్ధావ వృషభాద్రియ(శ్కె) వృషభేశ్వర బింబసనాథ మెంబలం
పొదవె నిజ ద్విజావసథ పర్వతమం జినచైత్యమగె మా
డిద జినవల్లభంగె జినవల్లభనప్పుడు మొందు చో(చో)ద్యమో॥

ఆ'ద్విజావసథ పర్వతం' లేదా అగ్రహారపు గుట్ట మొదట అనాథగానుండి నేడు జినవల్లభుడు నూతనంగా చేసిన వృషభేశ్వర ప్రతిమవల్ల సనాథమై వుంది. గుట్టమీద జినాలయం ఉండిందనడానికి ఇది కూడా సాక్షిగా వుంది. గుట్ట చివరి జినాలయంలో ఆదివృషభ తీర్థంకరుని విగ్రహం; సిద్ధశిలమీద ఆదివృషభ తీర్థంకరుని యక్షి చక్రేశ్వరి. "పంపనికి ధర్మపురం దానగ్రామంగా చేరిన పిదప ఆ వైదిక అగ్రహారంలో జైనధర్మప్రభావమూ అధికమై, అది చుట్టుప్రక్కల కూడ వ్యాపించి వుంటుందనడాన్ని ఇది సూచిస్తుంది" అనీ, మరియు "వృషభగిరి ఒక ప్రసిద్ధ జైనక్షేత్రం కావడం జినవల్లభుని కృషి వల్లనే" అనే డా. టి. వి. వెంకటాచల శాస్త్రిగారి పై పద్యానికి వ్యాఖ్యానం సరిగా వుంది.[16] ఆ బయలు మట్టిని త్రవ్వితే లేదా చుట్టుప్రక్కల గల లోతూ, దుర్గమమూ అయిన బండల సందుగొందుల్లో వెతికితే ఆ జినాలయావశేషాలు లభించగలవు.

జినవల్లభుని ఈ క్రింది మాటల్లో అతడు ఆ గుట్టమీద చేయించిన స్మారకాల ఒక క్రమానుగతమైన పట్టిక ఉంది.[17]

"...జినవల్లభుని సబ్బినాడ నట్టనడువణ ధర్మవురదుత్తర దిగ్భాగద వృషభగిరి యెంబనాది సంసిద్ధ తీర్థద దక్షిణ దిశాభాగదీ సిద్ధశిలే మొళత్తమ్మ కుల దైవమాద్యంత జినబింబగళుమం చక్రేశ్వరియుమం తెలవు జినప్రతిమెగళుమం త్రిభువనతిలకమెంబ బసదియుమం కవితాగుణార్ణవమెంబ కెఱెయుమం మదన విళాసమెంబ బనముమం మాడిసిదం"

గుట్ట దక్షిణపు సిద్ధశిలమీద మొదటి మరియు చివరి తీర్థంకరుల జిన బింబాలు, క్రింద చక్రేశ్వరి విగ్రహం; దాని చుట్టుప్రక్కల కొన్ని జినప్రతిమలు; సిద్ధశిల వెనుకభాగపు గుట్ట తుదలో జినాలయం; అక్కడినుంచి ఉత్తరపు లోయలో దిగితే అక్కడే కవితాగుణార్ణవ తటాకం; దాని వెనుక భాగంలో మదన విలాసమనే వనం.

'చక్రేశ్వరి' గురించిన దంతకథ

నేడు కుర్క్యాల పరిసరాల్లో జైనులెవరూ లేకపోయినా, జినాలయం పాడయిపోయినా, సిద్ధశిలమీది విగ్రహాలూ శాసనాలూ ముక్కలు కాకుండా మిగిలి వున్నాయి. చక్రేశ్వరిని గ్రామప్రజలు శ్రీరాముని భార్యగా విశ్వసిస్తారు. ఒకమారు 'బొమ్మలమ్మ' వివస్త్రయై కూర్చుండి స్నానం చేస్తుండగా అక్కడికి వచ్చిన శ్రీరాముడు కోపంతో తన కుడికాలును కురిక్యాల గ్రామంలో మోపి (అందువల్ల ఆ గ్రామానికి ఆ పేరు వచ్చిందట. 'కాలు' అనే ఉత్తరార్ధ పదాన్ని గమనించండి) తన గుర్రాన్నెక్కి కోపంతో వెళ్ళిపోయి ఆరేడు మైళ్ళ దూరపు గుట్టమీద నిలిచాడట. (ఆ గుట్టమీద అశ్వారోహి రాముడి విగ్రహం వుంది) బొమ్మలమ్మకు శ్రావణమాసంలో విశేషపూజ జరుగుతుంది. చుట్టుప్రక్కల గల ప్రజలు పిల్లలు కలుగకపోతే, రోగాలు రొచ్చులవుతే, బొమ్మలమ్మకు మ్రొక్కుకుంటారు. ఒక విగ్రహం మతపరంగా నిష్క్రియమైనప్పటికీ జానపదులు దాన్ని తమదే అయిన రీతిలో తమ సామాజిక జీవితంలో భాగంగా చేసికోవడాన్ని శేషశాయి ల్పం ఉదాహరణలో నేను వెనుక ఒకమారు చూపించాను: ఇది అదేమాదిరి మరొక ఉదాహరణ.


మరొక శాసనం?

అరికేసరి పంపనికి దానసమేతంగా ఇచ్చిన మూలశాసనం శిలాశాసనం కాదు, ఒక తామ్రఫలకం అనే విషయం జినవల్లభుని శాసనంవల్ల తెలుస్తుంది.

బరెదుదె తాంబ్రశాసనమవే యమె ధర్మపురం నెగత్తావె
త్తరిగన కొట్టుదే నెగర్ది పంపన పెత్తుదె పేఱుమెన్దు నీ
మ్మరుళె పలమెన్మయుం పలబరం బెసగొళ్ళదె పోగినోడ సు
న్దర వృషభాచళోన్నత శిలాతళదొళ్ బరె దక్కరంగళం॥

ఇందులోని "పోగినోడ..." అనే వాక్యాన్ని గమనించి, జినవల్లభుని శాసనమే కాక, అరికేసరి కూడ పంపనకి వేయించి ఇచ్చిన శిలాశాసన మింకొకటి బొమ్మలమ్మ గుట్టలో ఉందనీ, వెతికితే లభించవచ్చుననీ నమ్మిన పెక్కుమంది విద్వాంసులున్నారు. అలాంటి శాసనమొకటి అక్కడ వుండే సాధ్యత లేదని నాకు ఖచ్చితంగా తెలిసినా (ముందు చూడండి), ప్రముఖ ప్రదేశాలలోని బండలన్నింటిని కళ్ళల్లో కళ్ళు పెట్టుకొని చూశాము. ఇతరులకు కూడా చెప్పి వెతికించాము. అలాంటి శాసనమేదీ అక్కడ లేదు. రేయింబవళ్లు గట్టుమీద కట్టెలు, గడ్డి, పండ్ల కోసం తిరిగే పల్లీయులకు అలాంటి ఏ శాసనమూ కన్పించలేదు. వాస్తవమైన విషయమేమిటంటే "పోగినోడ..." అనే వాక్యంలోని శాసనం వేరే ఏదికాదు, జినవల్లభుని నేడు లభించిన శాసమే.

"పోగినోడు..." అని జినవల్లభుని శాసనం చెప్తోంది అన్న భావనమే ఈ తప్పు కల్పనకు కారణమయింది. అలా చెప్తున్నది శాసనకర్త జినవల్లభుడే కానీ శాసనం కాదు. ఆయన ధర్మపురంలోని తన ఇంట్లోనో, మరెక్కడనో కూర్చొని శాసనపాఠాన్ని రచించేటప్పుడు బండనూ, దానిమీద చెక్కాల్సిన శాసనాన్ని మనస్సులో కల్పించుకొన్నాడు: ప్రజలు తమకు కల్గిన సందేహాన్ని పరిహరించుకోవడానికి ఆ శాసనాన్ని వెళ్ళి చూడండి అని కవి చెప్తున్నాడు అని భావించేటట్టయితే అప్పుడు వేరొక శాసనాన్ని మనం వెదకాల్సిన ప్రశ్నయే ఉదయించదు. అరికేసరి పంపనికి వ్రాయించి ఇచ్చిన శిలాశాసనం లభించేదే అయితే అంతకంటె సంతోషపు సంగతి మరొకటి వుండదు. అదృష్టముంటే అరికేసరి పంపనికిచ్చిన తామ్రశాసనం దొరకవచ్చు. అరికేసరి ఇచ్చిన తామ్రఫలకం పోగొట్టుకొని పోవడంవల్ల, పంపని కాలానంతరం ప్రజలకు అనేక సందేహాలు వచ్చి, ఆ సందేహాన్ని పరిహరించుకోవడానికై జినవల్లభుడు ఈ శాసనాన్ని వేయించి వుంటాడని డా. గాయిగారి ఊహ. "ధర్మపుర దానాన్ని బలిష్ఠం చేసుకోవడానికి జినవల్లభుడు వృషభగిరిపై బండమీద దాన్ని శాశ్వతమైన దాఖలా అగునట్టుగా వ్రాయించి ఉండవచ్చు"నని డా. వెంకటాచలశాస్త్రిగారు అభిప్రాయపడతారు తామ్రఫలకం పోగొట్టుకొని పోయిందని అనడం కానీ, ఇది పంపని మరణోత్తర శాసనం అని అనడం కానీ కేవలం ఊహలు. పంపడు ఈ శాసనం ఉదయించేనాటికే గతించాడని చెప్పడానికి శాసనంలోని ఏ భాగం అవకాశమివ్వడం లేదు. పంపనికి ధర్మపురం దానంగా వచ్చిన సంగతి ప్రజల్లో పుట్టించిన సంభ్రమాన్ని "బరెదుదె తాంబ్రశాసనం..." అన్న పద్యం ధ్వనింప చేస్తుంది, "ఒర్వనె పీర్యభూవర



చక్రేశ్వరి మరియు ఇతర బింబాలు, క్రంద శాసనం

వల్లభం జినవల్లభం" అని జినవల్లభుడు చెప్పికొని వుండడం స్వ ప్రశంసయే కానీ అలాంటి మాటలకు అధిక ప్రాధాన్యం ఇవ్వలేను, "కీర్తియమూర్తి" "కీర్తి శాసనం" — ఈ మాటల్లో 'కీర్తి మాటకు ప్రసిద్ధి అనే అర్థమే కాని మరొకటి కాదు. ఖచ్చితమైన ఉల్లేఖనం లేదా సూచన లేని పరిస్థితుల్లో, ఈ శాసనం పుట్టి నప్పుడు పంపడు ఇంకా జీవించి ఉండెనని భావించడమే యోగ్యమనిపిస్తుంది. వ్యక్తులు జీవించి ఉన్నప్పుడే వారి పేర్లతో దేవాలయాలను, తటాకాలను కట్టించడం ఉండేది. అలాంటప్పుడు, కవితాగుణార్ణవమనే తటాకం ఆ కాలానికి గతించిన పంపని పేర్తో నిర్మాణమయిందని భావించాల్సిన అవసరం లేదు.[18]

ఒక ఊహ :

పంపడు తన దాన గ్రామమైన ధర్మపురంలోనే తన కొనఊపిరిని పీల్చి ఉంటే అతని సమాధి బొమ్మలమ్మగుట్ట ఉత్తరదిశలో గుహల సమీపంలో జరిగి వుండాలి. ఈ మొత్తం ప్రదేశాన్నంతా పరిశీలిస్తే మరొక స్థలాన్ని కల్పించు కోవడం కష్టం. (ఇది కేవలం ఒక ఊహ అని చెప్పాల్సిన పని లేదు.

"ఆదిపురాణం" మరియు జినవల్లభుని శాసనం

జినవల్లభుని శాసనంలో విక్రమార్జున విజయం పేరు వచ్చి వుండడమూ, ఎక్కడా ఆదిపురాణం ఉల్లేఖనం లేకపోవడం స్పష్టంగా కన్పించే సంగతి అయినా, ఆ పూర్తి శాసనం ఆదిపురాణం గురించి పలుమార్లు జ్ఞాపకంచేసే వాతావరణాన్ని పొందిందని గమనించాలి "వృషభాచలపర్వత" లేదా అగ్రహారపు గుట్ట అనే పేరున్న ఆ గుట్టకు జినవల్లభుడు వృషభాచలమని పేరు పెట్టడానికి ఆదిపురాణ కథయే కారణం భరతుడు తన దిగ్విజయపు ప్రశస్తి శాసనాన్ని వృషభాచల శిల మీద వ్రాయించినట్టుగా ఇక్కడ జినవల్లభుడు పంపని (మరియు తన) ప్రశస్తిని వ్రాశాడు. "ఇదు కవితాగుణార్ణవన కీర్తియమూర్తి వొలాగి దక్షిణార్ధద వృషభాద్రియకెక్కె" అనుటలో ఉత్తరపు వృషభాచలం భరతుని శాసనాన్ని పోలి నట్టుగా ఈ వృషభాచలమూ పంపని శాసనాన్ని పోలివుంది (పురాణ కథలో భరతుడు ఒక శాసనాన్ని తుడిచివేసి మరొక శాసనాన్ని వ్రాయించాడు, అప్పుడాతని గర్వ రసం అణగారిపోయింది అనే వివరాలు కవి మనసులో అప్పుడు ఏర్పడినట్టుగా కన్పించదు) శాసనంలోని ఈ మాటను గమనించండి— "...ఎందులోకమెల్లం పొగళె నెగట్టె జినవల్లభన సుధర్మ సంతతియొళ్ తొట్ట గుణావళి యసి వృషభగిరియ సిద్ధశిలె మొశెతొయమ్మం టంకోత్కీర్ణం మాడిదం". దీనితోపాటు ఆదిపురాణంలోని—" అంతు బందు వృషభాచల విటంకదొళ్ అప్రతిహత దిగ్విజయ ప్రశస్తియం టంకోత్కీర్ణంమాడి"[19] అనేదాన్ని పోల్చి చూడండి. శాసనం వున్న శిలను 'సిద్ధ శిల' అని పిలవడానికి వృషభాచలం లేదా బొమ్మలమ్మ గుట్ట ముందుభాగపు అతిపెద్ద శిల అయి వుండడమే కాదు; ముక్తులూ, విదేహులూ ప్రపంచంమీద ఆసక్తి లేనివాళ్ళు అయిన సిద్ధులు అగోచరంగా సిద్ధ శిలమీద విహరిస్తారు అనే జైనధర్మపు లోకాకాశ కల్పనకుండా ఇక్కడ పనిచేసింది.[20] బొమ్మలమ్మగుట్ట "సిద్ధశిల" చివర ఖాళీ: అక్కడ ఏమీ చెక్కడం లేదు (అక్కడ సిద్ధులున్నారు అనే కల్పన జినవల్లభునిది) చివరినుంచి క్రిందికి వస్తే రెండు జినబింబాలు—ఇవి అప్పుడే చూడబడ్డ ఆదివృషభుడు మరియు మహావీర తీర్థంకరుడివయి వుండి 24 తీర్థంకరులను ప్రతినిధిస్తాయి. జైనుల కల్పన ప్రకారం 'పంచ పరమేష్ఠి'లలో సిద్ధులు పైవారు. వారికంటె క్రింది వరుసలో అనుక్రమంలో తీర్థంకరులు వస్తారు. తీర్థంకరులు సిద్ధులవలె ముక్తులయినా లోకానుగ్రహం కోసం దేహధారులయి వుంటారు. తీర్థంకరుల క్రింది అనుక్రమంలో అచార్య, ఉపాధ్యాయ, సాధువులు వస్తారు. వీరిని సంకేతించే రీతిలో చక్రేశ్వరి విగ్రహం చుట్టుప్రక్కల ఆరుమంది జైనమునుల విగ్రహాలున్నాయి. (సిద్ధ, అర్హంత, ఆచార్య, ఉపాధ్యాయ, సాధు - వీరే పంచపరమేష్ఠులు) మొత్తం శిలను సిద్ధశిల అని పిలువడంలో జినవల్లభుడి తర్కం పై రీతిలో పనిచేసినట్టు తోస్తుంది.

"త్రిభువనతిలక" మనే జినాలయానికి పేరు పెట్టడానికి కారణం, అది సిద్ధశిలగల బండ వెనుకవైపు ఇంకా ఎత్తైన గుట్ట చివర్లో ఉండడం కారణమయి వుండవచ్చు. (ఆ జినాలయం ఆదివృషభ తీర్థంకరునిది అనే విషయం చాలవరకు ఖచ్చితం) వనానికి "మదనవిలాస" మనే పేరు పెట్టడానికి పంపని ఆదిపురాణం లోని భరతుడు, పంపడి రాణులూ విలాసంతో కాలం గడిపిన వనవర్ణన ప్రేరణ కల్గించి ఉండవచ్చు (చూడు - "భరతేశ్వరన్...జనతానందం బనమం విళాసదిం పుగుతందం", "...వనజాన నెయర్ విలాసవనమం పొక్కర్" ఇత్యాది.[21]

(45 వ పేజీ చూడండి)

సీరియల్ ప్రారంభం!

సృష్టి

ఇచ్ఛాపురపు రామచంద్రం



డిస్టెంపర్ చేయబడిన గోడకే అందాన్నిస్తున్న ఆ విదేశీ గోడ గడియారం-

మృదువుగా .... మధురంగా .... జల తరంగిణిలా — (అర) గంటకొట్టి కోయిలలా కూసింది. ఆరున్నర.

జయదేవ్ అటు చూశాడు.

కాలం గడిచిపోతూందని నిశ్శబ్దంగా హెచ్చరిస్తున్నట్లున్న ఆ గడియారం అతని కా క్షణాలలో - కాటు వేయడానికి తొందర పడుతున్న అందమైన కాలనాగు పడగలాగే అనిపించింది, నిశ్శబ్దంగా ముందుకి పరుగిడుతున్న సెకన్ల ముల్లు - నిశ్శబ్దంగా సమీపించే మృత్యువులాగే కనిపించింది. ఆ గడియారాన్ని అవతలికి విసిరేద్దా మన్నంత ఆగ్రహం కలిగిందతనిలో

ఆ సమయంలో

పిల్లి కళ్ళు మూసుకున్నంత మాత్రాన లోకం కళ్ళు మూసుకోదనే సత్యం అతనికి స్ఫురించలేదు. ఆ అందమయిన గడియారాన్ని - విదేశం నుంచి వొస్తూ తెచ్చి-ఒక ప్రియమిత్రుడు బహూకరించాడని గుర్తురాలేదు. అంతేకాదు గడియారం కాలానికి కొలమానమే తప్ప అదే కాలం కాదనీ, గడియారాన్ని పగలకొట్టినంత మాత్రాన కాలాన్ని ఆపలేడనీ - కూడా మరచిపోయాడతను. ఔను. ఆపదలో మునిగినవాడికీ, ఆత్రుతతో నిండినవాడికి - వివేకం ఎలా మిగులుతుంది? జయదేవ్ చాలా విషయాలలో సామాన్య మానవుడే.

అతను లేచి గడియారాన్నందుకో బోయేంతలో—

టెలిఫోన్ మోగింది-శ్రావ్యంగా; తన విషయం చూడమని వినయంగా ప్రార్థిస్తున్నట్లు. అతను ఆశగా...ఆత్రంగా రిసీవర్ తీశాడు.

"నమస్తే ... నేను - మానేజర్ రంగనాధాన్ని సర్. జయంతీ వాళ్ళకి సమాధానం రాసేందుకు రేపే చివరిరోజు సార్" భయపడుతూనే అన్నాడతను,

ఛర్రున లేచాడు జయదేవ్ "నేనేం చెప్పాను మీకు? నన్ను విసిగించ వొద్దనీ - నిర్ణయాలు మీరే తీసుకుని మీ యిష్టం వచ్చినట్లు చెయ్యమనీ స్పష్టంగా చెప్పానా లేదా?" గద్దించాడు.


"అదికాదండీ - ఈ ఆఫర్ విలువ ఆరు లక్షలు — అందుకని-" నసిగాడు.

"ఆరు లక్షలు కాదు - ఆరువందల కోట్లయినా సరే." అంతేనన్నట్లు రిసీవర్‌ని క్రాడిల్ లోకి వదిలేశాడు చిరాకుగా.

రేపే చివరిరోజు!

జయంతీవాళ్ళ ఆఫర్ స్వీకరించడానికే కాదు: పద్మ జీవితానికి కూడా! పద్మంటే - తన ప్రాణం-జీవితం-ప్రేమ-సర్వస్వం.

ఈ చివరి గంటలు కూడా తనని ప్రశాంతంగా ఉండనివ్వకుండా ఎందుకిలా చంపుతారు మనుషులు?



అతను సిగరెట్ అంటించాడు.

డబ్బు ఏమయినా చెయ్యగలదనేది పచ్చి అబద్ధం. ఏదీ...తన ఆస్తి లక్షలన్నీ కలసి పద్మ జీవితాన్ని రక్షించమను. చూద్దాం. డబ్బు శక్తికి చాలా హద్దులున్నాయి. ఊరికే దానివెనుక వెర్రి పరుగులు పరుగెత్తడం మూర్ఖత్వం. ఎన్ని లక్షలు - కోట్లు పద్మ ఆత్మహత్య చేసుకోకుండా - తనకి దూరం కాకుండా ఆపగలవు?

పద్మ - తన ప్రేమ - తనకి దూరమై పోతుంది. తను ఏమీ చేయలేడు! ప్రేక్షకుడిలా చూస్తూ ఊరుకోడం తప్ప. అంతేనా!

అతను అనుకోకుండానే టేబులువేపు చూశాడు.

ప్లాస్టిక్ బిళ్ళలలో - 17 - ఆగస్టు 1984.

ఇవాళ - పదిహేడు.

రేపు - అతను వణికిపోయాడు - పద్దెనిమిది.

ఆగస్ట్ 18. పద్మ జన్మ తేదీ.

18 ఆగస్ట్ 1984 - పద్మ ఆత్మహత్య చేసుకునే రోజు!

మరో ముప్పయి గంటలు...అంతే. పద్మని తను కోల్పోతాడు.

అతను-రెండు చేతులతోనూ తల పట్టుకున్నాడు. అతని కేడుపొస్తూంది. కాని - మగవాడు కనుక కన్నీరు పెట్టుకునే స్వేచ్ఛ లేదతనికి. ఎంత దుఃఖాన్నయినా గుండెలలో అణచుకోవలసిందే.

పద్మా!-మై లవ్-మై లైఫ్-

తనకి లక్షలున్నాయి. గట్టిగా తలుచుకొంటే వాటిని కోట్లు చెయ్యగలడు కూడా. కాని - దేనికి? తన కోరిక తీరలేదని ఆత్మహత్య చేసుకోబోతున్న పద్మని - లక్షలూ కోట్లూ కావు, ప్రపంచంలోని ఐశ్వర్యమంతా కూడా ఆపలేదు ఆమె కోర్కెని తీర్చలేదు.

ఇంత డబ్బు - బిజినెస్ మాగ్నెట్ అన్న బిరుదు - నలుగురిలోనూ పేర ప్రతిష్ఠలు - ముఖ్యంగా ఆమెమీద అంతులేని అనురాగం - యిన్నీ కలసిన ఆమె ఆత్మహత్య చేసుకోకుండా ఆపలేవు.

ఇది సాధించా నది సాధించానని విర్రవీగడమే కాని నిజంగా మనిషి సాధించేదేముంది? ప్రకృతి - కాలం - అజేయంగానే మిగిలి వున్నాయి: అతివృష్టి - అనావృష్టి - వరదలు - ఎండలు - వేటి నదుపులో పెట్టగలడ వాడు? కాలాన్ని నిముషమయినా ఆపలేడు.

ఏది చూత మొక్క గులాబిని సృష్టించమను - అన్న సవాలుకి యింత విజ్ఞానవంతుడని విర్రవీగే మానవుడూ ఓటమితో తల దించుకుంటూనే వున్నాడు. మరి ఏం సాధించిందని విజ్ఞానం? ఈ ప్రపంచమంతా... మానవుడు సాధించిన శాస్త్రీయ విజ్ఞానమంతా ఏకమయినా పద్మ కోర్కె తీర్చి ఆమెను ఆత్మహత్య నుంచి జీవితంవేపు మరలించగలదా? తనకి మనశ్శాంతి ప్రసాదించగలదా? ఈ సంవత్సరంనుంచీ తను ఎంత క్షోభా, చిత్రహింసా అనుభవిస్తూ వొస్తున్నాడని! క్షణక్షణమూ ఎంత చేదుని...కాలకూటవిషాన్ని దిగమింగుతున్నాడని!

నిరీక్షణను మించిన నరకం లేదు. భయంకరమైనది ఎదురు కాబోతూందని ముందు తెలిసి దానికోసం అయిష్టంగా, తప్పనిసరిగా నిరీక్షించవలసి రావడం కంటే నరకం ఏముంటుంది? కాలగమనంలో ఓడలు బళ్ళు, బళ్ళు ఓడలూ కావడమంటే యిదేనేమో! ఈ సంవత్సరంలోనూ తమ జీవితాలెంత తల్లక్రిందు లయ్యాయి! ఎంత మార్పు వచ్చింది!

ఇంక ముప్పయిగంటలు.

పద్మ తనని వదిలి వెళ్ళిపోతుంది.

ప్రపంచంలోని ఏ శక్తీ ఆమెను ఆపలేదు.

ఆమెపట్ల తన ప్రేమ కూడా ఓడిపోతుంది.

పద్మ ఆత్మహత్య చేసుకుంటుంది.

తన ప్రేమ...ప్రాణం...జీవితం...సర్వస్వమూ అయిన పద్మ-

ఆత్మహత్య చేసుకుంటుంది!

తెలిసినా తను నివారించలేడు.

అందుకే యింత బాధ.

జయదేవ్ మరో సిగరెట్ అందుకున్నాడు.

అతని అంతరంగంలో కల్లోలం చెలరేగుతూ చాలా అశాంతిగా వుంది.

ఒక్కసారి వెళ్ళి పద్మని చూద్దామా అనిపించింది.

కాని...అతనికి తెలుసు. ఆమె తనని సాధ్యమయినంత తప్పించు కుంటూంది చివరి రోజులలో. మునుపు తనని విడచి క్షణం ఉండలేనసే పద్మ... యిప్పుడు — ముఖం చూపడానికే...

ఎంత మార్పు తమ జీవితాలలో!

ఇలాగ జరుగుతుందని కలలో కూడా అనుకోలేదు తను.

క్రిందటి సంవత్సరం -

ఆగస్టు పద్ధెనిమిది -

ఎలా మరచిపోగలడా రోజుని?

అది - తన ప్రేమాధిదేవత జన్మదినం!

* * * * *

ఆ ఉదయం పద్మ వచ్చింది. తలంటు పోసుకొని, కొత్తచీర కట్టుకొని కాఫీ కప్పు పట్టుకొని.

అప్పటికి ఆమె మనసులో రగులుతున్న అగ్నిపర్వతం ఇంకా తన ముందు బద్దలు కాలేదు. "శుభోదయం - జన్మదిన శుభాకాంక్షలు. ప్రస్తుతానికి" అంటూ నవ్వుతూ ఆమెను చేతులలోకి తీసుకొని ముద్దు పెట్టుకున్నాడు తియ్యగా.

ఆమె మౌనంగా ఉండిపోయింది - సిగ్గయినా పడకుండా. తను ముద్దు పెట్టుకున్నా కొంచెమయినా పులకరించని ఆమె స్పర్శలోని తేడా తను గుర్తించినా అట్టే ప్రాధాన్యం ఇవ్వలేదు.

"ఎంత అందంగా ఉన్నావీ చీరెలో! ఈ చీర మీదకు మంచి ముత్యాల సెట్ అయితే చక్కగా మ్యాచ్ ఔతుంది. ఏం?"

"ఎందుకులెండి." అనేసిందామె నిర్లిప్తంగా.

అతను తృళ్ళిపడ్డాడు. "పద్మా!"

ఆమె పొరపాటు గ్రహించి సరిదిద్దుకుంటున్నట్లు - "అలాగే తీసుకుందాం" అంది బలవంతంగా చిరునవ్వు తెచ్చిపెట్టుకొని, అని అక్కడనుంచి వెళ్ళిపోయింది.

అతను స్నానం చేసి బట్టలు వేసుకుని పద్మతో బ్రేక్‌ఫాస్ట్ తీసుకొని గ్యారేజ్ వద్దకు వచ్చేసరికి డ్రయివర్ కారుతో సిద్ధంగా వున్నాడు.

పద్మ జన్మదినంనాటి కార్యక్రమం ఎలా జరుగుతుందో అతనికి తెలుసు. ఆవేళ అతను యింటినీ ఆమెనీ విడచి ఒంటరిగా వెళ్ళకూడదు. ఉదయం పది గంటలకి షాపింగ్. తను ఆమెకీ ఆమె తనకీ బహుమతులు కొనియిచ్చి...ఇంటికి వచ్చి కలసి - విందు భోజనం చేస్తారు. విశ్రాంతి అనంతరం సాయంత్రం దైవ దర్శనం. అటునుంచి అప్పే పద్మ కిష్టమయిన తెలుగు సినిమాకి. సినిమానుంచి మంచి హోటల్‌లో డిన్నర్ తీసుకుని యింటికి రావడం. ఆవేళ అతను కంపెనీకి వెళ్ళడు.

కారు లాల్‌చంద్ షాపు ముందాగింది.

అతనామెను లోపలికి నడిపించాడు.

"స్వచ్ఛమయిన యీ తెల్లని మంచి ముత్యాలహారం ఎలా వుంది?" అడిగాడతను షోకేస్‌లోని ఒక హారం చూపిస్తూ.

"మీ యిష్టం—"

అతనది తీయించి జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ ఆమె కలంకరించాడు స్వయంగా.

ఆమె - ఎక్కడో ఉన్నట్లూ - చలించనట్లూ - కృతజ్ఞతలయినా చెప్ప లేదు.

"మరి—నువ్వు నాకేమివ్వ బోతున్నావ్?" అతనే అడిగాడు జ్ఞాపకం చేస్తున్నట్లు.

ఆమె గతుక్కుమంది. "నేను-మీకేం యివ్వగలను?"

"అదేమిటి?—నువ్వు తలుచుకోవాలే కాని ఏమివ్వలేవు?"

"ఎంతో తలుచుకుంటున్నాను. కాని యివ్వలేకపోతున్నాను."

ఆమె కళ్ళల్లోకి నీళ్ళు!

"పద్మా!"

అప్పటికామె యీ లోకంలోకి వచ్చినట్లు-పరిస్థితి గ్రహించినట్లు-కళ్ళు తుడిచేసుకొని నవ్వుతూ షోకేసువైపు నడిచి - ఒక ఉంగరం తీయించి-

"నా జ్ఞాపక చిహ్నంగా." అంటూ అక్కడే అతని వేలుకి తొడిగింది.

ఇంక అక్కడ వుండలేనట్లు యివతలికి వొచ్చేసింది. అతను బిల్లు చెల్లించి కారువద్దకు వొచ్చేసరికి - ఆమె ఎటో చూస్తూ తీవ్రమయిన ఆలోచనతో మునిగి పోయినట్లుండిపోయింది. అతనూ అటు చూశాడు.

ఫ్యామిలీ ప్లానింగ్ హోర్డింగది.

ఒక యువతీ, యువకుడూ - ఓ అబ్బాయీ, అమ్మాయీ వారి చేతులు పట్టుకుని. బొమ్మ దిగువ - 'చిన్న కుటుంబం చింతలులేని కుటుంబం' అతను నవ్వాడు. "దేశానికి జనాభా ఎక్కువై యిలా—" అనబోయాడు.

"పిల్లలు ఎక్కువవడం కాదు. మనిషి సృష్టించిన డబ్బులాగే దేముడు సృష్టించే పిల్లలు కూడా సరిగా పంపిణీ కాక - అయితే అతివృష్టి లేకపోతే

అనావృష్టి. కోరుకున్నవారికి కలగరు. వొద్దనుకున్నవారికి కొల్లలు."

ఆమె కంఠంలోని భారానికీ గంభీరానికీ తృళ్ళిపడ్డాడతను. "పద్మా!"

ఆమె తొందరపడినట్లు తెలుసుకొని కారెక్కి, "పదండి" అంది.

కారులో ఆమె యింకేమీ మాట్లాడలేదు. సాయంత్రం వరకూ అతనూ ఏమీ అనలేదు. కోవెలలో... దైవదర్శనం చేసుకొని కొలను వొడ్డున కూర్చున్నాక అతను నవ్వుతూ అడిగాడు. "పద్మా! భగవంతుణ్ణి చాలాసేపు ప్రార్థించావు. ఏం కోరుకున్నావేం?"

"ముందు మీ సంగతి చెప్పండి."

"నేనేమీ కోరుకోలేదు. ఎందుకంటే-కోరుకుందుకు నాకేమీ కనిపించలేదు. నువ్వున్నాక నాకింకేం కావాలీ?"

"నిజం చెప్పండి."

"నీ దగ్గర అబద్ధం చెబుతానా! ప్రేమించడం, ప్రేమించబడడం రెండు వరాలూ లభించిన మనిషి కింకేముంటాయి కోరుకుందుకు?" అంటూ అతనామె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

"జీవితమంటే ప్రేమేనా?" అనుకోకుండా అడిగేసిందామె.

"కాక?" తెల్లబోయి చూశాడు.

ఆమె మౌనంగా వుండిపోయింది. అస్తమించబోతున్న సూర్యుణ్ణి చూస్తూ.

"పద్మా!"

"క్షమించండి. నా కిప్పుడలా అనిపించడం లేదు." పొడిగా అందామె.

భరించలేనట్లు చూశాడతనామె వేపు. పద్మేనా ఆ మాటన్నది?

గతం మరచిపోయిందా? ప్రేమ కోసం ఆమె తనూ చేసిన త్యాగాలూ. సాహసాలూ అన్నీ మరచిపోయిందా? కులం - తల్లితండ్రులు - ఆస్తిపాస్తులు-బంధువులు — అన్నీ వదులుకొని వచ్చిన పద్మకి ఇవాళ జీవితమంటే ప్రేమకాక మరేమిటనిపిస్తూంది!

"ఔను నిజమే! సారీ-వెరీ సారీ-అప్పుడు నిజంగా అంతే. ప్రేమే జీవితం, జీవితమే ప్రేమ. కాని ఇప్పుడు - నలభై ఏళ్ల నిండబోతున్న తరుణంలో జీవితమంటే ప్రేమ మాత్రమే కాక ఇంకా ఏదో కూడా అనిపిస్తూంది—".

"ఐతే పశ్చాత్తాపపడుతున్నావా?" దెబ్బతిన్నట్లు అడిగాడు ఆమె చేతిని వదిలేసి,

"మిమ్మల్ని చేరినందుకా! ఎంతమాత్రమూ లేదు. మీరు లభించడం నా అదృష్టం. నిన్నటివరకూ యీ వరంతోనే తృప్తిపడుతూ వచ్చాను, కాని-"

"కాని?" ఆత్రంగా చూశాడు.

"నాకీ అదృష్టం చాలదు. నాకింకా రావాలి."

"ఏమిటి?"

"చెబుతాను. చెప్పడానికే నిశ్చయించుకున్నాను. ముందు మీరొకటి చెప్పండి. మీకు జీవితం తృప్తిగా ఉందా?"

"నిజంగా చాలా హాయిగా వున్నాను. నేను ప్రేమించే, నన్ను ప్రేమించే నీలాంటి భార్య; విలాసంగా జీవించడాని కవసరమయినంత డబ్బు-నలుగురిలోనూ మంచి పేరూ, పలుకుబడి - మనిషికింకా ఏం కావాలి?"

"ఆత్మవంచన చేసుకోకండి-నన్ను మభ్యపెట్టాలని."

"నేను మనస్ఫూర్తిగా చెబుతున్నాను. జీవితం నాకు చాలా సుఖంగా సంతోషంగా ఉంది. అందుకు కారణం నువ్వే." నిజాయితీ, చిత్తశుద్ధి అన్నీ ప్రతిఫలించాయతని కంఠంలో.

"ఎంత అదృష్టవంతులు!" ఆమె నిట్టూర్చింది. "ఔను. మీరు మగవాళ్ళు. నేను స్త్రీని."

"ఐతే!?"

"నాకు మన యిల్లు ఎంతమాత్రమూ నచ్చడం లేదు."

ఆశ్చర్యపోయాడు. నిజంగా పద్మ మనసింత చంచలమా? "అదేమిటి? నువ్వు కోరినట్లే కట్టించుకున్నాంగా! విశాలమయిన జాగాలో — చుట్టూ గార్డెన్. మధ్యన భవనం. మొజాయిక్ ఫ్లోరింగ్‌లూ, రన్నింగ్ వాటరూ, అటాచ్‌డ్ బాత్ అండ్ లావొటరీసూ, బోలెడన్ని గదులూ, మనది మోడర్న్ హోమేగా? నీ అభిరుచులమేరకే నిర్మించబడిందిగా!

"ఇల్లంటే గదులూ గోడలూ కావు. నాకీ యింట్లో కాదు, అసలీ జీవితంలోనే ఉండాలనిపించడం లేదు." విరక్తిగా అందామె. "ఈ జీవితంలో ఏముందని?"

"పద్మా!" నిర్ఘాంతపోయాడతను. పద్మకింత విరక్తా జీవితం మీద! ఏమైందని? ఏం కాలేదని?

"స్త్రీ అంటేనే యింతే ఏమో! మీరు మగవాళ్లు—కనుక అదృష్టవంతులు. ప్రేమించే భర్త, సకలయిశ్వర్యాలూ వున్నా - ఇంకా ఏదో కావాలనిపిస్తూనే వుంది. జీవితంతో రాజీ, తృప్తి పడలేకపోతున్నానెంత ప్రయత్నించినా."

"నీకు కావాలనిపిస్తున్నదేమిటి పద్మా!"

"ఏ స్త్రీ అయినా కోరుకునేదే. పిల్లలు."

"పద్మా!" బాధగా చూశాడు.

"మీరు బాధపడతారు. నాకు తెలుసు. కాని ఏం చేసేది? నా సొద మీ ముందు వెళ్ళబోసుకోకుండా ఉండలేకపోతున్నాను. సానుభూతితో అర్థం చేసుకోండి. స్త్రీ జన్మకి ఒక ప్రయోజనాన్ని నిర్దేశించింది ప్రకృతి. ఆమె జీవిత సాఫల్యం సృష్టించడంలోనూ సృష్టిని కొనసాగించడంలోనే ఉంది. ఆ పవిత్ర బాధ్యతను నిర్వర్తించలేని స్త్రీ బ్రతుకు భూమికి బరువూ నిరర్థకమూ. నేనూ అలాగ వ్యర్థురాలినే.

మీకు తెలియదు. నేను ఆత్మన్యూనతా భావంతో — ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్‌తో కృంగిపోతున్నాను. అందరు స్త్రీలూ తాము అక్షరాలా స్త్రీలమని నిరూపించుకుంటూంటే, గర్వపడుతూంటే నేను మాత్రం పూలు పూయని గొడ్డు మొక్కలా - గొడ్రాలిలా ఉండిపోతున్నాను. నాకీ జన్మ వొట్టి నిరర్థకమనిపిస్తూంది. అమ్మా అని పిలిపించుకోలేని నా బ్రతుకు వృథా అనిపిస్తూంది.



బిడ్డని హృదయానికి హత్తుకుని పాలిచ్చి వాత్సల్యం కురిపించలేని నా హృదయం స్పందన నెరుగని శిలే అనిపిస్తూంది. అందుకే నాకీ బ్రతుకు ఎడారి ఐపోతూంది. ఇంకా ఏం చెప్పేది? ఎలా చెప్పేది?" దుఃఖం ఆపుకోలేక పోతూందామె. అతను ఆశ్చర్యపోయాడు. మామూలుగా కనిపించే పద్మలో ఇంత దావానలం చెలరేగుతూందా? తనెందుకు తెలుసుకోలేకపోయాడు? ఇందుకేనా స్త్రీ హృదయం అగాధమంటారు.

"పద్మా! ఏమంత వయసు మీరిపోయిందని ఇంత దిగులు పడడం? ఇద్దరమూ ఆరోగ్యవంతులం. ఇంకా బోలెడంత జీవితం ఉంది ముందు. పిల్లల్ని కనడానికేముంది? ఈ దేశానికున్న సంపదే అది." తేలిగ్గా తీసివెయ్యబోయాడు.

"మీ దృష్టిలో నేను చిన్నదాన్నేమో కాని...నిజంగా నాకు వయసు మీరిపోయింది. నలభై ఏళ్ళ ఆడదానికింకేం పిల్లలు పుడతారు? ఆ అర్హతా, దశా దాటిపోయాయేమో. అయ్యే చెట్టు ఆకులలోనే తెలుస్తుందంటారు. ఈ జీవితానికిక ఇంతేనేమో. నేను ఆడదానిగా మిగలవలసిందే తప్ప అమ్మని కాలేనేమో!.."

"పిచ్చిగా మాట్లాడకు పద్మా! ఎంత ఆడదానివయినా నలభై అంటే ముసలితనమేమీ కాదు. కొంతమందికి ఆలస్యంగా పుడతారు. మా పెద్దమ్మ..."

"వద్దండి. నన్ను మభ్యపెట్టబోకండి. ఆశ నిరాశ అయితే భరించడం మరీ కష్టం. ఇన్నాళ్ళూ-ఇన్నేళ్ళూ ఎంత సహనంతో, ఆశతో, ఎదురు చూశానో! మీకు తెలియకుండా ఎన్ని దేవుళ్ళకి మొక్కానో! ఎన్ని పూజలు చేశానో!"

"పిచ్చీ! పూజలకీ మొక్కులకీ పిల్లలు పుడతారా? మళ్ళీ చదువుకున్న దానివి!" విషయాన్ని, వాతావరణాన్ని తేలిక పరచడం కోసం నవ్వుతూ - "రేపు మనమిద్దరం డాక్టరు వద్దకి వెళ్దాం." అన్నాడు.

ఆమె అతన్ని వినిపించుకోలేదు. "నా బాధ మీకు తెలియదండీ. నలుగురూ-"జయదేవ్‌కి ఎంత డబ్బుంటే ఏం? పిల్లలు లేరు. అని మీ గురించి హేళనగా అనుకుంటారు. నా వల్లనే మీకీ అవమానమూ, లోటూ. మీ ప్రేమంతటికీ నేను మీకు మిగుల్చుతున్నది యీ చిన్నతనమే. నన్నెందుకు ప్రేమించారు? ఈ గొడ్రాలి కోసం ఎందుకంత తహతహలాడారప్పుడు?" ఏడ్చేసిందామె.

"మూర్ఖంగా మాట్లాడకు. నేను కోరుకున్నదీ, కోరుకునేదీ నిన్నే. పద్మా! మనకి పిల్లలు లేకపోయినా-ఐ డోంట్ కేర్. నా జీవితానికర్థం నువ్వే." ఆవేశంగా, ఆర్తంగా అన్నాడు. "అంతరాత్మ సాక్షిగా చెబుతున్నాను. నేను పిల్లల కోసం ఆలోచించనూ లేదు, ఆరాటపడనూ లేదు, తపించనూ లేదు. నాకీ ప్రపంచంలో నువ్వు చాలు.

"అందుకే నాకింత ఆవేదన. నన్నింతగా ప్రేమించే మీకు నేనివ్వవలసినదే ఇవ్వలేకపోతున్నాను."

"కాని-నేనది కోరుకోవటంలేదు" ఖచ్చితంగా అన్నాడు.

"నేను ఆడదాన్నండీ. వొట్టి ఆడదాన్ని, ఆశపోతుని. నా ప్రేమ స్వచ్ఛమూ, నిష్కళంకమూ కాదు. మీ అంత నిష్కామంగా ప్రేమించలేకపోతున్నందుకు సిగ్గుతో చితికిపోతూనే వున్నాను. నన్ను మన్నించండి. నాకు-మీ ప్రేమ చాలడం లేదు. ఒకప్పుడు మీరే నా వరం! మీ ప్రేమే నా జీవితం! నిజమేకాని ఇప్పుడు-మీ ప్రేమ నాకు చాలడం లేదు. ఔనండీ! నేను ఆడదాన్ని. అమ్మని కావాలన్న ఆరాటం, అమ్మని కావాలన్న తపన, నా బిడ్డ నోట అమ్మా అని పిలిపించుకొని వినాలనే ఆర్తత నన్ను దహించేస్తున్నాయి.

మీకు తెలియదు! స్త్రీ-స్త్రీ అయ్యేది సంతానంతోనే. మాతృత్వంతో తప్ప ఆమెకు శారీరకంగానీ, మానసికంగా కాని, సామాజికం గానీ వికాసం వుండదు. సంతానం స్త్రీకి శారీరక, మానసిక, సాంఘికావసరం! ఇది నాకు తీరే యోగం లేదు"

"దానికేముంది? ఎవరినయినా పెంచుకుందాం. అనాథ శరణాలయాలలో అమ్మా నాన్నల నెరుగని పిల్లలు కోకొల్లలు"

"వొద్దండీ. మీకు తెలియదు. మన చుట్టూ ఎటువంటి దుర్మార్గులు పొంచి కూచున్నారో. అయినా అరువు సొమ్ము బరువు చేటు! కంపే కర్మ కాని పెంచుకునే ప్రారబ్ధమా అని ఊరికే అనలేదు. అలాగ నాకిష్టం లేదు. నా బిడ్డని నేనే కనాలి" విస్పష్టం చేసిందామె.

అతనికి భయం వేసింది. ఏమిటింత పిచ్చిదైపోయింది పద్మ? ఎలాగ యీ మెని రోడ్డుకి తీసుకురావడం? మనసు మార్చడం?

"సంతానం భగవత్ప్రసాదమే! అది అత్యంత అపురూపమయిన వరం! మనం ఎన్ని విధాల అదృష్టవంతులమైనా అక్కడ మాత్రం చాలా దురదృష్టవంతులమే-ఏ పాపం చేశానో దేముడికి నా మీద దయ కలగలేదు"

"అదికాదు పద్మా!" ఆమె ధోరణి కానకట్ట వేయబోయాడు.

"నా మాటల కడ్డుపడకండి. ప్లీజ్... మీకు కాకపోతే ఎవరికి చెప్పుకోగలను నా గుండెలలోని బాధ?

ఇన్నాళ్ళూ ఆశతోనే కాలం గడిపాను.

ఇవాళ కాకపోతే రేపయినా బిడ్డలు పుట్టరా అని ఆశపడుతూనే వచ్చాను! కాని—నా ఆశ నిరాశే ఐపోయింది.

"పద్మా!" జాలిగా, లాలనగా పిలిచాడు!

"ఇంక నాకీ ఆశ కూడా లేదండీ, అందుకే-"

అతనామెవేపు ఆర్తంగా, భయంగా చూశాడు.

"ఇన్నేళ్లుగా ప్రతి పుట్టినరోజుకీ నాకు మీరు కానుకలిస్తున్నారు నేనడగకుండానే! ఔనా?"

"ఊఁ"

"ఈసారి నేనొకటి కోరుకుంటాను! ఒక్క కోరిక...ఒకే ఒక్క కోరిక. ఇది తప్ప ఇంకేమీ కోర నీ జన్మలో! కాదనరు కదూ?" ప్రార్థిస్తున్నట్లే చూసింది ఆమె అతి దీనంగా.

"ఏమిటి?"

"ముందు వాగ్దానం చెయ్యండి, కాదనననని!"

"నామీద, నా మాటమీద నమ్మకం లేదూ? ఎంత మారిపోయావ్!"

"అందుకే! మీమీద, మీ మాటమీద చాలా నమ్మకం కనుకనే.'

"సరే! కాదనను, అడుగు" అన్నాడతనేమిటీ ముందరి కాళ్ళకు బంధం అనుకుంటూనే.

"ప్రామిస్-?"

"ఊఁ!" చేతిలో చెయ్యి వేశాడు. ఏమిటి కోరబోతూందీమె? పిల్లల కోసం తనని రెండో పెళ్ళికాని చేసుకోమనదు కద? అసాధ్యం! తనకి స్త్రీ అంటే పద్మే! ప్రాణం పోయినా మరో స్త్రీని తన జీవితంలోకి హృదయంలోకి తెచ్చుకోడం జరగదు! పద్మ కోరబోయేదేమిటి?

ఎలా చెప్పాలా అని కాబోలు ఆమె ఆలోచిస్తూంది.

(ఇంకా వుంది)

(39 వ పేజీ తరువాయి)

పంపని ఆదిపురాణం ప్రకారం, పౌరాణిక వృషభాచలం ఉండినది "ఉత్తర భరత మధ్యమ ఖండన నట్టనడువణెడెయొళ్" (ఆదిపురాణం. 13.69. వ) జినవల్లభుని ప్రకారం, ఆతడు పేరుపెట్టిన వృషభాచలముండినది" సబ్బినాడ నట్టనడువణ ధర్మపురదుత్తర దిగ్భాగదల్లి" ఆదిపురాణ కథాప్రసంగం, అంకితనామాలు, భాష మొదలైనవి శాసనంలో దాగి వుండడాన్ని ఎవరైనా గమనింపవచ్చును.

జినవల్లభుడు ఒకచోట మాత్రం పంపని "ఆదిపురాణా"న్ని సూచించినట్టు కన్పిస్తుంది. ఈ శాసనపద్యాన్ని గమనించండి.

ఎసగలాళి పుగల్ పతంగ కిరణం సారల్మృగం పాఱలా
గసదొళ్ పక్కిగళల్లి సల్లవెని సిర్దన్యోదయం ధర్మ దొ
ళజసమం పొంపుఱుమాడె మెచ్చి హరిగం పంపంగె గొట్టాద్విజా
వసథ గ్రామమదే న్నెగఱ్దాయ కళాపగ్రామం పోల్తుదో॥

దీనికి డా. వెంకటాచలశాస్త్రిగారి అర్థం ఇలా వుంది—"అక్కడ గాలి వీచడానికి సూర్యకిరణం ప్రవేశించడానికి, మృగాలు సంచరించడానికి, (దానిపై) పక్షులు విహరించడానికి, సాధ్యం లేదనిపించి, అన్యత్వపు ఉదయం ధర్మంలో యశస్సును పెంచునట్లు మెచ్చి (చేసిన ధర్మకార్యంవల్ల తన కీర్తి అధికం కాగా) అరికేసరి పంపనికి ఇచ్చిన ఆ అగ్రహారం ప్రసిద్ధమైన కళాపగ్రామాన్ని ఏమి పోలినదో"[22] వారు తమ టిప్పణిలో[23] అన్య ఉదయము అంటే పారలౌకిక అపేక్ష అని కావచ్చును; అయితే ద్వాదశానుప్రేక్షలలో ఒకటైన అన్యత్వపు ఉదయం అని ఇక్కడ తాత్కాలికంగా అర్థం చెప్పబడింది. 'అన్యత్వ'మంటే సంసారంలో క్లేశాలను తెచ్చిపెట్టే ధన ధాన్యపుత్ర కళత్రాదులు తనవికావు, అవి అన్యవస్తువులని భావించునది". అయితే డా. శాస్త్రిగారి వివరణ అంత ఉచితంగా లేదు. "ఎళగల్గాళి...సల్లవు" అనే మాటలను 'ధర్మా'నికి అన్వయించాలి. ('అన్యోదయా'నికంటూ అన్వయించడం సాధ్యం కాదు. "వినిసిర్ద" అనే మాట కూడ గమనార్హం.

పై పద్యానికి ముందు పద్యంలో జినవల్లభుడు విక్రమార్జున విజయం పేరును చెప్పాడు; మరియు పై పద్యంలో అరికేసరికి పంపడిపై ఎందుకు ప్రీతి ఏర్పడింది అనే వివరణ ఉంది. ఇక్కడ ఒక సంగతిని గమనించాలి. పంపడు ఆదిపురాణ కావ్యాన్ని వ్రాసేటప్పుడే అరికేసరి దృష్టికి వచ్చాడనడానికి ఆతడు తన "కవితా గుణార్ణవ"మనే బిరుదును పలుచోట్ల చెప్పికొని వుండడమే సాక్షిగా ఉంది. అరికేసరి దానం ఇచ్చినది విక్రమార్జున విజయానికే అయినా, ఆ ముందే పంపడు ఆదిపురాణంలో 'ధర్మా'న్ని ప్రతిపాదించి అరికేసరి మెప్పును పడసి ఉండాలి. పంపడు ఆదిపురాణంలో 'ధర్మా'న్ని సంపాదిస్తే ఆతనికి "కీర్తి" వచ్చినది విక్రమార్జున విజయంవల్ల. మొదటి కావ్యపు 'ధర్మం'[24] రెండవకావ్యపు యశస్సువల్ల వృద్ధియై అరికేసరికి హర్షమై అతడు ధర్మపురాన్ని దానంగా ఇచ్చాడన్న విషయం పై పద్యంవల్ల సూచితమవుతుంది. ఈ పూర్వరంగంలో పై పద్యానికి ఈ విధంగా వ్యాఖ్యానం చెప్పుకోవచ్చు—

"పంపడు ప్రతిపాదించిన ధర్మం అన్యంనుండి ఉదయించినట్టిది—అంటే ఇంతకుమునుపు చెప్పిన కావ్యం విక్రమార్జున విజయంనుండి భిన్నమైన ఆ కరం నుండి, అంటే ఆదిపురాణం నుండి ఉదయించినట్టిది. ఆ ధర్మం ఎంత ఉన్నతమైనటువంటిదంటే అక్కడ గాలి వీచదు, సూర్యకిరణాలు ప్రవేశింపలేవు, మృగాలు సమీపించలేవు, పైన పక్షులు విహరింపలేవు. అంత ఉన్నతమైన ధర్మంతో (విక్రమార్జున విజయంనుండి సంపాదించిన) యశస్సును చేర్చి వృద్ధి పరచిన కావ్యానికి అరికేసరి మెచ్చి పంపనికి ఇచ్చిన ఆ అగ్రహారమూ, ప్రసిద్ధమైన కలాపగ్రామాన్ని పోలుతుంది, ఏమి ఆశ్చర్యం"

జినవల్లభుడు పై పద్యం మూలంగా, అరికేసరి లౌకిక కావ్యమైన విక్రమార్జున విజయాన్ని మాత్రం మెచ్చుకొని, జైనధర్మపు ఆదిపురాణాన్ని ఉపేక్ష చేశాడు, దాన్ని లక్ష్యపెట్టలేదు అనే ఆరోపంవల్ల అరికేసరిని వదలివేశాడు. కావ్యజ్ఞుడైన అరికేసరికి రెండు కృతులూ ఇష్టమయ్యాయి-ప్రశస్తి లేదా దానం ఇచ్చేటప్పుడు విక్రమార్జున విజయాన్ని పేర్కొన్నాడు. ఈ వ్యాఖ్యానం అరికేసరియొక్క కావ్యాభిరుచిపై మన గౌరవాన్ని అధికం చేసేది అయిందన దాన్ని ఇక్కడ సూచించడం అగత్యమయింది.

1. ప్రబుద్ధ కర్నాటక. 50:3 [అక్టోబరు, 1968] పుట 28-41. దీనికంటే ముందు ఈ వ్యాసం తెలుగుమూలం 'భారతి'లో ప్రకటింపబడింది. [మార్చి 1967]. దానికంటే ముందే డా. వెంకటరమణయ్యగారి ఆంగ్ల వ్యాసం పూర్తి పాఠాన్ని 1966 డిసెంబరులో వారు చెప్పగా విన్న నేను వారి అంగీకారాన్ని పొంది జినవల్లభుని శాసన పరిచయాన్ని ఒక చిన్న టిప్పణిలో వివరించాను. [ప్రబుద్ధ కర్నాటక. 48:4 వస్తుకోశ]. పంపని తమ్ముడి శాసనం గురించి కన్నడంలో వచ్చిన మొదటి వ్యాసం అదే. [వ్యాసకర్త చెప్పగా విని వ్రాసిన పరిచయాత్మక టిప్పణి కావడంవల్ల అందులో ఒకటి, రెండు తప్పులు దొర్లాయి.]
2. అదే. 53:4 [జనవరి 1972] పు. 73-83. దీనికిముందు శాసనపాఠం గురించి ఒక చిన్న వ్యాసాన్ని డా. గాయి ప్రకటించారు. [అదే. 50:4, డిసెంబరు 1968]
3. కర్మవీర [24-5-1970]
4. గంగాధర అనే రోమన్ లిపివల్ల ఏర్పడిన తొందరవల్ల ఏర్పడి ఉండొచ్చు.
5. హండీకీ ఉదాహరించినది యశస్తిలక ఎండ్ ఇండియన్ కల్చర్, షోలాపూర్ 1949 పు 3,
6. వృషభాద్రి మరేదీ కాదు, నేటి బొమ్మలమ్మ గుట్టయే అనడంలో సందేహం లేదు.
7. ప్రబుద్ధ కర్నాటక, 50:3, పు 31-2
8. ప్రబుద్ధ కర్నాటక. 53:4 (జనవరి 1972) పుట 80-1. దీనితోబాటు వారి మరొక వ్యాసం కూడ చూడండి. ప్రబుద్ధ కర్నాటక, 50:4 (డిసెంబరు 1968)
9. కర్మవీర. 24-5-1970 పుట 21. బొమ్మలమ్మ గుట్టను ఎక్కి అక్కడి శాసనాన్ని పరిశీలించి, పంపడి మరో శాసనం ఉండవచ్చునని బండలమధ్య తిరిగి, గుట్టనుండి దిగి కుర్క్యాల గ్రామానికి సాయంకాల సమయానికి వచ్చిన వర్ణనపై ఉద్ధరణలో ఉంది. ఈ ఉద్ధరణతో వ్యాసం పూర్తవుతుంది.
10. గుట్టనుండి దిగి వచ్చేటప్పుడు ఇటుక మట్టిపాత్రల ముక్కలు కన్పించాయని ఇటీవల (కన్నడప్రభ 5-3-1985) చెప్పారు: తమ విస్తారమైన ప్రవాస కథనంలో ఏవేవో వివరాలను సంగ్రహించినవారు ఈ విషయాన్ని చెప్పకుండా ఎందువల్ల వదలివేశారు అన్న ప్రశ్న ఉదయిస్తుంది. కుర్క్యాల గ్రామం వెళ్ళగానే తాము చూచిన పాత నివేశం గురించి ప్రశ్నించినట్టుగా కూడ అగుపించదు. అంతేకాక గ్రామప్రజలు ఆ నివేశంలో త్రవ్వినప్పుడు ప్రాచీన వస్తువులు లభిస్తాయని చెప్పినప్పుడు, తాము మొదటే చూచిన అవశేషాలను స్మరించుకొన్నట్టుగా కూడ సూచన లేదు. ఇవన్నీ వారి అభిప్రాయాలను సందేహంలో పడవేస్తాయి.

ఒకవేళ చూచింది నిజమైనా వాటి కాలాన్ని నిర్ధారించుకోవడానికి ఎలాంటి ప్రయత్నమూ వారు చేయలేదు. ధర్మపుర పరిశోధనా చరిత్రలో (హిస్టోరియోగ్రఫీ) వారు 1970 లో ఏమి వ్రాశారు; మరియు ధర్మపురపు నా పరిశోధనా పత్రిలలో ప్రకటమయ్యేదాకా (కన్నడప్రభ 16-2-1985) వారు ఏమి వ్రాశారు అనే అంశాలను మాత్రం లోతుగా పరిశీలిస్తాను ఈ చిన్న వ్యాసంలో.

11. ఈ సందర్భంలో నేను డా. కల్బుర్గిగారి "కర్మవీర" లోని వ్యాసాన్ని అది ప్రకటింపబడినప్పుడు చూచి వున్న దాని వివరాలను సంపూర్ణంగా మరచిపోయానన్న విషయాన్ని ఇక్కడ తెలియజేస్తున్నాను. వారి కర్మవీర లోని వ్యాసం ఆ తర్వాత వారి వ్యాస సంగ్రహాలలో ప్రకటింపబడలేదు. విద్వత్

పత్రికలో లేదా గ్రంథంలో ప్రచురింపబడే వ్రాతకూ, దినపత్రికలు: వార పత్రికలలో ప్రచురింపబడే జనప్రియ వ్యాసానికి మనం వ్యత్యాసాన్ని గుర్తించాలి, దినపత్రిక లేదా వారపత్రికలలో వచ్చినవాటిని ఎవరూ సంగ్రహించి వుండరు, మరియు వాటి వివరాలు మరచిపోతే క్షమించాల్సి వుంటుంది. అయితే అదే మాటను మొదటివర్గం వ్రాతలకు అన్వయించలేము.

హైదరాబాదు పురాతత్త్వ విభాగంనుండి రిటైరయిన శాసనతజ్ఞులు శ్రీ పి. వి. పరబ్రహ్మశాస్త్రి వారివల్ల అదే విభాగపు డా. రామచంద్రమూర్తి గారు కుర్క్యాల సందర్శనా సందర్భంలో నాతోపాటు రావడానికి సాధ్యమైంది. అంతేకాక నాతోపాటు ఉండి, అనేక విధాలుగా సహకరించి, ఫోటోలను తీసి ఇచ్చినవారు డా. ఆర్. శేషశాస్త్రి (కన్నడ అధ్యాపకులు, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం). వీరిరువురికీ నేను కృతజ్ఞుణ్ణి.

12. 80 సంవత్సరాల తడకమల్ల వీరయ్య అనే అతను మాత్రమే కాక కురిక్యాల గ్రామంలో పలువురు ఈ అంశాలను సమర్థించారు. గ్రామవాసుల మాటల్లో ధర్మపురం, ధర్మపురి, ధర్మార మొదలైన రూపాలు లభిస్తాయి.

13. పూర్వోక్తవ్యాసం. పుట. 32

14. పూర్వోక్త వ్యాసం, పుట-76,

15, పంపభారతం, 14. 56-57. అరికేసరి పంపనికిచ్చిన తామ్రపలకం లభించకపోయినా, అందులో అరికేసరి శౌర్యం, సాహసం, సత్యసంధత, త్యాగం మొదలైన గుణాల వర్ణన ఉండేవనీ, లానిచ్చిన ధర్మపుర దానం శాశ్వతంగా ఉండాలన్న కోరికగల మాటలుండేవనీ తెలియవస్తుంది. ఈ విషయాలు అన్ని శాసనాలలోను వుంటాయి.

16. జినవల్లభుని కుర్క్యాల 'శాసన అర్థం', శబ్దార్థ విహార, మైసూరు, 1979 పు. 30.

17. ఈ అంశంవైపు నా దృష్టిని కేంద్రీకరింపచేసినవారు డా. ఆర్. శేషశాస్త్రి.

18. "అర్ణవ"మంటే సముద్రం: "కవితా గుణార్ణవ" మనే పంపని బిరుదును తటాకానికి పెట్టడంలో అంత్యశబ్దం పనిచేసింది. —సముద్ర (-సంద్ర), —సాగర ఇలా అంత్యమయ్యే పేర్లను తటాకాలకు పెట్టడాన్ని ఇక్కడ జ్ఞాపకం చేసుకోవాలి.

19. ఆదిపురాణం (సం: ఎల్ బసవరాజు), మైసూరు, 1976. 14.59వ

20. చూడు - మిర్జి అణ్ణారావు: జైనధర్మ. సేడబాళ. 1952 పుట 506— "ఈ గుణాలతో కూడిన సిద్ధులు ఏ కార్యాన్ని చేయరు. వారు దర్శనజ్ఞానాల ఖని వున్నట్టు జైన దార్శనికుల మతం ప్రకారం వారున్న స్థలానికి "సిద్ధశిల" అనే పేరు. అది శాంతిమయమైనది. దానిచుట్టూ, పైనా స్తబ్ధమూ, అనిర్దేశ్యమూ, అనంతమూ, స్థిరమూ అయిన అలోకాకశం వుంటుంది. దాని మధ్య సిద్ధులు స్వభావస్థితులై యుంటారు. వారినుండి క్రిందకు దూరంలో కర్మబంధసమనే జగత్తు - లోకాకాశము అయి వుంటుంది"

21, ఆదిపురాణ (సం॥ ఎల్. బసవరాజు) మైసూరు. 1976. 11.68: 11.69

22. పూర్వోక్త గ్రంథం. పుట 27.

23. అదే. పుట 28.

24. చూడు. "ఆదిపురాణ దొళఱువుదు కావ్యధర్మమం ధర్మముమం" ●
(ఆదిపురాణం. 1.37)

ప్రతి బింబాలు

శ్రీమతి కొండేపూడి నిర్మల

"ఈ దారెటు పోతాది బాబూ?"
ఎటూ పోదు నీలాగే యిది కుంటిది
తరాలుగా తెగి పడి వుంది
నిట్టూర్పైనా వినిపించకుండా
వెన్ను మీద ట్రాఫిక్‌ను మోస్తోంది
విన్నటిదాక ఒంటికన్ను రాకాసిలా
ఒక్క దీపం వెలుగులో
ఆమూల చీడీలు వరకూ
అరచేతుల్లో నడిపించేది
ఇప్పుడదీ లేదు
రాయి విసిరిన ఏ చెయ్యి శపించిందో
దీపం గుడ్డు చిదికి చీకటి రక్తం స్రవిస్తోంది
పాదాలు తడవకుండా నడవాలి
అడ్డు తప్పుకో అట్టే విసిగించకు
"ఎరికె నేదు బాబూ మళ్ళీ సెప్పు"
సర్లె సర్లె నీ కెలాగూ అర్థం కాదు
నా కవతల బోల్డు పనులున్నాయి
తెలీయడం లేదూ
రెప్పల ఫ్రేములో
బిగించిన ద్రాక్ష రంగు దర్పణం
ఉద్విగ్నతతో తనకేసి హత్తుకున్న నిలువెత్తు దృశ్యాలు
ఏ కాన్వాసు పనికొస్తుంది దీని ముందు
పూల పరిసరాలు తాగితాగి మత్తెక్కిన
నా నాజూకు వాలు చూపుల్ని
అలా డిస్టర్బ్ చెయ్యకు
రోలరు కింద కంకర చితికిన శబ్దంలా
మూలుగూ నువ్వూనూ
నే తప్ప ఎవరూ దొరక లేదూ
అడిగో వాడ్నడుగు
గుప్పెడు బొగ్గు ముక్కల్ని
వజ్రపు తునకల్లా
చిరుగు జేబులో దాచుకున్న వాడ్ని
నడిరోడ్డు మీద దేవుని బొమ్మలు గీస్తున్న వాడ్ని
నుంచున్న వాడిఅస్తిత్వాన్ని డబ్బు చేసుకుంటున్న వాడ్ని
ఒంటి చెయ్యి వాడ్ని
పూర్ణించని చంద్రుడ్ని
లేపోతే వీడ్నడుగు
ఆకాశమంత జోలిలో
నక్షత్ర నాణాల్ని తడుముకుంటున్న వాడ్ని
గజ్జి కురుపుమీద ముసిరే ఈగలా
ఆగకుండా పాటలు పాడుతున్న వాడ్ని
ఒక కన్ను నేలకీ ఒక కన్ను నింగికీ
అంకితం చేసిన వాడ్ని
మెలికె చూపుల వాడ్ని
మెరవని నెలవంకని
అబ్బబ్బ
ఎందు కొచ్చారు మిరంతా ఈ రోడ్డుకేసి
ఎవరిచ్చారు మీకు నా చూపుల్ని ఆక్రమించే హక్కు
అలా దీనంగా నా ముందు నిలబడకండి
వెళ్ళండి
తిరుగుబాటుగా చూడకండి
పదునైన ప్రశ్న లేవీ వన్నడక్కండి
వెళ్ళిపొండి
నా రెప్పలు కంది పోకముందే
నా దృశ్యాలు తడిసి పోకముందే
నా వసంతం పొలిమేరలు దాటి పోక ముందే
అంతర్జాతీయంగా ఈ దేశం
మీకేం చేస్తోందో తెలీదు కాని
రెప్పా రెప్పా కలిపి ఎంత కన్నీటిని అభిషేకించినా
మీ ప్రతి బింబాలు తుడి చెయ్యలేకుండా వున్నాను.

కేటుకు

కాలువశ్రీ

ఈతనార చేతుల్లోకి తీసుకొని కత్తితో చీల్చుతూ దాంతాడు పేనుతున్నాడు బుచ్చయ్య. ఈతకమ్మ చీరడంవల్ల ఎర్రబడిన చేతులు మండుతున్నాయి. చేతుల్లో రక్తం పేరుకొనుంది. ముఖంపై నల్లటి శరీరంపై చెమట బిందువులు దగధగా మెరుస్తున్నాయి. బుచ్చయ్యకు సమీపంలో వాకిట్లో కొడుకును కూర్చుండబెట్టి కంచుతలెలో రాత్రి మిగిలిన చలి గడుక వేసి కొడుకు ముందుంచింది మధునమ్మ. గుడిసెలో పొయ్యిమీదుంచిన గడుకెసరు 'సుయ్' మని పొంగుతుంది. "గడుకెసరు పొంగుతంది బిడ్డ. ఎసట్ల గడుక వోసత్త. గిది తిను. అని గుడిసె లోపలి కెళ్ళింది మధునమ్మ.

ఆరేళ్ళ పసివాడు రామయ్య తలెలో చేయిబెట్టి చలిగడుకను అటూ ఇటూ గెలుకుతున్నాడు. పాచిపోయిన వాసన 'గుప్'మని వస్తుంది. ఎర్రటి మిరపకారంతో గడుక కలిపి నోట్లో పెట్టుకోబోయాడు. ఎంత ప్రయత్నించినా అది లోపలకు పోవడం లేదు.

"అవ్వా! బువ్వంత ఆసనత్తంది. నేందిన- అన్నాడు రామయ్య.

ఎసట్లో గడుక పోసి తెడ్డుతో రుద్ది బయటకొస్తున్న మధునమ్మ కొడుకు మాటలు విని "పాసిపెయింది బిడ్డ. బువ్వొడుకెరాక ఆగుమంచేనేమొ ఆగపోతివి. ఎట్లనో నాలుగు బుక్కల్దిను. ఉడికినంక మల్లింత తిందువుగని" అని ఓ బుక్క తీసి కొడుకు నోట్లో పెట్టబోయింది.

"నీయవ్వ నాకు పాసిపెయిందద్దు పో. నాకు మెతుకుల బువ్వే కావాలె" అని ముందటున్న తలెను (కంచు కంచంను) దూరం జరిపాడు.

"మనసు మెతుకుల బువ్వెట్ల దొరుకుద్ది బిడ్డ...ఇంక నాలుగొద్దులయితె యాకాశి పండుగత్తంది...పండుగనాడు తిందువు తియ్య..." అని కొడుకును బ్రతిమిలాడింది మధునమ్మ.

"ఏముద్దు నాకిప్పుడే గావాలె పో" అని ముక్కువెంట చీమిడి కారుతుండగా ఏడ్వడం మొదలుబెట్టాడు రామయ్య.

మధునమ్మ రామయ్యను దగ్గరకు తీసుకొని కొంగుతో చీమిడి తుడిచింది. "ఏడ్వకు బిడ్డ ఏడ్వకు. నువ్వీ బువ్వదింటె నూకలు వెడుత" అని బుదగరించ సాగింది.

భార్యను కొడుకును గమనిస్తూ తాడు పేనుతున్న బుచ్చయ్య "గా పాసి పెయిన కూడాదెట్ల తింటడే. కొంచెమంతంబలుంటె పొయ్యి. కలుపుకొని తాగుతడు" అన్నాడు.

గుడిసెలోకెళ్ళి కడుముంతలున్న అంబలి తెచ్చి కొడుకు తలెలో పోసింది మధునమ్మ. తలెచుట్టూ జుయ్‌మని ఈగలు ముసురుతున్నాయి.

"ఈగెలు నాశినంగాను. ఏన్నుంచత్తయోకని పానం తీత్తన్నయి" అని చేత్తో అటూ ఇటూ ఊపి తలె రామయ్య నోట్లో బెట్టింది. గుటుక్కుంటూనే రామయ్య ఆ గడుకంబలి తాగి-

"మరి నాకు నూకలు వెడుతనంటివి గద పెట్టు" అన్నాడు తల్లితో.

గుడిసె లోపలికెళ్ళి ఎసుల(మట్టిపాత్ర)లో వున్న పిడికెడు నూకలు తెచ్చి రామయ్య అంగి జేబులో పోసింది మధునమ్మ. "బుక్కుకుంట అయ్య సెప్పిన పన్జెయ్యి" అని అన్నం జూడడానికి లోపలికెళ్ళింది. జేబులో నూకలు పడ్డ తర్వాత బయట కురుకబోతున్న రామయ్యను పిలిచాడు బుచ్చయ్య.

"ఎటా ఉరుక వుచ్చుకుంటన్నవు? గీ తాడు జెప్పన పేనుడు గావాలె. పట్టు దొరింట్ల కట్టుదాళ్లు లెవ్వట. ఇచ్చిరావలె" అన్నాడు.

పోయేవాడల్లా తిరిగొచ్చి ఒక దిక్కు బుచ్చయ్య తాడు పేనుతుంటె మరో వైపు పట్టుకొని తండ్రి తింపుమన్నట్టు తింపుతున్నాడు రామయ్య. లేతచేతులు మంట మండుతున్నా తండ్రి చెప్పింది చేస్తున్నాడు. నోట్లోని నూకలు తినడం అయిపోగానే తాడు విడిచిపెట్టి ఒక చేత్తో అంగిజేబు పట్టుకొని మరో చేత్తో నూకలు తీసుకొని నోట్లో పోసుకోబోయాడు. తాడు పురి వదులయ్యింది బుచ్చయ్యకు కోపమొచ్చింది.

"నీ కడుప్పాడుగాను కొంచెమాగరాదుర ఎటువోతన్నయి నూకలు? తాడు మంచిగ పట్టుకో" అని గద్దరించాడు.

చేతిలో నూకలు గబుక్కున నోట్లో పోసుకొని తాడందుకున్నాడు రామయ్య. బుచ్చయ్య గబగబా తాడు పేనుతున్నాడు. రామయ్య తండ్రితో సమానంగా తాడు తింపడానికి సతమస మవుతున్నాడు. ఉడికిన గడుక దించి మధునమ్మ వాకిట్లో కొచ్చింది.

"బువ్వయిపోయినాదె" పని చేస్తూనే అడిగాడు బుచ్చయ్య.

"గడుకు దికిండిగని పోసుక తాగుటానికేం లేదు" అంది మధునమ్మ:

"నిన్న నాల్గు రాముల్కాయలు (చిన్న టమాటలు) తెత్తిగాదె గవ్వంద లేవు..."

"ఏం బెట్టండాలె...ఒక్క బొట్టన్న నూనె లేదు-నూనె లేకుంటండుతెట్ల పాడయిదతి-?"

"నూనె లేకుంటె మానాయె ఉప్పుకారమేసుదుక వెట్టలేవు——"

"పురాగ తొలుపులకన్న లేకపోతె నోట్లోకెట్లపోతడి. నీ మాటలుగని-,"

"అబ్బో దొర్సాని పద్దోలె మాట్లాడవత్తివేమె-? నూనె లేకుంటెన్నిసార్ల తిన్లేదు——కాయిపాయిగ తినన్నంటె మనం దొరలమాయె——ఎట్లనో నాలుగు బుక్కలు నోట్లె పెట్టుకుంటయిపాయె-అట్టి తొక్కుతొసెంతని తినత్తది-? జెప్ప నందుపో——దొరింటికి పొయ్యిరావాలె——" అన్నాడు బుచ్చయ్య.

"అవు-మొన్ననే దొర తాళ్ళు పంపుమని సెప్పంపిండు-" అని గుడిసె లోపలి కెళ్ళింది మధునమ్మ.

తాడు పేనడం పూర్తిగావస్తుంది. రామయ్యకు భలే బాధగా వుంది - పని వల్ల కలిగే బాధకంటె నూకలు బుక్కుకుంటూ స్నేహితులతో కలసి ఆడుకుందా మనుకుంటే తండ్రి ఆపిండని కోపంగా వుంది. బుచ్చయ్య చేతుల్లో రక్తం పేరుకుంది. రాముల్కాయల కూర పొయ్యిమీద పడేసి బయటకొచ్చింది మధునమ్మ.

"నువ్వాడుకోపో కొడుక. నేను మా పడుత" అని కొడుకు చేతిలోని తాడు తీసుకుంది. రామయ్య హుషారుగా బయటకు పరుగెత్తాడు.

"అవునయ్యా! పొల్లగాన్నిగూడ గీ "నల్ల మొకప్పనికే ఉంచుతవా-? సదువేత్తె సరుకారోల్లు పైసలిత్తండ్రట కద——ఈన్ని సదువేత్తామేంది-?" అని భర్త

దిక్కు ఆశగా చూసింది మధునమ్మ.

"నాగ్గూడ పోరన్ని సదువెయ్యాన్ననే ఉందే-కని మన కెల్లుతాదే-?"

"ఎల్లకుంటేం జేత్తది? ఇంకొంచెం కట్ట పడుతావేంది-? పొల్లగానికి నాలుగచ్చిరాలు సెప్పిత్తె మొకం తెలివోలుంటది-గా సదువుల సంగతి మన కెరుక లేపాయె-దొర నడుగేమంటడో-?"

"నేం గూడ గదే అనుకుంటన్ననే-గీ తాడు పట్టుక పోయ్యి. గీ మాట దొర సెప్పులేత్త-జెప్పునింత బువ్వ పెట్టు-" అని పేనడం పూర్తయిన తాడు చిపర ముడివేసి చుట్టగా చుట్టాడు-వాకిట్లో వేసి ముండ్లు పోయేట్టుగా పీటతో రాశాడు...గుడిసె ప్రక్కనున్న కుండల్లోని నీళ్ళతో కాళ్లు కడుక్కున్నాడు—చేతులు రుమాలుకు తుడుచుకుంటూ గుడిసె లోపలికెళ్లాడు-గొంగడి ముద్దగా వేసికొని దానిపై కూర్చోబోయేసరికి గుడిసెలో ఓ మూలకు ఆరేసున్న ఎద్దు తోలు 'గుప్'మని వాసన కొట్టింది. "సెయ్యవ్వ ఆసన పెడుగాను - ఇంట్ల నిలవదత్త లేదు–" అని దాన్ని బయటికు తీసుకెళ్ళి గుడిసె కప్పుపై ఆరేసాడు - మళ్ళీ లోపలికొచ్చి గొంగడిపై కూర్చున్నాడు–అసహనంగా అటూ ఇటు కదిలి

"జెప్పనెయ్యి బువ్వ—" అని భార్యను తొందర పెట్టాడు.

"ఎయ్యనేపడితి గొడాగలేవు...గడియరికాం లేదు గవ్వ రాకల్లేదు..." అంటూ మధునమ్మ బుచ్చయ్య ముందో తలె బెట్టింది...గడుక కుండ తెచ్చి అతనకి దగ్గరగా బెట్టి గంపెతో ఉడుకుడుకు గడుక తలెలో వేసింది – కసికెతో ఎర్రగా తయారయిన రాముల్కాయల కూర వేసింది. గడుక, కూర కలిపి ఓ ముద్ద నోట్లో బెట్టుకున్నాడు బుచ్చయ్య-ఒక్క బొట్టు కూడా నూనె లేకుండా వండిన ఆ కూర ఎలాగో వుంది - బలవంతంగా కొంత తిన్నాడు—మిగతా అన్నం మిరపకాయ కారం కలుపుకొని తిన్నాడు. మరింత వేయించుకొని.

"అంబలున్నాదె?" అన్నాడు.

"ఉన్నకాడికిప్పుడె పొల్లగానికి వోత్తి-ఇంకేడిది?" అంది మధునమ్మ.

"ఐతెమాయె తియ్యి" అని ఆ గడుకలో కొంత ఉప్పు వేసుకొని నీళ్లు పోసి కలిపాడు. గటగటా త్రాగాడు-మూతి రుమాలుకు తుడుచుకుంటూ బయట కొచ్చాడు–తాడు చేతిలో బట్టుకొని.

"ఇగనేం బోతన్ననే-" అన్నాడు బుచ్చయ్య.

"అచ్చేటప్పుడు దొర్సాన్ని కొంచెమంత సింతకాయ తొక్కడుక్కరా. మరిసిపోయేవు-పొల్లగాని సంగతి గూడడుగు-" అంది మధునమ్మ.

"సరె మా అడుక్కత్త-" అని బయలుదేరాడు బుచ్చయ్య.

*   *   *   *

ఆలోచించుకుంటూ కొడుకు చదువు గూర్చి కలలు గంటూ నడుస్తున్నాడు బుచ్చయ్య. తన కొడుకు నెక్కరు, చొక్కా తొడుక్కొని చేతిలో పుస్తకాలతో ఠీవిగా బడికి నడుస్తున్నట్లు ఊహించుకుంటున్నాడు-తన కొడుకు చదువుకొని పెద్ద కులస్థుల పిల్లలతో సమానంగా తిరుగుతున్నట్లు, ఇంగ్లీషు భాష ధనాధన మాట్లాడుతున్నట్లు ఆలోచిస్తున్నాడు-తన కొడుకు చదువుకుంటే తన కష్టాలు గట్టెక్కుతాయని మురిసిపోతున్నాడు-రకరకాల స్వప్నాల్లో తేలిపోతూ పరధ్యానంగా నడుస్తున్న బుచ్చయ్య హడావిడిగా ఎదురొస్తున్న కృష్ణశాస్త్రిని గమనించలేదు...పూర్తిగా దగ్గరకొచ్చి ఠక్కుమని ఆగి వెనుకకు రెండడుగులేసి

"అప్రాచ్యపు ముండాకొడుక-కండ్లు కనపడుదు లేవుర-" అన్నాడు శాస్త్రి.

శాస్త్రి మాటలతో ఈ లోకంలోకొచ్చిన బుచ్చయ్య

"లేదయ్యగారు-నేను మీరచ్చేది సూల్లేదు–" అన్నాడు దూరం జరిగి.



"సరె పోరా పో — మీకు కండ్లు నెత్తిమీది కచ్చినయిరా-?" అని భుజమ్మీదున్న పంచెను దులిపి మళ్ళీ భుజమ్మీదేసుకొని ముందుకు పోయాడు.

బుచ్చయ్య ప్రక్కకు జరిగి ఒదిగి నిల్చున్నాడు-శాస్త్రి ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలా ఆగి బుచ్చయ్యతో

"అరే బుచ్చిగా ఇటు రా..." అన్నాడు.

బుచ్చయ్య వెనుకకు తిరిగొచ్చి శాస్త్రికి కొంతదూరంలో నిల్చున్నాడు.

"ఇంట్ల అమ్మ(భార్య) చీపుర్లు లెవ్వని గోల వెడుతంది. రెండు కట్టుకొచ్చి రేపింట్లియ్యి-" అన్నాడు.

"మా ఇత్తగని అయ్యగారు! ఇదువరకిచ్చిన రొండు సీపుర్ల పైసలింకియ్యక పోతిరి-మేమెట్ల బతుకాలె బాంచెను-" అన్నాడు బుచ్చయ్య.

"వెధవ. అవసరమొస్తే పంచాంగం చూసి చెప్పనార-బ్రాహ్మని కిచ్చింది పోతాదిర-" అన్నాడు శాస్త్రి.

"నేనేం పనులు సేత్తనని పంచాంగం సూపిచ్చుకోవాలె అయ్యగారు! గా పైసలిత్తె నూనె బొట్టన్న తెచ్చుకుంట-" అన్నాడు బుచ్చయ్య.

"ఎప్పుడూ దరిద్రమే వెధవలకు-రేపు రెండు చీపుర్లు తీసుకెళ్ళి అమ్మ నడుగు...నాలుగు చీపుర్ల పైసలిస్తది-" అన్నాడు శాస్త్రి.

"సరె రేపు మా ఇచ్చుత్త అయ్యగారు-" అని కదిలాడు బుచ్చయ్య.

'అల్చెమయితంది-గీ బావనయినె దొరికిచ్చుకొని సోది జెప్పవట్టె. ఇత్తననుడే కని ఎప్పుడొక్క కొత్తన్న ఇయ్యకపాయె-మంత్రాల్జదివి పదులకు పదులు దొబ్బుతడుగని, కట్టపడి సేతులన్ని మండంగ సీపుర్లు గట్టిత్తె పుక్కానికే ఇయ్యన్నాయె-నీ యవ్వ పెద్దొళ్ళకెంతున్న సాలది'

తనలో తానే గొణుక్కుంటు కొడుకు చదువు గూర్చి దొర అభిప్రాయం తెలుసుకోవాలని అనుకుంటూ దొర ఇల్లు సమీపించాడు బుచ్చయ్య.

పాటకుల లోపల పెద్దరువాజ బయట పడకకుర్చీలో కూర్చొని సిగరెట్ తాగుతూ హాయిననుభవిస్తున్నాడు సుధాకర్‌రావ్ దొర...పాటకుల దగ్గర నిల్చొని తాడు క్రింద పడేసి తలమీది రుమాలు తీసి చేతిలో పట్టుకొని.

"దండాలు బాంచెను-" అన్నాడు బుచ్చయ్య.

దొర బుచ్చయ్యదిక్కు చూపు నిలిపి ప్రతినమస్కారం చేయకుండానే "బుచ్చిగా కావుర మచ్చినాదిర-? గిప్పుడార నువ్వు తాడు దెచ్చేది-" అన్నాడు సిగరెట్ దమ్ము గట్టిగా పీల్చుతూ సుధాకర్‌రావ్.

"మీరు సెప్పంగనే ఈతకమ్మ కురుకితి-నార సీరితి-పేనుకొని అచ్చెటాల్లకు రొండ్రోజులాయె బాంచెను-అల్చెమేద జేత్తి" వినయంగా అన్నాడు బుచ్చయ్య.

"అడిగిందానికేదోటి సెప్పుతర్రా-సరెగని ఆ తాడు లోపలాకిట్లో పడేసి ఇంటెనుకో తుమ్మ మొద్దుంది-ఎనుకనుంచిపొయ్యి పలుగ్గొట్టు పో-' అన్నాడు సుధాకర్ రావ్.

"మా పలగ్గొడుతగని దొర ఒక్క మాటడుగల్ననుకుంటున్న-" నీళ్లు నములుతూ అన్నాడు బుచ్చయ్య.

"ఏం మాటరో అడుగడుగు-" అన్నాడు దొర.

"దొరా! నేనంటె సిన్నప్పట్నుంచి తాళ్ళు పేనుకుంట, సెప్పలు కుట్టుకుంట. కూలిపనులు జేసుకుంట బతుక పడితి—పోంగ పోంగ మిగిల్నోడు నాకుగా రామిగాడొక్కడేనాయె. గానికి నాలుగచ్చిరాలు నేరిపియ్యాలనుకుంటన్న. పెద్దొల్లు మీ సెవునేసి మీ దీవెన్లు పొందన్నని—" అన్నాడు బుచ్చయ్య.

సుధాకర్‌రావు వినగూడని మాటలు విన్నవాడిలా ముఖం బెట్టాడు. చేతిలోని సిగరెట్ పీక పారేసాడు.

'కూలి వెధవలు కూడా చదువుతే మా పనులెవరు చేయాలి. వీన్నిఆలోచన నుండి విరమింప జెయ్యాలి-' తనలో తానే అనుకున్నాడు.

"వారి బుచ్చిగా-నీకెవ్వలా గీ మాటలు సెప్పింది? చదువుకొని రాజ్జేలేలుతార నీ కొడుకు—" అన్నాడు.

"గది గాద్దొర-ఇయ్యల్ల రేపన్ని కులాలోల్లు సదువుకుంటండ్రు గద-"

"నిజమేకని సదువులంటేందనుకుంటున్నవ్-అట్టిగనే ఐతాదిరా-"

"ఎట్లనన్న కట్టపడుత బాంచెను-"

"నువ్వు, నీ పెండ్లాం పనిసేసుకుంట బతుకుత లేరార? పోరనికి పుస్తకాలకు, ఫీసులకు, బట్టలకు పైసలేన్నుంచి తెత్తవుర? పిచ్చిపిచ్చి ఆలోచన్లు పెట్టుకోకు-" గదమాయించినట్టుగా అన్నాడు దొర.

"అరిజనులకు సర్కారోల్లు సదువుకుంటానికి పైసలిత్తండ్రట గద దొర-గవ్వీటితోని సదువు కోరాద-" అన్నాడు బుచ్చయ్య.

దొర బుచ్చయ్య మాటలకు బిగ్గరగా నవ్వి

"గా పైసల్తోనేమయితదిర-అవ్విగూడ అందరికత్త యనుకుంటన్నవా-? అచ్చినా అవ్వేం మొదలయితయి-? చదువంటె మాటలనుకుంటన్నావుర? కయికిలో గంబలో సేసుకుంటె ఎటువంటి బట్టలయిన కట్టుకోవచ్చు. బడికిపోయే పిల్లలకు మంచి మంచి బట్టలు పట్టియ్యన్నాయె-అంగి లాగులు మంచిగ లేకుంటె ఇజ్జదీత్తరు-మల్ల పుస్తకాలకు పైసలు గావన్నాయె. బడికి పొయ్యేటోడు ఇంట్ల పని వినడు. చేతికొచ్చిన పోరన్ని బడికి తోలుతె నీకెట్ల ఎల్లుతదో చెప్పు-" అన్నాడు.

అతని మాటలు వింటూ ఆలోచనలో పడ్డాడు బుచ్చయ్య.

అదే సమయమని మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు సుధాకర్‌రావ్.

"వారి బుచ్చగా! నీ పోరన్ని ఇరుసకు పాలేరుంచితివాంటె వేన్నీళ్ళకు చన్నీళ్లోలె నీకు తోడుంటది—గా చిన్నపోరన్ని ఎవ్వలుంచు కుంటరనుకోకు-నాకే వుంచు. వాడే గొడ్లతోని పోతడు. చదువు సంగతి మర్చిపోయి రేపట్నుంచాన్ని పనికి దోలు—"

దొర మాటలు విని "సరె దొర" అని సమాధానమేం చెప్పకుండానే కట్టెలు కొట్టడానికై ఇంటి వెనుకకు వెళ్ళాడు బుచ్చయ్య. మధ్యాహ్నం దాటే వరకూ కట్టెలు కొట్టి చెమట కంపుతో వాకిట్లో నిల్చొని "దొర్సాని" అని పిలిచాడు, లోపల్నుంచి దొర భార్య బయటకొచ్చి మురికిగా వున్న పంచెతో చెమట కంపుతో వున్న బుచ్చయ్యను అసహ్యంగా చూసింది. "ఏం గావాల్రా?" అడిగింది ముఖం చిట్లించి.

"దొరసాని కొంచెమంత చింతకాయ తొక్కు పెట్టుండ్రి - నోరంతెట్లనో వుంది-" అన్నాడు దీనంగా.

"మొన్ననే పెడితిగాదుర మామిడికాయ తొక్కు. బరుకతి దక్కో ముండ కొడుకులు" అని తిట్టుకుంటూ లోపలి కెళ్ళింది-ఓ బాదామాకులో చింతకాయ తొక్కు పెట్టుకొచ్చి చేతులు చాచుకొని నిల్చున్న బుచ్చియ్య చేతుల్లో పైనుంచి వేసింది. అవి కళ్ళకద్దుకొని "పోతన్న దొర్సాని" అని చెప్పి ఇంటిదారి పట్టాడు బుచ్చెయ్య. ఇంటికెళ్ళి స్నానంచేసి గుడిసెలో నులకమంచం వాల్చుకొని పడుకొని ఆలోచనలో పడ్డాడు. మొదట్నుంచి దొరనెంత నమ్మినా కొడుకు చదువు విషయంలో అతని మాటలు సరియైనవిగా తోచడం లేదు బుచ్చయ్యకు. రకరకాలుగా ఆలోచించాడు. తెక్కలు ముక్కలు చేసుకొనైనా సరె కొడుకును చదివించడానికే నిర్ణయించుకొన్నాడు. తన ఈ గమ్యంలో ఎన్ని అడ్డంకులెదురైనా ఎదుర్కోవాలనుకొన్నాడు. ఆడుకోవడానికెళ్ళి ఇంట్లో కొచ్చిన కొడుకును ప్రేమగా దగ్గరకు తీసుకున్నాడు.

పట్టెమంచంలో పడుకుని ఇంటి పైకప్పు దిక్కు చూస్తున్న బుచ్చయ్యకు పాతికేళ్ళ క్రితం కొడుకు చదువు విషయమై తాను నిర్ణయించుకొన్న రోజు

జీవిత పరమార్థం

మాన్ ఈజ్ నాట్ మేడ్ టు అండర్ స్టాండ్ లయిఫ్
బట్ టు లివ్ ఇట్

సాంతాయన.

మనోహిమ శకలం మీది నీటిపొర
మనుగడను చుట్టు కొన్న దుఃఖపు తెర
ఏ మార్మిక కవితా కరాంగుళులతో తుడిచినా పోదు
ఏ తాత్త్విక చింతనల చేతులతో తొలగించినా పోదు
కలల రంపప్పొట్టును ఎంత దట్టంగా అద్దినా
కరిగి పోక తప్పదు గడ్డకట్టిన బతుకు
అనుభవాల కణాలు అను క్షణం తొణికినా
అంచుల దాకా నిత్యం ఉంటుంది ఆశానీరం
ఎంత ఆలోచించినా అవగాహనకాదు
ఎంత విశ్లేషించినా అనుభూతికి రాదు
సిద్ధాంతాలు ఏవైనా దృక్పథాలు వేరైనా
జీవిత పరమార్థం మాత్రం జీవించడమే

వెన్నెల స్నానం

ఉలిపొర కాగితం లాంటి
తెలిమబ్బు తెర లోంచి
జారి పడుతుంది చీకటి టబ్ లోకి
చందనపు సబ్బు లాంటి శశి బింబం
ఆకాశపు నీలోదకాలమీద
అలి సుతారంగా తేలుతుంది
వెలుగుల తరగ
వెన్నెల నురగ
వెండి బెలూనులాగ

అప్పుడు
కలల్నీ కలతల్నీ విడిచి
వలపుల్నీ వాంఛల్నీ తుడిచి
బరువుల్నీ బాధ్యతల్నీ మరచి
ఆలోచనల్నీ అనుభూతుల్నీ చెరిపి
నా అంతరంగం వింతగా
స్నానం చేస్తుంది నగ్నంగా
వెన్నెట్లో.

శ్రీ కె. దినకర్

చెప్పులు

నా చెప్పులు కరుస్తున్నాయి!
ఏదేదో అరుస్తున్నాయి!
"ఎందుకు మమ్మల్ని అణగ దొక్కుతావ్?
ఎంత కాలం మమ్మల్ని అణచి ఉంచుతావ్?
నువు వెళ్ళేదారి మంచిది కాదు
నీ కాళ్ళలో దిగబడ వలసిన ముళ్ళు
మమ్మల్ని గాయపరుస్తున్నాయి
నీ బాధను మేము సహిస్తున్నాం!
బాధ మాకు, సౌకర్యం నీకు!
ఇది మేము సహించం,
అందుకే అరుస్తున్నాం, నిన్ను కరుస్తున్నాం!"
కొత్త చెప్పులు కదా అవి కరుస్తాయి!
వాటిని ఇంకా అణగదొక్కాను.
కొంత కాలానికి అవి కరవడం మానేశాయి.
ఇప్పుడు అవి కరవవు
హక్కుల గురించి అరవవు
ఇక అవి మహా అయితే 'కిర్రు' మని మూల్గుతాయి
తమని వదిలేయమని నన్ను దీనంగా వేడుతాయి

శ్రీ షేక్ మహమ్మద్ అలీ

జ్ఞాపకం వచ్చింది. గత జీవితపు పుటల్లో మనసు విహరించింది. కొడుకు చదువు కొరకై తాను రాత్రింబవళ్ళు విశ్రాంతి లేకుండా పనిచేసాడు. అనుకున్నది సాధించాడు. కొడుకునో మంచి ఉద్యోగిని చేసాడు. తాను పడ్డ కష్టాలకు ఫలితంగా కొడుకు కూడా పోకిరీ వేషాలెయ్యకుండా కష్టపడి చదువుకున్నాడు. తన కలలకు ప్రతిరూపంగా నిలిచాడు. తన కష్టాలను గట్టెక్కించాడు. తామిప్పుడు గుడిసెకు బదులు పెంకుటింట్లో నివసిస్తున్నారు. మాసికలు పడ్డ పాత మురికిబట్టలకు బదులు శుభ్రమైన బట్టలేసుకుంటున్నారు. ఉద్యోగమొచ్చింతర్వాత కొడుకు రెక్కలొచ్చిన పక్షిలా ఎగిరిపోకుండా తమకు దిక్కుగా ఉన్నాడు. బుచ్చయ్యకు తానారోజు తీసుకున్న నిర్ణయంపై ఎంతో గర్వంగానూ, సంతోషంగానూ వుంది.

ఊరిజనం తననిదివరకు బుచ్చిగా అని మాత్రమే పిలిచే వారిప్పుడు బుచ్చయ్యని పిలుస్తున్నారు. భార్యను మదినీ అని తప్ప పిలువని వాళ్ళు కూడా 'మధునమ్మ' అని పిలుస్తున్నారు. రారా, పోరా అని బూతు మాటలతో తప్ప పిలువని దొరలాంటి వాళ్లు కూడా అలా పిలువడం లేదు. తమ మురికిబట్టలు తమను చూస్తూ అసహ్యించుకునేవాళ్ళ దూరం దూరం జరిగే వాళ్ళలో కొంత మార్పు వచ్చింది. ఊరి ప్రజల్లో వచ్చిన ఈ మార్పుకు ఆశ్చర్యపోతున్నాడు బుచ్చయ్య. తన కొడుకు మంచి ఉద్యోగంలో వుండి తన ఆర్థిక పరిస్థితి కొంత మెరుగు పడ్డంత మాత్రాన ప్రజల్లో తమపట్ల వచ్చిన మార్పులోని కిటుకు అతని కర్థం కావటం లేదు - రెండు మూడేళ్లుగా తీరిక దొరికినప్పుడల్లా అతడు తీవ్రంగా ఆలోచిస్తూనే వున్నాడు.

ఆర్థిక పరిస్థితి మంచిగుంటే, మంచి స్థితిలో వుండే ఏ కులంవాడైనా ఈ సంఘంలో కొంతవరకైనా గౌరవపాత్రుడవుతాడని అతని కిప్పుడిప్పుడే అర్థమవుతుంది. ఈ దేశంలోని చాలా రుగ్మతలకు ఆర్థిక అసమానతలే కారణమన్న విషయం ఎంత నిరక్షరాస్యుడైనా బుచ్చయ్య తన జీవితానుభవాలద్వారా తెలుసుకుంటున్నాడు.

దీర్ఘాలోచనామగ్నుడై యున్న బుచ్చయ్య ఇంటిముందు స్కూటరాపి కోడలుతో ఇంట్లోకొస్తున్న కొడుకును చూసి ఈ లోకంలో కొచ్చాడు. కొడుకు కోడలు దిక్కు గర్వంగా చూసాడు.

శ్రీ కె. గురుమూర్తి

"కవికోకిల" జాషువా

శ్రీ జాషువా కవి గుంటూరు జిల్లా "గౌడడిండిమభట్టుని కంచుఢక్కా పగులగొట్టించు కవిసార్వభౌమునిల్లు, భాస్కరుని కత్తి మెరసిన ప్రథనభూమి, శిరము సెరసిన" వినుకొండసీమలో శ్రీ గుఱ్ఱం వీరయ్య, లింగమాంబలకు జ్యేష్ఠ పుత్రుడై 28-10-1895 తేదీన జన్మించెను. పిన్నవయసులో అందరు పిల్లల వలెనే అల్లరి చేయుచుండెను. "నెచ్చెలికాంద్రతో గలసి నేను చతుర్ముఖశాస్త్ర కేళిలో, బుచ్చితి కాలమున్; గటిక పోకిరి వీడని యూరివారు వాక్రుచ్చుటి మొన్న మొన్న వరకున్ నినదించె శ్రవోయుగంబునన్" అని "నా కథ"లో కవి యనెను. చిన్నతనము నుండియు తండ్రి వీరరసోద్రిక్తములగు కథలు విని పించుచుండుటచే — పూవు పుట్టగనే పరిమళించునన్నట్లు - వీరియెడ దాగియున్న స్వాభావిక కవితా సంపత్తి వేములవాడ భీమకవికి వలెనే, శైశవముననే బయలు పడినది. కవి యిట్లనుచున్నాడు:

> "లలితకళలయందు బలమైన యభిరుచి! చిన్నతనమునందె చిగురు బెట్టి.
> లీలనెదిగి చిత్రలేఖనం బయిమారి! కట్టకడకు నాంధ్రకవనమయ్యె।"
>
> (నా కథ)

పదునైదు, పదునారు వత్సరములకే కవితాకన్య వీరి కట్టెదుట తాండవించినది. అప్పటినుండియు వీరు తమ రచనలను మొదలిడి ఆంధ్రావని కందజేయుచుండిరి.

పిదప వీరు గుంటూరులో శతావధాని శ్రీ జూపూడి హనుమచ్ఛాస్త్రిగారివద్ద సంస్కృత విద్యను, నేత్రావధానము మున్నగు కళల నభ్యసించిరి. ఆ కాలమున వీరు రచించి లోకమునకు ప్రసాదించినవి: (1) హిమధామార్కధర పరిణయము, (2) చిదానంద ప్రభాతము (3) కన్యకాపరమేశ్వరి యను గ్రంథములు.

గ్రంథరచన మారంభింపగనే ఈ కవి అష్టైశ్వర్యములతో తులదూగు చుండెనని తలంపరాదు. భుక్తికే గడువక మిక్కిలి చిన్న చిన్న ఉద్యోగములను కూడ ఈయన చేయవలసి వచ్చినది. కవి యిట్లనుచున్నాడు:

1. "ఆ రోజున నమలునగల। టూరింగ్సినిమాలలో కడుంగడు శ్రమతో,
   జేరితినొక సినిమాలోన కథారచయితగాను। తత్కథా కథకునిగా.(నా కథ)
2. వేతనము పదియునైదును। చేతోమోదంబెకాని నేతికి నిడగా
   నేత్రమణి, చిల్లిగవ్వయు। ఖాతే ప్రాప్తంబు రెండు పర్యాయంబుల్.
3. గౌతమీ తీర లింగాల వద్ద
   ప్రాథమిక పాఠశాలలో పంతులునయి
   జీవనము చేసినాడ నే త్రోవలేక
   ఎనిమిదిన్నర మాస వేతనము మీద.
4. ఇద్దరు సుతులుంగూరిమి। ముద్దియ మేరాంబతోడ ముట్టెడు జీతం
   బద్దెకు ముద్దకు చాకలి! పద్దుకు సరిపోక పెక్కు పాట్లంబడితిన్"

3వ. ఖండకావ్య పీఠికలో యిట్లనుచున్నాడు: "నిర్ధనుడైన కవికి జాత్యాదరణకన్న భాగ్యమేమి కావలయును?"

4వ. ఖండకావ్య "విజ్ఞప్తి"లో యిట్లనుచున్నాడు: "మరణం లేని మానవత్వాన్ని కామించు కవితావీణపై నేను ప్రమోయించిన వ్యథా తంత్రులే ఖండకావ్యాలు."

పాండిత్యమును సంపాదించిన ఈ కవికి "నాటకాంతం కవిత్వం" అన్నట్లు నాటక రచనపై దృష్టి మరలినది. తదనుకూలముగ అవకాశమును లభించినది.



1917 సంవత్సరమున రాజమండ్రి శ్రీ గున్నేశ్వరరావుగారు "చింతామణి" సమాజమును స్థాపించి వీరిని కవిగా గ్రహించినారు. అప్పుడే వీరు "అనసూయ", "మదాలస", "రుక్మిణీ కళ్యాణము", "ధృవ విజయము" మొదలగు నాటకములను వ్రాసి శ్రవ్యకావ్యములే గాక దృశ్యకావ్యరచన యందును సిద్ధహస్తుడని లోకమునకు దెలియజేసెను. ఈ కాలముననే "కుశలవోపాఖ్యానము" అను నవలను గూడ రచించి తమ యపూర్వ మేధాశక్తిని వెల్లడించిరి. పిమ్మట బాపట్ల వాస్తవ్యులు శ్రీ రావూరి శ్రీశైలపతిగారు వీరిచే "శివాజీ" ప్రబంధమును వ్రాయించి మూడువేల రూప్యములు బహూకరించిరి.

వీరు ఉద్యోగరీత్యా 1920 నుండి 1928 వరకు గుంటూరు మిషను ట్రెయినింగు స్కూలులోను, 1929 నుండి 1942 వరకు గుంటూరుజిల్లా బోర్డు హైస్కూలులోను తెలుగు పండితులుగానుండిరి. ఈ హైస్కూలోనున్న కాలముననే "ఉభయభాషాప్రవీణ" యను బిరుదు వీరి కొసగబడినది. మూడు భాషలలో, అనగా సంస్కృతము, ఓఢ్రము, తెలుగు భాషలలో అనర్గళ పాండితీప్రతిభ గల జయపురం మహారాజావారగు శ్రీ శ్రీ శ్రీ విక్రమదేవవర్మగారిని ఈ కవి మెప్పించి "కవితా విశారద" యను బిరుదును, వెయ్యిన్నూటపదార్లు బహుమతిని స్వీకరించెను. ఆ సందర్భమున కవి యిట్లు విన్నవించుకొనెను:

1. గ్రంథరూపంబు దాల్చు భాగ్యంబు లేక। కంటదడి వెట్టుచుండు నా కవన పటిమ,
   ఏమి సేయుదు; బ్రోచు రాజేంద్రుడేడి?। కర్ణుడేమాయె కులపరీక్షకుల నడుమ?
2. ఆలయ మందముద్రితములై తెరచాటున దాగియున్న బి
   డ్డిల విధాన మత్కృతులు పెక్కులు వ్రాతలతో గృశించుచు
   న్జీలికలయ్యె నుద్ధతి నశించె, విచారము కారుచీకటిం
   బోలి యెడందలో నిలిచిపోయె, సుమింపవు క్రొత్తకబ్బముల్.

రాజసన్మానమును గూర్చి యిట్లనుచున్నాడు:

> "కవితా విశారదా" యను। నవీన బిరుదంబు, వేయి నాణెములు మహా
> కవి పండిత చండ మహా। ర్ణవ మలరగ సత్కరించె రాజవ్వోళన్.

వీరికి దేశములో పలుచోట్ల సన్మానములు జరిగినవి. వినుకొండ తహశీల్దారు శ్రీ గొట్టిముక్కల రమాకాంతాచార్యులుగారు నూటపదార్లను రజత పాత్రను

బహూకరించిరి. ఆంధ్రదేశమున గల కళాశాలలన్నియు వీరిని సన్మానించినవనియే చెప్పవచ్చును. మద్రాసు లయోలా, ప్రెసిడెన్సీ, మెడికల్, ఇంజనీరింగు, లా కాలేజీలు, బందరులో నోబుల్ కాలేజీ, హిందూ కాలేజీలు, గుంటూరు యు.యల్ సి.యం కాలేజీ, విశాఖపట్నం, నెల్లూరు కాలేజీలు, హైదరాబాదు ఉస్మానియా యూనివర్శిటీలున్నూ వీరిని సన్మానించి తగురీతి బహూకరించినవి. మద్రాసు ఆంధ్రమహాసభ, హైదరాబాదు "శ్రీకృష్ణరాయాంధ్రనిలయము", శ్రీకాకుళం సాహిత్య సమితి మున్నగు యితర సంస్థలు వీరిని గౌరవించి గౌరవింపబడినవి. ఇంక వీరి కవితాకన్య జమీందారీ వర్గము నాకర్షించినది. శ్రీ చల్లపల్లి, ముక్త్యాల, వేంకటగిరి రాజాగార్లు వీరి రచనల కానందించి ద్రవ్యరూపేణ వీరిని సత్కరించిరి.

వీరిని వినుకొండవారు సత్కరించినపుడే, యింట గెలిచినట్లయినది. అపుడే ఇక రచ్చగెలుతునని యీ కవి శపథము చేసినాడు:

"సకులింటన్ గెలిపించినార: లిక రచ్చంగెల్తునెందేని; సా
ర్థకమయ్యెం గవితా పరిశ్రమ; విధూతం బయ్యెఁజింతా తమ
శ్శకలంబుల్; దొలికోడి గూసిన దుషస్సంధ్యారుచిం దేలుమా
మక పూర్వాశ జనింపదో చిఱుత సంపత్సూర్యుడింపారగన్.

వినుకొండ యావల ఆంధ్రావని యంతటిలో గెలుచుటయే గాక యీ కవి పరరాష్ట్రమగు మహారాష్ట్రమున పూనాలో ఆంధ్ర సాహిత్య సమితి జరిపిన "తిక్కన జయంతి"కి విచ్చేసి రచ్చం గెల్చినాడు. దీనిని గూర్చి కవి యిట్లు వ్రాసికొనినాడు:

"పూనా ఆంధ్ర మహాజనుల్ పిలిచి సంపూర్ణాభిమానంబుతో నా
పై నిండారగ నాతిథేయములతో పద్య ప్రశంసాళితో నానారీతుల గౌర
వించిరి"—

ఈ కవికి జరిగిన సన్మానములలో 1, జనవరి, 1947 న విజయవాడలో జరిగిన అఖండ గౌరవము చెప్పకొనదగినది. అచట వీరిని గంధ సింధురముపై నూరేగింపగా మహాకవి చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు స్వహస్తములతో నీ కవి పాదమున గండపెండేరము నలంకరింప జేసిరి. దానిని గూర్చి యీ కవి తన సంతోషము నిట్లు వెలిబుచ్చినాడు:

తొడిగెంగాలికి చెళ్ళపిళ్ళ కవి ముద్దుం గండపెండారమున్
ముడిచెం గొప్పున నా కళాసతి యశంబున్ బుప్పగుచ్ఛంబుగా,
నడిచెం గుట్టపుదండు నా వెనుక నాంధ్రంబెల్లఁ బొంగారగా.
జడజన్మంబున నే మహాకవుల పూజల్ సల్పి మెప్పించితో!

(కృతజ్ఞత — ఖం.కా)

చళపిళ సత్కవీశుడు ప్రసిద్ధుడు, వీరశతావధాని, యాం
ధ్రుల శుభ రక్తనాళముల రూపము నెత్తిన బ్రాహ్మణుండు, నా
పలుకుల రాణి పాదమును బంగరు గగ్గెరతో నలంకృతుల్
సలిపె నికేమి కావలె? ప్రశస్తి కవిత్వ కళాపధూటికిన్.

(కృత...)

ఇంక కృతి భర్తలు: శ్రీ తిక్కవరపు రామిరెడ్డి (మాజీ గవర్నరు శ్రీ గోపాలరెడ్డి మామగారు) వీరి " ...శీకుఁడు" అను కావ్యమును స్వీకరించి రెండు మార్లు నూటపదార్లచే బహూకరించిరి. మాజీమంత్రి గౌ॥ కల్లూరి చంద్రమౌళిగారు వీరి కవితా మాధురికి చెవియొగ్గి "గబ్బిలము" అను కబ్బమును స్వీకరించి వెయ్యి నూటపదార్లు బహుమతి నిచ్చినారు, బాపట్ల శ్రీ రావూరి శ్రీశైలపతి "శ్రీశివాజీ" ప్రబంధమును వీరిచే వ్రాయించి మూడువేల రూప్యములు బహుమతి నొసగినారు.

శైలి !– ఈ కవి మృదుమధుర కవితాలహరి సాహితీ ప్రపంచమున సరి లేని మన్ననల నంది, పేదలకును శ్రీమంతులకును మాననీయమై, ప్రాఁగొత్తల మేలి కలయికకు స్వర్ణబంధమై, ఆబాల గోపాలమును సరళ రసస్యందనమున నానంద ప్రపంచములఁ జేర్చుచున్నది. శ్రీ భాగవతుల పూర్ణయ్య, ఎం.ఏ; వీరి కవితాశైలిని గూర్చి యిట్లు వ్రాసినారు:

1. శ్రీనాథ కవివచః శ్రీ విలాసమ్ములు। నీ సీసపద్యాల నూసులాడ
పోతనార్యుని గంటమున దొల్కి కులికిన। శైలినీవృత్తాల జటలు సెప్ప
తిక్కన్న చురకత్తితీట తీరుగడైన। రచన నీ కందాల రుచులు సూప
పెద్దన్న వలపు వావిరి బుట్టురత్నాల। రకము నీ కథలు పోలికలనీ న
తొంటి కవుల నిగ్గుతో నాధునాతన కవులత్రోవ నగ్రగామి వగుచు।
ప్రాతక్రొత్త కలుపు స్వర్ణబంధంబయి మెలగు సుకవి! నీవు తెలుగు
తేట.

2. కనినంత గుండియల్ గరచు "శ్మశానం"పు వాటిలో పూలదాళ్వరచినావు
చీరాల రణరంగ వీరతాండవమూర్తి "రత్న" శిల్పముచెక్కి ప్రబలినావు.
తిక్కన్న చేతిలో తీరని లోపమ్ము 'కర్ణ' పాత్రకు దీర్పగడిగినావు.
జాతీయతగ దేశజనని వర్ణనఁజేసి భక్తి ముక్తికి త్రోవ బట్టినావు.

"స్వప్నకథ" చెప్పి, "భిక్షుకి" శాంతపరచి,
దివ్యకవివరు "ఫిరదౌసి" తెలియబలికి,
"గబ్బిలము" దూత్యమంపించి, "కాందిశీకు"
దేశమాతృ విశేషాల దేల్చినావు।
మేలుకైతల "తాజీ" నిర్మించినావు.

ఈ కవికి తన కవితా పటుత్వమును గూర్చి దృఢ విశ్వాసము గలదు. ఒకచో కవి యిట్లనుచున్నాడు.

"గవ్వకు సాటిరాని పలుగాకుల మూకలసూయచేత న
న్నెవ్విధి దూరినన్ నను వరించిన శారద లేచిపోవునే?
యివ్వసుధా స్థలిం బొడమరే రసలుబ్ధులు? గంట మూనెదన్
రవ్వలు రాల్చెదన్ గరగరల్ పచరించెద నాంధ్రవాణికిన్!"

శ్రీ తోలేటి సుబ్బారావు కోర్కెపై ఈ కవి గోదావరి మీద చెప్పిన పద్యము ను ఆయన విని "కమ్మని పాకము" గల శైలిని గూర్చి యిట్లనినాడు!

"అని చెప్ప విని "వహవా!"
మొనగాడవు జాషువా! యపూర్వంబగు క
మ్మని పాకము నుడికారము
తెనుగుందన "మంచు బొగడి దీపన చేసెన్।"

మరియొకరు యిట్లనినారు:

"......భేషర జాషువా!
సితసకలాంధ్ర భూపలయ సిద్ధకవిత్వ వసంతవైభవా!'

ఈ కవి కవిత్వములో ప్రతిఫలించు తన చిత్తవృత్తిని గూర్చి యిట్లను చున్నాడు:

1. "దొడ్డ పదవులెక్కి గడ్డి మేసెడువారి
నెత్తి పొడుచు చిత్తవృత్తి నాది."

2. "కఠిన చిత్తుల దురాగతములు ఖండించి
కని కార మొలికించు కలము నాది."

సత్కవిత్వ మెట్లుద్భవించునో కవి యిట్లు తెల్పుచున్నాడు:

1. "హృదయ ..ర్తనంబును సృష్టిచేయు
హృదయ మావశ్యకంబగు కృతులకెపుడు
రాజుకొని కాల్పగ.. నిప.. నవ్వ లేక
యెండ పెల్లుగాలునే

2. "మట్టిముద్దగాదు మహిత సత్కవిశక్తి
మట్టుచున్న నణగి మణగియుండ,
రత్నఖచితమైన రబ్బరు బంతియై
వెంట వెంటనంటి మింటికెక్కు."

కవితా లక్షణమును గూర్చి యీ కవి యభిప్రాయ మిట్లున్నది!

"పొదుగు బరువున నలనల్ల పదము లిడుచు
గదలి చనుదెంచు జన్నంపు మొదవునట్లు,
విపుల రసభావ భరిత గంభీరగమన
మమరి చూపట్టవలయు గబ్బముల కుదురు."

పూనాలో నేను అధ్యక్షత వహించిన ఆంధ్ర సాహిత్య సమితివారు 21-9-1947 న జరిపిన "తిక్కన జయంతి" సందర్భమున శ్రీ జాషువా కవి యువకవుల కిచ్చిన సందేశములో కవిత యెట్లుండవలెనో యిట్లు తెలిపినారు:

"తెలుగు రచయితలు చాలావరకు స్వకీయములైన రచనలనే నిర్మించవలె. అనుకరణము కూడదు ... కాలధర్మమో యనునట్లు, తెనుగుదనము నామావశిష్టమై ఏ ముసలమ్మ పిట్టకథలలోనో, రాట్నపు పాటలలోనో, మారుమూలల్లోనో అణగి వున్నది. దానిని రెచ్చగొట్టి వికసింపజేయడము రచయితల కర్తవ్యము. పాశ్చాత్య నాగరికతలకు గాసిపడిన మన తల్లి నాగరికతను పునరుదరించడము ముఖ్యముగా రచయితలు చేయవలసిన పని ... ఒక పద్యముతో నెదుటవాని తల యూగింపలేకపోయిన అది కవిత్వము గాదు. అతడు కవిగాదు...... ఒక మనిషిలోని అహంకారాన్ని చంపలేకపోతే ఆ కవిలో పటిమ లేదు. కవిత్వము వ్యాకరణాదులు చదివితే అబ్బునది కాదు. అది మనస్సు ద్రవించి, అందునుండి వెలువడు నిర్మల స్రవంతి. అందుకు మితిమీరిన కట్టుబాట్లనవసరము.

జాతి, రాష్ట్రము, కాలము, వీటికేగాక, కవిత్వము అంతరాత్మను గురించి చెప్పవలె. ఒక జాతికిగాని, ఒక రాష్ట్రమునకుగాని, ఒక కాలమునకు గాని సంబంధించిన కవిత శాశ్వతమై యుండలేదు. అది వార్తాపత్రికవలె నీరసము. ఆచార జాతి నియమాల ననుసరించి కవిత్వం వ్రాస్తే అది కొంతకాలమునకే క్షీణించిపోతుంది...కవికి ధైర్యము ఎక్కువ అవసరము. ఏ విధంగా వ్రాస్తే ఎవరేమనుకుంటారో అను భయము ఉండరాదు. ఆత్మసాక్షిగా తనలో వితర్కించుకొని, ఏది వ్రాయదగ్గ మో, దానిని వ్రాయవలె...పండితుడు కవి సృష్టించిన సరస్సులో ఎనుబోతు...కవి స్వేచ్ఛగా వ్రాయవలెను. అంతమాత్రముతో సంఘానికి దెబ్బ తగిలేటట్లు, దిగంబరమైన స్వేచ్ఛ కూడదు. ఇందులో కూడ కొన్ని ఉత్తమ, మధ్యమ, అధమములను తారతమ్యము లున్నవి. వానిని కొద్దిగా సంస్కరించుటకు నేను ఒప్పుకొందును. కాని ఈ నగ్నమైన తోక పీకుడు కవిత్వమును - ఎవరికి అర్ధము కానిదానిని, వ్రాసిన వ్యక్తికే స్పష్టముగా నుండుదానిని నేనిరసింతును... సుదృక్పథంతో కవిత్వం వ్రాయవలె...కవి విశ్వసత్యాన్ని ఆలాపించవలె. జాతిని దృష్టి మాంద్యము విడజేయవలె...అంగాంగ వర్ణనలను, విరహాతురులైన రాణివాసులను, వ్రాసిన దానినే మరల వ్రాయుటలను త్యజింపవలెను. పండితనెహ్రూ వచించినట్లు, ఆర్తులై వచ్చుచున్న నిరాశ్రితులపై కరినులగు వారి మనస్సు కరగునట్లు కవిత్వం వ్రాయవలె. సంఘమునందలి నీచ, స్వార్థపూరిత విభిన్నతలను ఆమూలముగ పెకలివైచు దార్ఢ్యతను అందరిలో అంకురింపజేయవలె. ఈ విధముగా కవులు దేశోద్ధరణానికి తోడుపడి, సత్యమును లోకానికి అందించవలె."

ఈ కవి ఎన్నియో మహాసభలలో ననేక ఘనసన్మానములను పొందినను, తాను అంటరాని కులమున బుట్టుటచే తన కవిత్వమెంత కమ్మనిదని పొగిడినను తన కింకను లభించవలసినంత గౌరవం సంఘంలో లభింపలేదని ఆవేదన పడుచుండెడివాడు. కులవిచక్షతవలననే కర్ణునంత మహాయోధునకు గూడ అవమానము కలిగెనని యాతని నమ్మకము. అట్టి ఆవేదన అవకాశము కలిగినపుడెల్ల ఈ కవి తన పద్యములలో తొంగి చూచు[illegible]నే యుండును. ఉదాహరణకు:

1. వినుకొండను సంబోధించుచు:
"మాదిగలు మాలలనిమర్యాదల కాస్పదము లేని యభిధలతో సంబోధింప బలుకు దీనులు పేదలు సుఖమున్నవారె? వినుకొండపురీ!

2. "కులముల్ కొమ్ములతోడ గుమ్ముకొని చిక్కుల్ పెక్కు సృష్టించు పెద్దల కాలాలు గతించి పోయినవి...

3. "కులము లేనివాడు బలగముండనివాడు
పనికిరాడు నేటి భారతమున."

4. రేడియోను సంబోధించుచు—
"కులమతాల సౌధములు గూలిపోనీక
కాపలా యొనర్చు కవులచేత
వ్రాయబడ్డ ప్రాత రచనలు వినిపించి
బాధపెట్టవలదు వలదు రమణి!"

5. శ్మశానవాటిలో—
"ఇట నస్పృశ్యత సంచరించుటకు దావే లేదు"—

6. రాజదర్శనములో: "కర్ణుడేమాయె కుల పరీక్షకుల నడుమ."

7. చక్కని కవితకు కులమే ఎక్కువ తక్కువలు నిర్ణయించినచో నింకెక్కడి ధర్మము తల్లీ దిక్కుంజరవేదికా ప్రతిష్ఠితగాత్రీ!

8. వేదచతుష్టయంబు ప్రభవించిన వ్యాసుని దివ్యవాణిలో
మాదిగలుందురా? రుధిర మాంసములుంగల యంటరాని వా
రాదిమవాసు లక్కట కటా! తలపోసిన నల్లగుండెలో
సూదులు మోసులెత్తును గృశోదరి! యెట్లు సహించుకొందువో!

9. విజయవాడలో "కవి గజసింహుడఖండుడవు చెళపిళశాస్త్రి"
"బంగారు మువ్వల పెండారము కాలికిం దొడిగినపుడిట్లు
బ్రాహ్మణుడు తన కాలికి దొడిగెనని సగర్వముగ జెప్పి
కొనినను తాను పంచమకులోద్భవుడను మాటను

మరచిపోలేదు. "చెళపిళ సత్కవీశుడు, ప్రసిద్ధుడు వీరశతావధాని, యాంధ్రుల శుభ రక్తనాళముల రూపము నెత్తిన బ్రాహ్మణుండు నా పలుకులరాణి పాదమును బంగరు గగ్గెరతో నలంకృతుల్ సలిపె" నని చెప్పుచు, తన పాదమును అనక "పలుకులరాణి పాదమును" అని చమత్కరించి సమర్ధించినాడు.

10. తన కవిత్వమును విని "భళీ" అన్నవాడే తన కులమేదో వినిన పిదప చివాలున లేచిపోయినప్పుడు కవి పొందిన బాధ యీ పద్యమున తెలిపినాడు!

"నా కవితావధూటి వదనంబునెగా దిగ జూచి రూపరే
ఖా కమనీయ వైఖరులు గాంచి "భళీ భళి" యన్నవాడె, మీ
దే కులమన్న ప్రశ్న వెలయించి చివాలున లేచిపోవుచో
బాకున గ్రుమ్మినట్లగును పార్థివచంద్ర వచింప సిగ్గగున్."

ఈ పద్యమునకు జవాబుగ శ్రీ భాగవతుల పూర్ణయ్య, ఎం.ఎ; పూనాలో "ఆంధ్ర సాహిత్యసమితి" జరిపిన "తిక్కన జయంతి" మహాసభలో నీ క్రింది పద్యమును వ్రాసి చదివించినారు:

"నీ కవితాకుమారికల నిర్మల శీలల జూచి మెచ్చి మీ
దే కులమన్న పిచ్చి వెలయించిన జోగుల "కాంధ్రకోకిలా
"కో"కలకంఠగాన నవకోమల కావ్య కవీంద్రు వంశ"మం
చీ కమనీయగాత్రతలె వచింతు రవి స్మరణీయ వాక్కులన్"

ఇది వినగానే ఆనాడు సభకు అధ్యక్షత వహించుచున్న జాషువా కవి దిగ్గున లేచి నన్ను సంబోధించుచు, "కవిగారూ! నా గుండెలలోని మంట ఇప్పటికి

చల్లారినది. శ్రీ పూర్వయ్యకవిగారికి నా కృతజ్ఞతలను దయచేసి వెంటనే తెలియ జేయండి'', అనుచు, ఆ పద్యము, తాను వ్రాసిన యే పద్యమునకు జవాబుగా వ్రాయబడెనో తెలుపుచు పై ''నా కవితా పధూటి పదనంబు'' అను పద్యమును తన శంఖారావమున వినిపించి తన సంతృప్తిని వెల్లడించెను.

ఈ కవి సుప్రసిద్ధాంగ్లకవి థామస్ గ్రే వ్రాసిన ''ఎలిజీ రిటన్ యిన్ ఎ కంట్రీ చర్చ్‌యార్డు'' అను కవితను చదివెనో లేదోగాని ఈయన ''శ్మశాన వాటి''కిని పై ఆంగ్లకవి పద్యమునకు పెక్కు సామ్యములున్నవి: గ్రే మహాకవి ఎలిజీలో ''సమ్ మ్యూట్ ఇన్‌గ్లోరియస్ మిల్టన్ హియర్ మే రెస్ట్'' అని వ్రాసి నాడు. దానికి సరిపోలునట్లు:

1. ''ఇచ్చటనే సత్కవీంద్రుని కమ్మని। కలము నిప్పులలోనఁ గఱగి పోయె''

2. ''కవుల కలాలు, గాయకుల కమ్మని కంఠము లీ శ్మశాన పుం
గ వనులఁ ద్రొక్కి చూచెడి; నొకా నొక నాడల కాళిదాస భా
రవుల శరీరముల్ ప్రకృతి రంగమునందిపు డెంతలేసి రే
ణువులయి మృత్తికం కలిసెనో కద! కుమ్మరివాని సారెపై!''

గ్రే కవి యిట్లు వ్రాసినాడు:

పర్‌హాప్స్ ఇన్ దిస్ నెగ్‌లెక్‌టెడ్ స్పాట్ ఈజ్ లైడ్
సమ్ హార్ట్ వన్స్ ప్రెగ్‌నంట్ విత్ సెలెస్టియల్ ఫైర్
హాండ్స్ దట్ ది రాడ్ ఆఫ్ ఎంపైర్ మైట్ హావ్ స్వేయిడ్
అర్ వేక్‌డ్ టు ఎక్స్‌టసీ ది లివింగ్ లైర్
సమ్ విలేజ్ హాంప్‌డెన్ దట్ విత్ డౌట్‌లెస్ బ్రెస్ట్
ది లిటిల్ టైరంట్ ఆఫ్ హిస్ యీల్డ్స్ విత్‌స్టుడ్
సమ్ మ్యూట్ ఇన్‌గ్లోరియస్ మిల్టన్ హియర్ మే రెస్ట్
సమ్ క్రామ్‌వెల్, గిల్ట్‌లెస్ ఆఫ్ దిస్ కంట్రీస్ బ్లడ్

ఇంచుమించు సమముగా శ్రీ జాషువా కవి వ్రాసిన పద్దెమిది:

''ఇచ్చట, నే సత్కవీంద్రుని కమ్మని। కలము నిప్పులలోన గఱఁగిపోయె!
యిచ్చోట; నే భూములేలు రాజన్యుని। యధికారముద్రిక లంతరించె
యిచ్చోట; నే వ్రేతయిల్లాలి నల్లపూ। సల సౌరు గంగలోఁ గలిసిపోయె
యిచ్చోట: నెట్టి పేరెన్నిక గనుగొన్న। చిత్రలేఖకుని కుంచియ నశించె!

ఇది పిశాచులతో నిటలేక్షణుండు
గజ్జె గదలించి యాడు రంగస్థలంబు;
ఇది మరణదూత తీక్ష్ణ మౌ ద్రుష్టి లొలయ
నవనిఁ బాలించు భస్మ సింహాసనంబు.

ఈ కింది పద్యమును హృదయ విదారకముగ లిఖించుటలో శ్రీ జాషువా కవి ఆంగ్లకవి గ్రేను గూడ మించిపోయెననుటలో సందియము లేదు.

''ముదురు తమస్సులో మునిగిపోయిన క్రొత్త సమాధి మీదఁబై
బొదలు మిణుంగురుఁటురువు పోలికై వెల్గుచునున్న దివ్వె: ఆ
ముద ముడివోయినన్ సమసిపోవుట లేదది దీపమందుమా?
హృదయముసుమ్మి, నిల్పినియెన్ గతపుత్రక, యే యభాగ్యయో!

ఈ కవికి కర్ణునిపై ప్రత్యేకాభిమానము కలదు. పూర్వ కవుల వలనగూడ ఈతని భూమికకు మిక్కిలి అన్యాయము జరిగినదని ఈ కవి అభిప్రాయము కావచ్చును. కర్ణుడు ధీరుడనియు, యోధుడనియు, తల్లివలన తనకు అన్యాయము జరిగినదని తెలిసియు ఆమె అర్థించినపుడు వల్లెయనిన ధార్మికుడనియు, సూత కులజుడని లోకులనుకొనుటచే హీనకులజుడనుటతో నితని కన్యాయము జరిగె ననియు ఈ కవి దృఢ విశ్వాసము. ఈ క్రింది పద్యములతో కర్ణునిపై యీ కవి యభిమానము వెల్లడి యగుచున్నది:

1. ధర్మము దలంచి, నిను గన్నతల్లి నను గు
సోదరుల రేణువుల భాతి జూచినాడ
వౌర! నీ స్వామిభక్తి; నీ యద్వితీయ
సుగుణసంపద వర్ణింపనగునె కర్ణ!

2. జననం బందిన తక్షణంబ, కఠిన స్రోతంబునన్ గంగ క
ర్పన గావించిన క్రూరురాలనక; లోభస్వాంతయై కుంతి ''నా
యన! కర్ణా! సుతభిక్షరా!'' యనగ; నాహా! మారుమాటాడ కి
చ్చిన విఖ్యాత వదాన్య మాన్యుడవు! పొచ్చెంబేది నీ కీర్తికిన్?

''ఆశ్వాసము''లో—

దెసలం బుక్కిటబట్టు కొండొక మహాతేజస్సమూహంబు, నీ
ల సమానాకృతినుండి లేచి, రవినాలంబించుచో, వైరి మా
నసముల్ నీకు నమస్కరించినవి, కర్ణా! వీరచూడామణీ!
యసువుల్ వోయిననేమి నీ యశము బ్రహ్మాండంబు నోలార్చెడిన్.

తన కవితలో ''రవ్వలు రాల్చిన'' శ్రీ జాషువా, తన ప్రసంగములలో, పద్దెములలోను హాస్య[illegible] మొలికించుచుండెను. పూనాలో ఆంధ్ర సాహిత్య సమితి నిర్వహించిన 'తిక్కన జయంతి' ముగిసిన పిదప మమ్ములనందరినొకచో జేర్చి గుంటూరు గుఱ్ఱపుబండివాని హాస్యరస భరితమగు సంభాషణను వినిపించి కడుపుబ్బ నవ్వించినాడు. పిలకా శాస్త్రిగారితో భేదాభిప్రాయము వచ్చినపుడు కవి యిట్లు వ్రాసినాడు:

1. అంగనల దృష్టికిప్పుడు। ముంగలి జుట్టే ప్రియంబు ముమ్మాటికి, ని
క్కంగూడ దిపుడు పిలకలు। భంగము వాటిల్లు రచ్చపట్టున కెక్కన్.

2. కొడుకును గూర్చి వ్రాయుచు—


''తినును నిద్రవోవు, పనిబాటు చేయడు
కలహములను దెచ్చి కాళ్ళు సాచు,
పరుస దప్పకుండ ప్రతి పరీక్షయు దప్పు
తప్పు గురుల మీద దగులవేయు.''

3. శ్రీ ద్వారం వేంకటస్వామి ఫిడేలు వాద్యమును గూర్చి—

''చెవులు బట్టి పిండి శిక్షించి, జడమైన
కట్టెకెట్లు విద్య గఱపినావొ!
అంగుళీయకంబు లంటి యంటకముందె
నీ ఫిడేలు మధుర నిధుల గురియు.''

4. ''రేడియో'' పై వ్రాయుచు—

''నాల్గు పందలిచ్చి నట్టిల్లు సగమిచ్చి
మెచ్చి చేతులార దెచ్చికొంటి
రేడియా మెషీను చేడియా! దయచేసి
పాడకమ్మ! చలిది పాత పాట.



కవికోకిల శ్రీ జాషువాకు పూర్వ కవులన్న గౌరవము మెండు. అట్టి కవి తల్లజుల గాలములో తాను జన్మించి వారితోపాటు తగిన గౌరవమును పొందలేదని తహతహ పడినాడు. ఇందు తాను వారితో సమమగు కవిత నల్లగలనను అంత రార్థము కూడ కలదేమో!

"అలసాని కులజుఁడూయెల మంచముల నుండి। పసిడిలేఖిని బూని వ్రాయునాడు
పోతనార్యుని గేహమున భారతీదేవి। చిగురుఁజేతుల-వంటఁ జేయునాడు
భువన భీకరుడు వేములవాడ భీమన్న। గంగ్రాజునకు జోలె గట్టునాడు
శ్రీనాథకవి పాండితీ నైపుణము మీర। డిండిమభట్టు నోడించునాడు
కనుల జూచెడు భాగ్యంబు గలిగియున్న।
నేడు నా కవిత్వంబు రాణించియుండు
గారవంబున నన్నేలగాంచవైతి?।
తెలుప గదవమ్మ నను గన్న తెలుగుతల్లి!"

"ఆంధ్రభోజుఁడు"లో—

ముదమున గండపెండియరపుంజిలు గజ్జెల మ్రోతతోడ నీ
సదనమునందుఁ గ్రుమ్మరు లసత్కవితాసతి తాతగారియ
భ్యుదయము విన్న, నా హృదయమూరక పొంగులువారి, నాడు నే
నుదయము నందనైతి ననియున్ దలతున్ నులివెచ్చ యూర్పులన్.

శ్రీ జాషువా కవికి భారతమన్నను. కవిత్రయమన్నను అందును తిక్కయజ్వయనినను గల గౌరవము భక్తిరూపమును దాల్చినది. కవిబ్రహ్మ తిక్కనను గూర్చి తన భక్తి భావమునిట్లు వెలిబుచ్చినాడు:

"తిక్కన కవిత్వము ఒక ఆంధ్రదేశమునకేగాక ప్రపంచమంతటికిని వర్తింపగలది. కవితలో కార్యము సాధించినవాడు తిక్కన. అతని వడయుట ఆంధ్రమాతృ పుణ్యవిశేషము.

తిక్కన కవిత్వ మిదమిత్థమని యుపన్యసింప నెవరికిని తగిన పాండిత్యము లేదు. అతడు కవులలో మేటి. అగ్రస్థానమతనిది. ఐకమత్యమనెడి భావమును అతడు పోషించి, జీవవంతముగా జేసినాడు. మతసామరస్యము, దేవతలందు సమబుద్ధి, ఇవి యతని రచనలకు విశిష్టత నాపాదించుచున్నవి. కృత్రిమము లగు భేదములవల్ల సంఘము సంకుచిత మనోవృత్తులలో జీర్ణించి, చీలికలై, పేలికలై పోయినపుడు సంఘటన శక్తుల వెలయించు తిక్కన లేఖిని యమృత సేచనము గావించినది. కాలధర్మము ననుసరించి, యతని తిరుగులేని వాగమృత ధారలు బలహీనములైన దుశ్శక్తుల నధఃపాతాళమున కణగ్రదొక్కినవి.

తిక్కన కవిత మొదలు చదువ "నిరసన" భావము గలుగవచ్చును. రెండవ సారి భావమించుక గోచరించును. మూడవసారి, దానిలో తెలుసుకోదగిన విశేషములనేకములని స్ఫురించును. నాలుగవసారి, తిక్కయజ్వ మహానుభావుడని తోచును. ఐదవసారి, అతని పూజ్యమూర్తికి సేవజేయ వలయుననెడి భక్తిభావము లంకురించును. నేను ఎనిమిదిసార్లు చదివితిని. ఇంకను కవి హృదయమును పూర్తిగా నాస్వాదించలేనైతిని. యతి ప్రాసలు లేని భారత వేదమును తిక్కన లక్షణయుక్తముగ తెనిగించినాడు. విదేశీయమైన సంస్కృతమునకు, ఆంధ్రత్వముఁ గలిపినాడు. సంస్కృత మాంధ్రనుడికారముఁ గలిసి, యొకనూత్న వేషముఁ దాల్చినది. ఈ ధైర్యము తిక్కనది.

అనుకరింప ననువుగానిది తిక్కన కవిత. మరి యెట్టివారినైనను అనుకరింప కవులు సాహసించిరిగాని తిక్కనను మాత్రము ధైర్యముగ ననుకరించినవారు లేరైరి. ఈ కవిత్వమునకు ఎదురులేదు - సరికదా, సమానతను వహించునది గూడ ప్రపంచ వాఙ్మయమున లేదు. విశాల ప్రపంచమున వ్యాపించి, వినుతికెక్కిన యాంగ్లభాష యందే యిట్టి కవి యుదయింపలేదు. తిక్కన మాత్ర మెవ్వరిని అనుకరింపలేదు. తనకన్న ప్రాచీనులైన కవులను నన్నయాదులను బాగుగా విమర్శించుకున్నాడు. వారి కవితల యందలి స్వారస్యము నాస్వాదించినాడు. ఎఱ్ఱన "స్ఫురదరుణాంశు రాగరుచి", నన్నయ "శారద రాత్రుల"తో మేళవించునట్లనుకరింపబడగా, తిక్కన స్వచ్ఛందమగు నొక విశిష్టమార్గము ననుసరించినాడు. తిక్కన కవిత నిష్కల్మషమై, శాంతి రసోద్దీపనమై నవరసభరితమై ప్రవహించినది. ఆంధ్రుల సర్వతోముఖ జీవిత ప్రతిబింబ మీతని భారతము. ఆ ధైర్యము, ఆ విచక్షణత, మరొకరి యందుండజాలవు. అతని స్వేచ్ఛాఘంటమే ఆధునికులకును ఆంధ్రత్వమనునొక గర్వ మొసగినది.

ఆంధ్రజాతియొక్క అభ్యుదయము కొరకు వ్రాసిన కవి తిక్కన. అది భావోన్మత్త కవితావాహిని కాదు. విచక్షణ పూరిత విలక్షణధార. సకలభావ సంపర్కమున కలగూరగంప కాదు. మనోహర పరిశుద్ధ స్రవంతి. అతడు మరి యొకరికి భావమున దాస్యపద్ధతిగాని, గ్రంథ చౌర్యమును గాని చేసిన పాపమున బోలేదు. సంస్కృత భారతమును స్వతంత్రముగ తెనుఁగుదన ముట్టిపడ వ్రాసిన మనీషి. మనిషిని మనీషినిఁజేయఁబరగిన దితని కృతి. అందు కృతకృత్యతఁగన్నదని చరిత్ర నిరూపించినది. తిక్కన వినమ్రభావమునకు అతడు, తన తాత గౌరవమునుండియే తనకును గౌరవమబ్బినదనియు ఇందు తన గొప్ప యేమియు లేదనియు వ్రాసిన పద్యమందు ధ్వనితమైనది.

కరుణవల్ల వాల్మీకిలో కవిత్వము పుట్టినది. కవికి గురువు లేడు. అతడు జాతిని దేశమును మరచిపోడు. దీనినే తిక్కన పాండవ కథనమున వ్యక్తపరచినాడు."



శ్రీ జాషువా కవి తన రచనల వల్లన "జాతీయ కవి" యనియు, "స్థానిక కవి" యనియు పరిగణింపబడుచున్నాడు; కవి తన "దీర్ఘ విశ్వాసము"న నిట్లనుచున్నాడు:

"తెలుగుం బాసకు వన్నెదెచ్చిన జగద్వీరుండు మా కృష్ణరా
యలు గట్టించిన వజ్రదుర్గములు, శుద్ధాంత ప్రదేశంబులున్,
దల్లక్రిందై తపమాచరించెడిని సంతానార్థమై, గబ్బిగ
బ్బిలపుంగుబ్బెత లక్కటా! మొయిలుగప్పెం బూర్వమర్యాదకున్."

ఈ కవి జాతీయతయే "నేతాజీ" కావ్యమున గూడ మూర్తీభవించుచున్నది. ఈ కవితల్లజుని ప్రతిభను గుర్తించిన ఆంధ్రావని యీయనకు "కవి కోకిల", "కవితావిశారద", "ఉభయభాషాప్రవీణ", "కవిదిగ్గజ", "నవయుగ కవిచక్రవర్తి" మున్నగు ననేక బిరుదుల నొసగి సత్కరించినది. ఆంధ్రసాహిత్య ప్రపంచమునకు తీరని లోటు వాటిల్లునట్లు పక్షవాతమునకు గురియై:

24-7-1971 తేదీన:

"దివిజ కవివరు గుండియల్ దిగ్గురనగ
అరిగె" నంతట జాషువా "అమరపురికి"

దాని పేరు కవిత్వం!

శ్రీ వేదాంతం శరచ్చంద్ర బాబు

నేల మీద పారాడే చీమకూ
నింగి లోన తారాడే పక్షికీ
అడవుల్లో తిరుగాడే మృగానికీ
ఉత్సాహం పొంగినా
ఉద్రేకం వచ్చినా
ఆకలితో కనలినా
ఆపదలో అడలినా
ఆనందం,ఆక్రోశం,
ఆశ్చర్యం, ఆదరం,
కోపం, తాపం, ప్రేమ—
ఇంకా ఎన్నో ఎన్నెన్నో
భావ తరంగా లెదలో రేగుతాయి
భాషగా చెలరేగుతాయి—
అవును— భాషంటే ఏమిటి
మనసులోని భావానికి శబ్దరూపమే కదా!
పంచదార పలుకులు పది
చీమ కంటు పడగానే
పరుగెత్తు తుంది-ఎలుగెత్తుతుంది
తోటి కోటి చీమల కది
చాటి చెప్పు తుంది
అదే చీమ భాష!
కొమ్మ మీద కోయిలమ్మ కో అంటే
తుమ్మల్లో గుడ్లగూబ గీ అంటే
ఇంటి మీద కాకి పిల్ల కావ్ అంటే
వీధిలోన కుక్కపిల్ల బౌ అంటే
పడగ విప్పి త్రాచు పాము బుస కొడితే
మడుగు లోన గోండ్రు కప్ప
బెకబెక సవ్వడి చేస్తే
ఈల కోడి కీచు మంటే
చంటి పాప కేరు మంటే
ఏదో భావం ఉంది
ఎంతో అర్థం ఉంది
ఆభావాన్ని, అర్థాన్ని
పరార్థమై అనువదించి చెప్పేదే భాష!
అదే_అనంత కోటి జీవరాశి
అహోరాత్రి హృదయ ఘోష_కంఠశోష!

పూల ఋతువు విరిసి నపుడు
సిరి వెన్నెల కురిసి నపుడు
చివురు టాకు పెదవి మీద
ఉదయ కాంతి మెరిసి నపుడు
మంచు బొట్టు తళుకు మనుచు
ముత్యంగా మెరిసి నపుడు
పెను చీకటి ముసిరి నపుడు
వినువీధిని కారు మొయిలు
ప్రళయార్భటి చేసి నపుడు
జడి వానలు కురిసి కురిసి
ఏళ్లు పూళ్లు ఒకటి చేసి
సవిత్రినే ముంచి నపుడు
ప్రాణి కోటి తల్లడ పడి
భయ భ్రాంతి పరుగు లెత్తి
ఆర్తి తోడ అరచి నపుడు
శ్రమ జీవుల కండరాలు
కరిగించిన స్వేద బిందువులో
సింధువు ఘూర్ణిల్లి నపుడు
ఆకలితో కనలి నపుడు
ఆక్రోశం కలిగినపుడు
ఆవేదన పొగిలి నపుడు
ఆశ్చర్యం మిగిలి నపుడు
ఆనందం ఎగిరి నపుడు
అనురాగం మురిసి నపుడు
కోపం పెల్లుబికి నపుడు
తాపం చెల రేగి నపుడు
ఇంకా ఎన్నో ఎన్నో —
ఎన్నెన్నో భావా లెద మెదలి నపుడు
మెదలిన ఆభావం ఆర్ద్రంగా
మాటలలో అర్థంగా
తీవ్రంగా తియ్యంగా
ఎదుటి మనసు తాకినపుడు
విన్న మనసు కదలి కరిగి
తాదాత్మ్యం చెందితే
అదే-అదే భావ పరమార్థం—
దాని పేరు కవిత్వం

అయిదింటికి ఆఫీసు ఖాళీ అయింది. ఇంటి పక్షులు యిళ్ళకెగిరి పోయారు. బ్రహ్మచారులూ, తాత్కాలిక బ్రహ్మచారులు కొంతమందీ యిళ్ళకెళ్ళి చేసేదేమీ లేక పేకాటా, కారంస్ ఆడటానికి స్పోర్ట్సురూంకు చేరుకున్నారు. నెత్తి నెత్తుకున్న పెంట తీసేసుకోలేక నేనూ, మరో పదిమందిమీ నెమ్మదిగా. అయిష్టంగా యూనియన్ రూంకు నడిచాం.

అప్పటికే రూంలో సెక్రటరీ, కమిటీమెంబర్లు సమావేశం ప్రారంభించారు. పేరుకే కమిటీ మీటింగ్ కాని అక్కడా కబుర్లే. ఎవడి గోల వాడిదే. ప్రతివాడూ పక్కవాడితో ఏదో ప్రపంచ సమస్య (ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం, పంజాబు, తెలుగుగంగ, సింహళంలో తమిళుల వధ వగైరా) గొంతు చించుకుని వాదిస్తూనే వున్నాడు.

"మీ చర్చలు తరువాతయ్యా బాబూ. మనం కాసేపు వచ్చిన పనేమిటో మాట్లాడుకుందామా?" అన్నాడు సెక్రటరీ.

"చెప్పండి."

సెక్రటరీ గొంతు విప్పగానే మళ్ళీ వీళ్ళ చర్చలు మొదలు.

(నాతోసహా) అందరూ మంచివాళ్ళే. సెక్రటరీ మీద ఎనలేని నమ్మకం. సెక్రటరీగారు అనర్గళంగా మాట్లాడి చివరికి యిష్టంలేని విషయం కూడా మాచేత ఒప్పిస్తాడని మాకు తెలుసు.



"మన డిమాండ్సును మేనేజిమెంటు ఒప్పుకునేట్టు లేదు. 'చర్చలు చర్చలు' అంటూ కాలయాపన చెయ్యటమే వాళ్ళ ఎత్తుగడలా తోస్తున్నది. ఇంక మనం ఏదో ఒక ఆందోళన కార్యక్రమం ప్రారంభించకపోతే లాభం లేదు." అన్నాడు సెక్రటరీ.

వెంటనే, 'అలాగే' అంటూ అయిదుగురం కోరస్ పాడాం.

"ఏం చెయ్యాలని మీ ఉద్దేశం?" అన్నాడు ఈశ్వర్.

"ఏముందీ, డిమాన్‌స్ట్రేషన్స్ - ప్రదర్శనల్తో ప్రారంభిద్దాం" అన్నాడు సెక్రటరీ.

"హహ్హహ. మేనేజిమెంటు పెద్ద పెట్టుబడిదారు. ఈ తాటాకు చప్పుళ్ళకు జడపరు" అన్నాడు ఈశ్వర్. అందరం అతడివైపు చూశాం. ఈశ్వర్ మాలోని వాడే. కాని కాస్త అతివాది. అతడి కంటికి మేమంతా రియాక్షనరీలలాగా, రివిజనిస్టులలాగా కనిపిస్తాం. దమ్ములేనివాడు దమ్ములేదని ఒప్పుకోవటానికి సిగ్గుపడవలసిన అవసరం లేదు. మా ఫ్రెండ్సు కాస్త ఆర్గ్యూ చేస్తారుగాని నేను వెంటనే 'అవును గురూ, నేను చవటనే' అని ఒప్పేసుకుంటాను. బతికుంటే బలుసాకు తినొచ్చనుకునేవాణ్ణి నేను.

"అసలు ప్రపంచ చరిత్రలో కార్మిక సంఘాలు ఎప్పుడు ఏ పరిస్థితుల్లో పుట్టాయో జ్ఞాపకం చేసుకుంటే మనం ఎప్పరం ఈ పాక్షిక ఆర్థిక పోరాటాలతో తృప్తిపడం" అంటూ ఓ బాంబ్‌షెల్ వేశాడు ఈశ్వర్. దళసరి కళ్ళద్దాలు, చింపిరిజుత్తు, చేతిలో ఎప్పుడూ సిగరెట్టు. చంకలో ఓ అరడజను పుస్తకాలు, పత్రికలు-సృజన, అరుణతార. ఫ్రాంటియర్. మాస్‌లైన్ వగైరా ఎవో అన్నీ అలాంటివే. అతడెక్కడ తిరిగితే అక్కడే ప్రభుత్వం డిస్టర్బ్‌డ్ ఏరియాగా ప్రకటిస్తుందేమోనన్నంత భయంకరంగా మాట్లాడుతాడు. (మాటవరసకన్నాను. మనిషి మంచివాడులెండి.)

"నీ విప్లవ బాధకాదు గురూ, మనం చెయ్యాల్సింది చెప్పు." అన్నాడు సర్వారావు. వాడసలే పిరిగ్గొడ్డు. ఈశ్వర్‌ను చూస్తే నాకప్పుడప్పుడూ ఓ అనుమానం వస్తుంటుంది. ఈ మార్క్సిస్టు-లెనినిస్టు విప్లవ పార్టీలు తమ సభ్యుల్ని కొంతమందిని కార్మిక సంఘాల్లో పనిచేసి వాటిని మరింత రాడికలైజ్ చెయ్యమని పంపిస్తుంటాయట. వీళ్ళు వాళ్ళ తరఫు గూఢచారుల్లా ఇక్కడ పని చేస్తుంటారు. ఒకవేళ ఈశ్వర్ అలాంటివాడైనా నేను ఆశ్చర్యపడను. ప్రతిరోజూ పేపరు తెరవగానే 'ఈశ్వర్ అరెస్టు' అనే మాట కనిపిస్తుందేమోనని ఆతృతగా చూస్తాను. లేదా ఈశ్వర్ సెలవుపెట్టి మాయమైపోతే (అతడు తరచుగా సెలవు పెడుతుంటాడు.) ఏ వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ అడవుల్లోనో ఎన్‌కౌంటర్లో చంపేశారేమోనని భయపడతాను. ఎంత చెడ్డా కొలీగ్; మిత్రుడు.

"కామ్రేడ్ ఈశ్వర్ చెప్పినదానివెనక చాలా చరిత్ర వుంది. కార్మికోద్యమ చరిత్ర చదువుకోకుండానే మనమంతా కార్మిక సంఘంలో పోస్టుల్లో వున్నామంటే ఒకరకంగా సిగ్గుపడాలి. నిజానికి మనం ఎప్పుడైనా మన సభ్యుల కోసం 'పాఠశాల' నిర్వహిస్తే ఈశ్వర్‌ని తప్పక అక్కడ లెక్చర్లివ్వమని మనం కోరాలి. కాని ప్రస్తుతం——" అంటూ ప్రారంభించాడు సెక్రటరీ.

కార్మిక సంఘమంటే విప్లవ పార్టీయా ఏమిటి? యూనియన్ అంటూ ఒకటుంటే మేనేజిమెంటు మరీ బరితెగించి పోకుండా చూడచ్చనీ, పని పరిస్థితులు మెరుగుపడతాయనీ, ఏదో కాస్త హడావిడి చేసి జీతం రాళ్ళు పెరుగుదల కోసం ప్రయత్నించవచ్చనీ అనుకున్నామేగాని-విప్లవమే రావాలి, దేశంలో కమ్యూనిజమే రావాలి. అప్పుడే మా బతుకులు కడతేరాలి అంటే అది మావల్ల అయ్యే పనేనా!

ఈశ్వర్ కంత ఉత్సాహంగా వుంటే ఆ పార్టీలోనే ఫుల్‌టైమర్‌గా పని చేస్తే పోదూ. కార్మికసంఘం ఏం చెయ్యాలన్నా అందర్నీ కూడగట్టుకుని ముందుకు కదలాలి. ఏదో ఎర్రజెండా మీద కార్మిక సంఘం పేరు రాసుకోవడం, అందరం

ఒకర్నొకరు కామ్రేడ్ అని పిలుచుకోవడం తప్పిస్తే మేమెవరమూ కమ్యూనిస్టులం కామే!

అసలు ఈ ప్రదర్శనలకైనా ఎంతమంది వస్తారో అనుమానమే. కాని ఈశ్వర్ మాట తీసెయ్యటానికి లేదు. అతడు చెప్పిందాంట్లోనూ సత్యమున్నది.

"కామ్రేడ్ ఈశ్వర్ అభిప్రాయాన్ని మార్గదర్శకంగా తీసుకుని మనం మొదట ఆఫీసుకు గంట లేటుగా అటెండయ్యే కార్యక్రమం ప్రారంభిద్దాం." అన్నాడు సెక్రటరీ.

ఈశ్వర్ చిరాగ్గా చూశాడు.

"మీరేపని చేసినా అందరికోసం చేస్తారుగాని నా ఒక్కడికోసం కాదు. ఆ లెక్కన ఇప్పుడు మనకు వస్తున్న జీతం కూడా మనకన్నా ఎక్కువ కష్టపడుతున్న అనేకమంది ఇతర కార్మికులకు వస్తున్న జీతంకన్నా ఎక్కువే. నిజానికి, ప్రస్తుతం దేశంలో వున్న నిరుద్యోగ సమస్యతో - మనకిస్తున్నదాంట్లో సగం ఇస్తామన్నా ఎగిరి గంతేసి వచ్చేవాళ్ళు లక్షలమంది వున్నారు. అందువల్ల మనం మేనేజిమెంటు మెడలు వంచి జీతాల్లో గణనీయమైన అభివృద్ధి సాధించాలనుకుంటే కనీసం ఒకరోజు సమ్మెతో ప్రారంభించాలి." అన్నాడు.

సెక్రటరీ ఊం కొడతాడేమోనని మాకు గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి. కాని ఎప్పుడూ పాము చావకుండా, కర్ర విరక్కుండా మాట్లాడే సెక్రటరీ మావైపు చూశాడు.

"అన్నప్రాశన చెయ్యకుండానే మాంసం తినమన్నట్టుగా యిదేమిటయ్యా" అన్నాడు చౌదరి.

ఈశ్వర్ లేవదీసిన పాయింటుమీద తర్జన భర్జన ప్రారంభమైంది. కాని ముందే నిర్ణయించుకున్న పని వుండటంతో నేను వెడతానని లేచాడు. పౌర హక్కుల సంఘం సమావేశానికి వెళ్ళాలని ఈశ్వర్ కూడా బయల్దేరాడు.

"ఎందుకు ఈశ్వర్, మమ్మల్ని అలా అడకత్తెరలో ఇరికించ చూస్తావు?" అన్నాను.

"లేకపోతే ఏమిటీ ఆడంగి కబుర్లూ. మనిషి తనకై తాను ఏ ప్రమాదాన్నీ ఎదుర్కోవటానికి ఇష్టపడడు. తన మంచి కోసమే అయినాసరే, రిస్కు మాత్రం వద్దంటాడు. అందువల్ల మనం వాళ్ళను ముందుకు నెట్టాలి. ఒక్కరోజుతో ఈ సమస్య పరిష్కారం కాదని నాకు తెలుసు. అప్పుడు సమ్మె రెండోరోజు కూడా సాగుతుంది. క్రమంగా అటు మేనేజిమెంటు మీదా, యిటు మనమీద కూడా వొత్తిడి పెరుగుతుంది. మన పోరాటం తీవ్రతరమవుతుంది. పోలరైజేషన్ ఇలాగే వస్తుంది." అన్నాడు ఈశ్వర్.

"చివరికి?"

"ఏముందీ, ఎవరో ఒకరు గెలుస్తారు. మేనేజిమెంటు గెలిస్తే అది మనకు మంచి గుణపాఠం. ఇటువంటి పోరాటాలు ఎంత నిర్వీర్యమైనవో తెలిసివస్తుంది. ఒక కార్మిక సంఘం కాదు—ఇతర కార్మిక సంఘాలు—మొత్తం కార్మికవర్గం కలిసి సంఘటితంగా యుద్ధం ప్రకటించాలన్న చారిత్రక సత్యం అవగాహనవుతుంది. అప్పుడు దేశంలో నడుస్తున్న ఇతర ప్రజాపోరాటాలతో ఐక్యసంఘటన ఏర్పడుతుంది." అన్నాడు ఈశ్వర్.

"అయ్యబాబోయ్. నాలుగు జీతంరాళ్ళు కావాలంటే ఎంత థీరీ చెప్పావు!" అన్నాను ఇతగాడి ప్లానుకు ఇంకేమనాలో తోచక.

"సిద్ధాంతం కాదు. ఇది ఆచరణ."

"కడుపులోని చల్ల కదలకుండా వున్న మనవాళ్లు నీ సిద్ధాంతాన్ని అంగీకరించకపోతే ఏం చేస్తావు?" అన్నాను.

"అటువంటి కార్మిక సంఘంతో నాకు సంబంధం లేదు-" అన్నాడు ఈశ్వర్.

వెలుమర్చి

యం. పార్థసారథి

"నువ్వు ఆందోళన కార్యక్రమంలో పాల్గొనవా మరి?"

"ఎందుకూ? ఆడాళ్ళంతా కలిసి బతుకమ్మఆట ఆడుకున్నట్టు ఆఫీసు ముందర చేరి భజన చెయ్యటానికా?"

"ఆఫీసులో ఉద్యోగివైన నువ్వు అందరితోపాటు పాల్గొనకపోతే దానివల్ల ఎవరికి లాభం? - ఉద్యోగులకా? మేనేజిమెంటుకా?

"మేనేజిమెంటుకు లాభమని మీరనుకుంటున్నారు. నన్ను 'ద్రోహి' అంటారు. కాని వుద్యమానికి లాభమని నేను నమ్ముతాను." అన్నాడు ఈశ్వర్.

ప్రెస్ క్లబ్‌లో మీటింగ్, రజనీకొఠారీ, కన్నాభిరాన్ వగైరా ప్రముఖులు అనేకమంది వచ్చారు. ఈశ్వర్‌ను చూసి అక్కడ అనేకమంది పలకరించారు. వాళ్ళ మధ్యన నాకు కాస్త యిరకాటంగానే తోచింది. బయట వరండాలో పెట్టిన పుస్తక ప్రదర్శనను చూస్తూ నిల్చున్నాను. అక్కడికి వచ్చినవాళ్ళు విప్లవకారులో, విప్లవాభిమానులో, ప్రజాస్వామ్యవాదులో నాకు తెలియదు. వాళ్ళ మాటల ధోరణి చూస్తే ఈశ్వర్ గట్టివాడనే తోచింది. అసలలాంటి చోటికి వచ్చినందుకే పోలీసులు నిఘా వేస్తారేమోనని నా అనుమానం. మఫ్టీలో మా చుట్టూ ఎంతమంది గూఢచారులున్నారో ఏం తెలుసు. ఈశ్వర్ మాత్రం చక్కగా ఎగ్జిబిషన్‌లో తిరిగినట్టుగా, కరచాలనాలు చేస్తూ 'వాళ్ళ' కబుర్లు చెప్పుకొంటూ తిరిగాడు. పోలీసు అత్యాచారాల గురించీ, ఎన్‌కౌంటర్ల పేరుతో అమాయకులను, ప్రజా కార్యకర్తలను పట్టుకుని చిత్రహింసలు పెట్టి కాల్చివేస్తున్నారని చెప్పారు. 'పట్టుకుని కాల్చి ఎన్‌కౌంటర్ పేరు పెడుతున్నారంటే అది అన్యాయమనటానికి సందేహమెందుకు?

'ప్రభుత్వ చట్టాలను పోలీసులే ఉల్లంఘిస్తున్నారు' అన్నాడు మరో వక్త. "ఈ పరిస్థితుల్లో అధికారమే నేరమై ప్రజల్ని నేరస్తుల్ని చేస్తుంటే నోరుండి వూర్కున్న ప్రతివాడూ నేరస్థుడే-" అన్నాడు. ఆ మాటకు వొళ్లు గగుర్పొడిచింది. నా బానిస బతుకుమీద సిగ్గుపడ్డాను. "అద్భుతం గురూ" అన్నాను.

ఈశ్వర్ నవ్వాడు.

"ఇంత సానుభూతి వున్నవాడివి తరచు యిలాంటి సమావేశాలకెందుకు రావు మరి?" అన్నాడు.

"ఇకమీదట వస్తాను" అన్నాను.

యాదృచ్ఛికంగా యిలా రావటంవల్ల నా కళ్ళు తెరుచుకున్నాయి. జ్ఞానోదయమైంది. దేశంలో యింత అల్లకల్లోలం వుందా! ఇంత అన్యాయం, అక్రమం, హింస...

"నేను మన మీటింగ్‌లో అలా ఎందుకు మాట్లాడానో యిప్పుడైనా అర్థం చేసుకున్నావా?" అన్నాడు ఈశ్వర్.

ఇక్కడి వక్తలు దేశ పరిస్థితిని వర్ణించిన తర్వాత అలాంటి చిన్న విషయాలను గురించి ఆలోచించటానికే మనస్కరించలేదు. వీత కష్టాలు వీతవి కావచ్చు కాని దానికీ, దీనికీ సారూప్యం ఏమిటి?

నేను మాట్లాడలేదు.

వేయి స్తంభాల గుడి

శ్రీ రెంటాల శ్రీవెంకటేశ్వరరావు

(వేయి స్తంభాల గుడిని దర్శించి నప్పుడు - విశ్వనాథ
వారైతే దీన్ని గురించి ఏం రాసేవారో అన్న ఆలోచన
పుట్టి - రాసిన పద్యాలివి.)

ఇచటి నందీశ్వరుం డేపురాతన జయ
స్వప్న సంచయ దిదృక్షాత్త మతియొ
ఇచటి కూలిన స్తంభ నిచయమే మతమదో
న్మత్తదౌర్జన్య చిహ్నాత తులదియొ
ఇచటి కోనేటి నీరే నాటి దిక్కులే,
నట్టి తెన్గుల విషాదాశ్రుమయమొ
ఇచటి రుద్రేశ్వరుండెన్ని కష్టసుఖాల
కడలుల జనుల చుక్కాని యగునొ

ఇచటి ఒకనాటి వైభవ మ్మెంత ఘనమొ
ఇచటి ఒకనాటి వైక్లబ్య మెంత భృశమొ
పద పదాస్పృష్ట ప్రాక్కథా ప్రధితమైన
ఆలయమ్మిది; ముందున కడుగు పడదు.

ఒక్కొకక్క తెన్గువాడుక్కు మగటిమి !
తాపరుద్రత గన్న ధన్య ఘుడియ
ఒక్కొకక్క పదుచు నాంధ్రోగ్రధీ సద్గ్రంథ
మునకు శాశ్వత నొప్ప పుణ్యఘుడియ
ఒక్కొకక్క సౌధమ్ము చిక్కణ శ్రీకిన
రత్న మందిరత దాల్చు రమ్యఘుడియ
ఒక్కొకక్క శిలయు సముజ్జ్వల జీవశి
ల్పరుచి నాంధ్రత గొన్న లలిత ఘుడియ

కలసి వచ్చిన కాలానా వెలసి; నేటి
కా మహాకాల హేలా నిరంతరాయ
దర్శనాకాంక్ష దప్తమై తపసివోలె
కొలుచు రుద్రేశు శీర్ణ దేవాలయమ్ము.

"ఏం చెప్పవేం?" అన్నాడు ఈశ్వర్.

ఇంతలో సన్ను రక్షించటానికన్నట్టుగా, చెదరిన జుత్తుతో, సాదా కాటన్ చీర చుట్టుకుని, ఫాషన్‌ను యిష్టపూర్వకంగా తిరస్కరిస్తున్నట్టుగా వున్న ఓ పాతికేళ్ళ స్త్రీ 'నమస్కారం ఈశ్వర్‌గారూ' అంటూ వచ్చింది.

ఈశ్వర్ నన్నామెకు పరిచయం చేశాడు.

"మీరిటువైపు తరచుగా రావటం లేదు." అంది ఆవిడ.

"ఏవో ఆఫీసు గొడవలు" అన్నాడు ఈశ్వర్.

ఆవిడ చేతిలో పట్టుకున్న కాగితాల దొత్తులోంచి రెండు కాగితాలు తీసి నాకొకటీ, ఈశ్వర్ కొకటీ యిచ్చింది.

"ఎన్‌కౌంటర్లన్నీ పోలీసు హత్యలే. ఈ అక్రమాల్ని ఆపమని ప్రభుత్వానికి మెమోరాండం సమర్పించాలి. సంతకాల ఉద్యమం ప్రారంభించాం..." అంది ఆవిడ బాల్‌పెన్ను అందిస్తూ.

"మేమంతా ఎప్పుడూ మీతోనే గదా!" అన్నాడు ఈశ్వర్.

ఇంత గొప్ప కర్తవ్యం నిర్వహించే అవకాశం కల్గిన సంతోషంతో నేను పెన్ను తీసుకుని గబగబా పేరు రాసి సంతకం చేశాను.

"నేను తరువాత సంతకం చేసి మీకిస్తానులెండి." అంటూ ఈశ్వర్ కాగితం మడిచి జేబులో పెట్టుకున్నాడు.

ఆవిడ బలవంతం చెయ్యక నమస్కారం చేసి వెళ్ళిపోయింది.

ఒకసారి నిట్టూర్చి, నావైపు విసుగ్గా చూసి మెట్లు దిగాడు ఈశ్వర్.

"ఏమిటి కామ్రేడ్, సంతకం చెయ్యలేదేం? అభిప్రాయభేదమేమైనా వుందా?" అని అడిగాను.

"నీకు బుద్ధిలేదసలు. ఇలాంటివి చెయ్యటం మన ఆఫీస్ రూల్సుకు విరుద్ధం తెలుసా!" అన్నాడు ఈశ్వర్ నన్ను చిరాగ్గా ఫూల్‌ని చూసినట్టుగా చూసి.

"అదేమిటి. అన్యాయం ఆపమని చెప్పటానికి రూల్సెందుకు అడ్డమొస్తాయి?" అన్నాను అర్థంకాక.

"చూడవోయ్, వెర్రినాయనా, ఇవన్నీ తీవ్రవాద రాజకీయాలు. మనం, సంతకాలు, దస్తూరి లేకుండా ఎన్ని మీటింగులకి వచ్చినా ఫరవాలేదు. కాని సంతకాలు చెయ్యటమంటే పోలీసు పుస్తకాల్లోకి ఎక్కినట్టే." అన్నాడు ఈశ్వర్

"ఎక్కితే ఏమిటి? నేనేం తప్పు చేశాను?" అన్నాను

"నీ ఖర్మ నీలాంటి బడుద్ధాయిలకు ఎంత చెప్పినా అర్థం కాదు." అంటూ మరో సిగరెట్టు వెలిగించి బస్సెక్కి వెళ్ళిపోయాడు ఈశ్వర్.

శ్రీ నిష్ఫల సుబ్రహ్మణ్యం

కాళిదాసుని జ్యోతిశ్శాస్త్ర వైదుష్యము

కాళిదాసు సర్వశాస్త్ర పారంగతుడు. అతడు కాళికాదేవ్యనుగ్రహము నొందినవాడు. అతని కబ్బములలో జ్యోతిశ్శాస్త్ర విషయములు కోకొల్లలుగ నున్నవి వానిని స్థాలీపులాకన్యాయముగ నిట సమీక్షించుటయే ప్రస్తుత వ్యాసోద్దేశము.

1. రంభా : "హలా చిత్రలేఖాద్వితీయాం ప్రియసఖీమూర్వశీం
విశాఖాసహి
త ఇవ భగవాన్ సోమః సముపస్థితో రాజర్షిర్దృశ్యతే"
(విక్ర.)

ఊర్వశీ చిత్రలేఖలతోగూడిన పురూరవుడు విశాఖానక్షత్రఘటితుడైన చంద్రునితో బోల్పబడుట కడుంగడు హృదయంగమము. ఏ నక్షత్రముతో గూడిన చంద్రునైనను ఇట పోల్చనగును. కాని విశాఖానక్షత్రముతోగూడిన చంద్రునే ఉపమానముగా గ్రహించుట గమనార్హము. ఇట రాజు పార్శ్వమున ఊర్వశీ చిత్రలేఖ లిరువురు గలరు. ఒకే నక్షత్రమును గ్రహించినచో ఉపమానోపమేయములయందు అత్యంత సాధర్మ్యముండవలయునను నియమము భిన్నమగును. విశాఖానక్షత్రము ద్విదైవత్యము...ఋక్షేశా అథద్రసకాలహుత భుక్...' అను కారికయందు కాలామృతమున 'ఇంద్రాగ్నీ అపి' అని విశాఖా నక్షత్రమునకు ఇంద్రాగ్నులు దేవతలుగా చెప్పబడియున్నారు. ఆకారముననూ ఈ నక్షత్రము రెండు నక్షత్రముల కలయిక. ఆకారమున నక్షత్రములు రెండైనను విశాఖాత్వము రెంటియందును సమానముగా అవిభక్తముగానున్నట్లు ఊర్వశీ చిత్రలేఖ లిరువురైననూ పవిత్ర స్నేహయుక్తమైన వారి మనస్సు ఒకటేననెడి వ్యంగ్యార్థము మహాకవి వాక్కునందు గోచరించుచున్నది.

రెండు నక్షత్రముల కలయికచే నేర్పడు ఋక్షములు రెండున్ననూ విశాఖనే గ్రహించుటయందు మఱియొక యంతరర్థమున్నది. కాలనేమిరాక్షసుని జయించిన విక్రముడు పూర్ణచంద్ర సదృశుడని భావించుట యుక్తము. పూర్ణ చంద్రునియే ఏల గ్రహింప వలెనని యాశంకింపరాదు పూర్ణచంద్రునితో బోల్చుట కవి సంప్రదాయము. పూర్ణచంద్రునితో విశాఖానక్షత్రము గూడుట యనిన వైశాఖపూర్ణిమయగును. ఇతర పూర్ణిమానిశీథులయందుకంటె వైశాఖాపూర్ణిమా రజనియందు కల్గు ఆహ్లాదమ నిర్వచనీయమైనట్లు ఊర్వశీ చిత్రలేఖాసమాయుతమగు పురూరవుని శోభ ప్రేక్షకులకమందానందము నొసంగుచున్న దను వ్యంగ్యార్థస్ఫురణముచే కవికులగురునిచట అత్యంతస్తుత్యుడగుచున్నాడు. ఇట కల్పలతా వ్యాఖ్యానమున యీ విషయము చెప్పబడలేదు.

2. "ఆభాతి మణివిశేషః దూరమిదానీం పతత్రిణా నీతః
నక్తమివ లోహితాంగః పురుషఘనచ్ఛేద సంపృక్తః" (విక్ర).

పంచమాంకమున సంగమ నీయమణిని పక్షి ఆకాశమున గొనిపోవు చుండ దానినిజూచి కర్బురవర్ణమేఘచ్ఛేద సమేతమైన అంగారకగ్రహమువలె ప్రకాశించుచున్నదని రాజభిప్రాయపడినాడు. అంగారకగ్రహమగ్నిమండలములచే ప్రకాశించుచుండుటచే నింగిని పక్షిచే గొంపోబడుచున్న మణి అంగారకునితో పోల్పబడుట హృదయంగమము. రెండునూ ఆకాశమున ప్రకాశించునవి యగుటచే ఉపమచే వర్ణించుట రక్తి గట్టినది.

అంగారకుడనుకూలుడైనచో వివాహమున యెడబాటులేక అనురక్తి కలుగును. ఇట అనుకూలమైన సంగమనీయమణి ఊర్వశీ పురూరవుల పునస్సమాగమమునకు హేతువైన అంగారకునివలెనున్న మణి అనుకూల మగుట దాంపత్యసుఖమునకు హేతువనుట అత్యంత ముచితమై కవిచేగల జ్యోతిశ్శాస్త్రపాండితిని వెల్లడిచేయుచున్నది అంగారకుడెఱ్ఱని వాడగుటచే లోహితుడని పేరుగలదు కుతడగ్నిమయుడనుటకు 'అర్కోఽంగారశ్చాగ్ని తత్త్వమ్' అను లఘుపారాశర ప్రమాణమనుసంధేయము.

3. "దిష్ట్యా అవినయేన అప్రసన్నాగతైషా తాపదావాం
శ్రీఘ్రమేవాపస
రావః యావదంగారక ఇవ సా అనువక్రం న కరోతి

మాళవికాగ్నిమిత్ర నాటకమున తృతీయాంకమున సహజజ్యోతిశ్శాస్త్ర విదుడగు కాళిదాసుని నోట అప్రయత్నముగా జ్యోతిషోపమానము నిసృతమైనది. తృతీయాంకమున మాళవికాగ్నిమిత్రుల పరస్పర రాగాభివ్యక్తి సమయమున ఇరావతి ప్రవేశించి అభిక్రుద్ధయై అగ్నిమిత్రుని నిందించుచూ వెడలినది. ఇట్లు కుపితయై వెడలిన ఇరావతి నుద్దేశించి విదూషకుడైన గౌతమునితో రాజిట్లనినాడు.

'దిష్ట్యా అవినయేన అప్రసన్నాగతైషా తాపదావాం శ్రీఘ్రమేవాపసరా
వః యావదంగారక ఇవ సా అనువక్రం న కరోతి'

అప్రసన్నురాలై అవినయముగా ఇరావతి వెడలినది. మనమునూ శీఘ్రముగా ఇటనుండి తొలగిపోవుదము. లేనిచో అంగారకునివలె యీమె వక్రింపవచ్చును. అని పైమాటలకర్థము.

నక్షత్ర పాదములయందు సంచరించు గ్రహములు వెనుకపాదముల లోనికి మరలినట్లు గోచరించుటను వక్రించుటయందురు. స్థానదిక్కాలచేష్టా దృఙ్నైసర్గికబలములని ప్రతిగ్రహమునకు షడ్బలములు కలవు. వక్రించిన గ్రహమునకు చేష్టాబలము కలుగునని శాస్త్రము కలదు ఇట్లు చేష్టాబలము కలిగిన గ్రహము ప్రబలుడయి శుభుడయిన శుభఫలమును పాపియైన పాపఫలమునిచ్చును కుజునివలె ఇరావతి ఏ క్షణమునందయినను అగ్నిమిత్రుని గమనించుటకై వెనుకకు మఱలివచ్చును. వక్రించు ఏ గ్రహముతోనైనను పోల్చదగినను కుజునితో పోల్చుటచే నుపమానము సార్థకమై రమణీయమగుచున్నది. కుజగ్రహము వ్యవహారములకు, సాహసమునకు, తొందరపాటుకు కారణము ఈతడు శుభుడయిన వ్యవహార జయము కలుగును. పాపియైన కలహములను పరిస్థితుల ప్రాతికూల్యమును సూచించును. ఈతడు భావోద్రేకము నొసంగును. అశుభుడయి వక్రించిన కుజునివలె ఇరావతి వెనుకకు మఱలివచ్చి భావోద్రేక సమేతయై కలహమును, మానసిక సంఘర్షణమును, మాళవికానురాగవిచ్ఛేదమును దీర్ఘవియోగమును కలిగింపవచ్చును. కావున ఈమె వక్రించి రాకమునుపే తొలగిపోయినచో ఇట్టి ప్రాతికూల్యము సంభవింపదని రాజు అభిప్రాయము కుజుడు పాపియై వక్రింపనిచో శుభపరిణామము కలుగును. ఇరావతియు వెనుకకు మఱలి రాలేదు. మాళవికాగ్నిమిత్రులయనురాగము అవిచ్ఛిన్నమై సుఖాంతమైనది. కుజుడే వివాహప్రాతికూల్యమును, వియోగమును, విడాకులను కలిగించును. దాంపత్యమున యీతని ప్రభావమమేయముగదా.

అందుచే దాంపత్య ప్రాతికూల్యానుకూల్యములకు కర్తయగు కుజుడేయిట ఉపమాన వస్తువుగ గ్రహింపబడినాడు. ఇట్టి పరమ రమణీయము, ఔచిత్యభరితమునైన శాస్త్రీయోపమాన ప్రయోగముచేగదా యీతడు కవివంద్యుడయినాడు.

4. అభిజ్ఞాన శాకుంతలమున తృతీయాంకమున శకుంతల యొక్క అభిప్రాయము ఆమె చెలికత్తెలయిన అనసూయా ప్రియంవదలచే సమర్థింపబడగా రాజిట్లనినాడు.

"కిమత్ర చిత్రం యది విశాఖే శశాంకలేఖామనువర్తేతే?"

శకుంతలను ఆమె చెలులనుకరించుటయందు వింత యేమున్నది? విశాఖలు చంద్రరేఖను అనుసరించునుగదా. విశాఖలు రెండు నక్షత్రములని పూర్వమే ప్రతిపాదించబడినది. విశాఖలు చంద్రరేఖననుసరించు వర్ణనము యీతని జ్యోతిశ్శాస్త్రాభిరుచికి నిదర్శనము.


5. సప్తమాంకమున మాతలి స్వర్గమునుండి దుష్యంతుని భూలోకమునకు తెచ్చు సమయమున వాయుమార్గమునిట్లు వర్ణించెను.

"త్రిస్రోతసం వహతియో గగన ప్రతిష్ఠాం
జ్యోతీంషి వర్తయతి చ ప్రవిభక్తరశ్మి
తస్య ద్వితీయహరి విక్రమ నిస్తమస్కమ్
వాయోరిమం పరివహస్య వదన్తి మార్గమ్"

ఇట కాళిదాసు అపారమైన ఖగోళ విజ్ఞానమును ప్రతిపాదించినాడు. ఈ వాయుమార్గమాకాశగంగను ధరించుచున్నదని సప్తర్షిమండలమును సంచరింపజేయుచున్నదని వర్ణించినాడు. పరివహమనగా, స్వర్గము సప్తర్షిమండలమున కాధారభూతమైన అణువ వాయుస్కంధము ఆవహము, ప్రవహము, సువహము ఉద్వహము, నివహము, పరివహము, పరివాహము యనెడు ఏడు వాయుస్కంధములు గలవు. "సప్తర్షిచక్రం స్వర్గంగాం షష్ఠఃపరివహస్తథా" అని బ్రహ్మాండపురాణమందున్నది. స్వర్గంగను. సప్తర్షిమండలమును ఈ స్కంధము వహించునని భావము. జ్యోతిస్సులను ధరిస్తుందిగనుక దీనికి పరివహమనిపేరు. ఈ వాయు స్కంధముల వివరములు బ్రహ్మాండ పురాణ విష్ణుపురాణ సిద్ధాంత శిరోమణి మొ॥ గ్రంథములయందు నిరూపింపబడినవి. ఖగోళ విజ్ఞానమున కాళిదాసు కృతపరిశ్రముడని తెలియుచున్నది.

6. మేఘసందేశమున నీతడు యక్షుడు మేఘమును సందర్శించెనని చెప్పుచూ యిట్లనినాడు.

'ఆషాఢస్య ప్రథమ దివసే మేఘమాశ్లిష్టసానుమ్
వప్రక్రీడా పరిణత గజప్రేక్షణీయం దదర్శ"



ఆషాఢమాస ప్రారంభదినమున యక్షుడు మేఘమును సందర్శించెనని వర్ణించెను. ఆషాఢమాసము గ్రీష్మఋతువే అయినను ఆషాఢమాస ప్రారంభ దినమున మేఘదర్శనము శాస్త్రవిహితము. ఇట్టి శాస్త్ర దృష్టితోనే కవి వర్ణించినాడు.

7. "మందం మందం నుదతి పవనః"

మేఘుడు పయనించునపుడు అనుకూలవాతము, చాతకరుతము, బలకాదర్శనము మొదలగు శకునములు వర్ణింపబడినవి. ప్రయాణసమయమున పక్షుల దర్శనము శుభశకునమని 'పక్షిస్వామిమహాశ్వ పక్షికులక శ్రౌద్రాక్షత ప్రేక్షణమ్' అని కాలామృతమునందు చెప్పబడినది.

8. ఇట్లే 'త్వామాసారప్రశమిత వనోపప్లవం సాధుమూర్ధ్నా'—అని వర్ణించినాడు. మేఘుడు పయనమయి మొదటి మజిలీగా ఆమ్రకూట పర్వతమును చేరును. అచ్చట వర్షించి దవాగ్నిని చల్లార్చి ఆమ్రకూట పర్వతమునకు మేలు చేకూర్చును. తనకుపకారముచేసినవాడు తన్ను సమీపింపగా క్షుద్రుడైనను గౌరవించును. ఆమ్రకూటమువంటి మహనీయుడు ఉపకారియైన నిన్ను గౌరవింపకుండునా? నీవచట సుఖమునుపొంది విశ్రమించి పోవచ్చునని మేఘునితో యక్షుడనినాడు.

దీర్ఘప్రయాణములయందు మొదటి మజిలీ సుఖవంతముగానున్న యెడల ప్రయాణమంతయూ సుఖకరముగా సాగునని శకునశాస్త్రములయందు గలదు. 'ప్రథమావసథేయస్య సౌఖ్యం తస్యాఖిలేఽధ్వని శివం భవతి యాత్రాయాం అన్యథా త్వశుభం ధ్రువమ్' అని నిమిత్తనిదానగ్రంథమందలి ప్రమాణముచే మల్లినాధుడు యీతని శకునశాస్త్రవిజ్ఞానమును ప్రకటించియున్నాడు.

9. ఉపరాగాన్తే శశినః సముపగతా రోహిణీయోగమ్"

శకుంతల శాపావసానమున రోహిణి గ్రహణానంతరము చంద్రుని చేరినట్లు చేరినదని పైశాకుంతల పంక్తికి యర్థము. రోహిణి చంద్రుని చేర నెదురు చూచుచున్నది. గ్రహణముచే చంద్రుడు కనుమరుగయినాడు. గ్రహణము తొలగగా చంద్రుడు ప్రకాశించినట్లు శాపము తొలగగనే రాజు శకుంతలను గుర్తించినాడు. రోహిణివలె శకుంతల రాజచంద్రుని చేరినది. చంద్రుడు బహుపత్నీకుడయినను రోహిణియందాతనికున్న ప్రేమ యనంతము.జగద్విదితము దక్షునిచే శపింపబడియూ చంద్రుడు రోహిణియందనురాగమును వీడలేదు. రాజును బహుభార్యావుడయినను శకుంతలయందనన్య సామాన్యానురాగము నొందెను. చంద్రునివలెనీతడును దుర్వాసశ్శాపవిస్మృత శకుంతలుడయినను శకుంతలయందలి రక్తిచే పరితప్తుడాయెను. ఇతర నక్షత్రమును చేరుటకంటె రోహిణి చేరిన నిశాకరుడు అత్యంత ప్రభావితుడగును. ఏలయన రోహిణి వృషభరాశియందలిది. వృషభము చంద్రునకుచ్చస్థానము. ఇట్లీతడు రమణీయార్థమును ప్రతిపాదించెను.

10. రత్నచ్ఛాయా వ్యతికర ఇవ ప్రేక్ష్యమేతత్పురస్తాత్
వల్మీకాగ్రాత్ప్రభవతి ధనుఃఖండమాఖండలస్య (మేఘ)

మణికాంతులకలయికవలెనున్న ఇంద్రధనుస్సు వల్మీకాగ్రమునుండి వెలువడుచున్నదని కవి మేఘసందేశమున వర్ణించియున్నాడు. వల్మీకమనగా పుట్ట ఇంద్రధనుస్సు ఏర్పడుటకు గల కారణములను బృహత్సంహితలో ఆచార్యుల వారిట్లు వివరించియున్నారు. 'సూర్యస్య వివిధ వర్ణాః, పవనేన విఘట్టితాః కరాః సాభ్రే, వియతి ధనుస్సంస్థానాః యే దృశ్యన్తే తదింద్రధనుః'. సూర్యుని కిరణములు గాలిచే ధర్షింపబడి జలబిందువులనుండి ప్రసరించి ఇంద్రధనస్సు యేర్పడును. ఈ ఇంద్రధనుస్సు అనంతుడను సర్పముయొక్క నిశ్వాసమనియు శాస్త్రకర్తలు నుడువుచున్నారు, ఇట్లే ఇది జలమధ్యమునందు, వల్మీకమునందు గూడ ప్రభవించునని శాస్త్రవచనము పుట్టనుండి శక్రచాపము వెడలుటను శ్రీకృష్ణదేవరాయలాముక్తమాల్యద యందిట్లభివర్ణించి యున్నాడు.

'పుట్ట వెడలి నభోభిత్తిఁ బుట్టు శక్ర
కార్ముకపు పెద్ద పలుపన్నె కన్నె జెట్టి'

'వల్మీకే శస్త్రభయమ్' అను బృహత్సంహితవచనము ననుసరించి వల్మీకాగ్ర ప్రభూతమగు శక్రధనుస్సు రాజులకే శస్త్రభయమును కలిగించునుగాని మేఘునికిగాదు. కావున మేఘగమనమునకు కాటంకములేదు. వల్మీకాగ్రజాతమగు శక్రధనస్సునుగూర్చి మల్లినాథులవారుదాహరింప వలసినదని నేననుకొందును: ఇట్టి అనన్య కవి గోచరమగు వర్ణనముచేతను నితని జ్యోతిశ్శాస్త్రపాండితియే వెల్లడి యగుచున్నది.

11. —పురశ్శుక్ర మివ ప్రయాణే' (కుమార.)

ఈశ్వరుని తపోభంగమునకై పంపబడిన మన్మథుడు శివునిఁజూచి పురశ్శుక్రునివలె భావించి ఆతనికెదురుగాబోక తప్పుకొని వనములోనికి పోయెనని కుమారసంభవమున యీ కవి వర్ణించినాడు. ప్రయాణము చేయువానికి ఎదురు దిక్కునయందు శుక్రుడు గాన్పించిన ఆ దిక్కునకు పోరాదని జ్యోతిశ్శాస్త్రము వక్కాణించుచున్నది. ఈ విషయమే కాలామృతమునందు పంచమబిందువు నందిట్లున్నది- 'యాత్రాయాం ప్రతిభార్గవం ప్రతికుజం ప్రత్యబ్జంచ చాత్రికృత్' శివుని ఎదురు శుక్రునిగా బోల్చుట యుక్తము. ఇది భావిమన్మథానర్థము సూచించుచున్నది.

12. "అథౌషధీనామధిపస్య వృద్ధౌ, తిథౌ చ జామిత్ర గుణాన్వితా యామ్
సమేత బంధుర్హిమవాన్ సుతాయాః, వివాహదీక్షా విధిమన్వ తిష్ఠత్"

కుమార సంభవమున హిమవంతుడు కొమరితయగు పార్వతికి వివాహాలంకరణ కార్యక్రమమును శుక్లపక్షమున జామిత్ర శుద్ధితో శుభతిథియందు ప్రారంభించెనని వర్ణించెను. వివాహాది శుభకార్యములకు శుక్లపక్షము ప్రశస్తము సప్తమశుద్ధి వివాహ కార్యములకవసరము.

"జామిత్రే చ కరగ్రహే స్థిత ఇనో వై భవ్యమిందుః స్త్రియమ్"

కళత్ర స్థానమగు సప్తమ స్థానమున ఏ గ్రహముండరాదని అదియే జామిత్ర శుద్ధియని తృతీయ బిందువునందు కాలామృతమున చెప్పబడినది. ఇట వివాహలగ్న బలాబలములను చెప్పుచున్న కాళిదాసుడు జ్యోతిశ్శాస్త్ర పారంగతుడగుట నిస్సంశయము.

13. 'మైత్రే ముహూర్తే శశలాంఛనేన, యోగం గతాసూత్తర ఫల్గునీషు
తస్యాః శరీరే ప్రతికర్మ చక్రుః, బంధుస్త్రియోయాః పతిపుత్ర వత్యః"

ప్రతి దినమునకు పదునైదు ముహూర్తములుండును. ఇట్లే రాత్రికి గూడ పదునయిదుండును. ప్రతి ముహూర్తము సుమారు రెండు ఘడియలకాల ముండును. సూర్యోదయకాలమునుండి మూడవ ముహూర్తము మైత్రమన బడును. ఈ ముహూర్తమునకు సూర్యుడధిపతి. ఈ ముహూర్తము శుభ కర్మలకు శ్రేష్ఠమైనది. ఈ విషయము కాలామృతము తృతీయ బిందువునందు "రుద్రాహిమిత్రపితృవసవో వారాఖ్య విశ్వేవిధి..." యను కారికయందు ప్రతిపాదింపబడినది. చంద్రుడుత్తర ఫల్గునీ నక్షత్రమందుండగా వివాహ కర్మలకు శుభత్వము కలుగును. ఈ విషయము కాలామృతములో 'రేవత్యుత్తర రోహిణీకర పిత్ర స్వాంతీందు మిత్రాసురే, పాపానన్విత పాపవేధరహితే పాణిగ్రహశ్శోభనః' అని కలదు. 'ఆర్ద్రస్యార్ద్రస్తథామైత్రః శుభోవాసవ ఏవచ' అని బృహస్పతి చెప్పెను. ముత్తైదువులు ఉత్తర ఫల్గునీ నక్షత్రదినమున మైత్రముహూర్తమున పార్వతిని వివాహాలంకృతను చేయనారంభించిరి. ఇట్టి కాళిదాసుని వర్ణనమున జ్యోతిశ్శాస్త్రాంతర్గతమైన ముహూర్తశాస్త్రమందలి ప్రజ్ఞ వెల్లడియగుచున్నది.

14. 'బభౌ చ సంపర్కముపేత్య బాలా, నవీన దీక్షావిధిసాయకేన
కరేణభానోర్బహులావసానే సంధుక్ష్యమాణేవ శశాంకలేఖా'
(కుమార)

మంగళాలంకారములను పొందిన పార్వతి సూర్యకిరణములచే వెలుగొందు చంద్రలేఖవలె నున్నదని కాళిదాసిటవర్ణించుచున్నాడు. చంద్రుడు స్వయంప్రకాశకుడు గాడని సూర్యకిరణములాతనిపై ప్రతిబింబించుటచేతనే అతడు ప్రకాశించుచున్నాడని ప్రాశ్చాత్యుల నిశ్చితాభిప్రాయము. మన ప్రాచీన ఖగోళశాస్త్రవిదులకీ విషయము క్రొత్తగాదు. వరాహమిహిరాచార్యులవారు తమ గ్రంథములయందు 'సలిలమయే శశిని, రవేర్దీధితయో మూర్ఛితాస్తమోనైశమ్ క్షపయన్తి—' అని చెప్పి యున్నారు. ఇట్టి జ్యోతిశ్శాస్త్ర విషయములను ఉపమానముగా గ్రహించి అద్భుతముగా ప్రతిపాదించి ప్రాచీన నవీనుల నందరినీ ఆశ్చర్యచకితులను గావించిన కాళిదాసుని ప్రతిభ అమేయముగదా.

గ్రహైస్తతః పంచభిరుచ్చసంశ్రయైరసూర్యగైస్సూచిత భాగ్యసంపదమ్
అసూతపుత్రం సమయే శచీసమా త్రిసాధనా శక్తిరివార్థమక్షయమ్'

ఈ శ్లోకంలో కాళిదాసు రఘువు జన్మను వర్ణిస్తున్నాడు. సూర్యునితో కలవని ఐదుగ్రహాలు ఉచ్చలలోనుండగా రఘువు జన్మించాడట. 'త్రిప్రభృతిభిరుచ్చస్థైః నృపవంశభవా భవన్తి రాజానః' అని శాస్త్రకర్తలు మూడు మొదలుకొని గ్రహాలుచ్చలలోనుండగా జన్మించిన రాజవంశీయులు రాజులవుతారని చెబుతున్నారు. అనేక గ్రహాలుచ్చలలోనుండి అట్టి ఉచ్చగ్రహంగల యొక రాశి లగ్నమైతే రాజయోగం. సూర్యునితోకలిసిన గ్రహాలు అస్తంగతాలవుతున్నాయి. సూర్యకాంతితో యితర గ్రహాలస్తంగతాలయితే అవి ఫలితాన్ని యివ్వలేవు. అస్తంగతగ్రహం రాజయోగ భంగాన్ని కలిగిస్తుంది. అందుకే సూర్యుడిని యితరగ్రహాలనుండి విడదీసి వర్ణించాడు కవి. స్థానాదిక్కాలచేష్టాదృగ్జన్మసర్గికా అయిన షడ్బలాలున్నా వాటిలో స్థానబలం గొప్పది. ఇది కవికిగల రాజయోగాధ్యాయ విజ్ఞతను సూచిస్తూంది.

ఇంకా రఘువు దినదినాభివృద్ధిని పొందినట్లు వర్ణిస్తూ 'పుపోషవృద్ధిం హరిదశ్వదీధితేః అను ప్రవేశాదివ బాలచంద్రమాః' అంటాడు. సూర్యకిరణాలు పడుటవలన క్రమంగా చంద్రుడు వృద్ధిపొందినట్లు వృద్ధిపొందాడట. ఈ వర్ణన వలన చంద్రునికి స్వయంప్రకాశత్వంలేదనీ సూర్యకాంతి చంద్రునిపైబడి పరావర్తనం చెందడంవలననే చంద్రుడు ప్రకాశిస్తున్నాడనీ ఆధునికులు చెప్పే విజ్ఞానం కుశాగ్రబుద్ధియైన కవి ఆనాడే తన కావ్యంలో ఉపమారూపంలో ప్రతిపాదించాడు. ఈ విషయాన్ని వరాహమిహిరాచార్యుడు 'మూర్తిత్వే పరికల్పితశ్శశభృతః వర్త్మాఽపురర్జన్మనాం' అనే కారికలోనే సూచ్యార్థ సూచనగా సూచించాడు. 'సలిలమయే శశిని రవేర్దీధితయోమూర్ఛితాస్తమోనైశమ్ క్షపయన్తి దర్పణోదర నిహితా ఇమందిరస్యాంతః' అని కంఠోక్తిగాకూడా చెప్పాడు.


'బ్రాహ్మే ముహూర్తేకిల తస్యదేవీ కుమారకల్పం సుషువే కుమారమ్' అనే శ్లోకంలో రఘురాజపత్ని బ్రాహ్మీముహూర్తంలో అజుడిని ప్రసవించిందని చెబుతాడు. ముహూర్తాలలో బ్రాహ్మముహూర్తం చాలా శ్రేష్ఠమైంది. బ్రాహ్మముహూర్తం అంటే అభిజిన్ముహూర్తం అని మల్లినాథ వ్యాఖ్య. 'ముహూర్తోఽభిజిదాహ్వయః నాశయత్యఖిలాన్ దోషాన్' అని నారద సంహితగూడా అభిజన్ముహూర్త ప్రాశస్త్యాన్ని చెబుతూంది అయితే నిర్ణయ సాగర్‌వారి ప్రెస్సు వారి ప్రతిలో టిప్పణిలో, 'బ్రాహ్మే అభిజిన్ముహూర్తే' అనే

మల్లినాథ ప్రతీకనాధారంగాగాని 'నాత్ర అష్టమోముహూర్తః కింత్వభిజిత్' అని నిర్దేశింపబడింది. దీనిలో ఔచిత్యం గోచరించదు. 'బ్రాహ్మేముహూర్తే' అంటే అభిజిత్తన్నాడు మల్లినాథుడు. ఎనిమిదవ ముహూర్తం అభిజిత్తుకాదనే ప్రమాణంలేదు. కాలామృతాన్ని గమనించండి—'సూర్యస్థాల యతశ్చతుర్థ మభిజిద్యద్వా ముహూర్తోఽష్టమః! అష్టముహూర్తం అభిజితే. దీనినే బ్రాహ్మం అన్నాడు మల్లినాథుడు. కావున అష్టమ ముహూర్తం మాత్రంకాదనే పంక్తి నిరర్థకం. ఈ వర్ణనం హృద్యమైంది.

'వామేతరః సంశయమస్య బాహుః' అని ఇందుమతీ స్వయంవరం సందర్భంలో అజునికి దక్షిణబాహుస్పందాన్ని వర్ణించి శకున పరిజ్ఞానం ప్రదర్శించాడు. మిథిలను చేరిన రామలక్ష్మణులను వర్ణిస్తూ 'గాంగతావిప దివః పునర్వసూ' అని చెబుతాడు. అంటే రామలక్ష్మణులు పునర్వసు నక్షత్రంలా ఉన్నారని భావం. ఈ శ్లోకవ్యాఖ్యా సందర్భంలో 'తారాద్వయాపేక్షయా పునర్వసూ ఇతి ద్వివచన నిర్దేశః' అని దినకరమిశ్రుల వ్యాఖ్య. ఇది యెలా సంగతమౌతుంది? పునర్వసు నాల్గు నక్షత్రాల కలయికగాని రెండు నక్షత్రాల కలయిక గాదు. 'త్రిత్ర్యంగ పంచాగ్నికు వేదవహ్నయః' అని తారా స్వరూపం చెబుతూంది. ముహూర్త చింతామణి, వేద శబ్దానికి నాలుగని అర్థం గనుక పునర్వసు నాలుగు నక్షత్రాల కలయిక అని స్పష్టమౌతుంది. ఈ సందర్భంలో 'యథా సర్వ నక్షత్రేషు పునర్వసు-పుష్యౌ శోభమానౌ తథైవైతౌ రామ లక్ష్మణావపి' అని సుమతి వాఖ. పునర్వసు శబ్ద ద్వివచనాన్ని సమర్థించాలని పునర్వసు పుష్యౌ అని చెప్పి పునర్వసు పుష్యతారలవలె ప్రకాశిస్తున్నారనే యీ సుమతి వ్యాఖ్య సహృదయుల కానందాన్ని కలిగించదు. పునర్వసు ద్వివచనానికి "పుష్యమిని చేర్చడం సమంజసమా? ద్విదైవత్యం పునర్వసు గనుక ద్వివచన ప్రయోగం అని మల్లినాథ వ్యాఖ్య. ఋక్షేశా అధద్రసకాలహుతభుగ్బ్రహ్మేం దుర్భ్రదా దితి' అని కాలామృతం. 'పునర్వసోః అదితిః దేవతా' అని కాలామృత వ్యాఖ్య. కావున పునర్వసు ద్విదైవత్యం కాదు. రెండు పునర్వసులవలె రామలక్ష్మణులున్నారని ఉత్ప్రేక్ష. అభేదం, ఏకాత్మత్వం వ్యంగ్యాలు.

ఛాయాపథేనైవ శరత్ప్రసన్నమాకాశమావిష్కృత చారుతారమ్' అనే వర్ణనలో జ్యోతిశ్చక్రమధ్య అడ్డుగా ఉండే శూన్యప్రదేశాన్నిగూడా ఉపమానంగా గ్రహిస్తాడు కవికుల గురువైన కాళిదాసు.

విదర్భాధిపతి అజునితో మార్గమున మూడురాత్రులు గడపివెనుదిరిగిన విషయాన్ని వర్ణిస్తూ, 'తస్మాదపావర్తత కుండినేశః పర్వాత్యయే సోమ ఇవోష్ణరశ్మేః' అంటాడు కవి. అమావాస్యనాడు సూర్యునితో కలిసిన చంద్రుడు దర్శాంతమున సూర్యునినుండి విడివడినట్లు విదర్భేశుడు వెనుదిరిగెనని వర్ణించినాడు. 'దర్శస్సూర్యేందు సంగమః' అని అమావాస్యనాడు చంద్రుడు రవితో కలియును. ప్రతిపత్తునుండి రవికి దూరముగా గోచరించును. ఈ విషయమును వర్ణనయందు హృద్యముగా జోడించినాడు.



ఇట్లే ద్వాదశసర్గలో రాముని మార్గమున కడ్డముగా విరాధుడను రాక్షసుడు నిలిచెనను విషయమునకు చంద్రుని కడ్డముగా రాహుగ్రహము నిలుచుటను ఉపమానముగా గ్రహించినాడు. రామలక్ష్మణుల నడుమనుండి సీతను విరాధుడపహరించెను. ఇది శ్రావణభాద్ర పదముల నడుమ సంభవించు వృష్టిని వర్ష ప్రతిబంధక యోగమపహరించినట్లున్నదట. 'నభోనభస్యయోః వృష్టిమవ గ్రహ ఇవాంతరే' అనినాడు. గుర్వస్తమయము, భార్గవోదయము, కుజుడు వక్రించుట, శనికి వీటిలో ఏదేని ప్రాప్తించుట వర్షమునకు కారణములు. 'గురావస్తంగతే వృష్టిః వృష్టిస్స్యాద్భార్గవోదయే, కుజే వక్రిణి వృష్టిస్స్యాత్ త్రితిర్వృష్టిశ్శనైశ్చరే' అను కారికపై యోగమునే వివరించుచున్నది. ఇట్లనేక యోగములు గలవు. వర్షప్రతిబంధకయోగము కల్గినచో వృష్టియుండదు. ఇట్టి వర్షాగమ శాస్త్రరహస్యములు 'వసమాలా'ది గ్రంథములయందు గలవు. పై వర్ణన ననుసరించి వర్షయోగ, ప్రతిబంధక యోగములలోకూడ కవికి నైపుణ్యమున్న ట్లూహింపనగును.

భరతలక్ష్మణులతో కలిసిన రాముడు విమానమునధిరోహించినాడు. ఇది బుధబృహస్పతులతో కలసి మేఘమునధిరోహించినట్లున్నదని కవి యీ సందర్భమున నుడివినాడు.

'దోషాతనం బుధబృహస్పతి యోగదృశ్యస్తారాపతి స్తరల విద్యుదివాభ్రవృందమ్' అనేది యీ వర్ణన. బుధగురులు శుభులు. అట్టివారితో కలసిన చంద్రుడు నయనానందకరుడనుట యెంతయో లెస్స. చంద్రునితో బుధగురులు కలసినా, వారుభయపార్శ్వములయందున్నా శుభఫలమే సంభవిస్తుంది. ఉభయ పార్శ్వములయందున్నట్లు భావిస్తే దురుధరా' అనే శుభయోగం అవుతుంది. ఉభయస్థితైర్దురుధరా అని లఘుజాతకం. మాఘమహాకవి ఉద్ధవబలరాములతో కలసిన కృష్ణుని గురుశుక్రులతో కలసిన చంద్రునితో పోల్చినాడు. పై కాళిదాసుని వర్ణనమే 'గురుశుక్రానుగాం బిభ్రచ్చాంద్రీ మభినవామివ' యనెడి మాఘవర్ణనమునకు ఉజ్జబంతియైయుండ వచ్చును.

వంశానుక్రమంలో కాళిదాసు పుత్రుడనే-రాజు-భార్య పుష్యడనే పుత్రుడిని ప్రసవించినదనే విషయాన్ని ఎలా వర్ణించాడో చూడండి—

"తస్య ప్రభానిర్జిత పుష్యరాగం పౌష్యాం తిథౌ పుష్యమ సూతపత్నీ
తస్మిన్నవుష్యన్నుదితే సమగ్రాం పుష్టిం జనాః పుష్య ఇవ ద్వితీయే"

పుష్య నక్షత్రంలా పుష్యుడు జనులకు పుష్టినిస్తూ ఉదయించాడట. నక్షత్రాలలో పుష్యమికి ప్రాముఖ్యం వుంది. పుష్యప్రాముఖ్యాన్ని విస్తృతి భయంవలన కాబోలు మల్లినాథుడు వివరించలేదు. చంద్రుడు విరుద్ధుడయినా పుష్యమినాడు చేసిన కార్యం సఫలమవుతుంది. దీన్నే 'చంద్రేవిరుద్ధేఽప్యథగోచరేవా సిధ్యన్తి కార్యాణి కృతాని పుష్యే' అని వివరించింది దినకర వ్యాఖ్య. పుష్యమి అన్నిటికంటె బలమైందని, చంద్రుడు వ్యయంలో ఉన్నా పుష్యమి బలం కార్యసాఫల్యానికే హేతువని 'అపి ద్వాదశగే చంద్రే పుష్యః సర్వార్థసాధకః' 'పుష్యః పరకృతం హన్తి నతు పుష్యకృతం పరః' అని శిశుతోషిణీ వ్యాఖ్యలోని కారిక చెబుతూంది. వీటినన్నింటినీ గుర్తించియే కవి పుష్యతారనుపమానముగా గ్రహించినాడు.

ఇట్లు కవితల్లజుడు, కవికులగురువైన కాళిదాసు తన జ్యోతిర్విద్యా పాటవమును కావ్యములయందు నిక్షేపించి జ్యోతిర్విద్యాపారంగతుడని సహృదయ పండితులచే ప్రశంసింపబడినాడు. ఈతని జ్యోతిర్విద్యా విశారదత్వమమోఘము. ఈతనికి సహస్ర నమోవాకములు.

ఈ వ్యాసరచనకు ఉపకరించిన గ్రంథములు

1. కాలామృతమ్ 2. లఘుజాతకమ్ 3. శాకుంతల వ్యాఖ్య 4. సంజీవని వ్యాఖ్య 5. బృహత్సంహిత 6. బృహజ్జాతకమ్ 7. దినకర మిశ్ర వ్యాఖ్య 8. సుమతి వ్యాఖ్య 9. వృష్టియోగాధ్యాయః 10. శిశుతోషిణీ వ్యాఖ్య

నీ కౌగిలికోసం

కడలి అంచున నిలబడి –
కళ్లు చికిలించి చూస్తున్నాను
నీ కోసం
నీ వొచ్చే ఓడ
జాడలేదు
కాటుక కళ్లలో
కరుగుతోంది కాలం
ఉదయించే ప్రతి సూర్యుడూ
ఈ హృదయంలో క్రుంకుతున్నాడు
ఇరుల వలలోంచి
మినుగు మినుగు మంటోంది
నక్షత్ర సముదాయం
ఇప్పుడు జీవితం
కృష్ణ పక్షం –
చంద్రోదయ సమస్యే లేదు –
ఆశగా అటే చూస్తున్నాను.
మల్లె చెండు దొర్లుకుంటూ
మరులు మోసుకొస్తున్నట్లు
దూరంగా –,
తెల్లని నురగల కెరటం
ఒకదాని వెంట మరొకటి –,
దుడుకుగా వచ్చి,
చిట్లిన ముత్యపు పొడిలా చెదరి –,
ఆరేళ్ళ అందాల ఆకతాయి
పాపలా తుళ్లి –,
చిలిపి పరుగులు తీసి –,
కడలి తల్లి కడుపులో
దూరిపోతోంది –
ఆవలి తీరం లేని అరవ మధ్యాన
అకస్మాత్తుగా తేచి,
అలలపై లలి
నా కోసం వస్తావని
నిమిషాలు లెక్కిస్తూ
చూస్తున్నాను
నీ కోసం –,
అంతలోనే –,
ఎవ్వరో నవ్వుతున్నట్లు
సముద్ర గర్భాన తిమింగలం కదిలినట్లు –
స్వరువ పార్క్ ఎగిరి పడినట్లు –
"ఎదురు చూచి ఎదురుచూసి
ఎందకు అలసి పోతావు ?
నాలుగడుగులు వేసి చూడు
ఎదురు సన్నాహం చేసి చూడు
అన్నట్లు –,
అవును :
అది నాకూ అనిపిస్తోంది
కానీ ... .
తానంత తానుగా
కోరరానిది ప్రేమ.
చేర కూడనిది మృత్యువు
ప్రేమనే భ్రమ తొలగినపుడు
మరణమా !
నువ్వైనా కౌగలించుకోవా నన్ను

శ్రీమతి ఇంద్రగంటి జానకీబాల

నిజం

కుసుమమ్మని చేయి చాస్తే
గాలిలోకి ఎగిరింది– సీతాకోక చిలుక అది.
హృదయం అని మేల్కొల్పితే
రాగానికి గళ మెత్తితే
ఆక్రందన చేసింది–అజ్ఞానమే అది
కావ్యానికి కలం తీస్తే
కన్నీళ్ళను కార్చింది–దొరికే వస్తువే అది
రక్షణకై చేయి చాస్తే
విద్యుత్తీగ దొరికింది–నా జీవితమే అది.

కారణం ??

నురుగులు గ్రక్కుతూ పరుగెత్తినా
సాగని జీవన పయనానికి,
ఇరుపాదాల్లో కారిపోయే
రుధిరానికి కారణం—
ఒత్తుగా పరుచుకొన్న
ఇసుకదారి అందునా !
అందులో దాగిన జాలి లేని
జాలిముళ్లను కొందునా !!
కళ్లు చించుకొన్నా
కానరాని గమ్యానికి
అడుగడుగునా కనిపించే
అడ్డదారులకు కారణం—
దృష్టిలోపమని అందునా !
హ్రస్వబుద్ధి ఫలితమ్మను కొందునా
పెన్నేరులో కడవముంచినా
నోరు తడియక పోవడానికి కారణం—
అది ఎండ మావులఝరి అందునా !
మరి చిల్లిపడిన కుంభమ్మను కొందునా !
శ్రమించి గట్టెక్క ప్రయత్నిస్తుంటే
ఎక్కనివ్వని నిచ్చెనలకు
కాళ్లు పట్టిలాగే కాల సర్పాలకు కారణం—
కాల హేతువందునా !
కుటిలనీతి అనుకొందునా !!
ఆదారించిన అందాలకు
చేతికందిన ఊసరవెల్లికి కారణం—
స్వార్థం అని అందునా !
ప్రేమకు విలువ లేదను కొందునా !!
నా హృదయడమరకపు మ్రోతలోనూ
నిద్రమరిగిన జనతకు కారణం—
చైతన్య శూన్యమందునా !
నైరాశ్యమ్మను కొందునా !!

శ్రీ సల్లపల్లె చిదంబరరెడ్డి

శరత్ వర్షం

ఎ.వి.వి.యస్ యస్.ప్రసాద్

శరత్ వర్షం కురుస్తోంది___!!

చినుకులు చూసేసరికి శాంతారామ్ గారిలో ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది.

ఎప్పుడో చిన్నప్పుడు-

ఇంటి అరుగుమీద వణుకుతూ కూర్చొని, కాగితం పడవలు వదలడంలో ఆనందం అనుభవించారు.

తరువాత కాస్త ఎదిగాక-

ఓ రోజు-

ఎక్కడ్నుండో వస్తూంటే-

బస్సు దిగారో లేదో, వాన ప్రారంభమయ్యింది.

బస్సు దిగాక దాదాపు ఒక కిలోమీటరు నడవాలి వూళ్ళోకి వెళ్ళాలంటే.

మెల్లగా నడక ప్రారంభించారు.

చిరుజల్లు శరీరమ్మీదపడి చిందులు వేస్తుంటే గొప్ప ఆనందానుభూతి కల్గింది.

అందులోను శుక్లపక్షం!

దానికితోడు శరత్ పూర్ణిమ!

చంద్రుడు నిండుగా వెన్నెలలో వెన్నముద్దలా వున్నాడు.

వెన్నెల, వానతో కలిసి 'ఆనందనాట్యం' చేస్తోంది.

చిరుజల్లులో-

నీలాకాశంలో కలువరేడుని చూస్తూ-

విచిత్రంగా మెరుస్తున్న వెన్నెలలో నడుస్తుంటే;

___ఆనాడు వణుకుతూ వేసిన అడుగులు ఇప్పటికీ జ్ఞాపకాల ఆనందపు నీడలు-!

అప్పట్నుంచి శాంతారామ్‌గారికి అది అలవాటుగా మారిపోయింది.

'శరత్'లో-

శుక్లపక్షంలో-

చంద్రుడు 'వెండిభరిణి'లా వున్నప్పుడు-

చిరుజల్లు నింగినుండి నేలకి ఏదో పర్తమానం తీసుకువస్తూ-

శాంతారామ్‌గారిని 'సౌంజ్ఞ చేసి, పిలిచినట్టు అన్పిస్తే-

అడుగులో అడుగు వేసుకుంటూ,

చినుకులని లెక్కపెడ్తూ,

వెన్నెలతో ముచ్చటలాడ్తూ-

నిశ్శబ్దం మాటలాడుకొనే మాటలు నిశ్శబ్దంగా వింటూ,

వణుకుతూ-

నడిస్తే!

స్వప్న ప్రపంచాల సౌందర్యాలు కళ్ళముందు కదిలిన అనుభూతి-!

వానలో తడిస్తే జలుబు, జ్వరం వస్తాయని మొదట తల్లి, తరువాత భార్య ఎంత వద్దన్నా, వినేవారు కారు.

"...ఆ ఆనందం మీకేం తెలుసు? వెన్నెల గుమ్మంలోకి వచ్చి పిలిచినట్టు, చినుకుల శబ్దం స్వాగత గీతం ఆలపిస్తున్నట్టు, చంద్రుడు మిత్రుడిలా ఆహ్వానిస్తున్నట్టు-" ఇలా సాగిపోయేది అతని ధోరణి.

ఎవరూ ఆయనకి సమాధానం చెప్పలేకపోయేవారు.

ఇవాళ!

మళ్ళీ ఇన్నాళ్ళకి-!

మునపటి వాతావరణం!

అదే వెన్నెల, అదే పూర్ణిమ, అదే చంద్రుడు. అవే చినుకులు!

ఈ మధ్య 'సుస్తీ' చేయడంవల్ల ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది.

వయస్సు కూడా యాభై దాటడంవల్ల వంట్లో శక్తి నశించింది.

కానీ-

ఏదో శక్తి-

కదిలించింది!

వానని చూస్తూ కూర్చోలేకపోయారు.

మెల్లగా లేచి-

లాల్చీ వేసుకొని, గొడుగు తీసుకొని, కాశ్మీర్ శాలువ కప్పుకొని, చేతి కర్ర అందుకొని-

కదిలారు!

పిల్లలకి పెళ్ళిళ్ళు అవ్వడం వల్ల, వాళ్ళు దూర ప్రాంతంలో వున్నారు.

భార్య మొన్ననే ఆమెతరుపు వాళ్ళింట్లో 'పెళ్ళి' కెళ్ళింది; తనని రమ్మని మరీ మరీ పిల్చారు కానీ, ఓపిక లేక వెళ్ళలేదు.

మెల్లగా నవ్వుకున్నారు.

చినుకులు చూసేసరికి కదలడం.

వాళ్ళు ఎంత బ్రతిమాలినా కదలక పోవడం గుర్తొచ్చి-!

ఇంటికి తాళంవేసి, నడక ప్రారంభించారు,

చిరుజల్లే!

వీధి చివర్న వున్న కరెంటు స్తంభం లైటు వానలో అందంగా మెరుస్తోంది.

అలా అరగంట దాటి వానలో తిరిగినా 'తృప్తి'గా లేదు.

ఇంకా తిరగాలని అన్పిస్తున్నా మీద పడ్డ 'వయస్సు' సహకరించడం లేదు.

తిరుగు ముఖం పట్టారు.

వస్తున్నప్పుడు-

చినుకుల చాటున కన్పించింది ఆ దృశ్యం.

కరెంటు స్తంభం పక్కన చలికి వణుకుతూ, వాన చినుకులకి ముడుచుకు పోతున్న ముసలివాడు——

అంతకుముందే కరెంటు స్తంభం పక్కనుండే వెళ్ళినా వాడ్ని చూళ్ళేదు—

చిన్నగా మూలుగుతూ, వణికిపోతున్నాడు.

వాడి వంటిమీద చిన్న గోచీలాంటిది తప్ప, మరేదీ లేదు.

శరీరము ముడుతలు పడి వుంది.

కళ్ళలో ఆర్తి——

సహాయం చేయమన్నట్టు-

శాంతారామ్‌గారిని చూసి-

అంత చలిలోనూ, చేతులు జోడించాడు,

దాదాపు తన వయస్సువాడే—విపరీతమైన బాధని అనుభవిస్తున్నాడు.

తనకి — ఆనందానుభూతి!

వాన ఒక్కటే——

ఒకరికి విషాదం!

ఒకరికి ఆనందం!

ఒకరి కళ్ళలో అనుభూతి తాలూకు అశ్రువులు!

మరొకరి కళ్ళలో భరించలేని బాధకి చిహ్నల్లా-కన్నీళ్ళు—

వాన ఏదో చెప్తున్నట్టు, వెన్నెల ఏదో ఆజ్ఞాపిస్తున్నట్టు, చంద్రుడు 'మరొక మిత్రుడ్ని' సహాయం చేయమన్నట్టు——

వంటిమీది శాలువాని తీసి, వాడి మీదకి విసిరి, అక్కడ్నుండి వేగంగా కదిలారు.

"శరత్ వర్షం ఇంకా కురుస్తోనే వుంది——!" ●



శ్రీ డి. రామలింగం

చాసో కథా ప్రపంచం

'కాదేదీ కథకు అనర్హం' అని చాటి, ఈ చరాచర జగత్తులో కళింగ పట్నం మొదలు చెన్నపట్నం వరకూ విస్తరించి ఉన్న ఆంధ్రదేశంలో దేన్ని గూర్చి అయినా కథ వ్రాయగలను అనగల కథకుడు చాసో [చాగంటి సోమయాజులు] ఒక్కరు మాత్రమే అని నాకనిపిస్తుంది. కొందరు కొన్ని రకాల పాత్రలవల్ల మాత్రమే ప్రేరణ పొంది కథలు వ్రాయగలరు. మరి కొందరు కళ, దానికి సంబంధించిన గొడవ, ఆ ప్రమేయం ఉంటేనే కథ వ్రాయడానికి పూనుకో గలుగుతారు. ఇంకా కొందరికి చెప్పవలసిన తత్త్వం ఆ చట్రంలో రాగలిగితేనే కథారచనకు ఉపక్రమిస్తారు. కొందరేమో కొన్ని రకాల కథలు మాత్రమే వ్రాయ గలం, తక్కినవి మా వల్లకాదు అని స్పష్టంగా చెప్పేస్తారు. కాని చాసో వ్రాసిన కథలు చూస్తే వీరికి అటువంటి వర్గీకరణ లేవేమో అనిపిస్తుంది. పూట భత్యం పుల్ల వెలుగు గుడిసెవాళ్ళు మొదలు రాజధానీ నగరాలలో రంగులతో బ్రతికే వాళ్ళ వరకూ అన్నిరకాల మనుషుల పాట్లను చిత్రించడంలో, వాళ్ళ వాతావరణాన్నీ భాషనూ చూపెట్టడంలో సిద్ధహస్తుడీయన. ఏ ఇతివృత్తం తీసుకొన్నా, ఆ కథను చక్కని భావగీతం [లిరిక్]గా మలచడంలో ఈయన పనితనం అసమానమైంది. ఇక్కడ భావగీతమంటే రొమాంటిక్ అని కాదు, ఒక ఆలోచనవున్న కావ్యఖండం

అయితే వీరి కథల్లో ప్రధానమైనది ఆర్థికాంశం. ఆర్థిక విషయాలు ఒక్కొక్కళ్ళ చేత ఎటువంటి పనులు చేయిస్తాయో వారిని ఎలా తయారు చేస్తాయో ఈయన చూపెట్టిన వైనం కథానికకు ఒక విశిష్టతను చేకూర్చేదేకాక, వీరి ప్రతిభను ప్రదర్శించేదిగా కూడా కొట్టవచ్చినట్లు కన్పిస్తుంది. వీరి ఈ జాతి కథల్లో ముఖ్యంగా పేర్కొనదగ్గవి 'లేడీ కరుణాకరం', 'ఏలూరెళ్ళాలి', 'చెప్పకు చెప్పకు'. మొదటి కథలో కరుణాకరం భార్య కాపురానికి రాకముందునుంచే నాయుడుతో పోయే సాని ఆ సంగతి కాస్తా భర్తకు తెలిసిపోయిందని గ్రహించిన తర్వాత ఇక ఆమెలో అరమరికలు లేవు, దాపరికం ఏమాత్రం లేదు. ఇక మాటల్లోనైతే ఆమె చప్పు లేకుండా అన్నీ ఎంత బాహాటంగా అనేస్తుందో రచయిత వ్రాసిన తీరు గమనార్హమైంది. అతనికి విషయం చెప్పాలనే అనుకుందట తీరా అతనే వెలిలి పడ్డాడు ఇకనేం. "అతని అన్నమే తిని అతని బట్టే కడుతున్నావు-వాణ్ణి దోచి నీకు పెడుతున్నాను నాకే ద్రోహ బుద్ధి ఉంటే అతనితో లేచిపోనూ" అంటుంది అతనితో. ఈ చివరి వాక్యం మాత్రం నిజం. ఏం చేసినా భర్తతోనే వుంది. భర్త అభివృద్ధికి రావాలనే చేసింది. మహా మూర్ఖుడు. వెధవ చేవస్తాలు పెట్టుకోవద్దని భర్తకు పై చదువు చెప్పించింది. "విడకోటి పెంపుడు సీమ కుక్కల్లాగ ఆమె తనులతా సౌష్ఠవాన్ని సహస్ర నామార్చన చేస్తూ కనకాభిషేకం చేశారు చెన్నపట్నంలో". ఇక్కడ కథకుడు మన ఇతిహాసాన్ని ప్రస్తావించి అరుగురి పిల్లల్ని పరాయి దేవతలకి కన్న కుంతీదేవి పతివ్రత అయితే శారద కూడా పతివ్రతే అంటాడు. భర్తకు సర్ బిరుదు వచ్చింది. ఆమె లేడీ కరుణాకరం అయింది !

'ఏలూరెళ్ళాలి' అనే కథలో షష్టిపూర్తి అయిన ఒక పెద్ద మనిషి రెండో పెళ్ళి పెళ్ళాం ముప్పయి అయిదేళ్ళ ప్రౌఢ ఇరవై కూడా నిండని నూనూగు మీసాల కుర్రాణ్ణి శృంగార ప్రబంధంలోకి దించుతుంది. ఇది చలంగారి తరహా కథేమోనని అపోహపడే ప్రమాదం వుంది. కాని ఆమె సెక్స్ కోసం ఆ పని చేయలేదు. భర్త గడించిన డబ్బు, పిత్రార్జితం అలా ఆమెకొక పిల్లవాడు కలుగబట్టి దక్కుతాయి లేకపోతే ఆమె మరుదులు ఆమెను ముండను చేసి మూల కూర్చోబెట్టేవారే. అయితే ఈ కథలో కథకుడు చేసిన తమాషా ఏమిటంటే ఆమె తన్ను అలా రంగంలోకి ఎందుకు దింపిందో అది జరిగిన కొన్నేండ్ల తర్వాత కూడా ఆ యువకుడికి తెలియకుండా గోప్యంగా ఉంచడం. ఆ కథంతా అతను మరిచేపోయాడు. ఆమెను కూడా రైలుపెట్టెలో తటస్థపడితే గుర్తుపట్టలేక పోయాడు. ఆమే వెనకటి కథ జ్ఞాపకం చేసింది. అతనికి తెలియకుండా పుట్టిన పిల్లవాణ్ణి అతని కళ్ళు వాత్సల్యంతో చూచాయి. ఈ కథను కథకుడు ఇంతటితో ముగించి వదిలేయలేదు. ఇక్కడొక చిన్న ధ్వని పెట్టాడు. ఆ పిల్లవాడి చేత ఒక ఇంగ్లీషు వాక్యం అనిపించి, ఆ వాక్యం ఇంగ్లీషు పలుకుబడి ప్రకారం తప్పా రైటా అన్న ప్రశ్న పిల్లవాడి చేత వేయిస్తాడు. ఆ వాక్యం కూడా ఎలా వుందంటే ఏ విధంగా అన్నా అర్థం తెలుస్తుంది. అయితే ఇంగ్లీషువాళ్ళు దాన్ని ఒక రకంగా మాత్రమే అంటారు. అదే కరెక్టు ఇంగ్లీషేమో ! కాని ఇక్కడ విమర్శకుడైన పాఠకునికి ప్రస్ఫుటంగా ద్యోతకమయ్యేది భాష తప్పా రైటా అని కాదు. ఆమె చేసిన పని నైతికంగా సమర్థనీయమేనా అని లేదా అతను ఆమెకు అలా వశుడై "రోజుకొక సువర్ణఘట, క్షణానికొక అమృతభావం" అనుభవించడం సరైన పనేనా ? ఈ కథలో ఆమెకు కలిగిన ఫలితం ప్రధానం. మరి ఆమె ఆస్తి దక్కించుకోవడానికి ఈ దారి తొక్కింది. ఫలితం కూడా అనుకూలంగానే వుంది. ఎవరి మంచి చెడ్డలు వాళ్ళవి. అయితే ఆస్తే ప్రధానంగా ఆమె చేత అంతపని చేయించింది. ఆమెకే ఒక పిల్లవాడు భర్త వల్ల కలిగి ఉంటే ఈపాటూ తప్పు రైటు ఉండేవి కావు ఆర్థిక విషయాలు ఇలా నైతిక స్థాయిని తారుమారు చేస్తూ ఉంటాయి. అని కథకుడు చూపెట్టాడు.

మూడవ కథ 'చెప్పకు, చెప్పకు' ఒక తల్లి మొగుడు లేకపోయినా తనపాట్లు తను పడి ఒడ్డు జాగానే లాక్కొస్తూ వుంటుంది ఆమె చీటీ ఇచ్చిందంటే ఊళ్ళో మహామహులు డబ్బు తీస్తారు. ఆమెకున్న ముగ్గురు సంతానంలోనూ పెద్దవాడి స్వభావానికి ఇది సరిపడలేదు. తక్కిన ఇద్దరూ ఒక అబ్బాయి, ఒక అమ్మాయి తల్లి పార్టీయే. పెద్దవాడు తల్లి అవస్థను అర్థం చేసుకున్నాడు. కాని తన చెల్లెలు తల్లి అడుగుజాడల్లో పడిపోక అది మంచి గృహిణి కావాలని అతని ఆశ. కాని ఆ చెల్లెలు గుమాస్తా జీతం గుడ్డ ముక్కకి చాలదంది. ఆ తమ్ముడు ఈ "రోజుల కుర్రాడు" ఏ అమ్మాయిలు మంచి ఫైర్లో ఉన్నారు అనే సంగతి పసికట్టి వాళ్ళను మోసుకుపోవడం వాడి ఉద్యోగం. నీలికిపోయిన వాడు అడుక్కుతింటాడని వాడు అనేస్తాడు. చివరకు తల్లి ప్రోత్సాహంతో కోటీశ్వరుణ్ని పట్టేసింది. ఆయన గొప్ప మానవతావాదిగా పేరుమోశాడు ఆమెను మేడలోకి ప్రవేశ పెట్టాడు. ఆ మేడ ఎక్కడో చెప్పనా అని తమ్ముడంటే, అందుకు విరుద్ధస్వభావంగలవాడైన అన్న "చెప్పకు, చెప్పకు" అంటాడు ఎందుకంటే అది అతను వొచ్చేచోటుకాదు. ఈ కథలో ఆ తల్లివంటి మార్గం పట్టినవాళ్ళు సాధారణంగా పాము నోట్లో పడి పాతాళానికి పోతారు. కాని ఆమె నిచ్చెనలు ఎక్కి పరమపద సోపానం చేరుకొందని కథకుడు, అంటూ అవినీతిలో వుంది ఐశ్వర్యం అంటాడు.


ఇట్లా ఆర్థిక విషయాలు జీవితాలను నడిపిస్తోన్న అనేక వ్యక్తుల కథలను చా.సో. అత్యంత కౌశలంతో వ్రాశారు 'ఎందుకు పారేస్తాను నాన్నా ?' అనే కథలో ఆ పిల్లవాడు ఆ కాలంలో అంతంత హైస్కూలు ఫీజులు కట్టలేక, ఆ ధరలు పెట్టి పుస్తకాలు కొనలేక చదువు మానుకోవలసి వచ్చిన అగత్యాన్ని ఆర్ద్రంగా చిత్రించారు. పాపం చదువు పోయిందని వాడికి తెలిసిన వాళ్ళని చూడవలసి రావడమే లజ్జ అయిపోయింది. వాడి స్థితి చూచి తండ్రికి చచ్చినంత పని అయింది. 'బండపాటు' అనే కథలో బండపాటుకు కూలీ రాముగాడు చస్తే వాడి భార్యకు కంట్రాక్టరు నుంచి ఏదో ఇప్పించిన మేస్త్రీ సత్యం కమీషన్ కొట్టేస్తాడు. కోడలి కొచ్చిన దాంట్లో నుంచి తనకూ కొంత రావాలని అత్త వచ్చి కూర్చుంటుంది కట్టుకున్న దానికి సెప్పినారు, కనుక్కున్న దానికి సెప్పినారు కారు అంటుంది. అన్నీ కిసిపెడుతున్న కనకమ్మ మేస్త్రీని బెదిరించి కోక కొట్టేసింది. కాని అన్నిటికంటే ఘోరమైన విషయమేమిటంటే— రాముగాడి భార్యకున్న మరో మొగుడు సరిగ్గా సమయానికే దాని గుడిసె చేరుకొని దానికొచ్చిన డబ్బుతో పాలెంలో గేదెని బేరమాడుతున్నాడు! ఇది జరిగిపోతున్నా అది "నాన్ సెన్స్ పద్ధంబావో" అని దీర్ఘాలు తీస్తూనేవుంటారు. లేనిబ్రతుకులు. అందుచేతే ఇలాంటివేవో ఏర్పాట్లు ముందుజాగ్రత్త కోసం చేసుకొంటూనే వుంటారు.

సరి బ్రతకడం ఒక పోరాటంలా వుంద మ్యే ఏమిటిచేయడం? అందుకే "బతకడం నేరంగా ఉంది" అంటుంది 'పుక్కుటేశ్వరం' అనే కథలో గోదావరి మండలం సరి హద్దులు దాటించి, ప్రభుత్వ శాసనాన్ని ధిక్కరించి ఇడేసి ఖుంచాలచొప్పున బియ్యం తెచ్చు తరలించుకుపోతూ పట్టుపడ్డ ముద్దాయి ముసలమ్మ. ఈ బాపతు కథలో 'ఎంపు' గొప్పకథ. ఇందులో రచయిత ముష్టివాళ్ళ ఆర్థిక రహస్యాలను విశ్లేషణచేసి చూపారు. మూడుపిడికెళ్ళు దొరికితే శ్రమపడకుండా బతకొచ్చు. నలుగురమ్మలకు దయగలిగితే పొట్ట నిండుతుంది. అన్నిటికన్నా ముసలాడి ఉపన్యాసం ముష్టిలోకానికి ఉపనిషత్తు అన్నారు రచయిత. ఆ ముసలాడికూతురికి కుంటివాణ్ణి కట్టుకోవాలనివుంటుంది. కాని ముసలాడు "ముష్టిగు టలంటా ఎరికి గుడ్డోళ్ళనే కట్టుకోవాలి" అంటాడు. గుడ్డివాడి సంపాదన కుంటివాడికన్నా మెరుగ్గా వుంటుందట పైగా వాడు తనకూతురితో "నీకు మనసయిందీ ఇష్టమొచ్చినట్టు తిరుగు తప్పులేదు. కాని గుడ్డోణ్ణేకట్టుకో" అని సలహా చెబుతాడు. గుడ్డివాడు చూడలేడుకదా ! అయితే వాడు వినగలడు. తనను కట్టుకొనే ఎర్రికి కడియాలూ, గాజులూ అవసరం అని వాటికి డబ్బు గుమ్మరిస్తాడు. ఇక్కడ కథకుడి వ్యాఖ్య: "కళ్ళులేనివాడికి కడియాల రవళులూ గాజుల మోతలే కాబోలు కామాన్ని కదుపుతాయి." అని

చా. సో. గారి కథల్లో 'ఊహా ఊర్వశి' విలక్షణమైనది. ఈ కథకుడు భావకవి అనుకుంటారేమో, కాదు. తనను భావకవుల ఆవేశం పట్టుకోలేదనీ, తనకు భావకవిత్వం మీద అనాదరణా, కవితలో వాస్తవికత — అతివాస్తవికత అంటే అభిమానం ప్రబలిన తర్వాతనే లేని ఊర్వశితో కాపురం చేయడమనే మనో మనోజ్ఞత(ఇది మనోజాడ్యమేనా ?) పట్టుకుందని అంటాడు ఇదే ఆశ్చర్యకరమైన విశేషం భావ కవులు భావగీతం పాడుకొంటూ, భావప్రపంచంలోకి వెళ్ళి మనస్సుని ఊర్వశి వైపు మళ్ళించి ఊహిస్తారుకదా ఊర్వశి సాధారణంగా భావకవుల్దేకదా! ఈ కథకుడంటాడూ—నిజమైన ఊర్వశి వల్ల చిక్కులు, సంసారికి ఊర్వశి దరిద్ర దేవత; దుఃఖకారణం. ఊహా ఊర్వశితో ఏమైనా చెయ్యొచ్చు అంటూ ఇతగాడు చిట్టితో ఊహా ఊర్వశి కాపురం చేస్తున్నాడు. చిట్టి అంటే అతడు వాంఛించిన పిల్ల. ఆమెకు పెళ్ళి కావలసి వుంది. ఆమె పెళ్ళికి పాట్లుపడుతున్నారు ఆమె తల్లిదండ్రులు. కాని చిట్టికి పెళ్ళి కాకుండా చూస్తున్నాడు ఇతగాడు. అలాంటి అందాల రాణి వుందని ఎవరికీ చెప్పడు.

ఎవడికైనా పెళ్ళామైందా అతని ఊహా ఊర్వశి పోయినట్లే. చిట్టి కింకా పెళ్ళి కాక పోవడం, తనకు ఆమెకన్న మూడేళ్ళు చిన్న దానితో అయి ఆమె అమ్మఅయి అమ్మలక్కలతో కలసి పోవడం, అతనిలో దురుద్దేశాన్ని రేపుతోంది. అదేకావాలి అతనికి. అతని మనస్సులో చిట్టి ముద్ర బాగా పడిపోయింది నిజానికి ఊర్వశుల విషయంలో భావకవు లేమిటి? అతి వాస్తవిక కవులేమిటి? పెళ్ళికాని పరస్త్రీ మీద కోర్కె పుట్టింది. అంతేపైగా ఇతగాడు చిత్త సంస్కారం కలవాడినని చెప్పు కొంటాడు. అతని వివాహం ఆదర్శ ప్రాయంగా జరగాలట. కట్నంలేదు, పసుపు కుంకం లేదు. సాక్షులు రిజిస్ట్రారు చాలు. పెళ్ళి సంతకాలు కాగానే చకోర దంపతులై వెన్నెలో తెగిరిపోతారట. మేడ, స్ప్రింగుమంచం, పట్టు పరుపు, మొగలాయి మహలు—ఇలా తేలిపోతున్నాయి. అతని ఊహలు ఇంత కథా చెప్పి, చిట్టికి పెళ్ళి కాకపోవడం పై తెనుగు యువకుల రసజ్ఞతా దారిద్ర్యాన్ని ప్రస్తావించి, తెలుగు ప్రొఫెసర్ల మీద ఒక దెబ్బ వేశాడు ఇతగాడు. "అందం ఎవడిక్కావాలి? ఆఫీసరు గారి కూతురు కోతైనా సరే, తెనుగు ప్రొఫెసర్లు పెళ్ళాడతారు." అని వరూధినీ ప్రవరాఖ్యుల ఘట్టం పాఠం చెబుతూంటారనా మరి వాళ్ళే "నలదమయంతులిద్దరు మనః ప్రభవానలదహ్యమానులై" అనే పాఠం కూడా చెబుతూ వుంటారే! ఏమైనా ఈ కథలో ఊహా ఊర్వశులతో కాపురం చేస్తూ ఎట్లాగైనా వారికి పెళ్ళి కాకుండా చూసి, వారు శాశ్వతంగా తమ ఊహా ఊర్వశులుగా ఉండిపోవాలని చూచేవారి ఒక తరహా మనస్తత్వాన్ని రచయిత బహిర్గతం చేశాడు. ఇది శాడిజమ్‌గా కన్పించవచ్చు, కాని ఎవరి అస్తిత్వ దృక్పథంతో వారు ప్రవర్తిస్తూ ఉంటారు. ఈ కథ 'భారతి' లో పడింది. ఊర్వశీ భావన ఒక వ్యసనమనీ, అది మనో వ్యభిచారం వంటి ఒకానొక లోలత్వమనీ ధ్వని ప్రాయంగా రచించిన అధిక్షేప కథ ఇది.

'బబ్బాబ్బా' మరెవ్వరూ వ్రాయలేని కథ. తెలుగు పట్టణాలు ఇంకా విద్యుచ్ఛక్తికి నోచుకోని రోజుల నాటి కథ. చిన్నతరంవాళ్ళు కష్టే ఫాల్తీలు, పెంచు కొనే వైరాలు, తినిపించిన కురిడీలు, ఎగతాళి చేస్తూ బబ్బాబ్బా కొట్టడం, నేల టిక్కట్టుకు వెళ్ళి లెక్కా పత్రం లేనన్ని సినిమాలు చూడటం, నేలకు



పక్కదంలో వున్న సుఖవులు, గొంగుల పంతం ఉడుకుమోతు తనం మత్సరం, కోపం, ఒకడు కురిడీ తినిపించిన సంగతి జ్ఞాపకాని కొస్తే వొళ్ళుమండి, ముక్కుపుటా లెగిరి, ముచ్చెమటలు పోసి కంపించిపోవడం అన్నీ బలే వివరంగా వర్ణించారు. వీటినన్నిటినీ పరిశీలించిన రచయిత కొన్ని సంవత్సరాల పాటు ఆ దృశ్యాలను తన జ్ఞాపకాలుగా పదిల పరచుకొని, తీరిక చిక్కి మనః స్థిరి ఏర్పడ్డ వేళ కాగితంపై పెట్టి, మానవునికి ఒక వయస్సులో సాహసంపై ఉండే విజిగీషను, మక్కువను చిత్రించారు. ఈ రకం కుర్రకాగు ఏ దేశంలోనైనా, ఏ భాషలోనైనా ఉంటారు కాని తెనుగు వాతావరణాన్ని పరిసరాలనూ తెలుగు వారి ప్రత్యేకతనూ చూపడంలో రచయిత చూపిన సుకౌశలం ఎన్నదగింది. ఇంత కథ వ్రాసిన తర్వాత కథకుడు "ఆ నాటి నన్ను చూసి ఈ నాటికీ నేను నవ్వుకొంటాను" అన్నారు సహజమే. వయస్సులో వుంది అది. అందుకనే జీవితం దశలుగా విభజింపబడింది కదా !

'జంక్షనులో బడ్డీ, ; 'ప్రెసిడెంటు లక్ష్మీకాంతం' మునిసిపాలిటీలలో కౌన్సిలర్లు చేసే మోసాలూ, ఎటువంటివాళ్ళు ఎలా పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు అవుతారో చెప్పే కథలు. లక్ష్మీకాంతం గమళ్ళదాని వల్లే పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు అయ్యాడు రాజకీయాల్లో తప్పితే ఆడదానికి మనం చాలం అంటాడు సారామకాణముప్పుడు దానిపడి రాత్రి రోజూ రెండు గళాసులు. అతని పని కూడా అప్పుడంతే. అతను బోర్డు ప్రెసిడెంటు అయి, అది గంగాదేవి అయినప్పుడు అది రోజూ బ్రాందీ రెండు పెగ్గులు వేస్తుంది. అతని పని సరిగ్గా అంతే.

ఒక యువతి ఒక యువకునికి రాసిన ఉత్తరాల ద్వారా ప్రేమనూ మోజునూ, బదలాయింపు చేసిన కథ'బదిలీ' ఆ యువతికి అతనిపై వున్న మోజును ప్రధానంగా చూపెట్టిన కథ ఇది. సిగ్గూ లజ్జా లేకుండా "నేనో కుక్కని. సిగ్గులేకుండా తోకాడించు కొంటూ మీ దగ్గరికి వస్తూ ఉంటాను" అని రాస్తుంది ఒకరి అవసరం ఒకరికి కలిగినప్పుడు కలిశారు. అతను ఆమె మొగుణ్ణి తిడుతూ రాశాడు. ఆమె అతని పెద్దరికాన్ని ప్రశ్నించింది. తన భర్తను బదిలీ చేయించి ఆయన బుద్ధి మార్చిందట. ఏమైతేనేం అతనికి ధైర్యం, తెగింపు లేక ఆమె విటుడుగా ఉండవలసిన స్థానాన్ని పోగొట్టుకొన్నాడు. తన మొగుడు చెడితే తానూ చెడ్డానని అంగీకరించిన స్త్రీ మనస్సులోకి మనం చూచే అవకాశం కలిగించే కథ ఇది. ముఖ్యంగా ఆమె అన్న మాట "మనుషుల బుద్ధులు మారవూ" ఇంద్రధనుస్సు వలె గోచరిస్తుంది.

కథారచనలో చా. సో. కనపరిచే వైవిధ్యానికి మచ్చుతునకల వంటి కథలు కొన్ని ఉన్నాయి. ఇవి ఇతివృత్తంలో, చెప్పే తీరులో, శిల్పంలో, సందేశంలో ఆయన ప్రత్యేకతను చాటేవిగా ఉన్నాయి. 'దుమ్మల గొండె' అర్ధరాత్రి కుమిలి ఘాటికి షికారు. భయంకరమైన ఏకాంతసీమలో సుందర జాగారం చేయాలని కాని అద్భుతమైన ప్రకృతి ముందు మానవుడు అల్పుడని చెప్పడ ... లక్ష్యం. ఒక్క గానమే మానవునికి క్షమ కలిగిస్తుంది. దుమ్మల గ ... పట్టుకొంటుంది. భయం

శరీరాన్నంతా ఆవహించడం అనే అనుభవాన్ని ఈ కథలో రచయిత పరిసరాల వర్ణన ద్వారా పాఠకునికి కలుగజేశాడు. ఇందులో భయానకమైన, వికృతమైన, విపరీతంగా కనపడే ప్రకృతిని కథకుడు వర్ణించిన తీరు ఒక్కొక్క వాక్యం ఒక చిత్రకారునికి అపురూపమైన ప్రకృతి చిత్రాన్ని వేసేందుకు భావన ఉత్తేజము కలిగించేదిగా వుంది "నల్లని నీడలో గోతిడు సీళ్ళు వెన్నెలపడి తెల్లగా చెంగల్వ పువ్వులాగ వికసించాయి. రోడ్డువార కాలువలో నక్షత్రాలు మాకన్నా వడిగా పరిగెత్తుతున్నాయి. చెమ్మమీద చంద్రకాంతి పడి గెడ్డ జిగ్గని తెల్లని జరీ చీర లాగ మెరిసిపోయింది చుట్టూ కొండలు వలయంగా చుట్టేశాయి. ఆమధ్యనున్న భూస్థలం గంగాళం లాగున్నాది."

'గుడిసె దీర్ఘరోగి' అనే కథ ఊహ, కళామూల్యం, ఫీలింగు కళాకారుడికి ఎక్కడినుంచి వస్తాయి అనే ప్రశ్నకు సమాధానం అవి యధార్థ సంఘటనల్లో నుంచి వస్తాయి. ఈ కథలో చిత్రకారునికి ముసిలి ముష్టి దాని మొహంలో ఎనభై ఏళ్ళ జీవితపు బాధ, మరణవేదన ఇచ్చిన స్ఫూర్తి వల్ల అతను దీర్ఘరోగి చిత్రంలో అనుకున్న ఫీలింగు తేగలిగాడు రోగి ఏ క్షణాన చచ్చిపోతాడో అనే భావం చూచేవారికి కలుగజేశాడు. మనిషిని మనిషి ఏం చేస్తున్నాడో ముసలిదాని చూపు చెప్పేసింది. ఆ ముసల్దికూడా జుట్టు సవరించుకోవాలని చూస్తుంది. అది మనిషిలో అంతర్గతమై వున్న సౌందర్యపిపాస అని చెబుతూ చిత్రకారుడు దాన్ని వినియోగించుకోలేదు. ఆ చిత్రం నారాయణబాబు (శ్రీరంగం) 'దేశమాత' శ్రీశ్రీ 'భిక్షువర్షీయసి' గీతా లేతా లెత్తగా బైటికొచ్చిందట.

'బొమ్మలపెళ్ళి' ఓ ముసలమ్మ చెప్పిన ఎప్పుడో ఇక్ష్వాకులనాటి జీవితాన్ని పునః సృష్టించిన కథ ఆ రోజుల్లో ఎంత పెద్దింటి పిల్లలైనా గోచీలే. ఎర్రని రాగి డబ్బు కంటబడేది కాదు. గరిసెల కొద్దీ ఇంటినిండా దినుసులు పట్లు కొలిచిపోసినా కోమటి పది రూపాయలు చేతిలో పెట్టేవాడు కాదు. సంవత్సరానికి ఐదు రూ. లు పన్ను కట్టుకోలేక ఏభై ఎకరాల భూమి వదులుకున్నారు — ఇట్లా ఆర్థిక విషయాలను అధికంగా సాంస్కృతిక విషయాలతో జోడించి అప్పటి గ్రామీణ తెలుగు సంస్కృతికి అద్దం పట్టడంలో కథకుడు కృతార్థుడైనాడు.

చా. సో. ఆ క్షణానికి మనుషులెవరూ గుర్తుకు రాకపోతే పక్షులను పాత్రలుగా తీసుకొని అయినా కథ వ్రాయగలరనడానికి 'మాతృధర్మం' కథ నిదర్శనం ఇది ఆడకత్తెర మగకత్తెర పిట్టలకథ. అయితే మానవీయ ప్రస్తుతాంశం ఇందులో లేకపోలేదు మానవులు తమ పిల్లలను ఎట్లా సాకుతారో, ఎలా సుఖ దుఃఖాలను భవిస్తారో పక్షులు కూడా అంతే. ప్రకృతిలో - లేదా సృష్టి ఉనికిలో బలం కలవాడిదే రాజ్యం అనే సిద్ధాంతం ఎప్పుడూ పనిచేస్తూ వుంటుంది. చీమలు పెట్టిన పుట్ట పాము పరిగ్రహించింది దాన్ని చంపి స్వాధీన పరచుకొంది ముంగిస. ముంగిస పుంజుకత్తెరను తన దంష్ట్రల్లోకి తీసుకొంది. ఏకాకియైన ఆడకత్తెర ప్రదక్షిణలు చేస్తూ విలపించింది. దాని విలాపాన్ని గీతంగా రాసుకున్నాడు మానవుడు. మాతృధర్మం ముందు ప్రియుని వియోగం ఏమాత్రం. ఆడకత్తెర మళ్ళీ గుడ్డు పెట్టింది ... పుంజు పిల్ల బయటపడింది. అది హల్వాలాంటి ఆకుపురుగుల్ని తిన్నది ఇట్లా పక్రృతిలో ప్రతి క్షణం జరిగే సృష్టి, స్థితి లయాలను కథకుడు పరిశీలించి ఈ కథను చెప్పడం రచయిత ప్రతిభకు పతాక స్థాయి. ఇందులో చెప్పదలచుకున్న అంశం ఆడజీవి తన మాతృ ధర్మాన్ని నిర్వర్తించి, కృత కృత్యురాలినైనానని దాని హృదయం ద్రవీ భూతం కావడం. ఈ కథను చలం రాసిన 'ఓ పువ్వు పూసింది'తో ఎవరైనా పోల్చవచ్చు. చలం కథలో రొమాంటిక్ ఫీలింగ్, ఆవేశం హెచ్చు. చా. సో. రాసిన ఈ కథలో గాఢత్వం సందేశం ప్రబలం. కాని రెండూ రెండు మహా కావ్యాలు ఈయన పలుపోకడలు పోయినట్లు నిరూపించేవీ, వ్యాఖ్యానింపదగ్గవీ 'ఉళ్ళో వానలేదు', 'కర్మ సిద్ధాంతం', 'చొక్కా - బొచ్చు తువ్వాలు' వంటి మరికొన్ని కథలున్నాయి.

చా. సో. కథారచన 'చోటుచాలదు' లో ముఖ్యంగా గమనార్హమైంది కథను కవిత్వ స్థాయికి తీసుకు వెళ్ళి లిరిక్ లక్షణాలు కథకు సమకూర్చడం. ఈ ప్రయత్నం ప్రతి కథను మలచడంలో కనిపిస్తుంది ఇందుకు కారణం చిన్నప్పుడు ఛందస్సు నేర్చుకొని ఆంగ్లంలో కవిత్వం వ్రాసేందుకు ప్రయత్నించి, ఆ వ్రాసిన ఖండిక పేరుగల పత్రికలు వేయకపోగా జనించినటువంటి అసంతృప్తి, కృతార్థత చెందలేకపోవడం కథకుని పూర్వ రంగం కావడమేమో ! ఆ రోజుల్లో శ్రీ శ్రీ, నారాయణబాబు, రోణంకి అప్పల స్వామి, చా. సో ఒక జట్టు ఐరోపాఖండ సాహిత్య కళా ఉద్యమాలతో వీరికి విదేశీ పత్రికల ద్వారా సంబంధముండేది ఆ పత్రికలు విజయనగరం మహారాజావారి కళాశాలకు వచ్చేవి. రోణంకి అప్పలస్వామిగారు అనేక యూరోపియన్ భాషలు సాహిత్యాలు తెలిసిన వారు. విశాఖపట్నంలో శ్రీ శ్రీ, శ్రీరంగం నారాయణబాబు ఒకప్పుడు భావకవులు. ఈ వాతావరణంలో మసిలిన చా. సో. కు కొంత కాలంపోగా తాము వ్రాసేది కవిత్వం కాదని తెలిసిపోయింది. అది ఊరికే పద్యం రాయడమే సంతృప్తి కలుగలేదు. ఇంగ్లీషులో కవి కావడం అసాధ్య మనిపించింది వీరికి. అయినా ఆ రోజులనాటి అనుభవాన్ని చా. సో. గారు 'చిన్నాజీ' అనే కథలో కొంత వైరాగ్య భావంతో కథావొద్దు కావ్యంవొద్దు, చిన్నాజీతో ఐదు నిమిషాలు షేక్స్పియర్ కామెడీలో ఐదంకాలపాటి చెయ్యేవా అన్నారు. చిన్నాజీ చిరుతప్రాయం విలువైంది అని చెప్పారు. ఈ కథలో "ఫ్రెంచి పండితుడు అప్పలస్వామి నాయుడు వొచ్చి రసగుల్లా లాంటి రోసార్కవి గేయంలో చరణం అందుకుంటాడు. దాంతో వెర్రెత్తిపోతాడు గాయకుడు నారాయణబాబు. పరాసు పద్యం పరారీ అయిలాగ పాడతాడు ఇంగ్లీషు పాట నవ్య సాహిత్య పిపాసి నారాయణబాబు. అప్పలస్వామి రోసార్ని వొదిలి నారాయణబాబు గొంతుకతో కలుపుతాడు" - ఇవన్నీ అలనాటి వారి కవితాసాంగత్యం జ్ఞాపకాలు. చా. సో. ఆంగ్లకవిత్వ రచనలో విఫల మనోరథులై తెలుగు కవిత్వంలో పడ్డారు ఆయన ఛందస్సు భాషా సౌలభ్యం, ఇమేజిస్టు స్కూలుకు చెందిన వనబడే గీతాలు వ్రాశారు. వాటిని భారతి, ప్రతిభ ఆదరించాయి. మరి కొన్ని ప్రత్యేక సంచికల్లో కూడా ఇవి ప్రచురితమయ్యాయి. ఇదీ కాదనుకొని అప్పుడు కథా రచనకు మళ్ళారు. కథానిక కవిత్వంలో లిరిక్ వంటిది అనే నిర్వచనాన్ని వీరు నమ్ముతారు. నమ్మడమే కాక కథను కావ్య సదృశమైన పరిపూర్ణత్వం కేసి తీసుకు వెళ్ళడం వీరి లక్ష్యమైనట్లు తెలుస్తున్నది. కాబట్టే తాము వ్రాసిన కథ కావ్య ఖండికవలె రూపు దిద్దుకున్నదా లేదా చూస్తారు ముఖ్యంగా కథ ప్రారంభ భాగానికీ చివరి భాగానికీ పరస్పర ఆధార సంబంధం వుంటుంది ఈయనకు శబ్ద మహిమ, నాద మహత్యం కూడా ఆకళింపే అనిపిస్తుంది. ఒక కథలో "గంగాళం లాంటి భూవలయంలో కళపెళ ఎసరు ఉడుకుతున్నట్టు కప్పలు మోతపెడుతున్నాయి - గాజుల నిక్వాణం. నర్తకి గుల్ల కడియాల్లో రాళ్ళ గుణ గుణ - కీటకాలు కోటాను కోట్లు తంత్రీ స్వనాలు మీటుతున్నాయి. మువ్వలు మోతపెడుతున్నాయి. కింకిణీ స్వనం లంకిణీదేవి గుర్రలాగుంది" అని శబ్దాల వర్ణన చేశారు. ఇక సామెతలూ, నుడికారమూ సందర్భోచితంగా పడిపోతూంటాయి. ఇక అక్కడక్కడా చురుకైన పదునైన ఛలోక్తులు. "పాండిత్యం ఎక్కువైతే బుద్ధికి పడిశం పడుతుంది" ట "వెన్నెల కర్పూరంలాగ వెలుగుతున్నాది" అనే వీరి ఉపమానం ఎంకిపాటల్లో 'ఎలుతురంతా మేసి ఏరు నిదరోయింది, అనే పంక్తిని స్ఫురింపజేస్తుంది. వీటన్నిటికీ ప్రాతిపదిక వాస్తవికత. ఇక ఆ కథ కావ్యం కాక ఏమౌతుంది ?

చా. సో. కథా ప్రపంచం తెలుగు కథానికకు మరో పరిమాణాన్ని ఇచ్చి దాని సంపన్నతనూ మూల్యాన్నీ బాగా పెంచింది.

"జీవనగీతం"

రఫి

సుమ సుగంధ సౌరభాలు వీడ్కోలు అర్థిస్తాయి ....
పరిమళం మిగిలిపోతుంది
గాయకుడు స్వర్గాన్న ధిరోహిస్తాడు
అతనిగేయం-గాయాల్ని సైతం మరపింపజేస్తుంది
కవి మన మధ్యనుంచి దూరమవుతాడు
భావుకత స్పందించే హృదయాలలో
చిరకాలం శోభిల్లుతుంది
ఈ జీవితంలో ....
మనం ఏమి శోధించాలి నేస్తం ?
మంచిని పెంచడం తప్ప!
మనం ఏమి సాధించగలం నేస్తమ్?
మమతను పంచడం తప్ప !

కలగూరగంప

వేములవాడ భీమకవి

విమర్శ - పరామర్శ

భారతి-నవంబరు '84 కలగూరగంపలోని "వేములవాడ భీమకవి" అను పునః పునర్విమర్శయందు అపూర్వములైన విశేషములు కలవు. అవి :

1. "1983 జనవరి "భారతి"లో నేనుదహరించిన కొరవి గోపరాజు "సింహాసన ద్వాత్రింశిక" లోని పద్యాన్నిచూచి కూడ అది ఆరుద్రగారి "సమగ్ర ఆంధ్ర సాహిత్యం లోనిదని అదే నా వాదానికి మూలమని...వ్రాయుటను... ఏమనవలెనో విజ్ఞులు సెలవీయగలరు. నేనుదహరించిన పద్యము ఆంధ్ర సాహిత్య పరిషత్తువారి ప్రచురణములోనిదే, సమగ్ర ఆంధ్ర సాహిత్యములోనిది కాదు."

ఇట్లు వ్రాయుటకు నిమిత్తమైన పూర్తి వాక్యమిది.

"కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక-ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారి ప్రచురణములోని (1936), ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి వారి ప్రచురణలోని (1982) పరిష్కృత పద్యమును పరికింపక ఆరుద్రగారి సమగ్ర ఆంధ్ర సాహిత్యంలోని (1965) అపరిష్కృత, అర్ధరహిత, పద్యమును పట్టుకొని, వేములవాడ భీమకవి జన్మస్థలము లేములవాడ అని వాదమునకు దిగిన విమర్శకుడు-అసలు పద్యమునకు అర్థము చెప్పిన తర్వాత, "కొన్నినాళ్ళున్నట్టు" సమ్మతించినను, అది వేములవాడ అనుట "సత్యాన్వేషణ తత్పరత"కు సాక్ష్యము కాదు.

ఇందు 1983 జనవరి "భారతి"లో విమర్శకుడు ఉదహరించిన పద్యము సమగ్ర ఆంధ్రసాహిత్యంలోనిదని లేదు. ఆంధ్ర సాహిత్య పరిషత్తువారి ప్రచురణములోనిదికాదనియును లేదు. అదే విమర్శకుని వాదమునకు మూలమని కూడలేదు. "ఆంధ్ర సాహిత్య పరిషత్తువారి ప్రచురణములోని...పరిష్కృత పద్యమును పరికింపక" అని కలదు.పరికింపక అనగా ఉదహరింపక అని అర్థము కాదు. ప్రకరణమునుబట్టి పరిశీలింపక అని ప్రస్ఫుటము. "సమగ్ర ఆంధ్ర సాహిత్యంలోని పద్యమునుపట్టుకొని" అని కలదు. పట్టుకొని అనగా ఉదహరించి అని అర్థముకాదు. సందర్భమునుబట్టి ఆధారముచేసికొని అని స్పష్టము. "వాదమునకు దిగిన" అని కలదు. దిగిన అనగా మూలము అని అర్థము కాదు. ఉపక్రమించిన అని సువిశదము. సింహాసన ద్వాత్రింశికలోని పద్యమును ఉదహరించియును, విమర్శకుడు పరిశీలింపక పోవుటవలన ఆ పద్యమునకు అర్థము చెప్పుట జరిగినది. అర్థము చెప్పిన తర్వాత "భీమకవి కరీంనగర్ జిల్లాలోని వేములవాడలో కొన్నినాళ్లున్నట్లు గోపరాజు పద్యము సాక్ష్యము" అని విమర్శకుని పునర్విమర్శలోని విన్యాసము! అందుకు పైన ఉదహరించిన పూర్తివాక్యము ప్రసక్తము. ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు, ఆంధ్ర సాహిత్య అకాడమి వారు ప్రచురించిన సింహాసన ద్వాత్రింశికలోని "గోపరాజు పద్యము" నందు లేములవాడ అనియేగాని వేముల వాడ అని లేదు, కాని ఆరుద్రగారి సమగ్ర ఆంధ్ర సాహిత్యంలోని "గోపరాజు పద్యము" నందు మాత్రమే వేములవాడ అని కలదు. అందువలన "ఆరుద్ర గారి సమగ్ర ఆంధ్ర సాహిత్యంలోని అపరిష్కృత, అర్థరహిత పద్యమును పట్టుకొని...అది వేములవాడ అనుట "సత్యాన్వేషణ తత్పరత"కు సాక్ష్యము కాదు" అని సమాధానమిచ్చుట జరిగినది. "వేములవాడల[illegible] [illegible]టకు మఱి ఆరుద్రగారి సమగ్ర ఆంధ్రసాహిత్యంలోని "గోపరాజు పద్యము" [illegible]ధారము కానిచో, మఱే సాహిత్యములోని "గోపరాజు పద్యము" ఆధార[illegible] [illegible]కుడు చెప్పవలయును. కాని చెప్పలేదు. అంతేకాదు. విద్యార్థి సహితము చదువు సమగ్ర ఆంధ్రసాహిత్యం విమర్శకుడు చూడనట్లు పునర్విన్యాసము ! !

2. "భీమకవిని లంకా విజయములో లక్ష్మణకవి 'పృథుకు కవి స్వాంత భీముని'గా కీర్తించినట్లు నేను వ్రాసినదానిని "లంకా విజయము చదివి వ్రాసినది కాదు" అని...వ్రాశారు. నిజమే. "లంకా విజయము ముద్రితప్రతి నేను చదువలేదు...[illegible] [illegible]ద్రగారి సమగ్ర ఆంధ్ర సాహిత్యం మాత్రమే చూచి" వ్రాసినది క[illegible] నా వ్రాతకు ఆధారము మద్రాసు ప్రభుత్వము వారిదివరలో ప్రచురించిన డిస్క్రిప్టివ్ కేటలాగు పుట 957 ముద్రితప్రతికి మూలాధారమనదగిన కాగితపు ప్రతిలో "పృథుకు కవి స్వాంత భీము'డుగా మార్చి ముద్రించవలసిన అవసరమేల కలిగినదో?"

ఇందు "లంకా విజయము చదివి వ్రాసినది కాదు" అని వ్రాసినది అయినను, "నిజమే" అని ఒప్పుకొనుట ముదావహము. కాని అది "ఆరుద్ర గారి సమగ్ర ఆంధ్రసాహిత్యం మాత్రమే చూచి వ్రాసినది కాదు" అని తప్పు కొనుట దయనీయము, "సమగ్ర ఆంధ్ర సాహిత్యం మా[illegible] [illegible] వ్రాసినది కాదు" అనగా ఇట సమగ్ర ఆంధ్రసాహిత్యం మా[illegible]మేగాక ఇంకొకటికూడ చూచి వ్రాసినట్లు అర్థము వచ్చును. అనగా సమగ్ర ఆంధ్ర సాహిత్యం చూచి వ్రాసినట్లే కద! ఇంకొకటి కేటలాగు. అది మరి ఆరుద్ర గారికిని ఆధారమే అగును. విమర్శకుని కేటలాగు పాండిత్యమును సరిగాలేదు. మదరాసు ప్రభుత్వము "ఇదివరలో ప్రచురించిన డిస్క్రిప్టివ్ కేటలాగు" అని, ఇటీవల ప్రకటించిన డిస్క్రిప్టివ్ కేటలాగులు అని రెండు రకములు లేవు. ఆల్ఫబెటికల్ ఇండెక్స్, ట్రీనియల్ కేటలాగ్, డిస్క్రిప్టివ్ కేటలాగ్ అని మాత్రము కలవు. అవి సరిగా పరికించినచో, పిండిప్రోలు లక్ష్మణకవి లంకా విజయమునకు ఒక కాగితపు ప్రతిమాత్రమేగాక, రెండు తాళపత్ర ప్రతులును కలవని తెలియును. 1927వ సంవత్సరమునందు వావిళ్ళ రామస్వామి శాస్త్రి అండ్ సన్స్‌వారు ప్రచురించిన "రావణ దమ్మీయము" అను నామాంతరముగల లంకా విజయము"ను చదివినచో, ఆ గ్రంథము "1887వ సంవత్సరమున గాకినాడలో ముద్రింపబడినది" అని, అది "తప్పులతో నుం'డె ననియు, వావిళ్ళవారు "సాధ్యమయినంతవరకు నిర్దుష్టముగా ముద్రించిరి" అనియును తెలియును. తాళపత్రగ్రంథముల, కాగితపు ప్రతుల పరిచయము కలదేని, అవి లేఖక పాఠక దోషములకు అతీతములు కావని అర్థమగును శబ్దార్థ జ్ఞానము, వ్యాకరణ జ్ఞానమును ఉన్నచో, "పృథుకు కవి స్వాంత భీము భీము" అను లిఖిత పాఠము దుష్టమని, "పృథుక కవి స్వాంత భీము భీము" అను ముద్రిత పాఠము నిర్దుష్టమని బోధపడును. రెండు పాఠముల అర్థములను వివరించి, ముద్రితపాఠము సరియైన పాఠమని మూదలించినను, "కాగితపు ప్రతి లోని (ది) మార్చి ముద్రించవలసిన అవసరమేల కలిగినదో" అని విమర్శకుడు అభినయము చేయుట మఱి అకాండ తాండవము.

3. "గోపరాజుకు భీమకవిపై 'అంతస్తావమైన కోపమే' ఉన్న యెడల...'సత్యనారన' అన్న పేరుగల తన తాత 'భూమిని మించిన భీమన నామంబున బరగెనని సగర్వముగా చెప్పుకొనునా?"

కొరవి గోపరాజు తన తాత సత్యనారన "భీమన నామంబున బరగె" అనగా వేములవాడ భీమకవి నామమున పరగెనని సగర్వముగా చెప్పుకొనలేదు. విమర్శకుడు మాత్రము "సగర్వముగా చెప్పు"ట జరిగినది. అందుకు నిమిత్తమైన కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశికలోని పద్యమిది:

"రామాయణ కృతి కృతియై
తా మెఱయుచు నంధ్ర కవిపితా మహుఁడనఁగా
భూమిని మించిన భీమన
నామంబునఁబరగె సత్యనారన ఘనుఁడై"

ఈ పద్యమునకు దాగంటి శేషయ్యగారు చెప్పిన అర్థమిది:

"ఈ కవికి (సత్యనారనకు) భీమనయను నామాంతరముండెననియు, నితఁడాంధ్ర కవితా పితామహ బిరుదాంచితుఁడై రామాయణమును రచించెననియు నీ...పద్యములో గోపరాజు కవి వ్రాసియున్నాడు."

(ఆం. క. త. సం. 4. పు. 160)

ఇందు సత్యనారనకు నామాంతరము భీమన అని కలదు. పద్యములోని భీమన అనునది సత్యనారనకు నామాంతరము కానిచో, "రామాయణ కృతికృతియై తామెఱయుచు నంధ్రకవి పితామహుఁడనఁగా భూమిని మించిన" వాడు "భీమన"యే అగును. కాదని రామాయణ కర్తృత్వము, ఆంధ్రకవి పితామహ బిరుదము పద్యములోని సత్యనారనకు తగిలించిన, దూరాన్వయదోష దూషితమగును. అంతేకాదు. ఆంధ్రకవి పితామహ బిరుదాంకితుడైన, రామాయణ కర్త అయిన భీమన మరొకడు కనరాడు. వినరాడు. వేములవాడ భీమకవి ఆంధ్రకవి పితామహుడు, రామాయణ కర్త అనుటకు మరి ప్రమాణాంతరము లేదు. కనుక "భీమన" అనునది "సత్యనారన"కు నామాంతరమే కావలయును. కానిచో "భీమన" మరొకడే అగును. అనగా ఈ పద్యమునందు వేములవాడ భీమకవి ప్రసక్తిలేదని అవగాహనమగును. ఆంధ్ర కవితరంగిణిలోని అర్థమైన చూడకుండ, అథవా చూచినను అవగాహన చేసికొనకుండ, కొరవి గోపరాజు సుకవిస్తుతిలోని భీముడు (11ప.)కు కవి నాదలోని భీమన (18 ప.) వేములవాడ భీమకవి కావున, కొరవి గోపరాజు కవి వంశావతార వర్ణనములోని భీమన (49ప.) కూడ వేములవాడ భీమకవియే అని విమర్శకుడు "సగర్వముగా చెప్పు"ట అవి చారమూలకము.

4. "మధ్యాక్కర గురించి నేను వ్రాసిన దానిని శ్రీరామమూర్తి గారు వ్రాసిన విమర్శను చదివి సత్యము నిర్ణయించుకొనవలసినది పాఠకోత్తములే."

అసలు మధ్యాక్కర ఛందస్స్వరూపము గురించి "శ్రీరామమూర్తి గారు వ్రాసిన" విషయము పండిత పరంపరాగతమైన పరమ సత్యము. విమర్శకుడు కావించిన విమర్శ స్వకపోల కల్పితమైన మృషావాదము. అది, ఇది, "చదివి సత్యము నిర్ణయించుకొనవలసినది పాఠకోత్తములే" కాని పండితోత్తములు కారన్నమాట!

"ఎట్టిన తాను నన్నయ రచన కాఁబూరించిన వాఁడగుట భారతమున మధ్యాక్కర రచించెనే కాని సమానాక్కరయగు దీనియందు (2ఇం-1సూ + 2 ఇం-1సూ) 3 గణములపై యతి నిల్పుటయే సముచితమును రమ్యతరమునని యెంచి యీ చిన్ని మార్పు గావించెనని తోఁచెడు" (పు. 159.)

అని రావూరి దొరస్వామి శర్మగారు నిర్ణయించి వ్రాసిన విషయము కలదు. ఇందలి "సమానాక్కరయగు" అను విశేషము, "2 ఇం—1సూ + 2 ఇం–1సూ" అను విభాగమును అర్థము చేసుకొనిన సత్యము స్వయముగ సాక్షాత్కారమగును. కాని లంకా విజయము ముద్రితగ్రంథమునైన చదువని విమర్శకుడు. "తెలుగు భాషలో ఛందోరీతులు" అను ముద్రిత గ్రంథమునుకూడ చదువలేదు. ఇట్టి విషయములు మదరాసు ప్రభుత్వమువారి కేటలాగులందు ఉండవు. కనీసము మధ్యాక్కర అను నామధేయములోని "మధ్య" అను విశేషణమును విమర్శకుడు కానలేదు. అయినను విమర్శకుని 'ఆర్భాటము' సత్యాన్వేషణ తత్పరత .!

5. "యతి విరామ స్థానాన్ని గమనించి చదివినపుడు తేట గీతి నడక మధురాక్కరలో గలదో, ద్విపద నడక నడిచే అంతరాక్కరలో గలదో" "ఛందశ్శాస్త్ర పరిజ్ఞానము" గలవారు తేల్చి చెప్పగలరు."

ఛందశ్శాస్త్ర పరిజ్ఞానము కలవారు మాత్రమేగాక విజ్ఞులైన పండితోత్తములు తేల్చి చెప్పిన విషయమునైన తెలిసికొనకుండ విమ్మర్శకుని విశృంఖల విజృంభణము! అంతేకాదు. అంతరాక్కర "ద్విపద నడక" నడచునని విమర్శకుని వితండవాదము!! ఉపరి "యతినియమస్థానమును గమనించి చదివినప్పుడు" అని విమర్శకుని విపరీత ధీ విలాసము!!!

కవిజనాశ్రయములోని మధురాక్కరమిది:

"రవి దివిజరాజ గీర్వాణరాజ దేవాధిదేవ
కువలయప్రియు లిప్పాటఁగూడ నేను గణములు
నవిరళముగఁ బ్రావడి మధురాక్కరంబు ధరలోనఁ
గవిజనాశ్రయుండె తెఁగించెఁగవుల కింపుజనింప"

ఇందు "అధిదేవ, గణములు, ధరలోన, జనింప" అను పదములు లేనిచో—మధురాక్కర తేటగీతి అగును. అవి కలవు గావున మధురాక్కర యందు తేటగీతి నడక అతిక్రమించినది.

ఆంధ్రసాహిత్య పరిషత్తువారు ప్రచురించిన కవిజనాశ్రయములోని అంతరాక్కరమిది :

"ఇన సురేంద్ర చంద్రంబు లిప్పాటవచ్చి
పొనరి యుండంగఁబ్రావిష్ణు పూర్వభంగి
ననగణంబులు నాలుగింటంబెనంగ
ననుపమానాంతరాక్కర మయ్యె రేచ"

ఇందు "ప్రథమ పాదమందు యతి విచార్యము" అని జయంతి రామయ్య పంతులుగారి అథసూచనము. అంతేకాదు. గణ నిర్దేశభంగమును కలదు. రెండు ఇంద్ర గణములకు బదులు ఒక ఇంద్రగణమే నిర్దిష్టము. కడమ మూడు పాదములును యతి మైత్రి ఘటితములైన తేటగీతి పాదములె. మూడు, నాలుగు పాదములు ద్విపదపాదములగునుగాని యతిమైత్రి ఘటితములు కావు. మొదటి రెండు పాదములు ద్విపద పాదములు కాఁజాలవు.

వావిళ్ళవారు ప్రకటించిన కవిజనాశ్రయములోని అంతరాక్కర మిది ;

"ఇనుఁడొకఁడు సురేంద్రయుగమిందుండొక్కడుం
బొనరియుండఁబ్రావిష్ణు పూర్వంబుగాదు
ననఁగ నాల్గింట యతి త్రికాంత్యంబు వర్ణ
మనుప మానాంత రాక్కరాఖ్యంబు రేచ"

ఇందు మూడు. నాలుగు పాదములు యతిమైత్రిఘటితములైన తేటగీతి పాదములు. రెండవపాదము యతిమైత్రి రహితమైన తేటగీతి పాదము. ఒక్క పాదమును యతిమైత్రి ఘటితముకాని, యతిమైత్రిరహితముగ కాని ద్విపద పాదము కాఁజాలదు.

విన్నకోట పెద్దన కావ్యాలంకార చూడామణిలోని అంతరాక్కరమిది:

"కమల మిత్రుండు సురరాజ గణయుగంబు
కమల శత్రునితోఁ జెంది కందళింప
నమరు ప్రావళ్ళు నర్థంబు నతిశయిల్ల
నమలమగు నంతరాక్కర మబ్ధి సంఖ్య"

ఇది ఎంత అంతరాక్కర పద్యమో. అంత తేటగీతి పద్యము. నాలుగు పాదములును యతిమైత్రీఘటితములైన తేటగీతి పాదములే. ఒక్క పాదమును యతిమైత్రీ ఘటితముగ గాని, యతిమైత్రీ రహితముగ కాని ద్విపద పాదము కాఁజాలదు. ఇది సాధారణముగాఁజదువువారికి ప్రాసయుక్త తేటగీతియని తోఁచును" అని రావూరి దొరస్వామి శర్మగారు తేల్చి చెప్పిన సంగతి. (పు157)

అనంతామాత్యుని ఛందో దర్పణములోని అంతరాక్కర ఇది:

"ఇనుఁడొకండును నింద్రులిద్దఱును నొక్క
వనజవైరియుఁగూడి వైభవమొనర్పఁ
గనక వస్త్రీని గృతకైటభుని గొల్చి
రనుచుఁజెప్పుదురంతరాక్కర [ను] బుధులు"

ఇందు మొదటి పాదము యతిమైత్రీరహితమైన తేటగీతి పాదము. రెండవ పాదము యతిమైత్రీ ఘటితమైన తేటగీతి పాదము, మూడు, నాలుగు పాదములు యతిమైత్రీ రహితమైన తేటగీతి పాదములు ఒక్క పాదమును ద్విపదపాదము కాఁజాలదు. ద్వితీయ పాదమునుగురించి "ఇది తేటగీతి పాదము వలెఁబడినది" అని రావూరి దొరస్వామి శర్మగారు తేల్చి చెప్పిన సంగతియే. (అదే)

చిత్రకవి పెద్దన లక్షణ సార సంగ్రహములోని అంతరాక్కర ఇది:

"రవియు నిద్దరమర్త్య రాజులును రాజు
వనజపుత్ర యీ నాల్గు పాదముల రాఁగ
నవని విరచింప నంతరాక్కరయనంగ
నవును ద్రిగణాంత వర్ణమయ్యతులు గాఁగ"

ఇందు మొదటి మూడు పాదములు యతిమైత్రీ రహితమైన తేటగీతి పాదములు. నాల్గవ పాదము యతిమైత్రీ ఘటితమైన తేటగీతి పాదము ఒక్క పాదమును ద్విపద పాదము కాఁజాలదు. మొదటి పాదములోని 'ను అను వర్ణమును తొలగించిన, యతిమైత్రీ ఘటితమైన ద్విపదపాదమగునుగాని, అప్పుడది అంతరాక్కర పాదము కాఁజాలదు. అంతేకాదు. తొలగించుట "అహో మూలచ్ఛేదీ తవ పాండిత్యప్రకర్షః" అనిపించును.

అప్పకవీయములోని అంతరాక్కరమిది:

"భానుఁడిద్దరాదిత్యపతులు చంద్రుండు
పూని నాలుగు చరణములఁద్రిగణాంక
మైన వర్ణంబు విరతి నంతరాక్కరఁబు
భాను శీతాంశు నేత్ర పద్మాకళత్ర"

ఇందు రెండు, నాలుగు పాదములు యతిమైత్రీ రహితమై తేటగీతి పాదములు. ఒక్క పాదమును ద్విపదపాదము కాఁజాలదు. "ఇందలి 2,4 పాదములు యతిస్థానభేదముగం తేటగీతి పాదములవలె నున్నవి." అని రావూరి దొరస్వామి శర్మగారు తేల్చి చెప్పిన సంగతికూడ. (అదే. పు. 156) అంతేకాదు.

"తేట గీతికి-1 సూ-2 ఇం-2సూ-గణములు
అంతరాక్కరకు-1సూ-2ఇం-1 చంద్రగణము

గీతి తుది రెండు సూర్యగణముల స్థానములో అక్కరకు ఒక చంద్ర గణముండును. నహ (IIIUI) రల (UIUI) అను రెండు చంద్రగణములొక్కొక్కటియు రెండేసి సూర్యగణములుగా నెన్నఁదగుఁగానఁబై రెండు చంద్ర గణము లిందుపయోగించిన అంతరాక్కర తేటగీతి వలెఁగన్పట్టు".

అనికూడ రావూరి దొరస్వామి శర్మగారు తేల్చిచెప్పిన తిరుగులేని తీర్మానము. (అదే!) మరి తేటగీతివలె కనిపించు అంతరాక్కరయందు తేటగీతినడక ఉండుట తేటతెల్లము. ద్విపద నడక లేకపోవుట దేదీప్యమానము. అంతరాక్కర చతుష్పాది. తేటగీతి చతుష్పాది. ద్విపద ద్విపాది. అంతేకాదు. అంతరాక్కర గణములు తేటగీతి గణములు సమానమగు సందర్భములు సమృద్ధిప్రాయము. అంతరాక్కర గణములు ద్విపద గణములు సమానమగు సందర్భములు సకృన్మాత్రము అదికూడ తేట గీతి గణములు ద్విపదగణములు సమానమగు అవకాశముండుట వలని ఆనుషంగిక ఫలము.

"సుతుఁడు పుట్టుట యిది గడుఁజోద్యమయ్యె"
"నన్ను మున్న యెఱుంగు దిన్నాతి నీవు"
"అగు మహీతల గతుఁడగు నద్భుతముగ"

ఇవి నన్నయగారి తేటగీతి పద్యపాదములు. ఇందు మొదటిపాదము యతిమైత్రీ రహితమైన ద్విపదపాదమగును. రెండవపాదము ప్రాసయతి సహితమైన ద్విపదపాదమగును. మూడవపాదము యతిమైత్రీ ఘటితమైన ద్విపదపాదమగును. ఇక యతిమైత్రీ స్థానము అంతరాక్కరయందు మూడవ గణము తుది అక్షరము. నాల్గవ గణము తొలి అక్షరము కూడ. తేటగీతియందు నాల్గవ గణము తొలి యక్షరము. ద్విపదయందు మూడవ గణము తొలి అక్షరము. తుది అక్షరము కాదు. కనుక పాదములనుబట్టి, గణములనుబట్టి, యతిమైత్రీ స్థానమునుబట్టియును అంతరాక్కర, తేటగీతి సంపదించును. అంతరాక్కర, ద్విపద విపదించును. పద్యము నడక యతిమైత్రీ స్థానగమకముకంటె గణప్రీతి పదికము. కనుక అంతరాక్కరయందు తేటగీతి నడక కలదు. ద్విపద నడక లేదు. అంతేకాదు. మధురాక్కరయందు తేటగీతి నడక అతిక్రాంతము. అంతరాక్కరయందు తేటగీతినడక అన్యూనాతిరిక్తము. కనుక మధురాక్కరయందుకంటె, అంతరాక్కరయందు తేటగీతి నడక అధికము అయినను అంతరాక్కరయందుకంటె మధురాక్కరయందే తేటగీతి నడక అధిక

మని, అంతరార్కరయందు తేటగీతి నడక కాక ద్విపద నడక కలదని విమర్శకుడు కల్పించుట అవిచారమూలకము, అకాండతాండవము. అసత్యాన్వేషణ తత్పరత మాత్రమేగాక, ఆత్మవంచనముతోడి జగద్వంచనము.

ఇదికూడ విజ్ఞులు పరికింతురుగాక.

ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి

నిఘంటువు కెక్కని అనంతపురం జిల్లా మాండలిక పదాలు

లక్షణ గ్రంథాలనగానే మన లాక్షణిక కర్తల దృష్టిలో ఛందో వ్యాకరణాలంకార గ్రంథలేగాని నిఘంటువులు కాదేమో. అందుచేతనే తెలుగు భాషకు ప్రథమ వ్యాకరణ గ్రంథం ఆంధ్రశబ్ద చింతామణి క్రీ.శ. పదునొకండవ శతాబ్దంలోనే ఆవిర్భవిస్తే, దాని తరువాత ఆరు శతాబ్దులకుగాని వేంకటేశాంధ్ర మనే నిఘంటు గ్రంథ మావిర్భవించలేదు. నన్నయ కాలంనుండి క్రీ.శ 1650 ప్రాంతంలో గణపవరపు వేంకటకవి వేంకటేశాంధ్ర నిఘంటువు రచించేవరకు ఆ మధ్యకాలంలో నిఘంటు గ్రంథరచన చేయాలనే సదుద్దేశ్యం కల్గకపోవటం సాహిత్య చరిత్రలో ఆశ్చర్యకరమైన విషయమే.

పోనీ ఆ తరువాతనైనా నిఘంటు రచన విశేషంగా సాగిందా అంటే క్రీ.శ. 1700 ప్రాంతంలో పైడిపాటి ఏకామ్ర మంత్రిగారి లక్ష్మణకవి వ్రాసిన ఆంధ్రనామ సంగ్రహం; పైడిపాటి అమరయ్యగారి లక్ష్మణకవి రచించిన ఆంధ్ర రత్నాకరం; క్రీ.శ. 1750 ప్రాంతంలో అడిదం సూరకవి వ్రాసిన ఆంధ్రనామ సంగ్రహం; కస్తూరి రంగకవి రచితమైన సాంబనిఘంటువు క్రీ.శ. 1769 ప్రాంతాలలో నుదురుపాటి వేంకటకవి ఆంధ్రభాషార్ణవం ఇలా ఏవో వ్రేళ్ళమీద లెక్కింపదగిన కొన్ని నిఘంటు రచనలే కన్పిస్తాయిగాని ఛందో వ్యాకరణ గ్రంథాల ప్రాచుర్యంగా నిఘంటు గ్రంథరచన జరిగినట్టు కనబడదు.

అందుచేత తెలుగుపద స్వరూపానికి పూర్తి కవుల ప్రయోగాలే శరణ్యమయ్యాయి. కవులయొక్క ఏ ఒక్క కావ్యమూ కూడ నిఘంటువులా భాషలోని సమస్త పదజాలానికి ప్రాతినిధ్యం వహించజాలదుకదా! పోనీ దేశములోని సమస్త కవుల గ్రంథాలైనా ఒక నిఘంటువులా సమస్తభాషా పదజాలానికి ప్రాతినిధ్యం వహిస్తాయా అంటే కావు అనే చెప్పాలి. కారణం తెలుగుభాష కావ్య భాషగా పరిణతి చెందే కాలంలో ఆ తర్వాతకూడ తెలుగు కవులు సంస్కృత ప్రాకృత భాషలచేత ప్రభావితులై దేశీయ తెలుగు పదాలను నిర్లక్ష్యం చేసారు. ఇది జగమెరిగిన సత్యం.

అందుచేతనే తెలుగు దేశీయ పద సంపద చాలావరకు గ్రంథస్థంకాక ప్రజల రసనాంచలాలమీదనే జీర్ణించుకుపోతూ వచ్చింది. ఈ దుస్థితినిచూచి కొద్దిమంది కవులు దేశీయ పదాలకు సాహిత్య గౌరవం కల్గించినా మన తెలుగు భాషకు ప్రారంభంనుండి నిఘంటువు లేకపోవటంవల్ల ఆ కవుల దేశీయ పద ప్రయోగాలిప్పటికీకూడ పూర్తిగా అర్థంకాని పరిస్థితి ఏర్పడింది.

సాహిత్యస్థాయి కెక్కని దేశీయ తెలుగు పదాల పరిస్థితి ఆ విధంగా ఉంటే అసలు సాహిత్య జీవన స్రవంతిలోనికే అడుగిడక కుట్టుసురుతో జానపదుల జిహ్వాగ్రాలపై నిలిచిన పరంపరీణ తెలుగు దేశీయ పదసంపద యిప్పటికీ ఎంతో జీవించియుంది. ఆంధ్రదేశంలోని ప్రతిపల్లె తిరగాలేగాని యీ భాషా సంపద కనబడని తావేలేదు.

ఈ దృష్టితో చూచినపుడు అనంతపురం జిల్లాలో నిఘంటువుల కెక్కని భాషా సంపద యెంతో కనబడుతుంది. విశేషమేమంటే ప్రాచీనమైన నిఘంటువులకే కాదు అర్వాచీనమైన శబ్దరత్నాకరం; ఆంధ్రవాచస్పత్యం; సూర్యరాయాంధ్ర నిఘంటువులకుకూడ అందక అచుంబితంగా - అనాఘ్రాతంగా అనంతపురంజిల్లా మాండలిక పదజాలమెంతో ఉండటమే.

నా దృష్టికి వచ్చిన అట్టి పదజాలాన్ని మీముందుంచుతాను

1. అంగరీలు = హద్దులోలేకుండ: క్రమశిక్షణలేని; ఆలనాపాలనాలేని.
   వాక్యప్రయోగము :- తల్లిపోయాక పిల్లలంతా అంగరీలయ్యారు.
2. అరువు తెరువు=చేయవలసినపని
   వా. ప్ర. అరువుతెరువు చెప్పకుండ పోతే నేనేమిచేయగలను.
3. ఆసంది | ఆసగాల | ఆ ప్రాంతము
4. ఊసుగాళ్లు = బలహీనతవలన సన్నబడిన కాళ్ళు
5. కలమాగు=పండు పూర్తిగా పండుట
6. కలుగు = పేడ కలిపిన నీళ్ళు
7. కసిరి=రోత
   వా. ప్ర. గొడ్లసాల కసిరి కసిరిగా ఉంది. వాన రావడంతో రోడ్లన్ని కసిరి కసిరిగా అయ్యాయి.
8. కరుసుపొట్ట = పొట్టలోని జీర్ణకోశపు సంచి
9. కసాలా=ఇబ్బంది
10. కిరాముసెడు=ఒకపదార్థము తినవలెనని మిక్కిలి కోరిక కలిఉండుట
    వా. ప్ర. నీవు పెట్టేతిండికి కిరాము సెడి రాలేదు
11. కుసాల=తమాషాచేయు
12. కోరబద్ది=వెడల్పుగా మూతి ఉండే పాత్ర.
13. కొట్టిడి=సామానుల గది
14. గెంజాలు=ప్రిగల్భాలు
15 గీట్లు = అక్షరాలు
16. గుడుగులు=ఉరుములు
17. గెన్ను=కణుపు (వ్రేలిగెన్ను; చెఱకు గెన్ను
18. జరితి=కొండవాలు
19. జిడగ=మేక: గొఱ్ఱె, కోడిపిల్లలు బయటకుపోకుండ పైన కప్పుగూడ
20. జాడికల్ల=తుమ్మకంప
21. జాలిమాను=తుమ్మమాను
22. జంపు=పొడవు
23. తబ్బిల కరచుకొను=కౌగలించుకొను
24. దసిలినాడు—ముసలివాడైనాడు
25. దుగద=చింత-బాధ
26. వెరజల్లు=వెదజల్లు
27. నెరవాద = సమర్థుడు
28. నేత = లేత
29. పటవ—కల్లుతాగ్రే మట్టిపాత్ర
30. పదరుకొను=బెదిరించుచు పలికే మాటలు
31. పలిగిడి = బండి పలిగిడి
    వివరణ : బండి యిరుసుపై పరచునట్టి బల్లలు
32. పాగి=వాటము
    వా. ప్ర. చెట్టు గోడమూలకుంది. నరకడానికి పాగిలేదు
33. పాసలా=దూరము
34. పుండాకు=గోంగూర
35. పుగసాటి=ఉచితము
36. బచ్చల=స్నానాలగది
37. బద్దించు=అసలు కొలతకు సరిపడినదో లేదో తెలిసికొనుటకు వేరొక కొలమానముతో కొలిచి సరిచూచుట
38. పటాయము=నిస్పృహ
39: బడబడకల—బలహీనతవలన సన్నబడు

ఈ విధంగా అసలు నిఘంటువులకే ఎక్కని పదాలు కొన్ని ఉంటె మరికొన్ని పదాలు నిఘంటువులకెక్కినా నైఘంటికార్థంకంటె భిన్నార్థంలోప్రయో

గింపబడుతున్నవి కనబడతాయి.

	నైఘంటికార్థము	మాండలికార్థము
1.	అంగు=అందము; విధము, శ. ర.	అంగు=ఒకరిపశమునందుండుట వివరణ : ధనముచేతగాని, బలముచేతగాని అధికారముచేతగాని అధికుడైన వానికి లొంగియుండుట
2.	ఊద=వాపు; ఈర్ష్య శ. ర.	ఊద=ఉబ్బరము వా. ప్ర. పొట్టఊదగా అయింది.
3.	ఊబ=నపుంసకము శ.ర.; వా. ని.	ఊబ=ఒక విధమైన గడ్డిముల్లు
4.	ఎదుగు=పెరుగు; ప్రబ్లు. శ. ర. అతిశయించు: సమీపించు, ఈడుపచ్చు (వా.ని)	ఎదుగు=సమర్తాడు
5.	ఒడుపు—లక్ష్యముదాటు; పూనిక లాభము. శ.ర. ఆం.వా.	ఒడుపు=ఎగుడుడిగుడు నేలలపై బండి పోపునపుడు అటునిటు నూగుట
6.	ఒలికి=చితి, శ్మశానము వా. ని.	ఒలికి=గోరీ
7.	ఒప్పు=ఒప్పిదమగు; తగు; సమ్మతించు (శ.ర) కాంతి; విన్నాణము; ఒడంబడిక; సొగసు; యుక్తమగు; అంగీకరించు:	ఒప్పు=కాయలు కోసిగాని పగులగొట్టి చేసిన భాగాలు
8.	గొత్తు=వెన్న మొదలగునవి పాసిన కంపు శ. ర. వా. ని.	గొత్తు=మూత్రపు వాసన
9.	గోలు=పేము బొద్దునకు ప్రక్క నేర్పరచిన పేము. శ.ర. వా.ని,	గోలు=గుండ్రని; బండిచక్రము
10.	జుజ్జు=మిక్కిలి చింపి శ.ర. ఆం.వా. శిథిలము శ.ర. వా.ని.	జుజ్జు=దూయుట వివరణ : తీగెలనుండి ఆకులనుగాని కాయలనుగాని దూయుట
11	జివురు=చిగురు రూపాంతరము శ.ర.	జివురు=కొసగా కెక్కుట
12.	జొంపు=కొండయందలి యూట నీరు.	జొంపు=పొదవు
13.	జొరు=కొట్టు; చేతులతో కుప్పచేసి ఎత్తు శ.ర.వా.ని.	జొరు=కొడవలితో కోయుట, నిమురుట
14.	తీడు=వాడిచేయు; చీల్చు మెలిపెట్టు. వా,ని. చిమ్ము; పండ్లు కొరుకు: వ్యాపించు. సూ.రా. ఆం.ని.	తీడు=నిమురు. తీగలకుండ ఆకులను గాని కాయలనుగాని దూయుట
15.	దట్టము=పొపద; తఅచు. శ.ర.	దట్టము=చర్మమును వొలిచి మాంసమును తొలగించిన జంతు కళేబరము
16.	దడి=వెదురుచాపలు మొదలగు వానితో నేర్పరచిన తడిక. శ.ర. వా.ని. ఆం.ని.	దడి / దటి — కొండవాలు
17.	దడిబము / దడిమము — పఱపు మెత్తనిపాన్పు శయ్య. శ.ర.	దడిబము / దడిమము — సమర్తాడిన కన్నెకుపఱచే పాన్పు
18.	దొన్ని=త్రాగుటకుపయోగించు దొప్ప	దొన్ని=జంతువు మెడలో తగిలించు గుదిబండ; పెద్దపేను
19.	కపయు=రతిచేయు. వా.ని.	కపయు=క్రమ్ముకొను
20.	బతము=వ్రతమునకు వైకృత విశేషము	బతము=మానభంగము జరిగినపుడు బతము చెడినదనివ్యవహారము

సూ. రా. ఆం. ని. సూర్యరాయాంధ్రనిఘంటువు శ.ర. శబ్ద రత్నాకరము. ఆ.వా. ఆంధ్రవాచస్పత్యము. వా. ని. వావిళ్ళ నిఘంటువు.

రాజాశ్రయంలేందే ఏ కవి రాణించనట్టు కవుల ఆదరణ లేకుండ ఏ పదము కాల ప్రవాహంలో నిలువదు. ఇప్పటికే యెన్నో దేశీయ పదాలు కాలగర్భంతో కలిసిపోయాయి. కవుల ఆదరణకు నోచుకొన్న దేశీయ పదాలు మాత్రం స్వస్వరూపంతో నిల్చి ఉన్నాయి. ఉదాహరణకు "బూతు" శబ్దాన్ని తీసికొండి "అశ్లీలార్థకమైనతిట్టు"గా ఆ పదాన్ని అందరు ఎరుగుదురు గాని భట్రాజు అనే యర్థమున్నదని ఎవరికి తెలియదుకదా. నన్నయ భారతంలో ఈ యర్థంలో "బూతు వొగడినట్లు పొగడెదు, పొగడంగ; వలయునేని...(సభా. పర్వము. 2ఆ. 48ప) బూతు శబ్దప్రయోగం కనబడుతుంది. అంటె నన్నయ కాలానికి బూతు శబ్దానికి నాడున్న అశ్లీలార్థంగాకుండ "భట్రాజు" అనే యర్థమున్నట్లు తెలుస్తోంది. ఇలాగే "అవ్వ" శబ్దానికి తల్లితల్లి అనే యిప్పటి యర్థంగాక యువతి స్త్రీ-పూజ్యురాలు అనే యర్థాలుకూడ ఉన్నట్లు "అవ్వా! నీ ప్రశ్నంబునకుత్తరము అయ్యుధిష్ఠిరుడు చెప్పవలయును. (సభా.ప.2ఆ.45వ) అనే ప్రయోగాన్నిబట్టి స్పష్టమౌతుంది.

ఈ విధంగా దేశీయ శబ్దాలు కవుల ప్రయోగాలకు నోచుకోవడంవల్ల ఇప్పటికి వాటి చరిత్ర తెలుస్తోంది. కాని, కవుల ప్రయోగాలకు నోచుకోని ఎన్నో దేశీయ పదాలు జీర్ణించిపోతున్నాయి.

మాండలిక పదకోశాలను నిర్మించేటప్పుడు ఉన్న మాండలి పదజాలంలోని భాషా చారిత్రక పరిణామ వికాసాలకే ప్రాముఖ్యమిస్తున్నారేగాని మౌలిక పదజాలముయొక్క విశిష్టతను సమగ్రంగా కాకపోయినా స్థూలంగానైనా స్పృశించకపోవుట శోచనీయాంశం. ఒక్క అనంతపురం జిల్లాలోనేగాక యావదాంధ్రదేశంలోని మాండలిక పదాల్లో నిఘంటువులకెక్కని పదజాలాన్ని సమీకరించి ప్రచురించటం జరిగితే తెలుగుభాష సమగ్రతను పొందటమేగాక నేటి విద్యా వైజ్ఞానిక రంగాల్లోని అవసరాలను తెలుగుభాష సంపూర్ణంగా తీర్చగలదని నా అభిప్రాయం.

కృతజ్ఞత :- ఈ వ్యాసములోని మాండలిక పదాలను సేకరించి యిచ్చిన అనంతపురం జిల్లా, పెనుకొండ తాలూకా; కోగిర వాస్తవ్యులు జె. సీతారామ్‌గార్కి హార్దిక కృతజ్ఞతలు.

పాలకోడేటి జగన్నాథరావు

గ్రంథ విమర్శలు

కోడి కూతేసింది (వచన కవితా సంపుటి)

బెళ్ళూరి శ్రీనివాసమూర్తి

వెల :- రు. 6-00 లు

[ప్రతులకు :- శ్రీ బెళ్ళూరి శ్రీనివాసమూర్తి; కుంటిమద్ది గ్రామం; (వయా) చెన్నే కొత్తపల్లి; అనంతపురంజిల్లా]

బెళ్ళూరి శ్రీనివాసమూర్తిగారు సాహిత్య తపస్వి. వారి కలంనుండి గతంలో అనేక గ్రంథాలు అవతరించినై. అనంతపురం రాయల కళా గోష్ఠివారు ఇప్పుడీ వచన కవిత్వాన్ని అచ్చువేశారు. శ్రీనివాస మూర్తిగారి కవితపై పలువురు పెద్దలు వెలిబుచ్చిన అభిప్రాయాలు సంక్షిప్తంగా ఈ కావ్యం మొదట్లో ఇచ్చారు. ఈ సంకలనంలో అనేక అంశాలను ఇతివృత్తంగా తీసుకొని శ్రీనివాస మూర్తిగారు కవిత్వం రాశారు. వయోవృద్ధత్వం కవిత్వ పిపాసకు, కవితారచనకు అడ్డం రాదని కవిగారు ఋజువు చేశారు.

ఉదాహరణత్రయి, శారదోదాహరణము, సత్యోదాహరణము విశ్వనాథోదాహరణము.

రథచక్రంలా కాలం తిరిగిపోతుంది.
క్రిందిభాగం పైకి వస్తుంది
పైభాగం క్రిందికొస్తుంది
ఋతు పరివర్తనం-సృష్టి ధర్మం!
దివస్పతీ-తెలుసుకో ఈ మర్మం"

అంటూ రాబోయే కాలధర్మాన్ని సూచించే ఆశావాదంతో, మానవతా దృక్పథంతో, కవి హృదయంతో బెళ్ళూరివారు ఈ కవితా రచన చేశారు.

శ్రీ రామోదాహరణము

"శాంతిశ్రీ" జంధ్యాల వేంకటేశ్వర శాస్త్రి వెల :- రు. 6-00 లు

ప్రతులకు :- జె. నాగేశ్వరరావు; శాంతి సదన్; సుబ్బారాయుడి పేట; తాడేపల్లి గూడెం-534101; పశ్చిమ గోదావరి జిల్లా.

ఇందులో మూడు ఉదాహరణ కావ్యాలున్నై. వీటిని గురించి మంధునా పంతులువారు "ఒకటి దివ్యము; ఒకటి విద్యా దివ్యము; ఒకటి మానవము. ఏవం విధమైన సమ్మేళనము చేసికొని సత్యసమారాధనము జరుపుచున్న ఈ కవిగారి భావనాసౌభాగ్యము రచనావైఖరి కళ్యాణాభిముఖమై వెలయుచున్నవి" అని అన్నారు.

పెన్గలూరి వెంకటాద్రికృతము
సంపాదకుడు :- కపిలవాయి లింగమూర్తి
వెల :- రు. 2-00లు

ప్రతులకు :- వెలిదండ వెంకటరావు; 11-2, సబ్‌రిజిష్ట్రారు ఆఫీసు ప్రక్కన; నాగర్ కర్నూలు-509209.

ఉదాహరణ వాఙ్మయాన్ని గురించి నిడదవోలు వేంకటరావుగారు చాలా చెప్పి ఉన్నారు. ఈ ఉదాహరణ కావ్యాన్ని గురించి శ్రీ రంగాచార్యగారు ఇట్లా అన్నారు. "పూర్వులేర్పరచిన నియమాలు దీనిలో-పద్యరచనలో-అతిక్రమించబడినవి. వాదు మార్పు ప్రవేశపెట్టబడింది. లేకుంటే చతుర్థికి మత్తకోకిల షష్ఠికి పంచ చామరం, సప్తమికి ఉత్సాహం ఎందుకుంటవి. కవి అంత ప్రాచీనుడు కాకున్నా ప్రాచీన పద్ధతికి చెందిన శబ్ద ప్రయోగాలున్నవి. వానిని మార్పు చేయకుండా పరిచరించడం గమనింపదగిన విషయం. మధ్యమధ్య శిథిలమైన స్థలాల్లో సంపాదకునిచే పూరణలు చేయబడ్డవి."

అమ్మ (గేయ కవిత)

ఎస్. కే. పిళ్ళే వెల :- రు 2-50 లు

[ప్రతులకు :- ఎస్. కే. పిళ్ళే :- జనహిత సాహిత్య సమితి; ఇం. నెం. 7-4-45/-1 కాశ్మీర్ గడ్డ, కరీంనగర్-505002.]

మూఢ నమ్మకాలు, కులమతాలు, ఆర్థిక వ్యత్యాసాలు లేని మానవ సమాజంమీద అపేక్షతో ఉక్తులుగా, సూక్తులుగా ఈ గేయాలు రచింపబడ్డాయి.

'గతంనుండి మంచి చెడులు
సంతరించుకొనుట మేలు
గతి తార్కిక మంత చదివి
మతమౌఢ్యము వీడవలయు'
'స్వేచ్ఛాయుత జీవనముకు
సామ్యవాదమే శరణ్యం
సామ్యవాద గమ్యమరయ
సమరమేను ధ్యేయమౌను'

ఇట్లా వీరి గేయ రచన వుంటుంది.

మధు హృదయము

"అ రా ల" వెల :- రు 3-00లు

[ప్రతులకు :- విపంచి బుక్స్; 47-3-28; 5 క్రాస్‌స్ట్రీట్; ద్వారకానగర్; విశాఖపట్నం-16]

ఉమర్ ఖయ్యాంను తెలుగులోకి ఇప్పటికి చాలామంది తెచ్చారు. కొంతమంది అనువదించారు. కొంతమంది ఆ భావాన్ని వాడుకొన్నారు. మొత్తం మీద పారశీక కవిని తెలుగువాడిగా చేశారు. అట్లాంటి ప్రయత్నంలో భాగంగానే ఈ కావ్యం.

"జగమొక పాంథశాల
జనులకు, వచ్చువారి
కావోవ మందించు
కాలమ్ము చెల్లినా
సాగనింపును జనుల
సతతమదియె క్రమము-
ఎటనుండి వత్తురో
ఎటకేగనుండిరో
తలక్రిందులయినసూ
తెలియ నేరరు జనులు-"

ఇట్లా ఉమర్ ఖయ్యాం భావాన్ని సూటిగానూ, సరళంగాను చెప్పారీ కవి.

వ్యర్థ గీతాలు

[వెల రు 1-50 పై గాదిరాజు మధుసూదనరావు ప్రతులకు :- డా॥ జి. యస్ శేఖర్ రాజు పోస్టు :- బత్తులూరు; తాలూకా ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా]

"సమాజ శ్రేయస్సునకు ఉపకరించునదే సాహిత్యము. ఈ చట్టాలు శిక్షలు-దౌర్జన్యాలును, దురాచారాలను నిరోధించగలవేగాని, నిర్మూలించలేవు. ప్రజలలో మానసిక పరివర్తన కలిగినప్పుడే అవి నిర్మూలించ బడతాయి. అట్టి మానసిక పరివర్తనను సాధించగలిగిన మృదుమధురమైన సాధనాయుధమే సాహిత్యము" అని సాహిత్య పరమోద్దేశాన్ని చెబుతూ కవి సామాజిక దుర న్యాయాలను ప్రజలకు తెలియచెప్పటానికి ఈ వృధా గీతాలు రాశారు.

ప్రగతి (కవితా సంకలనం)

వెల :- రు 2-00 లు

[ప్రతులకు ;- తమ్మిశెట్టి రామారావు; ప్రగతి సాహితి; యలమంచిలి-531005]

ఇందులో కవులందరూ ఔత్సాహికులు భక్తి కవిత్వం, సామాజిక కవిత్వం రాశారు. ప్రగతి సాహితి యలమంచిలివారు కొత్తగా కవిత్వంలోకి ప్రవేశిస్తున్నవారందరికి ఇట్లా ప్రోత్సాహం ఇవ్వటం అభినందనీయం.

శ్రీరామ హృదయము

[(తాత్పర్య సహితము అనువాదకుడు, ప్రకాశకుడు :- పురాణపండ రాధాకృష్ణమూర్తి; జ్ఞానమహాయజ్ఞ నిర్వాహకుడు; జయశ్రీ టాకీస్ రోడ్ - రాజమండ్రి-4]

"రిటైర్డు మునిసిపల్ కమీషనర్ శ్రీయుత యస్. బాలకృష్ణారావుగారి ప్రోత్సాహంతో రాజమండ్రి మునిసిపల్ సూపర్‌వైజర్ శ్రీయుత కాళంగిపల్లి వెంకట లక్ష్మయ్యగారి సంపూర్ణ ఆర్థిక సహకారంతో ముద్రింపబడి ప్రచారము చేయబడుచున్నది. నిత్యం పారాయణ చేసికోదలచినవారు" పై యడ్రస్‌కు రాసి ఉచితంగా ప్రతిని పొందవచ్చును.

శ్రీరామ శతకము

తిరుకోవలూరు రామానుజస్వామి వెల:- రు10-00 [ప్రతులకు :- డి. రామానుజ స్వామి; ఇ. నెం-5-11-114/4 విద్యారణ్యపురి; వరంగల్-506009]

కవిగారు ఆధ్యాత్మిక విషయములందు, తత్ సాహిత్యమందు నిష్ణాతులు. వారు రామమహిమను అనేక విధములుగా ఇందులో పొందుపరచారు. భక్తులు చదివి తరించటానికి ఇట్లాంటి పుస్తకాలు చాలా ఉపయోగపడినై.

పరమేశ్వరానందలహరి

డా॥ పమ్మి సోమశేఖర్ వెల :- అమూల్యం [అడ్రసు :- సునిత క్లినిక్ 524-టి. హెచ్. రోడ్ మద్రాసు-21]

ఈ పుస్తకం శాయిబాబాకు అంకితం ఇవ్వబడింది. "బతుకుబాటలో నాతోటి బాటసారులై పయనించుచు వెలుగు చీకటులు చూచువారికి ఈ పరమేశ్వరానందలహరి ఒక మజిలీ వంటిది" అంటున్నారు రచయిత. ఇది శివ మహిమను స్తోత్రించే కావ్యం.

వినయరంగ శతకము

నీలకంఠ పాండురంగము వెల :- రు 2-00 లు [ప్రతులకు :- ఎన్. పాండురంగము; పోస్టు శంకరంపేట, తా॥ అందోల్,జిల్లా మెదక్-502271]

"సమాజమున సన్మార్గవర్తనులై, సామాజిక విలువను పెంచుటను తద్వారా సామాజికునిగా మనిషి యనుసరింపదగు మార్గములను, సమాజమునగల నానావిధ ప్రవృత్తులను తెల్పుచు, వినయ విధేయతలతో, ఆయా ప్రవృత్తుల కనుగుణంగా నడుచుకొను విధానములనీ వినయరంగ శతకమున" కవిగారు తెలిపినారు.

ఓ. స

లౌకిక ప్రజాస్వామ్యరాజ్యాంగం లక్ష్యం ఏది? జాతీయ పునరుజ్జీవనమా ? మతమౌఢ్య పునరుద్ధరణమా ?

రచన-పరకాల పట్టాభి రామారావు; వెల-రు 5-00 ప్రతులకు :- విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, చంద్రం బిల్డింగ్స్, విజయవాడ-520 004, విశాఖపట్నం, గుంటూరు, హనుమకొండ, తిరుపతి, హైదరాబాద్, అనంతపురం]

ఈ పుస్తకంలో బంకిం చంద్ర చటర్జీ "వందేమాతరం, తిలక్ గీతా రహస్యం" భారతీయ తాత్విక చింతనపై జాతీయోద్యమ ప్రభావం, కర్మ సిద్ధాంతానికి అపూర్వ నిర్వచన, మత ఉత్సవాల పేరిట ప్రజానీకం సమీకరణ, సత్యాగ్రహోద్యమాలను గాంధీజీ "వేదమంత్రాలతో ప్రారంభించలేదేమి?, ప్రజల దృష్టిని, రాజకీయ ఆర్థిక సమస్యపై వు గాడ్సే "పిస్తోలు గుండు" వెనుక ఉన్నది ఎవరు? లౌకిక ప్రజాస్వామ్య విధానంలోనే భారతదేశ పురోగమనం-నెహ్రూ, మతమౌఢ్యం హిందూ హేతువాదం. శాస్త్రీయ విజ్ఞాన దృష్టి అవసరం, వేదాలు అపౌరుషేయాలు కావు. భారతదేశంలో భౌతిక తాత్విక సంపదను జరిగిన నష్టంవంటి ఇరువది అధ్యాయాలున్నాయి. మార్క్సిస్ట్ దృష్టితో చదివితే ఇవన్నీ మంచి వ్యాసాలే. కానీ మార్క్సిస్ట్ దృక్పథం మాత్రమే శాస్త్రీయ దృక్పథమని పెక్కుమంది మేధావులు, శాస్త్రజ్ఞులు ఈనాడు అంగీకరించడంలేదు. వారందరూ పెట్టుబడిదారుల బంటులని నిరసించి ప్రయోజనంలేదు. ఈ గ్రంథకర్త తెలుగునాట మార్క్సిస్ట్ విజ్ఞులలో ఒకరు. 30 వ పుట వరకూ యీ రచయిత వ్రాసిన అంశాలతో ఎవరికీ పేచీ ఉండనక్కరలేదు. అవన్నీ రాజకీయవాదులు, రాజకీయవేత్తలు ఆమోదించిన అంశాలే. ఏడవ భాగంలో "గాడ్సే పిస్తోలు వెనుక చోదక శక్తిగా, ప్రేరక శక్తిగా పనిచేసింది ఏమిటి? మతమౌఢ్యం, మతోన్మాదం, మతద్వేషం..." అనే వాక్యాలు శాస్త్రీయంగాలేవనిపించుతుంది. మతం అంత ప్రమాదకరమూ, నల్లమందుగా పనిచేసే శక్తి అయితే రాజకీయ విశ్వాసాలు మాత్రం ప్రమాదకరమయినవి కావా? "మితిమీరిన విశ్వాసం ఏ విశ్వాసమయినా మానవతను కించపరుస్తుంది" అన్నాడొక శాస్త్రజ్ఞుడు. "ఇరవయ్యవ శతాబ్దంలో దశదశలుగా రూపొంది నిలద్రొక్కుకున్న ఆధునిక మతం మార్క్సిజం అన్నాడా శాస్త్రవేత్తయే. మతం కలహాలకు కారణమయిందని సహనం ప్రబోధించనిది మతం కాజాలదు. మతకలహాలుగా చరిత్రలో చోటుచేసుకున్న సంఘర్షణలను గురించి విషయప్రధానంగా అనుశీలనగాని, విశ్లేషణగాని ఇంతవరకూ జరిగి వుండలేదు. జాతీయతయే మతమయింది. భారతదేశంలో భగత్‌సింగ్ వరించబడుచున్నాడూ అన్న మాటలలోని అంతరార్థమదే నా దేశం గొప్పది. నాదేశంకోసం ప్రాణాలనయినా అర్పించువాడనే సిద్ధాంతం మతం కాదా? మతాన్ని, రాజకీయాలను ముడిపెట్టవద్దని గాంధీజీకి ఆనాడే ఎంతోమంది మేధావులు సలహా ఇచ్చారు. అట్టివారితో రైటానరబుల్ శ్రీనివాసశాస్త్రి, సర్ తేజ్‌బహదూర్ సప్రూ ప్రముఖులు మతాలన్నా, వర్గాలన్నా, తరగతులన్నా ప్రజలను ప్రజలుగాకాక మతాల వదిలాయనహోయంతో మాత్రమే అర్థం చేసుకోగలమన్నమాట. అటువంటప్పుడు మతాల కారణంగానే "భారతీయ ఆర్థిక వ్యవస్థ విధానం క్రీస్తుశకం మొదటి శతాబ్దం తరువాత కుంచించుకు పోసాగింది అనే ముక్తాయింపు హేతువాద దృష్టిని సూచించుతుందా?

మతమౌఢ్యంపనికిరానిమాటనిజమే,కాని వ్యక్తికి మతస్వేచ్ఛ ఉన్నదనివాదించుతూ మతమౌఢ్యం అని నిరసించేప్పుడు ఏ మేరకు మతం వాంఛనీయమో ఏ మేరలో మతమౌఢ్యం అనవచ్చునో వివరించాలి. తమ వాదనను, ఖండన మండనలను సమర్థించుకొనడానికి కమ్యూనిస్టులూ, తదితరులూ కూడా జవహర్‌లాల్ నెహ్రూ, తిలక్ వంటి మహనీయుల రచనలనుంచి ఉటంకించడం యుక్తి వాదమౌతుందేమో గాని గతితార్కిక భౌతికవాదం కాజాలదు. జవహర్‌లాల్ నెహ్రూకు మార్క్సిస్ట్ అవగాహన మాత్రమే హిందూశాస్త్ర పరిజ్ఞానమూ, ఆధునికత దృష్టికూడా వున్నాయని ఈ రచయిత ఉటంకించిన వాక్యాల సహాయంతోనే వాదించే విజ్ఞులున్నారు. "అవైదిక మతాలు" అనే శీర్షిక కింద యీ రచయిత వ్రాసిన అంశాలు బాగున్నాయి. కాని ఇంకా వివరణ అవసరం. పోతే ఉపనిషత్తులు భారతీయ తాత్విక చింతన అనే శీర్షిక కింద యీ రచయిత వ్రాసిన అంశాలు ప్రశంసనీయాలు, భారతీయ తాత్విక చింతన అంతా ఉపనిషత్తులలోనే ఇమిడివున్నది. ఉపనిషత్తుల సారం భగవద్గీతలో వున్నది. భగవద్గీతకు తిలక్ చెప్పిన భాష్యం భారతీయులందరూ అర్థం చేసుకోవాలి. మతకక్షతో భౌతిక తాత్విక గ్రంథాలను ఎవరో నాశనం చేశారనే అంశం వివాదాస్పదం. దారిద్ర్యం దైవలిఖితమనీ ఏమతం ఎక్కడ చెప్పింది? ఈ విధంగా యీ పుస్తకంలోని అంశాలన్నింటినీ చర్చించాలంటే పెద్ద వ్యాసమే అవుతుంది. కాని అసలు మీమాంస చేయకపోవడం ఎంత ప్రమాదమో తప్పుదోవన మీమాంస చేయడంకూడా అంత ప్రమాదమే.

భారతదేశ చరిత్ర రచనలో మతతత్వం

[ముప్వురు చరిత్రకారులు వ్రాసిన వ్యాసాలు; వెల-రు 2-00 ప్రతులకు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, చంద్రం బిల్డింగ్స్, విజయవాడ 520 004, విశాఖపట్నం, గుంటూరు, హైదరాబాద్, అనంతపురం, తిరుపతి, హన్మకొండ.]

రొమిల్లా థాపర్, హర్బన్స్ ముఖియా, బిపిన్ చంద్ర ఆకాశవాణిలో 1968లో జరిగిన చర్చలో చేసిన ప్రసంగాలను ఈ వ్యాస సంకలనంగా ప్రచురించింది విశాల పబ్లిషింగ్ హౌస్. ఈ మూడు మంచి వ్యాసాలే? వీటిలో రొమిల్లా థాపర్ చేసిన ప్రసంగం వివరంగానూ చరిత్ర రచనలో ఉపయోగపడే ప్రాథమిక సూత్రాలను ప్రశ్నించేదిగాను వున్నది. "అధికార భావన చరిత్ర అనీ, అనగా అధికార భావన గురించే, అధికారం పంపిణీ గురించి చరిత్ర" అని 22వ పుటలో వ్రాయడం సమంజసమే. ఆ కాలంలోనే కాదు ఈ కాలంలోకూడా యీ అభిప్రాయం ఇలాగే వున్నది కదా? రాజులు, రాణుల కథలు, వారుచేసిన యుద్ధాల కథ చరిత్ర అనే అభిప్రాయం బలపడింది. చరిత్ర అధ్యయనానికి ఉపకరించే కొన్ని ప్రశ్నలను ఈ చరిత్రకారుడు ఈ వ్యాసంలో ఉదహరించారు. చరిత్రలో రచనలో మతతత్వంగురించి ఈయన యీ వ్యాసంలో అంతగా ప్రస్తావించలేదు.

పోతే హర్బన్స్ ముఖియా చేసిన ప్రసంగ వ్యాసంలో మధ్యయుగం నాటి భారతదేశ చరిత్రలో మతతత్వ దృక్పథం గురించి క్షుణ్ణంగా చర్చించారు. మతం ఆ కాలంలో జీవిత విధానమయింది. రాజుల మతానికి ప్రజలవలంభించి అనుసరించిన మతానికి సంఘర్షణలు వచ్చిన సందర్భాలున్నాయి. ప్రజల జీవిత విధానమే మతం అయినప్పుడు మతతత్వ దృక్పథంగురించి విమర్శించడం సహేతుక మవుతుందా? ఇస్లామ్ అంటేనే కాదు ఇంకా పెక్కుమతాలకు ఎవరి అర్థం వారు ఆనాడూ, యీనాడూకూడా చెబుతున్నారు. "మనం నిజంగా అధ్యయనం చేయాల్సిందేమిటంటే ఒక కాలంనుంచి మరో కాలానికి సామాజికాభివృద్ధిగురించి మాత్రమే. అవును. నిజమే. కానీ దేని ఆధారంగా యీ అధ్యయనం జరగాలి? ఉత్పత్తి సాధనాలు ఆధారంగా అని కొందరు విజ్ఞులంటే ప్రజల భావాలు ఆధారంగా అని మరికొందరంటున్నారుగదా? "పాలకుని స్వీరత మతం కాలానుగుణమైనదని" ఏమి ఆధారంగా తీర్మానించగలం? "ఏడవ శతాబ్దపు అరేబియా ఆవిర్భవించిన ఇస్లామ్ సమకాలీన ప్రపంచంపై గణనీయమైన ప్రగతిశీల ప్రభావాన్ని ప్రసరించింది. "నిజమే దేవుడొక్కడే అనే సూక్తి సత్యమైనది మరి ఆ దేవుడి రూపగుణాలు ఆనాటి ప్రజల రూపగుణాలలో పెక్కింటికి సన్నిహితంగా వుండిన మాట నిజంకాదా? "ఫలానావారే పౌరోహితవర్గంగా వుండాలని ఇస్లాం ప్రబోధించదు." ఇదొక అభిప్రాయం మాత్రమే. ఇస్లాం మతావలంబకులలో ఎంతమంది ఈ అభిప్రాయాన్ని ఆమోదించుతారు? హర్బన్స్ ముఖియా అభిప్రాయంలో మధ్యయుగ భారతదేశ చరిత్ర రచనలో మతతత్వ దృక్పథం కలదని తప్పుగా చరిత్రకారులు వ్రాశారు. "అశోక చక్రవర్తి బౌద్ధమతవ్యాప్తికి రాజ్యాంగ యంత్రాంగాన్ని దుర్వినియోగపరచాడనడానికి యే ఆధారాలున్నాయి? మధ్యయుగంలో భారతదేశంలోని ప్రభుత్వమే కాదు వివిధ దేశాలలోని ప్రభుత్వాలుకూడా "ప్రతికూల లౌకిక స్వభావం కలిగి వుండేవి. ఐరోపా దేశాల ప్రభుత్వాలలో మతస్వభావం ఇటీవలి కాలంవరకూ వ్యక్తం కావడంలేదా!

"వాస్తవానికి భారతదేశంలో మతతత్వ చారిత్రక దృక్పథమే మతతత్వంయొక్క ప్రధాన భావ జ్వాలం అన్నా అతిశయోక్తి కాబోదు. మతతత్వ చారిత్రక దృక్పథాన్ని తీసేస్తే మతతత్వం భావజాలంలో మిగిలేది శూన్యమే" అన్నారు. "ఆధునిక భారత చరిత్రకారులు మతతత్వం" అనేవ్యాసంలో బిపిన్‌చంద్ర స్థూలంగా చరిత్రకారులందరూ ఆమోదించిన అభిప్రాయమే ఇది అయితే యీ వ్యాసంలో వివాదస్పదమైన అభిప్రాయాలు పెక్కుకలవు. "ప్రాతినిధ్య జాతీయవాదంగా లేక "దొడ్డిదారి" జాతీయవాదంగా పనిచేసే శక్తి మత తత్వానికి వుంది. ఈ శక్తి దేశాభివృద్ధికి ప్రజల అభివృద్ధికి తోడ్పడిందా? లేదా అన్నదే సమస్య కావాలిగదా!

మొత్తం యీ మూడు ప్రసంగ వ్యాసాలలో చర్చించవలసిన ఇంకా కొంత అనుశీలన చేయవలసిన అంశాలు పెక్కు కలవు.

హైదరాబాదు సంస్థానంలో రాజకీయ చైతన్యం, విద్యార్థి యువజనుల పాత్ర

[రచన. ఎస్. ఎమ్. జవార్ రజ్వీ వెల :- రు 5-00 ప్రతులకు:- విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, చంద్రం బిల్డింగ్స్, విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, హైదరాబాద్, తిరుపతి, హన్మకొండ, అనంతపురం.]

కామ్రేడ్స్ అసోసియేషన్, విద్యార్థి ఉద్యమం అనే రెండు పెద్ద భాగాలు 197 పుటలు ఈ పుస్తకంలో ఉన్నాయి. ఈ రెండు భాగాలలో ఇరువది మూడు ఉపశీర్షికలు వున్నాయి. ఈ పుస్తకంలోని అంశాలు 1938 నుంచి 1956 వరకూ హైద్రాబాద్ సంస్థాన చరిత్ర పుటలు భారతదేశమంతటిలో హైద్రాబాద్ సంస్థానానికొక ప్రాముఖ్యత వున్నది విశేషించి కమ్యూనిస్టుపార్టీ చరిత్రలో హైదరాబాద్ సంస్థానానికి విశిష్ట స్థానం వున్నది. తెలంగాణా పోరాటం గెరిల్లా పోరాటాలవంటి అంశాలనిందుకు కారణంగా చెప్పవచ్చు. ఆకాలంలో నిరంకుశ నిజాం నవాబు పరిపాలనను, బ్రిటిష్ ప్రభుత్వ దౌర్జన్యాలను విద్యా వ్యాప్తి లేక రాజకీయ పరిజ్ఞానం ఉప్తించి, బయట ఏమి జరుగుతున్నదో తెలియని ప్రజలు ముందడుగు వేయడంలో యువకులు; విద్యార్థులు ధైర్యంగా ముందడుగు వేశారు. సైనిక చర్యదాకా పోతేనేగాని ఆ సంస్థానం యూనియన్‌లో చేరడానికి అంగీకరించలేదు. ఆ కృషి దశలవారీగా విద్యార్థులు యువకులు నిర్వహించినదే యీ చిన్న పుస్తకం వివరించుతుంది. ఇప్పుడున్నంత అధికంగా రాజకీయ పట్టింపులు ఆనాడు లేవు. కమ్యూనిస్టులు వారి అభిమానులు మాత్రమేకాక రాజకీయ నాయకులందరూ చదివి గుర్తుంచుకోవలసిన అంశాలు ఈ చిన్న పుస్తకంలో వున్నాయి.

ఏ. ఎస్. అవధాని

గురజాడ రచనలు – కథానికలు

[పరిష్కర్త: సెట్టి ఈశ్వరరావు, ప్రచురణ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ చంద్రం బిల్డింగ్స్, విజయవాడ-520 004 డెమ్మీసైజు, ఉపోద్ఘాతమూ, పీఠికా కాకుండా 75 పుటలు వెల: రు 10-00 లు]

ఇందులో మీ పేరేమిటి? దిద్దుబాటు (1) దిద్దుబాటు (2) మెటిల్డా సంస్కర్త హృదయం, మతము: విమతము, సౌదామిని (ఒక నవలకు స్థూల రూపం) అనే కథలున్నాయి.

మీ పేరేమిటి? (1910) కథలో శైవ వైష్ణవ శాఖలకు చెందిన కొందరు హిందువుల బుద్ధులను ఎగతాళి పట్టించే కథ ఇది ఈనాడు ఇటువంటి వాతావరణం మనం చూడం. ఇందులో పీరుసాయిబు నిజాయితీపరుడు. హిందువులు మూర్ఖులు మోసగాళ్లు.

దిద్దుబాటు (1910) అనే కథను రచయిత ఒకసారి గ్రాంథికంలోను ఇంకొకసారి వ్యవహారికంలోనూ రాశారు. పూర్తిగా ఆధునిక రీతిలో ఉన్న మొట్టమొదటి తెలుగు కథ యిది అని చాలామంది నమ్మకం. పెడదారిపడుతున్న భర్తకు భార్యే బుద్ధిచెప్పడం దిద్దుబాటు ఇతివృత్తం. మొదట గ్రాంథికంలో వ్రాసిన కథను వ్యావహారికంలోకి మార్చుద్దామని రచయిత ప్రయత్నించి, దిద్ది, దిద్దుబాటు (2) వ్రాశారు. ఆ కథకు చివరి వాక్యం "...మనోహరియైన నూపురముల రొద వినవయ్యెను. ఇది గ్రాంథికమో వ్యావహారికమో విజ్ఞులే నిర్ణయించాలి.

మునలిభర్తచేతిలో పడుచు పెళ్ళాం పడేపాట్లు మెటిల్డా కథలో రచయిత చూపించారు.

వేశ్యను సంస్కరించాలని ప్రయత్నించిన ప్రొఫెసరుగారి హృదయం ఎలా మారిందో? "సంస్కర్త హృదయం" కథలో రచయిత చక్కగా వర్ణిస్తారు.

ఈ సంకలనంలో ఉత్తమమైన చిన్నకథగా "మతము: విమతము" అనే కథను చెప్పవచ్చు. మహమ్మదీయులు హిందువుల గుడిని పడగొట్టించి మసీదును నిర్మించడం; ఒక హిందువు ముసల్మానై అక్కడ కూర్చుని తన బంధువులకు కనబడటం రచయిత అద్భుతంగా వర్ణించారు.

ఒక నవల రాద్దామని ఇతివృత్తం సంక్షిప్తంగా ఇంగ్లీషులో రచయిత వ్రాసుకొన్నదానిని అనువదించి ఇందులో చేశారు. ఈ కథల్లో ఎక్కువగా రచయిత స్పృశించిన విషయాలు (1) వేశ్యలు (2) స్త్రీ స్వేచ్ఛ (3) హిందువుల మూర్ఖత్వం.

గురజాడను గూర్చిన ప్రచారం చూస్తే ఆయన పేదల బాధలను గూర్చి రచనలు చేసిన 'ప్రజాకవి' అని భ్రాంతి పడవచ్చు. ఎక్కడా ఆర్థిక సమస్యలనుగూర్చి ఆలోచనలు రానీయని కథలివి. ఈ మతము..., వేశ్యలూ, స్త్రీ స్వేచ్ఛలూ కడుపునిండినవాడి గొడవలు, జమీందార్లూ, జమీందార్ల ఆస్తుల రక్షించే తొత్తులూ మతాన్ని గురించి వేశ్యలనుగూర్చి; స్త్రీ స్వేచ్ఛను గూర్చి ఆలోచించవచ్చు. గురజాడవంటి 'ప్రజాకవి'గూడా వాటినిగూర్చే రచనలు చేయడం ఆశ్చర్యకరం.

గురజాడ రచనలు – కవితల సంపుటం

[పరిష్కర్త: సెట్టి ఈశ్వరరావు, ప్రచురణ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్; చంద్రం బిల్డింగ్స్, విజయవాడ-520004 డెమ్మీసైజు, ఉపోద్ఘాతం గాక 148 పుటలు వెల: రూపాయలు.]

శ్రీ సెట్టి ఈశ్వరరావు 1945 ప్రాంతంలో గురజాడ అప్పారావుగారి కుమారులైన కీ. శే. రామదాసుగారినుండి గురజాడ సాహిత్యం వ్రాతప్రతులను సేకరించారు. వాటిని ఏడు సంపుటాలుగా కీ.శే. అవసరాల సూర్యారావుగారు కూర్చారు. సెట్టి ఈశ్వరరావుగారు ఆ సంపుటాలను పరిష్కరించి పునర్ముద్రణకు సిద్ధ పరిచారు. ఫలితం ఈ పుస్తకం. "ఆధునిక భాషా సాహిత్యాల యుగకర్త ఐన గురజాడ మౌలిక కృషినీ, ఉద్యమాన్నీ వివరించే పీఠికలను, వివరణలను, వారి జీవిత వివరాలను ప్రతి సంపుటంలోనూ చేరుస్తున్నాము" అని ప్రచురణ కర్తల "మనవి"

ఈ పుస్తకంలో ఉన్న కవితలను అయిదు విధాలుగా విభజింపవచ్చు.

1. కథాత్మక కవితలు : ముత్యాల సరాలు, కాసులు, కన్యకవంటి కవితా ఖండికలు ఎనిమిది ఇందులో ఉన్నాయి.

2. ముత్యాల సరాలు, పిల్లల పాటలు, వ్యంగ్య గీతం : దేశభక్తి వంటి గీతాలు తొమ్మిది ఉన్నాయి.

3. నీలగిరి పాటలు ; సుందరతరమీ నీలనగము...పద్ధతిలో ఎనిమిది గీతాలు.

4. సంప్రదాయ కవితలు : సుభద్ర మొదలైన ఏడు కవితలు

5. ఆంగ్ల గీతాలు : సారంగధర, కాంగ్రెస్ మహాసభ, ది ఎమరాల్డ్స్ మొత్తం మూడు

'ఆధునిక సాహిత్యయుగ కర్త'గా 'మహాకవి'గా గురజాడ పేర్కొనబడుతున్నాడు.

గురజాడ గొప్పతనాలుగా పేర్కొనబడుతున్నవానిలో ముఖ్యమైనవి 1. వ్యావహారిక భాష 2. దేశభక్తి 3. ప్రజాకవిత్వం

ఈ పుస్తకంలో ఉన్న కవితలనుబట్టి ఈ మూడు విషయాలనూ నిరూపించడం కష్టం.

ఈ సంకలనంలో వ్యావహారికభాషలో ఉన్న కవితలు : దేశభక్తి, మనిషి, పిల్లల గీతములు

కొద్దిగా వ్యావహారికం, ఎక్కువగా గ్రాంథికం ఉన్నది : ఛొట్టు.

ఎటూగానివి : ముత్యాల సరములు, కన్యక, పూర్ణమ్మ

గ్రాంథిక భాషలో ఉన్న కవితలు : కాసులు, లవణ రాజుకల, డామన్ పితియస్, దించు లంగరు, లంగరెత్తుము, ముత్యాల సరము (జార్జిప్రశంస, సుందరతరమీ నీలనగము, ఊటి చోద్యమేమి చెపుదు, ఉమాపతి శతకము) పుష్పలావికలు, మాటల మబ్బులు, మెరుపులు, కోరుకొండ.

దీన్నిబట్టిచూస్తే ఈ పుస్తకంలో ఉన్న కవితలు ఎక్కువభాగం గ్రాంథికంవైపు మొగ్గుతున్నాయని తెలుస్తోంది.

ఇక రెండవ అంశం

ఈ పుస్తకంలో ఉన్న కవితల్లో ఇంగ్లీషువాళ్ళని ప్రశంసించేవి కొన్ని—

"కన్నుకానని వస్తుతత్వము
కాంచనేర్చరు లింగి రీజులు
కల్ల నొల్లరు వారివిద్యల
కరచి సత్యము నరసితిన్"

"వచ్చెనిదె బంగారు కాలము
వాంఛలెల్లను తీరు సుజనుల
కాంగిలేయుల ధర్మరాజ్యము
జ్ఞానమును స్వాతంత్ర్యమిచ్చుచు
సంతతము వర్థిల్లుగావుత" (దించులంగరు)

"వెల్లివగ నారోగ్య సంపద
ఉల్లమలరుచు నిచ్చు గావుత
తల్లి భరతమాత పంచమ జార్జి కెల్లపుడున్-

"భరత ఖండం బెన్నడెరుగని
నిరత శాంతి నొసంగి విద్యల
నెరయనించిన యాంగిలేయుల రేడు మనవలయున్"

"నల్లవాడును తెల్లవాడును
నెల్ల శుభముల గూర్చు గావుత
తల్లి మేరీమహారాజ్ఞికి జార్జి నరపతికిన్" (ముత్యాల సరము)

1908లో మద్రాసులో జరిగిన కాంగ్రెస్ సభ గూర్చి గురజాడ ఎగతాళి చేస్తూ వ్రాసిన ఆంగ్లగీతంకూడా ఆనాటి గురజాడ అభిప్రాయాలను వెల్లడించేదే! వీటిని చదివితే గురజాడ దేశభక్తిని ప్రశంసించలేం.

ప్రజా కవిత్వం అంటే పేదలబాధలనుగూర్చి చెప్పడమైతే-అది ఈ కవితల్లో ఎక్కడా కనబడదు. "ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడును" అని ప్రశ్నిస్తే గురజాడ పేదలనుగూర్చి రాసేశాడని సంతోషించే వాళ్లుండవచ్చు. కాని గురజాడకు ఆ ఉద్దేశం ఉన్నట్లు కనబడదు. పైపెచ్చు గురజాడ ప్రశంసించే వాళ్ళంతా రాజులు రాణులు. 'శ్రీశ్రీశ్రీ హెర్ హైయినెస్ ది మహారాజ కుమారికా సాహెబా శ్రీ అప్పల కొండయాంబా ఆఫ్ విజయనగరం మహారాణి ఆఫ్ మధోగడ్ (రీవాస్టేట్) వారి యనుజ్ఞను నీలగిరి పాటలు వ్రాసిన 'ప్రజాకవి' గురజాడ "ఆశ్రిత వరదు డంబికా రమణుఁడు బాలచంద్రమౌళి భక్తికి నెదమెచ్చి రాజపుత్రి రాజ్ఞి నప్పల కొండయాంబఁ బ్రోచుఁగాత నధిక సౌఖ్యములిచ్చి" అని ఉమాపతి యర్చన ముగించారు.

దీనిని ప్రజాకవిత్వం అని అనరు.

ఈ పుస్తకం పీఠికలో ఉన్న సమర్థనలు సంతృప్తికరంగా లేవు.

అధిక ప్రచారం పొందిన ఆధునిక కవుల్లో అగ్రగణ్యుడయిన గురజాడ రచనలను విశాలాంధ్రవారు అందంగా అచ్చువేశారు.

అంబేద్కర్

వ్యాసాల సొగసులు

[పుద్భా పూర్ణానందం, రచయిత : రామరాజ్యనగర్ : విజయవాడ.. పదిహేను రూపాయలు.]

భగవంతునికి నవ్వాలనిపించింది-వెంటనే మానవుడ్ని సృష్టించాడు. అనే మున్నుడిలోని మాటతో ఆరంభమయిన యీ 259 పేజీల హాస్య ప్రధానమయిన యీ పుస్తకంలోవున్న పదిహేను హాస్య ప్రసంగ వ్యాసములూ ఆకాశవాణి సౌజన్యంతో ప్రచురించినట్టు రచయిత తెలియజేశారు. హాస్యం చేయడం కోసం చక్కని కథావస్తువులను రచయిత ఎన్నుకొన్నారు. కవుల, శతక కర్తల వాక్యాలనుకూడా సమయోచితంగా, సందర్భోచితంగా వాడారు.

వీటిలో తాంబూలమే, భోజ్యం, వీరరాజ్యం, నస్యం పండితలక్షణం కాకిగోల వంటివి చక్కని సున్నిత హాస్యంతో చదువరిని చక్కిలిగింతలు పెట్టాయి.

ఈ వ్యాసాలకు చిత్రకారుడు బాలి రచించిన చిత్రాలు అద్భుతంగా వున్నాయి.

ఇది ఒక చక్కని పుస్తకం.

ఫాలాక్షుడు



Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd, by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna, Vijayawada. Phone: 75667 & 61247.


కె.సత్యం
సారధ్యంలో
గుప్తా క్రియేషన్స్
పట్నంపిల్ల
పల్లెటూరి చిన్నోడు
నిర్మాత.
కండె వెంకటనారాయణగుప్తా
స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: మౌళి
సంగీతం కృష్ణ-చక్ర పాటలు. ఆచార్య ఆత్రేయ, రాజశ్రీ మాటలు. భరణి కెమెరా. డి.ప్రసాద్ బాబు
కూర్పు. కె సత్యం నృత్యం. శివసుబ్రహ్మణ్యం ఫైట్స్: సాహుల్ కళ. కళాధర్
పంపిణీ: సాగర్ ఫిలింస్
గుంటూరు: గుండా వెంకటనాగలక్ష్మి, త్రూ: రామప్రసాద్ పిక్చర్స్. నెల్లూరు విఘ్నేశ్వర పిక్చర్స్, వెస్ట్: శ్రీశ్యామలా ఫిలింస్, త్రూ జైలక్ష్మి ఫిలింస్. ఈస్ట్: లలితా జ్యోతి ఫిలింస్. వైజాగ్ జైకిసాన్.
నైజాం శ్రీనివాస. సీడెడ్: సత్యనారాయణ కంబైన్స్. తమిళనాడు: శ్రీమతి మానేపల్లి కృష్ణకుమారి, ఏలూరు. మైసూరు: RBR కంబైన్స్. ఒరిస్సా: కార్తికేష్ పిక్చర్స్, బరంపురం.